


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 153

శనివారం 23-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


మరెక్కడ ఊహించలేనంత తక్కువ తరుగు!
Bracelets
V.A. 3% 8% 8% 8%
8% 8% 9% 9%
V.A. 9.5%
9.5% 9.5%
Necklace
11%
12%
Oddiyanam
Haaram
10%
7% 7% 7% 7% Bangles
8% 8% 8% 8%
11% 11% 9% 11% 8%
Bangles Ring Haaram Jhumkas Necklace
Drops
8% 8%
8% 8%
Blackbeads
10% 10% 10%
10%
5.5% 5.5%
Drops Haaram Drops
12% 12%
Haaram
Pendants
8%
11%
Lalithaa
లలితా జ్యూవెల్లరి
మార్ట్ లిమిటెడ్
సోమాజిగూడ • దిల్‌సుఖ్‌నగర్ • కూకట్‌పల్లి
చందానగర్ • సుచిత్రా సర్కిల్
క్యారెట్ రూ. 54000 మాత్రమే
V.A లేదు, M.C లేదు!
మార్కెట్లో కంటే తక్కువ ధరకు వజ్రాభరణాలు
వజ్రాలకు మాత్రమే డబ్బులు ఇచ్చి అందమైన వజ్రాభరణాలు తీసుకోండి.
హైదరాబాద్‌లోని సోమాజిగూడ షోరూంలో మాత్రమే!
ప్రత్యేక ఎగ్జిబిషన్ కౌంటర్
SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా,
ఫోన్: 040-6748 6677.


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 153

శనివారం 23-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేరగాళ్లు జైలు నుంచి పరిపాలించాలా?: మోదీ

-వివరాలు 6లో




స్టెరిలైజేషన్ తర్వాత వదిలేయాల్సిందే: సుప్రీం

-వివరాలు 6లో

న్యూస్‌రీల్

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నక్సలైట్ల మద్దతుదారుడు



నక్సలైట్లకు గట్టి మద్దతుదారుడైన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని విపక్ష 'ఇండియా' కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసుకుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తప్పుపట్టారు. 'సల్వాజుడుం' చట్ట వ్యతిరేకం, రాజ్యాంగ విరుద్ధం అంటూ గతంలో ఆయన తీర్పు ఇచ్చారని గుర్తు చేశారు.

- వివరాలు 6లో▶

లార్డ్ స్వరాజ్‌పాల్ కన్నుమూత



ప్రముఖ ప్రవాస భారతీయ పారిశ్రామిక దిగ్గజం లార్డ్ స్వరాజ్ పాల్ (94) లండన్‌లో కన్నుమూశారు. బ్రిటన్‌లో అత్యంత సంపన్న ఏషియన్‌గా ఎదిగిన ఆయన దశాబ్దాల పాటు వ్యాపార, రాజకీయ రంగాల్లో కీలకంగా నిలిచారు. ఆయన మృతిపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు.

- వివరాలు 17లో▶

మరణం అంచున గాజా



గాజాలో ఆకలి మరణాలు ఫిబ్రవరి నుంచి 4 రెట్లు పెరిగాయి. ప్రస్తుతం 5 లక్షల మంది తీవ్ర కరువును ఎదుర్కొంటున్నారని ఐరాస డబ్ల్యూఎఫ్‌పీ ఈడీ సిండీ మెక్ కెయిన్ తెలిపారు. మధ్యప్రాచ్యంలో అధికారికంగా కరువు నిర్ధారించడం ఇదే మొదటిసారి.

- వివరాలు 6లో▶

మన అంతరిక్ష కేంద్రం!



- బీఏఎస్-01 నమూనా ఆవిష్కరించిన ఇస్రో
- మన అంతరిక్ష ప్రస్థానంలో కీలక మైలురాయి
- అమెరికా, రష్యా, చైనా సరసన భారత్
- మూడేళ్లలో ప్రయోగించాలన్నది లక్ష్యం

దేశీయంగానే బీఏఎస్ తయారీ

ఇదేమిటో తెలుసా? రోదసిలో మన దేశాన్ని అమెరికా, రష్యా, చైనా సరసన నిలిపే ప్రతిష్టాత్మక భారతీయ అంతరిక్ష కేంద్రం (బీఏఎస్) తొలి నమూనా! దేశమంతా చిరకాలంగా ఎంతో ఉత్సుకతగా ఎదురు చూస్తున్న ఈ బీఏఎస్-01ను భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) శుక్రవారం సగర్వంగా ఆవిష్కరించింది. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న జాతీయ అంతరిక్ష దినోత్సవం ఇందుకు వేదికైంది. దేశీయంగా రూపకల్పన చేసిన బీఏఎస్ తొలి మాడ్యూల్ (01)ను 2028 కల్లా భూ దిగువ కక్ష్యలోకి ప్రవేశ పెట్టేందుకు ఇస్రో కృషి చేస్తుండటం తెలిసిందే. 2035కల్లా దాన్ని ఐదు మాడ్యూళ్లకు విస్తరించాలన్నది లక్ష్యం. – న్యూఢిల్లీ

ఎన్నో విశేషాలు..

బీఏఎస్-01

బరువు	పొడవు	వెడల్పు
10 టన్నులు	8 మీటర్లు	3.8 మీటర్లు

దీన్ని భూమికి 450 కి.మీ. ఎత్తున దిగువ కక్ష్యలోకి ప్రవేశపెడతారు

- ➤ అంతరిక్షంలో స్పేస్-లైఫ్ సైన్సెస్, ఔషధ, గ్రహాంతర అన్వేషణ తదితర అత్యాధునిక పరిశోధనలకు వేదికగా నిలవనుంది.
- ➤ వాణిజ్య అంతరిక్ష రంగంలో భారత్ పూర్తిస్థాయిలో కాలూనేందుకు వీలు కల్పించనుంది.
- ➤ అంతరిక్ష పర్యాటకంతో పాటు

మిగతా 2వ పేజీలో ▶

చర్చించాకే చర్యలు

కాళేశ్వరం నివేదికను అసెంబ్లీలో పెడతామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

- సర్కార్ హామీ నేపథ్యంలో నివేదికపై స్టే లేదా రద్దు ఆదేశాలు అవసరం లేదన్న హైకోర్టు
- నివేదిక కాపీని అధికారిక వెబ్‌సైట్‌లో పెడితే తీసేయండి
- కమిషన్ 8బీ, 8సీ కింద నోటీసులు ఇవ్వకపోవడం సరికాదు
- అన్ని అంశాలపై మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిన ధర్మాసనం
- రిపోర్టును మీడియాకు వెల్లడించడాన్ని తప్పుబట్టిన హైకోర్టు
- పిటిషనర్లకు 'ముందస్తు చర్యలు' భావన అవసరం లేదని స్పష్టీకరణ
- తదుపరి విచారణ అక్టోబర్ 7వ తేదీకి వాయిదా

సాక్షి, హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి, చర్చించిన తర్వాతే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం



హామీ ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం అఫిడవిట్ దాఖలు చేసింది. దీంతో కమిషన్ నివేదికపై స్టే ఇస్తూ, రద్దు చేస్తూ ఆదేశాలు అవసరం లేదని హైకోర్టు అభిప్రాయపడింది. నివేదికపై అసెంబ్లీలో చర్చించాలని మంత్రిమండలి నిర్ణయించినప్పుడు.. అంతకుముందే మీడియాకు వివరాలు వెల్లడించడాన్ని తప్పుబట్టింది. పిటిషనర్లు ఆరోపిస్తున్నట్లు ఒకవేళ నివేదికను అధికారిక వెబ్‌సైట్ లో పెడితే వెంటనే తీసివేయాలని ఆదేశించింది. కమిషన్ 8బీ, 8సీ కింద నోటీసులు జారీ చేయకుండా పిటిషనర్లను నిందితులుగా చూపడం సరికాదని పేర్కొంది. పిటిషనర్లు లేవనెత్తిన అన్ని అంశాలపై పూర్తి వివరాలతో మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ తదుపరి వారంలోగా సమాధాన కౌంటర్ వేయాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. కమిషన్ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, అమలు చేయకుండా ఉత్తర్వులు

మిగతా 5వ పేజీలో ▶

అసెంబ్లీ వేదికగానే ఎండగడదాం!



- 'కాళేశ్వరం నివేదిక'పై హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో కేసీఆర్..
- ఎర్రవల్లి నివాసంలో కేటీఆర్, హరీశ్‌రావు తదితరులతో చర్చ

- 5లో▶

సురవరం కన్నుమూత



- వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో తుదిశ్వాస విడిచిన సీపీఐ అగ్రనేత
- విద్యార్థి దశ నుంచే సుధాకర్‌రెడ్డికి వామపక్ష ఉద్యమాలతో అనుబంధం
- పార్టీలో వివిధ హోదాల్లో సేవలు.. ప్రధాన కార్యదర్శిగానూ బాధ్యతలు
- నల్లగొండ నుంచి రెండుసార్లు ఎంపీ..
- సురవరం మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్, పలువురు ప్రముఖులు, పార్టీ నేతల సంతాపం

సాక్షి, హైదరాబాద్/మహబూబ్‌నగర్/ నల్లగొండ: కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి(83) శుక్రవారం రాత్రి కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో సుధాకర్‌రెడ్డి మరణించినట్లు కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు తెలిపారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుధాకర్‌రెడ్డి గతంలో పార్టీలో అత్యున్నత పదవి అయిన ప్రధాన కార్యదర్శిగా

మిగతా 3వ పేజీలో ▶

సమాజం సిగ్గుతో తలదించుకోవాలి

'కేబుల్' విద్యుదాఘాత మరణాలపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

- పుట్టిన రోజునే తండ్రి చితికి కొడుకు నిప్పుపెట్టాల్సిన పరిస్థితా?
- దీనికి బాధ్యులెవరో ప్రభుత్వం చెప్పాలి.. అనుమతిలేని కేబుళ్లను తొలగించాల్సిందే
- ఎయిర్‌టెల్ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక ఆదేశం



సాక్షి, హైదరాబాద్: పుట్టిన రోజునే తండ్రికి కొడుకు తలకొరివి పెట్టాల్సిన పరిస్థితి చోటుచేసుకున్నందుకు సమాజం సిగ్గుతో తలదించుకోవాలని హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. తల్లిదండ్రులతో కేక్ కట్ చేయాల్సిన తొమ్మిదేళ్ల బాలుడు కన్నీటిపర్యంతం కావడం తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేసింది. బాలుడి హృదయం పగిలిపోయిందని.. దీనికి బాధ్యులెవరో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రతి ఒక్కరూ దీనికి బాధ్యత వహించాల్సిందేనని అభిప్రాయపడింది. వైర్లతో విద్యుత్ స్తంభాలు, మామూళ్లతో కొందరి జేబులు బరువెక్కి కిందకు వంగుతున్నాయని చురకలంటించింది. అనుమతి లేని కేబుళ్లను వెంటనే తొలగించాలని ఆదేశించింది. అనుమతి ఉన్నా ప్రమాదకరంగా ఉంటే వాటిని కూడా తీసేయాలని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో శ్రీకృష్ణుడి శోభాయాత్ర సందర్భంగా భక్తులు లాగుతున్న రథానికి విద్యుదాఘాతం జరిగి ఐదుగురు మృతి చెందడం, పాతబస్తీలో మరో నలుగురు మృతిచెందిన నేపథ్యంలో

మిగతా 7వ పేజీలో ▶

టెన్త్ క్లాస్ కిల్లర్!

కూకట్‌పల్లి బాలిక హత్య కేసులో వీడిన మిస్టరీ.. వెలుగులోకి సంచలన విషయాలు

- పక్క భవనంలో చోరీ కోసం స్కెచ్చేసిన టెన్త్ కుర్రాడు
- చోరీ అనంతరం గ్యాస్ లీక్ చేసి ఆ ఇంటికి నిప్పంటించాలని కుట్ర
- దొంగతనం చేస్తుండగా బాలిక చూడటంతో పట్టుబడిపోతానన్న భయంతో హత్య
- వెంట తెచ్చుకున్న కత్తితో సుమారు 20 సార్లు పొడిచి ఇంట్లోకి పరార్
- బాలిక తండ్రిపైనే అనుమానం వచ్చేలా పోలీసులను తప్పుదోవ పట్టించిన వైనం
- ఓ స్థానికుడి సమాచారంతో చివరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. నిందితుడి ఇంట్లో సోదాల్లో కత్తి, రక్తపు మరకల దుస్తులు లభ్యం

8లో



మార్చిలో జరిగిన సహస్ర పుట్టినరోజు వేడుకలో కేక్ తినిపిస్తున్న బాలుడు

అలాగైతే ఓకే

ఇచ్చంపల్లికి షరతులతో తెలంగాణ సమ్మతి



- గోదావరి-కావేరీ అనుసంధానంతో తరలించే నీటిలో 50% మాకే ఇవ్వాలి
- 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి అవకాశం ఇవ్వాలి
- సమ్మక్క సాగర్‌పై ఏ ప్రభావం పడదని అధ్యయనాల్లో తేలాలి
- ఎన్‌డబ్ల్యూడీఏ టాస్క్‌ఫోర్స్ భేటీలో తేల్చిచెప్పిన రాష్ట్రం
- పోలవరం నుంచే గోదావరి-కావేరీ అనుసంధానం చేపట్టాలి: ఏపీ
- అన్ని రాష్ట్రాలూ ఉదారంగా అంగీకరించాలి: సీడబ్ల్యూసీ చైర్మన్

- వివరాలు 7లో▶

ఇదండీ జగత్





సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి పీఏసీఎస్ వద్ద యూరియా కోసం గురువారం అర్ధరాత్రి నుంచే బారులు తీరిన రైతులు -మిరుదొడ్డి (దుబ్బాక)

కష్టాలు వరుస కట్టాయి..

- యూరియా కోసం రైతులకు తిప్పలే తిప్పలు
- కొన్ని ప్రాంతాల్లో టోకెన్లు ఇచ్చి వారం అవుతున్నా అందని దైన్యం
- పీఏసీఎస్ కేంద్రాల వద్దే భోజనం.. నిద్ర
- పోలీస్ పహారా నడుమ టోకెన్లు, యూరియా పంపిణీ

- వివరాలు 2లో▶

యూరియా పక్కదారిపై బదులివ్వాలి: కిషన్‌రెడ్డి

- యూరియా సరఫరాపై కేంద్రాన్ని బద్నాం చేయడం మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హితవు
- పెద్ద రైతులు ఎక్కువ యూరియా నిల్వ చేసుకోవద్దని వినతి



సాక్షి, హైదరాబాద్: కేంద్రం నుంచి తెలంగాణకు పంపుతున్న యూరియా పక్కదారి ఎలా పడుతోందో, ఎలా బ్లాక్ మార్కెట్‌లోకి వెళ్తోందో సమాధానం చెప్పాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక్క బస్తా కూడా అధిక ధరలకు అమ్మకుండా చూడాలని.. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ యూరియా సరఫరా విషయంలో కేంద్రాన్ని బద్నాం చేసే దురుద్దేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. రైతులకు సక్రమంగా యూరియా సరఫరా అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తెలంగాణలో 2.04 లక్షల టన్నుల యూరియా ఖరీఫ్ సీజన్ కోసం ఓపెనింగ్ స్టాక్‌గా ఉందని కిషన్‌రెడ్డి చెప్పారు. అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులు విత్తనాలు వేయక ముందే రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రం యూరియా సరఫరా

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

సంక్షేమ పథకాలు అందుతున్నాయా?

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆరా


గ్రామస్తులతో సమావేశమైన మీనాక్షి నటరాజన్

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు లబ్ధిదారులకు అందుతున్న తీరును పరిశీలించేందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె సమాక గ్రామాన్ని సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయో.. లేదో తెలుసుకున్నారు. అలాగే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా, తమకు ఆసరా పింఛన్ రావడం లేదని, రేషన్ కార్డుల కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్నామని, రైతు భరోసా అందలేదని, భూసమస్య పరిష్కారం కావడం లేదని పలువురు గ్రామస్తులు చెప్పడంతో వారిని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పైలట్ ప్రజావాణి ప్రజా ఫిర్యాదుల బహిరంగ విచారణకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రజల తరఫున మీనాక్షి, ఆమె బృందం సభ్యులు గ్రామస్తుల సమస్యలను లిఖిత పూర్వకంగా అధికారులకు సమర్పించారు. ఆ సమస్యలు త్వరగా పరిష్కరించాలని వారికి సూచించారు. ఆమె వెంట టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఉన్నారు.

యూరియా కొరత ప్రభుత్వ వైఫల్యమే

బీజేపీ ఎంపీ లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో యూరియా కొరతకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యం, బ్లాక్ మార్కెటింగ్ ప్రధాన కారణాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. సర్కార్ తీరుతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. తెలంగాణకు సక్రమంగానే యూరియా సరఫరా జరుగుతోందని స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం కాంగ్రెస్ పార్టీకి బీసీ అభ్యర్థి దొరకలేదా? అని ప్రశ్నించారు. తెలంగాణకు చెందిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్యపై కాంగ్రెస్ వ్యవహరించిన తీరును ప్రజలు మర్చిపోరని గుర్తు చేశారు. తెలంగాణలో 'మార్వాడీ గో బ్యాక్' అంశంపై స్పందిస్తూ.. దేశంలో ఎవరైనా ఎక్కడైనా వ్యాపారాలు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

కేసీఆర్ కుటుంబం వెలిగిపోతోందంటే కాంగ్రెసే కారణం: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరితే కాంగ్రెస్ పార్టీని చిల్లర పార్టీగా కేటీఆర్ వ్యాఖ్యానించడం ఆయన క్యారెక్టర్ ఏంటో చెబుతోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. గాంధీభవన్‌లో శుక్ర వారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'కేటీఆర్ కుటుంబం వెలిగిపోతుందంటే దానికి కారణం కాంగ్రెస్ కాదా? సోనియాగాంధీ వల్లనే తెలంగాణ వచ్చింది అని కేసీఆర్ సభలో చెప్పాడు. ఆ మాట నువ్వు మర్చిపోయావా? కాంగ్రెస్ థర్డ్ క్లాస్ అయితే అక్కడి నుంచే వచ్చిన మీ నాన్న కూడా థర్డ్ క్లాసే కదా! కాంగ్రెస్‌పై మాట్లాడిన కేటీఆర్ క్యారెక్టర్ లేనోడు. రాష్ట్రం ఇచ్చిన తర్వాత సోనియా గాంధీ ఇంటికి వెళ్లి కలిసి నప్పుడు చిల్లర అనిపించలేదా?' అని జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. సోనియా తెలంగాణ ఇవ్వకపోతే అమెరికాలో జీతం మీదనే బతికే వాడివని ఆగ్రహం వ్యక్తంచేశారు.

'స్థానిక' ఎన్నికలకు ఎలా వెళ్లాలి?

నేటి అధికార కాంగ్రెస్ పార్టీ కీలక భేటీలో నిర్ణయం

పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించి.. ముందుకెళ్లడంపైనా చర్చ



- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, ఓటు చోరీ, యూరియా అంశాలపై కూడా...
- మరోమారు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరే అవకాశం
- రాజకీయ వ్యవహారాల కమిటీతో పాటు పీసీసీ సలహా కమిటీ సమావేశం కూడా

సాక్షి, హైదరాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీ శనివారం కీలక భేటీ నిర్వహించనుంది. స్థానిక ఎన్నికల అంశంలో నిర్ణయం తీసుకునేందుకు వీలుగా టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీతోపాటు సలహాకమిటీ సమావేశాన్ని కూడా సంయుక్తంగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సాయంత్రం 5 గంటలకు గాంధీభవన్‌లో జరగనున్న ఈ కీలక సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో పార్టీపరంగా ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై నిర్ణయం తీసుకొని తమ వైఖరిని అధికారికంగా ప్రకటించనుంది. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లతోపాటు రాష్ట్ర మంత్రులు, రాజకీయ వ్యవహారాలు, సలహా కమిటీ సభ్యులు హాజరుకానున్నారు.

ఎజెండా ఇదే....!

గాంధీభవన్ వర్గాల ద్వారా తెలిసిన సమాచారం ప్రకారం ఐదారు కీలకాంశాలపై రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు చర్చించనున్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే విషయంలో హైకోర్టు తీర్పు నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యల గురించి నిర్ణయం తీసుకోనున్నారు. దీనికి ముడిపడి ఉన్న బీసీల రిజర్వేషన్లను అమలు చేసే విషయంలో పార్టీ ఎలాంటి వైఖరి తీసుకోవాలన్న దానిపై కూడా నేతలు చర్చించనున్నారు. అయితే, బీసీలకు రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గేది లేదని, చట్టపరంగా కల్పించలేని పక్షంలో పార్టీపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చే అంశంపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. బీసీ రిజర్వేషన్ల విషయంలో తమ చిత్తశుద్ధిని ప్రజలకు వివరించడంతోపాటు ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు అనుసరిస్తున్న ద్వంద్వ, అస్పష్ట వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా మరోమారు అసెంబ్లీని సమావేశపర్చాలని ప్రభుత్వాన్ని కోరే అంశాన్ని కూడా చర్చించనున్నారు. అయితే, ఈ విషయంలో పీఏసీలోని అందరి సభ్యుల అభిప్రాయాలను తీసుకొని, మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు పార్టీ పరంగా నిర్ణయం తీసుకోవాలని ఇప్పటికే టీపీసీసీ నిర్ణయించింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, ఏఐసీసీ పిలుపు మేరకు ఓటు చోరీ అంశంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, పెండింగ్‌లో ఉన్న గ్రామ, మండల, జిల్లా పార్టీ కమిటీల నియామకం, రాష్ట్రంలో యూరియా కొరత, ప్రతిపక్ష పార్టీల వైఖరి తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చ జరగనుందని సమాచారం.

జనవరి 15కల్లా 'యాదాద్రి' జాతికి అంకితం

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటన

- గ్రీన్ పవర్ ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెడతామని వెల్లడి
- విద్యుత్ కేంద్రం పరిధిలో 500 మంది భూనిర్వాసితులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత
- నాడు వై.ఎస్. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వబట్టే నేడు గిరిజనులకు ఉద్యోగాలు వచ్చాయని వ్యాఖ్య



భూ నిర్వాసితురాలికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న భట్టి, కోమటిరెడ్డి, బీఎల్ఆర్

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని వచ్చే ఏడాది జనవరి 15 నాటికి జాతికి అంకితం చేస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇప్పటికే రెండు యూనిట్లను అందుబాటులోకి తెచ్చామని.. గ్రీన్ పవర్ ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ముందు వరుసలో నిలబెడతామన్నారు. యాదాద్రి విద్యుత్ కేంద్రం పరిధిలో భూములు కోల్పోయిన 500 మందికి ప్రజాభవన్‌లో భట్టి శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ ఉండదన్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టామన్నారు. 'కాంగ్రెస్ అంటేనే కరెంట్... కరెంట్ అంటేనే కాంగ్రెస్'అని వ్యాఖ్యానించారు. వాస్తవానికి యాదాద్రి పవర్ ప్లాంట్‌కు 2022 అక్టోబర్‌లోనే పర్యావరణ అనుమతులపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ స్టే ఇచ్చిందని.. అయినా గత ప్రభుత్వ పాలకులు ప్లాంట్ నిర్మాణ పనుల్లో చేసిన జాప్యం వల్ల ప్రాజెక్టుపై తీవ్ర ఆర్థిక భారం పడిందన్నారు. తాము అధికారంలోకి రాగానే తిరిగి పర్యావరణ అనుమతులు తీసుకొచ్చి నిర్మాణ పనుల్లో వేగం పెంచామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 1978లోనే జపాన్ సంస్థ మిత్సుబిషి సాంకేతికతను ఉపయోగించి పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తి తీసుకొచ్చామని చెప్పారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నప్పటికీ రాష్ట్రంలో రెప్పపాటు కూడా విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తున్నామని భట్టి అన్నారు. రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు, 51 లక్షల మంది పేదలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు అయ్యే రూ. 17 వేల కోట్ల మొత్తాన్ని విద్యుత్ సంస్థలకు ప్రభుత్వమే చెల్లిస్తోందని వివరించారు.

ఆలస్యం వల్ల ఆర్థిక భారం.. ప్రతి మండలానికీ అంబులెన్స్

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి పవర్ ప్లాంట్ పరిసర గ్రామాల్లోని వారికి విద్య, వైద్యాన్ని ఉచితంగా అందిస్తామని భట్టి తెలిపారు. ప్రతి మండలానికీ ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సీసీ రోడ్లు, ఫ్లై ఓవర్లు నిర్మిస్తామని, భూసేకరణకు అవసరమైన నిధులను ఇస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలోనే లక్షలాది మంది గిరిజనులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందాయని భట్టి గుర్తుచేశారు. వారిలో చాలా మంది భూ నిర్వాసితులు ఇప్పుడు ఉద్యోగాలు పొందారన్నారు. జెన్‌కో విధుల్లో ఉండి ప్రాణాలు కోల్పోయిన 159 మంది కుటుంబ సభ్యులకు రెండోసారి కారుణ్య నియామక ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి, ఉన్నతాధికారులు నవీన్ మిత్తల్, హరీశ్ పాల్గొన్నారు.

మన అంతరిక్ష కేంద్రం!


స్పేస్ స్టేషన్

▶ మొదటి పేజీ తరువాయి

అంతర్జాతీయ సహకారాలకు వేదిక కానుంది.

- స్పేస్ టెక్నాలజీ, రీసెర్చ్‌ను కెరీర్‌గా మలచుకునేలా భావి తరాలకు స్ఫూర్తినివ్వనుంది.
- ఎన్విరాన్‌మెంటల్ కంట్రోల్, లైఫ్ సపోర్ట్ సిస్టం (ఈసీఎల్ఎస్ఎస్), భారత్ డాకింగ్ సిస్టం, భారత్ బెర్తింగ్ మెకానిజం, ఆటోమేటెడ్ హాచ్ సిస్టం వంటి హంగులెన్నో దీని సొంతం.
- ఇవన్నీ పూర్తిగా దేశీయంగా తయారు చేసుకున్న ఫీచర్లే కావడం విశేషం.
- అంతరిక్షంలో మనుషుల ఆరోగ్యంపై సూక్ష్మగురుత్వాకర్షణ ప్రభావంతో పాటు సాంకేతిక ప్రదర్శనలు, శాస్త్రీయ ఇమేజింగ్ తదితరాలు బీఏఎస్‌లో జరగనున్నాయి.
- రోజువారీ కార్యకలాపాలకు తోడు రీఫిల్లింగ్ ప్రొపల్లెంట్, ఈసీఎల్ఎస్ఎస్ ఫ్లూయిడ్లు, రేడియేషన్, థర్మల్ ప్రభావం, మైక్రో మీటరాయిడ్ ఆర్బిటల్ వ్యర్థాల (ఎంఎంఓడీ) నుంచి రక్షణ తదితరాలకు అవసరమైన హంగులన్నీ బీఏఎస్‌లో ఉండనున్నాయి.
- స్పేస్ సూట్లు, ఎయిర్ లాక్స్, ప్లగ్ అండ్ ప్లే తరహా ఇంటిగ్రేటెడ్ ఏవియానిక్స్ వ్యవస్థలకు దన్నుగా నిలుస్తుంది.

ఆ దేశాల సరసన...

బీఏఎస్-01 భారత్‌ను సొంత అంతరిక్ష కేంద్రాలున్న అమెరికా, రష్యా, చైనా సరసన నిలపనుంది. అయితే ప్రస్తుతం రెండే అంతరిక్ష కేంద్రాలు పని చేస్తున్నాయి. మొదటిది అమెరికా, రష్యా, యూరప్, జపాన్, కెనడా సంయుక్తంగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం. రెండోది చైనాకు చెందిన టియాంగాంగ్ స్పేస్ స్టేషన్.

- గతంలో తొలుత అమెరికా, అనంతరం సోవియట్ యూనియన్ (యూఎస్ఎస్ఆర్-ప్రస్తుత రష్యా) సొంత అంతరిక్ష కేంద్రాలను నిర్వహించాయి.
- అమెరికా స్కైలాబ్ పేరిట, యూఎస్ఎస్ఆర్ మిర్ పేరిట అంతరిక్ష కేంద్రాలను నిర్వహించాయి.
- ఇటీవల టియాంగాంగ్ స్పేస్ స్టేషన్ నిర్మించిన చైనా అంతకుముందు టియాంగాంగ్-1, టియాంగాంగ్-2 పేరుతో మాడ్యూళ్లను ఏర్పాటు చేసుకుంది.

కష్టాలు వరుస కట్టాయి..

యూరియా కోసం రైతులకు తిప్పలేతిప్పలు


మహబూబాబాద్‌లో యూరియా బస్తాల కోసం వచ్చిన రైతులు

సాక్షి, మహబూబాబాద్ / మిరుదొడ్డి / ఆత్మకూర్: యూరియా కోసం రైతుల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. సరిపడా స్టాక్ ఉందని అధికారులు చెబుతుండగా, టోకెన్లు ఇచ్చి వారం దాటినా యూరియా ఇవ్వడం లేదని రైతులు రోడ్డెక్కారు. పలుచోట్ల రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో పోలీస్ పహారా మధ్య యూరియా బస్తాలు, టోకెన్లు ఇచ్చారు.

- మహబూబాబాద్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణ సెంటర్‌లో శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. వందలాది మంది రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ ధర్నాలో రైతులకు మద్దతుగా ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. చివరకు టోకెన్లు ఇచ్చి త్వరలో యూరియా అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఆపై బందోబస్తు మధ్య టోకెన్లు పంపిణీ చేశారు.
- కురవి, సీరోలు మండల కేంద్రాల్లో యూరియా పంపిణీ కేంద్రం వద్దకు పెద్దఎత్తున రైతులు రావడంతో పోలీస్ పహారా మధ్య పంపిణీ చేశారు.
- సకాలంలో యూరియా ఇవ్వడం లేదని కేసముద్రం మండలం బేరువాడ, దనసరి, ఇనుగుర్తి, డోర్నకల్ మండలం మన్నెగూడెం ప్రాంతాల్లో రైతులు ఆందోళనకు దిగారు.
- సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి పీఏసీఎస్‌కు శుక్రవారం యూరియా లారీ వస్తుందని సమాచారం అందుకున్న పలు గ్రామాలకు చెందిన రైతులు అర్ధరాత్రి నుంచే క్యూ లైన్ కట్టారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి రైతులు చెప్పులను క్యూలో పెట్టి బయటకు వెళ్లారు. ఒకేసారి 3 వేల మంది రైతులు బారులు తీరడంతో టోకెన్లు ఇవ్వడంతో అధికారులకు సైతం తిప్పలు తప్పలేదు. మొత్తానికి యూరియా లారీ రావడంతో టోకెన్లు అందుకున్న రైతులకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు.
- వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతుల కుటుంబసభ్యులందరూ పడిగాపులు కాస్తున్నారు. శుక్రవారం సొసైటీకి 700 బస్తాల యూరియా రాగా.. గురువారం టోకెన్లు తీసుకున్న 72 మంది అందజేశారు. శుక్రవారం మరో 70 మంది రైతులకు టోకెన్లు ఇచ్చారు. అయితే తమ వంతు ఎప్పుడు వస్తుందేమోనని తెల్లవారుజాము నుంచే రైతులు పీఏసీఎస్ కార్యాలయం వద్ద చెప్పులను క్యూలైన్‌లో పెట్టి ఎదురు చూస్తున్నారు. ఇంటివద్ద నుంచి భోజనం తెచ్చుకొని అక్కడే తింటున్నారు. అలసిపోయి చెట్టు నీడన నిద్రపోతున్నారు.

టోకెన్ ఇచ్చి ఐదురోజులు..



నాకున్న ఎకరంతోపాటు మూడు ఎకరాల పొలం మునాబాకు తీసుకున్నా. పొలం నాటేసిన వెంటనే యూరియా వేయాలి. నాటేసి నెలరోజులైనా యూరియా వేయలేదు. యూరియా కోసం వస్తే వారం క్రితం టోకెన్లు ఇచ్చారు. ఇప్పటి వరకు బస్తా కూడా ఇవ్వలేదు.

– అజ్మీర చక్రు, రోటిబండ తండా, మహబూబాబాద్

అదును దాటితే ఇబ్బందే..



వరి, మొక్కజొన్న సాగు చేశా. వర్షాలు పడుతున్నాయి. ఇప్పుడు యూరియా వేస్తేనే దిగుబడి వస్తుంది. ఐదురోజుల నుంచి ఇద్దరం తిరుగుతున్నా ఒక్క బస్తా దొరకలేదు. అదును దాటిన తర్వాత యూరియా వేసినా లాభం లేదు. పంట దిగుబడి తక్కువ వస్తుంది.

– భూక్యా హుస్సేన్, సికింద్రాబాద్ తండా, మహబూబాబాద్

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



తిరుమల: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా, టీటీడీ అధికారులు లడ్డూప్రసాదాలను అందించారు.

అసమర్థుల వల్లే రైతులకు కష్టాలు

అన్నదాతను అరిగోస పెడుతున్నవారి పతనం ప్రారంభమైంది: కేటీఆర్


కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులను అరిగోస పెడుతున్న వారి పతనం ప్రారంభమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో యూరియా కొరత ఏర్పడలేదని, ప్రస్తుతం పరిపాలన చేతకానివారి చేతిలో ఉండటం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. కేసీఆర్ ముందుచూపు, పాలనా సామర్థ్యం ప్రజలకు ఇప్పుడు అర్థమైందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిల్లర రాజకీయాలు చేసే అసమర్థుల వల్లే రైతులకు కష్టాలు వచ్చాయని విమర్శించారు. వందేళ్ల ముందుచూపు ఉన్న కేసీఆర్‌కు, బూతులు మాట్లాడే వారికి నడుమ ఉన్న తేడా కూడా అందరికీ అర్థమైందని అన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు గురువారం కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఈ చేరికల్లో జమ్మికుంట మండలం తనుగుల మాజీ సర్పంచ్ రామస్వామి, శంభునిపల్లి మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, పాపక్కపల్లి మాజీ సర్పంచ్ మహేందర్, శాయంపేట మాజీ సర్పంచ్ భద్రయ్య, నాగంపేట మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కెళ్లపల్లి రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

టోకెన్ల వారీగా యూరియా

- యూరియా నిల్వలు, సరఫరాపై అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల
- యూరియాపై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌లతో ఫోన్‌లో మాట్లాడిన నాగేశ్వరరావు


కేంద్రమంత్రులతో ఫోన్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: రైతులకు టోకెన్లు జారీచేసి యూరియా సరఫరా చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. యూరియా డిమాండ్ అధికంగా ఉన్న జిల్లాలకు నిల్వలున్న జిల్లాల నుంచి తక్షణమే తరలించి రైతులకు అందుబాటులోకి తేవాలని మంత్రి సూచించారు. జిల్లాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూరియా నిల్వలు, సరఫరాపై శుక్రవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల కీలక సమావేశం నిర్వహించారు. ఈ విషయంలో కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ, రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాలను అనుసంధానం చేసి యూరియాను పంపిణీ చేసే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. రాష్ట్ర అవసరాల దృష్ట్యా కేంద్రం 50 వేల మెట్రిక్ టన్నులు ఈ నెలలో సరఫరా చేస్తామని చెప్పినా, 28,600 మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించి, అందులో 13,000 మెట్రిక్ టన్నులు సరఫరా చేసిందన్నారు. ఎర్ర సముద్రం నౌకాయానంలో ఇబ్బందులతో మన దేశానికి దిగుమతి కావాల్సిన యూరియా సకాలంలో అందుబాటులోకి రాకపోవడానికితోడు, రామగుండం ఎరువుల కార్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో యూరియా ఉత్పత్తి అనుకున్న స్థాయిలో లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. రాష్ట్రాలకు యూరియా కేటాయింపులు, సరఫరా పూర్తిగా కేంద్రానిదని, కానీ రాష్ట్రంలో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. రైతుల ప్రయోజనాలకంటే రాజకీయ స్వార్థంతో విమర్శలు చేయడం, క్యూలైన్‌లో చెప్పులు పెట్టించి సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని బద్నాం చేస్తుండటంపై తుమ్మల మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొనుగోలు కేంద్రాల వద్ద క్యూ లైన్లు లేకుండా చూడాలని, టోకెన్ పద్ధతిలో స్టాక్‌ను బట్టి రైతులకు యూరియా బస్తాలు అందించాలని అధికారులకు సూచించారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి ఆగిపోయి..

రాష్ట్రానికి కేటాయించిన స్వదేశీ యూరియాలో ఆర్ఎఫ్‌సీఎల్ లో ఉత్పత్తి ఆగిపోయి, దాదాపు 63 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయలేదని తుమ్మల చెప్పారు. ఈ 63 వేల మెట్రిక్ టన్నుల యూరియా వెంటనే సరఫరా చేసేలా చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని ఫోన్‌లో తుమ్మల కోరారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన యూరియా సరఫరాపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితోనూ ఫోన్‌లో మాట్లాడారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఆర్ఎఫ్‌సీఎల్ లో తెలంగాణకు కేటాయించిన యూరియా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్‌ను తుమ్మల ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి, కోఆపరేటివ్ కమిషనర్ సురేంద్రమోహన్, మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

యూరియా పక్కదారిపై బదులివ్వాలి: కిషన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

చేయడం లేదని ప్రకటించి భయానక వాతావరణాన్ని సృష్టించిందని మండిపడ్డారు. ఇతర దేశాల్లో ఎరువుల ధరలు మూడు రెట్లు పెరిగినప్పటికీ కేంద్రం 11 ఏళ్లుగా రైతులపై భారం వేయకుండా రాష్ట్రానికి సుమారు రూ. 80 వేల కోట్ల ఎరువుల సబ్సిడీని భరించిందన్నారు. రూ. 2,650 విలువైన ఒక్కో యూరియా బస్తాను రూ. 265 సబ్సిడీ ధరకే రైతులకు అందిస్తుంటే దాన్ని రూ. 400కి వారు కొనాల్సిన పరిస్థితి ఎందుకొస్తోందని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటోందని ప్రశ్నించారు. అసలు కుట్ర ఎవరిదో బదులివ్వాలని నిలదీశారు. పెద్ద రైతులు వారి దగ్గర ఎక్కువ యూరియా ఉంచుకోవద్దని.. అవసరమైన యూరియాను అందుబాటులోకి తెస్తామని భరోసా ఇచ్చారు.

సచివాలయం వద్ద నిరసనలకు భయమెందుకు?

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఏటా సెప్టెంబర్ 17న 'తెలంగాణ లిబరేషన్ డే'ను హైదరాబాద్‌లో నిర్వహిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. ఈ ఏడాది కూడా తెలంగాణ విముక్తి దినాన్ని కేంద్రం తరఫున ఘనంగా నిర్వహిస్తామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రజాసమస్యలు, నగరాభివృద్ధి అంశాలపై బీజేపీ ఆధ్వర్యంలో సచివాలయం ఎదుట నిరసన చేపడితే రాష్ట్ర ప్రభుత్వానికి ఉలికిపాటు, భయం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ నేతలను అదుపులోకి తీసుకోవడం, హౌస్ అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో మౌలిక సమస్యల పరిష్కారానికి జైలుకెళ్లేందుకైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీల మేరకు ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1 నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చేసే పోరాటానికి బీజేపీ రాష్ట్రశాఖ పూర్తి మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కొత్త పీఆర్సీని ప్రకటించి 6 నెలల లోపు సిఫార్సులను అన్నీ అమలు చేస్తామని ఇచ్చిన హామీ అటకెక్కిందని విమర్శించారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో అన్ని రకాల జబ్బులకు అన్ని ఆసుపత్రుల్లో వైద్యం అందించేవిధంగా హెల్త్ కార్డులు ఇస్తామన్న ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. ప్రస్తుతం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ విధానం అమలు చేస్తామన్న హామీ అతీగతీ లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి మరీ దయనీయంగా మారిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగుల జీపీఎఫ్ మొత్తాల విత్‌డ్రాపైనా మారిటోరియం విధించడం దారుణమన్నారు.


మరిన్ని రాష్ట్ర వార్తలు సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..

▶ మొదటి పేజీ తరువాయి

బాధ్యతలు నిర్వర్తించారు. నల్లగొండ నుంచి రెండు సార్లు ఎంపీగా విజయం సాధించారు. సురవరం మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మాజీ సీఎం , వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఇతర నేతలు, ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

సురవరం కన్నుమూత





ఎల్ఎల్‌బీ అందుకున్నప్పుడు...



తల్లిదండ్రులతో సురవరం సుధాకర్‌రెడ్డి

పార్టీ ప్రధాన కార్యదర్శిగా..

సుధాకర్‌రెడ్డి 1942 మార్చి 25న ప్రస్తుత నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొండ్రావుపల్లిలో సురవరం వెంకట్రామ్‌రెడ్డి, ఈశ్వరమ్మ దంపతులకు జన్మించారు. అయితే ఆయన సొంతూరు జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని కంచుపాడు. ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం కర్నూలు జిల్లాలోని ఉస్మానియా కళాశాలలో బీఏ చదివారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాలలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచే వామపక్ష ఉద్యమాలతో అనుబంధమైన ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. సీపీఐ అనుబంధ ఆల్ ఇండియా విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నుంచి ఆయన ప్రస్థానం మొదలైంది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియాలో క్రమంగా ఎదుగుతూ ప్రధాన కార్యదర్శి కూడా అయ్యారు. అంతకుముందు 1966లో ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, 1970లో జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు. 1972లో ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1971లో సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడిగా.. 1974 నుంచి 1984 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. 1984, 1990లలో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 1994లోనూ కర్నూలులోని డోన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు. అయితే 1998 (12వ లోక్‌సభ), 2004 (14 లోక్‌సభ)లో నల్లగొండ నుంచి ఎంపీగా విజయం సాధించారు. ఈ క్రమంలో సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2007లో హైదరాబాద్‌లో జరిగిన పార్టీ జాతీయ సమావేశాల్లో ఉప ప్రధాన కార్యదర్శిగా, 2012లో పాట్నాలో జరిగిన జాతీయ సమావేశాల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత కూడా ఆయననే ప్రధాన కార్యదర్శిగా పార్టీ ఎన్నుకుంది. ఈ నేపథ్యంలో 2012 నుంచి 2019 వరకు ఆ పదవిలో కొనసాగారు. 2004లో ఎంపీగా ఎన్నికైన తర్వాత పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ (కార్మిక) చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

విద్యుత్ చార్జీల ఆందోళనలో కీలక పాత్ర

2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచగా.. దీనిపై వామపక్షాలు పెద్దయెత్తున పోరాటం నిర్వహించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఆందోళనల్లో సురవరం కీలక పాత్ర పోషించారు. ఎంపీగా పార్లమెంటులో కార్మికులు, రైతులు, కూలీలు, పేదల సమస్యలపై గళమెత్తారు. వ్యవసాయ సంక్షోభం, కార్మిక హక్కులు, ఆర్థిక విధానాలపై నిరంతరం స్వరం వినిపించారు. నిరాడంబర జీవనశైలి, ఆచరణాత్మక రాజకీయ దృక్పథం ఆయన ప్రత్యేకత. దేశంలో వామపక్ష శక్తుల ఐక్యత కోసం ఎల్లప్పుడూ కృషి చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. తెలంగాణ వైతాళికుడిగా పేరుగాంచిన సురవరం ప్రతాపరెడ్డి ఈయనకు పెదనాన్న.

మహబూబ్‌నగర్‌లో జననం..

సురవరం సుధాకర్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించినా నల్లగొండతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉంది. పార్టీ కార్యక్రమాలైనా, రాజకీయాలైనా నల్లగొండ గడ్డ నుంచే క్రియాశీలంగా వ్యవహరించారు. నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు ఎంపీగా గెలుపొంది సేవలందించారు. ఉద్యమాల పురిటిగడ్డ నల్లగొండ జిల్లా కేంద్రంగా అనేక వామపక్ష పోరాట కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 2024 డిసెంబర్‌లో నల్లగొండలో నిర్వహించిన సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగసభలో పాల్గొన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కూడా ఆయన సభలో పాల్గొని మాట్లాడారు.

గొప్ప నాయకుడిని కోల్పోయాం: సీఎం

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సుధాకర్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయి నేతగా ఎదిగిన గొప్ప నాయకుడని, వామపక్ష ఉద్యమాలు, ఎన్నో ప్రజా పోరాటాల్లో పాలు పంచుకున్నారని గుర్తు చేసుకున్నారు.

కేసీఆర్, సీపీఐ నేతల సంతాపం

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు సురవరం మృతి పట్ల సంతాపం ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయనతో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు. శోకతప్తులైన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర పార్టీ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, నర్సింహ, కలవేణ శంకర్, మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తదితరులు సంతాపం ప్రకటించారు.

కాంగ్రెస్ నేతల సంతాపం

సుధాకర్‌రెడ్డి మృతిపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు తమ సంతాపాన్ని తెలియజేశారు. కమ్యూనిస్టు నాయకుడిగా దేశ రాజకీయాల్లో తనదైన చెరగని ముద్ర వేసిన సుధాకర్ రెడ్డి మరణం రాజకీయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సంతాపం ప్రకటించారు.

సురవరం మృతికి వైఎస్ జగన్ సంతాపం

సీపీఐ అగ్రనేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన సురవరం సుధాకర్‌రెడ్డి ప్రముఖ వామపక్ష నేతగా గుర్తింపు పొందారని, ఏ పదవిలో ఉన్నా.. తనదైన ఒక ప్రత్యేక ముద్ర వేశారని గుర్తు చేశారు. ఆయన మరణం రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

క్లుప్తంగా...

విద్రోహ సభకు తరలిరండి

- టీఈఏ అధ్యక్షురాలు నిర్మల



సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించనున్న పెన్షన్ విద్రోహ సభకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరు కావాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం (టీఈఏ) రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ జి.నిర్మల కోరారు. జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో జిల్లాల్లో చేపడుతున్న చైతన్య యాత్రలకు పూర్తి మద్దతు ఇస్తున్నట్టు ఆమె తెలిపారు.

ఉద్యమిద్దాం.. పాత పెన్షన్ సాధిద్దాం

- టీచర్ల ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఫోన్‌ఇన్ కార్యక్రమం



సాక్షి, హైదరాబాద్: పాత పెన్షన్ విధానాన్ని సాధించేందుకు జరిగే పోరాటంలో ప్రతీ ఉపాధ్యాయులంతా పాల్గొనాలని టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న పీఆర్టీయూటీఎస్ నేతృత్వంలో పెన్షన్ విద్రోహ దినం మహాధర్నా చేపట్టాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేశారు. శుక్రవారం ఆయన పీఆర్టీయూ నేతలు గుండు లక్ష్మణ్, పులగం దామోదర్‌రెడ్డితో కలిసి టీచర్లతో ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాల్లోని టీచర్లకు ఫోన్ చేసి ఆయన నేరుగా మహాధర్నా ఆవశ్యకతను వివరించారు. ప్రతీ ఉపాధ్యాయుడిని పాత పెన్షన్ కోసం చేపట్టే ఆందోళన వైపు నడిపించాలని సూచించారు. జిల్లా పీఆర్టీయూటీఎస్ నేతలు తమ జిల్లా పరిధిలో ఇలాగే అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్టు శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. గ్రామ స్థాయి ఉపాధ్యాయుల వరకు కూడా ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని తీసుకెళ్తున్నట్టు చెప్పారు.

తైవాన్‌లో టీ-చిప్ బృందం పర్యటన

సాక్షి, హైదరాబాద్ : ప్రపంచస్థాయి సెమీకండక్టర్ రంగంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలపడానికి టెక్నాలజీ చిప్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ (టీ-చిప్) వ్యవస్థాపకుడు సందీప్ కుమార్ మక్తల నేతృత్వంలోని ప్రతినిధి బృందం తైవాన్‌లో మూడు రోజుల పర్యటనకు వెళ్లింది. ఈ పర్యటనలో భాగంగా శుక్రవారం నేషనల్ యాంగ్ మింగ్ చియావో తుంగ్ యూనివర్సిటీ (ఎన్‌వైసీయూ), తైవాన్ సెమీకండక్టర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (టీఎస్ఆర్ఐ) వంటి ప్రముఖ విద్యా, పరిశోధనా సంస్థలను టీ-చిప్ బృందం సందర్శించింది. 2030 నాటికి 10,000 మంది సెమీకండక్టర్ నిపుణులను తయారు చేయాలన్న తెలంగాణ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పర్యటన చేపట్టినట్లు ఈ సందర్భంగా టీ-చిప్ వ్యవస్థాపకుడు సందీప్ కుమార్ మక్తల తెలిపారు.

రూ.345 కోట్లతో జోగులాంబ ఆలయ అభివృద్ధి

- ఆలయ పునరుద్ధరణ కమిటీ సమావేశంలో తీర్మానం

సాక్షి, హైదరాబాద్: ఐదో శక్తిపీఠం జోగులాంబ ఆలయాన్ని రూ.345 కోట్లతో అభివృద్ధి చేయాలని ఆలయ పునరుద్ధరణ కమిటీ సమావేశం తీర్మానించింది. దీనికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. తొలుత రూ.4.9 కోట్లతో పనులు ప్రారంభించాలని తెలిపింది. శుక్రవారం ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి అధ్యక్షతన జోగులాంబ ఆలయ పునరుద్ధరణ కమిటీ భేటీ జరిగింది. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకట్రావు, ధార్మిక సలహాదారు, స్థపతి గోవిందహరి, మూర్తి, దేవాదాయశాఖ, రోడ్లు భవనాలశాఖ, పురావస్తు శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆలయ పునరుద్ధరణ పనులు మూడు దశల్లో చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

విధుల్లో అంతా సమానమే

- మహిళలు, పురుషులు అన్న తేడాలు సరికాదు
- మహిళా పోలీస్ మొదటి సదస్సు ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి



సదస్సులో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్ : నియామక సమయంలో లేని లింగవివక్ష.. విధుల్లో చూపడం సరైంది కాదని, మహిళా పోలీస్‌లో మహిళ అనే పదాన్ని తొలగించాలన్న సిఫారసు మంచి ఆలోచనని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. పోలీస్‌శాఖ తరఫున చేసిన ఈ సిఫారసుతో రాష్ట్ర ప్రభుత్వం పక్షాన తాను ఏకీభవిస్తున్నానని పేర్కొన్నారు. విధుల్లోనూ సమానంగా చూడాలన్న ప్రతిపాదన సరైందేనని భట్టి అభిప్రాయపడ్డారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో మూడురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మహిళా పోలీసుల మూడురోజుల సదస్సు ముగింపు సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి భట్టి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళాపోలీస్ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. సదస్సులో భాగంగా చర్చకు వచ్చిన మహిళా పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారాలపై ప్రత్యేకంగా కమిటీ వేసి శాస్త్రీయ ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందిస్తే అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో విధుల్లో మహిళలు ఉన్నప్పుడు వాష్‌రూం సదుపాయం అత్యంత ముఖ్యమని చెప్పారు. మహిళా సిబ్బంది వ్యక్తిగత, యూనిఫామ్ అవసరాలు అన్ని అమలు చేయదగినవే అని.. అవేమి గొంతెమ్మ కోరికలు కాదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ జాతీయస్థాయిలో నంబర్‌వన్‌గా ఉందని చెప్పారు. పోలీసు సిబ్బంది వ్యక్తిగత సమస్యలతోపాటు శాఖాపరమైన అవసరాలు, కార్యాలయాల భవనాలు, ఠాణాలు, సిబ్బంది క్వార్టర్స్ వంటి సమస్యలకు సంబంధించి ప్రతిపాదనలు తీసుకురావాలని డీజీపీ జితేందర్‌కు డిప్యూటీ సీఎం సూచించారు. అనేక ఒత్తిళ్లు, సవాళ్ల మధ్య విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బంది పిల్లల చదువుల విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేకుండా ఆ బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

- ➤ హోంశాఖ స్పెషల్ సీఎస్ రవిగుప్తా మాట్లాడుతూ పోలీస్‌శాఖలో మహిళల పాత్ర ఎంతో కీలకమని వారి సంఖ్య పెరుగుతోందన్నారు.
- ➤ డీజీపీ జితేందర్ మాట్లాడుతూ మహిళా సిబ్బంది సమస్యలపై చర్చించేందుకు మూడురోజుల సదస్సు నిర్వహించడం ఎంతో కీలకమని చెప్పారు. ఉత్తమ పనితీరు కనబర్చిన సిబ్బంది అవార్డులకు ఎంపికలో పూర్తి పారదర్శకతతో పనిచేస్తున్నట్టు తెలిపారు.
- ➤ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ మహిళా పోలీస్ సిబ్బందికి విధుల్లో ఎదురయ్యే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలన్న అంశాలపై తరగతులు, చర్చలు నిర్వహించినట్టు తెలిపారు.
- ➤ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ మాట్లాడుతూ అటవీశాఖలో మహిళా సిబ్బంది క్రమంగా తమ శక్తిసామర్థ్యాలు నిరూపించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీలు సౌమ్యామిశ్రా, శిఖాగోయల్, స్వాతిలక్రా తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో హెలీ టూరిజం

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- హెలికాప్టర్ ద్వారా కృష్ణా తీర ప్రాంతాలు, నల్లమల అందాలను వీక్షించేలా ప్రణాళిక
- నాగర్‌కర్నూల్ జిల్లాలో వెల్‌నెస్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి



వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి జూపల్లి

సాక్షి, నాగర్‌కర్నూల్: కృష్ణానది తీర ప్రాంతాలు, నల్లమల సుందర దృశ్యాలను హెలికాప్టర్ ద్వారా విహంగ వీక్షణం చేసేలా టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డితో కలసి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అమరగిరి ద్వీపంలో రూ.68.10 కోట్లతో వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ ప్రాజెక్ట్, అమ్రాబాద్ మండలం ఈగలపెంటలో రివర్ క్రూయిజ్ నోడ్, చెంచు మ్యూజియం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అమరగిరి ద్వీపంలో 30 కాటేజీలు, కెఫెటేరియా, యోగా డెస్క్, ధ్యాన మందిరం, ల్యాండ్‌స్కేప్ గార్డెన్ వసతులు కల్పించనున్నట్టు చెప్పారు. భవిష్యత్తులో హెలికాప్టర్ ద్వారా ఇక్కడి అందాలను వీక్షించేందుకు వీలుగా వసతులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కృష్ణానదిలో వాటర్ స్పోర్ట్స్, బోటింగ్ క్రూయిజ్ సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ప్రపంచంలోని చాలా దేశాలు కేవలం పర్యాటకం మీదే ఆధారపడి ఆదాయాన్ని పెంచుకుంటున్నాయని, తెలంగాణలో పర్యాటకానికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం టూరిజం అభివృద్ధిపై నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధిపై తమ ప్రభుత్వం నూతన ఒరవడిని అనుసరిస్తోందని చెప్పారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. సోమశిల వద్ద ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంతో ఇక్కడి రూపురేఖలు మారుతాయన్నారు.

కొత్తగా 1,623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు

భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య నియామకాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని జిల్లా, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లతోపాటు ఆర్టీసీ హాస్పిటల్‌లో 1,623 స్పెషలిస్టు డాక్టర్ల నియామకానికి శుక్రవారం ప్రభుత్వ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో మల్టీజోన్-1 పరిధిలో 858 పోస్టులు, మల్టీజోన్-2లో 765 పోస్టులు ఉన్నాయి. సెప్టెంబర్ 8 నుంచి 22 వరకు దరఖాస్తులను స్వీకరించనుంది. ఈ నియామకాలు పూర్తయితే టీవీవీపీలోని ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత తీరనుంది. జిల్లా, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ప్రజలకు వైద్యసేవలు మెరుగు కానున్నాయి. వాస్తవానికి ఇప్పటికే 8 వేల పోస్టులను భర్తీ చేసినట్లు ఆరోగ్య శాఖ పేర్కొంటున్నప్పటికీ టీవీవీపీ పరిధిలో కొత్త డాక్టర్ల నియామకం జరగలేదు. వేతనాల నుంచి విధుల నిర్వహణ వరకు ప్రభుత్వ వైద్యులకు ఉండే వెసులుబాటు టీవీవీపీ పరిధిలోని డాక్టర్లకు ఉండకపోవడం వల్ల వైద్యులు పనిచేసేందుకు ఆసక్తి చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అయితే టీవీవీపీని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ పబ్లిక్ హెల్త్‌గా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించిన ఫైల్ మంత్రివర్గ ఆమోదానికి ఎదురు చూస్తోంది. టీవీవీపీని ప్రభుత్వ సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలోకి మార్చ నున్న నేపథ్యంలో వైద్యులు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు స్పెషలిస్టు వైద్యులకు హైదరాబాద్, ఇతర జిల్లా కేంద్రాల్లో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లోనే డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఇప్పటివరకు జిల్లాల్లో కొత్తగా నియామకాలు జరపలేదు. మారిన పరిస్థితులు, స్పెషలిస్టు డాక్టర్ల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ఈసారి ప్రభుత్వ నోటిఫికేషన్‌కు సానుకూల స్పందన వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. కాగా, మరో సుమారు 7 వేల పోస్టుల భర్తీకి సర్కారు కసరత్తు చేస్తోంది. ఇప్పటివరకు 2,322 స్టాఫ్ నర్స్, 1,284 ల్యాబ్ టెక్నీషియన్, 732 ఫార్మసిస్ట్, 1,931 ఎంపీహెచ్ఎస్ ఫిమేల్, 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్, 4 స్పీచ్ పాథాలజిస్ట్, 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాల ప్రక్రియ కొనసాగుతోంది.

సింగూరు జలాశయం మధ్యలో రిసార్టులు

మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి




రిసార్టుల ప్రతిపాదిత స్థలం మ్యాపులను పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సింగూరు ప్రాజెక్టు మధ్యలో 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దీవి లాంటి ప్రదేశం రామచంద్రాపురంలో రిసార్టులు, హోటళ్లను నిర్మిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హైదరాబాద్‌కు అతిసమీపంలో ఉన్న ఈ ప్రాజెక్టును టూరిస్ట్ హబ్‌గా మారుస్తామన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి, రాయికోడ్ మండలాల్లో రూ.70 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీచ్ రోడ్డు మాదిరిగా సింగూరు బ్యాక్‌వాటర్ వెంట రెండు లైన్ల రోడ్డు నిర్మాణానికి రూ.60 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో ప్రైవేటు రంగం ఆధ్వర్యంలో రిసార్టులు ఏర్పాటవుతాయని చెప్పారు. టూరిస్టులు పడవల్లో రామచంద్రాపురం దీవిలోకి వచ్చి ఈ రిసార్టుల్లో విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేస్తామని దామోదర వెల్లడించారు.

పల్లెల్లో పనుల జాతర ప్రారంభం

- అన్ని నియోజకవర్గాల్లో రూ.205 కోట్ల పనులు ప్రారంభం: మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, పీఆర్ ఇంజనీరింగ్ విభాగం, స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ్), ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం 'పనుల జాతర-2025' ప్రారంభమైంది. ఇందులో భాగంగా గ్రామపంచాయతీల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు మొదలుపెట్టారు. పీఆర్ఆర్‌డీ శాఖ ద్వారా 13,552 పనులను అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల ద్వారా రూ.205 కోట్లతో ప్రారంభించినట్టు ఆ శాఖ మంత్రి సీతక్క ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 88,037 అభివృద్ధి పనులకు రూ.1,994 కోట్ల మేర అనుమతి పత్రాలను అందజేసినట్టు వెల్లడించారు. మొత్తంగా 1,01,589 అభివృద్ధి పనులను రూ.2,199 కోట్లతో ప్రారంభించడం గొప్ప విజయంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడానికి, ప్రతి కుటుంబానికి వేతనంతో కూడిన పనిని కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, ఉత్పాదకతను పెంచేందుకు పనుల జాతర చేపడుతున్నామని వివరించారు.



> నాకు పుట్టుక లేదు, నాశనము లేదు. నేను సర్వజీవరాసులకు అధిపతినై యున్నాను. అయినప్పటికీ నా చేత నిర్మింపబడిన ప్రకృతితో చేరి మాయతో జన్మించుచుందును.
>
> – హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 23 ఆగస్టు 2025

ముంబై చేస్తున్న హెచ్చరిక!

ప్రణాళికాబద్ధంగా లేని పట్టణీకరణను పరిహసిస్తూ తరచు ప్రకృతి వైపరీత్యాలు విరుచుకు పడుతున్నా పాలకులు మేల్కొనటం లేదనటానికి మళ్లీ నీట మునిగిన ముంబై మహానగరమే సాక్ష్యం. ముంబై దక్షిణ ప్రాంతంలో గురువారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో ఏకధాటిగా 300 మి.మీ., పశ్చిమ శివారు ప్రాంతంలో 200 మి.మీ. వర్షం కురిసిందంటే కుంభవృష్టి ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. నిన్నంతా దాదాపు ప్రశాంతంగానే ఉన్నట్టు కనబడిన ఆ మహానగరం, మళ్లీ భారీ వర్షాలుంటాయన్న హెచ్చరికలతో బెంబేలెత్తుతోంది. ఏటా వర్షాకాలంలో కనీసం ఒక్కసారైనా వరదలు ముంబైని పలకరించటం ఆనవాయితీ. ఈసారి మే నెలలోనే ఒక రోజు నడుంలోతు వరదల్లో నగరం నానా యాతనలూ పడింది. ఆ నెలలో కొత్తగా ప్రారంభమైన వొర్లి మెట్రో స్టేషన్ భారీ వరదతో వణికిపోయింది. రెండు నెలలు గడిచాయో లేదో మళ్లీ నగరానికి కుంభవృష్టి తప్పలేదు. నిరుడు 21 దఫాలు 100 మి.మీ. వర్షం పడిందని గణాంకాలు చెబుతున్నాయి. వాతావరణంలో పెనుమార్పులు విపత్తుల తీవ్రతను పెంచాయి. అస్తవ్యస్త పట్టణీకరణ ఈ సమస్యను వందల రెట్లు పెంచింది. ఈసారి వర్షాలవల్ల సంపన్నులు, సినీతారలు నివసించే ప్రాంతాలు సైతం వరద నీటన మునిగాయి. ఇటీవలే ఆర్భాటంగా ప్రారంభించిన మోనోరైల్ సైతం భారీ వర్షాలతో విద్యుత్ సరఫరా అందక గంటసేపు నిలిచిపోయింది. చివరకు అద్దాలు బద్దలుకొట్టి వందమంది ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురావాల్సి వచ్చింది.

ముంబై తూర్పు శివారులోని మీథి నది ఆ మహానగరంపై విరుచుకుపడింది. అయిదు రోజులపాటు వరసగా కురిసిన వర్షాలతో ఆ నది కట్టు తెంచుకుని అటువైపుగల రైల్వే ట్రాక్‌లన్నిటినీ ముంచెత్తింది. అరేబియా సముద్రం భారీ కెరటాలతో అల్లకల్లోలంగా ఉండటంతో దానిలో కలవాల్సిన మీథి వరద నీరు కాస్తా వెనక్కొచ్చి నగరంలోని అనేక ప్రాంతాలను జలమయం చేసింది. హైదరాబాద్ నగరంలో మూసీ మాదిరిగా ముంబైలో మీథి నదిని కూడా మురికిమయం చేశారు. అందులో 70 శాతం మురికినీరు కాగా, 30 శాతం చెత్తాచెదారం, 10 శాతం పారిశ్రామిక వ్యర్థాలు కలుస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలుగా కనబడు తున్నవన్నీ సారాంశంలో మానవ తప్పిదాల పర్యవసానం. గత యేభైయ్యేళ్లగా నగరాన్ని విస్తరించుకుంటూ పోవటమే తప్ప అందుకు తగిన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టినవారు లేరు. అలాగని మీథి నది ప్రక్షాళనకు ప్రయత్నాలు జరగలేదని కాదు. 2013–23 మధ్య బృహన్ ముంబై కార్పొరేషన్ (బీఎంసీ) రూ. 2,000 కోట్లు వ్యయం చేసింది. కానీ చివరకు తాజా వర్షాల ధాటికి మురికి నీటితో, ప్లాస్టిక్ వ్యర్థాలతో నివాస ప్రాంతాలన్నీ నిండిపోయాయి. 70వ దశకం వరకూ పరిశుభ్రంగా ఉండే ఆ నది మురికి కూపంగా మారిందంటే పాలకులు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే కారణం.

భౌగోళికంగా ముంబై తీరం పశ్చిమ కనుమలకు దగ్గరలో ఉంది. వాటివల్ల నైరుతి రుతుపవనాల్లో గాలుల తీవ్రత హెచ్చుగా ఉంటుంది. అందుకే ఏటా భారీవర్షాలు, వరదలు తప్పవు. దేశ ఆర్థిక రాజధానిగా, ఢిల్లీ తర్వాత అత్యధిక జనసాంద్రత గల నగరంగా ముంబై మన దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రాణప్రదమైనది. దేశ జీడీపీలో ఆ నగరం వాటా దాదాపు 7 శాతం. కానీ వరదలు ముంచుకొచ్చిన ప్రతిసారీ మౌలిక సదుపాయాలు దెబ్బతినటం, ఉత్పాదకత పడకేయటం రివాజైంది. పునర్నిర్మాణానికి ఏటా రూ. 550 కోట్ల వ్యయమవుతోంది. నిజానికి ఈ సంక్షోభం అక్కడే కాదు... దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పాలకులనూ పునరాలోచనకు పురిగొల్పాలి. నగర నిర్మాణాల్లో ఎలాంటి మెలకువలు తీసుకోవాలో, పెద్ద నగరాల నిర్మాణంపై మోజువల్ల చివరకు జరిగేదేమిటో గ్రహించేలా చేయాలి. కానీ అదెక్కడా కనబడదు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అమరావతి తాజా వర్షాలకు ఎంత దయనీయ స్థితిలో పడిందో కనబడుతూనే ఉంది. పెద్ద నగరాల నిర్మాణంవల్ల జనసాంద్రత పెరిగి మౌలిక సదుపాయాల కల్పన అసాధ్యమవుతుందనీ, పైగా అభివృద్ధి మొత్తం ఒకే చోట కేంద్రీకరించటం వల్ల ఇతర ప్రాంతాలు ఎప్పటికీ ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోతాయనీ నిపుణులు హెచ్చరిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు తలకెక్కటం లేదు. మన కోసం ప్రకృతి మారదు. మనమే దానికి అనుగుణంగా మారాలన్న స్పృహ పాలకులకు కలగాలి. మళ్లీ మళ్లీ మునుగుతున్న ముంబై మహానగరాన్ని చూసైనా గుణపాఠం నేర్వకపోతే భవిష్యత్తు క్షమించదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** అమావాస్య ప.11.18 వరకు, తదుపరి భాద్రపద శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** మఖ రా.1.32 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.1.21 నుండి 2.59 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.42 నుండి 7.27 వరకు, **అమృత ఘడియలు:** రా.11.14 నుండి 12.50 వరకు, **పోలాల అమావాస్య.**

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.19
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

గౌరవం



ఆనందం అకస్మాత్తుగా రాదు. కలలు వాటంతటవే నెరవేరవు. మనం నిబద్ధతతో ఉండాలి. కష్టపడి పనిచేయాలి. కష్టపడి పనిచేయడం అత్యంత గౌరవనీయమైన మానవ ధర్మం.

– షీ జిన్‌పింగ్, చైనా అధ్యక్షుడు

తర్ఫీదు



మీరు సమయానికి ముందే ఆలోచించాలి. సమయం లేని ఆలోచన సత్ఫలితాలను ఇవ్వదు. సమయం ఉండి చేసే ఆలోచన మీరు చేయబోయే కార్యానికి తగిన తర్ఫీదును ఇస్తుంది.

– నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రి

ఈత



సమస్యల సముద్రంలో మీరు మునగనైనా మునుగుతారు, లేదంటే ఈతైనా కొడతారు. ఈత కొట్టడమే జీవితం. మునిగిపోవటానికి ఏ ప్రయత్నమూ అక్కర్లేదు.

– టామ్ క్రూజ్, హాలీవుడ్ స్టార్

డబ్బు



డబ్బు సంతోషాన్ని కొనగలిగినా, లేకున్నా... స్వేచ్ఛనైతే కొనగలదు. అది చాలా పెద్ద విషయం. ఎందుకంటే డబ్బు లేకపోవడం అన్నది జీవితాన్ని చాలా ఒత్తిడికి గురి చేస్తుంది.

– సామ్ ఆల్ట్‌మాన్, సీఈవో, ఓపెన్ ఏఐ

అవకాశం



నేను మైదానంలో అడుగు పెట్టిన ప్రతిసారీ, నన్ను నేను మెరుగు పరుచుకోవడానికి ఒక అవకాశం అనుకుంటాను. నేను భారీ స్కోరు చేసినా, లేదా త్వరగా ఔట్ అయినా, ప్రతి ఇన్నింగ్స్ నుండి ఎల్లప్పుడూ నేర్చుకోవటం మీదే నా దృష్టి ఉంటుంది.

– శుభ్‌మన్ గిల్, క్రికెటర్

పోలిక




మిమ్మల్ని మీరు ఇతరులతో పోల్చుకోకండి. ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నంగా ఉంటుంది. విజయం అన్నది పట్టుదలకే కానీ, పరిపూర్ణతను చిహ్నం కాదు. మీ ప్రతి చిన్న ప్రయత్నాన్ని సెలబ్రేట్ చేసుకోండి. మీరే మీ చీర్ లీడర్‌లా ఉండండి.

– దువా లిపా, సాంగ్ రైటర్

ప్రభుత్వాలను దించే ఆయుధమా?

సందర్భం



సంజయ్ హెగ్డే

రాజ్యాంగంలోని 75, 164, 239ఎఎ అధికరణలకు సవరణలను ప్రతిపాదిస్తూ రాజ్యాంగ (130వ) సవరణ బిల్లును ఇటీవల లోక్ సభలో ప్రవేశపెట్టారు. దానిని కేంద్ర పాలిత ప్రాంతాలు, జమ్ము–కశ్మీర్‌కు వర్తింపజేసే విధంగా రెండు అనుబంధ బిల్లులను కూడా ప్రవేశపెట్టారు. మూడింట రెండొంతుల మెజారిటీ ప్రభుత్వానికి కొరవడినందు వల్ల ఈ ప్రతిపాదనలు చట్ట రూపం ధరించకపోవచ్చు. అయినప్పటికీ, వాటి వెనుక ఆలోచన గమనార్హమైనది.

ప్రధాని లేదా ముఖ్యమంత్రితో సహా ఏ కేంద్ర లేదా రాష్ట్ర మంత్రి అయినా ఐదేళ్ళు లేదా అంతకు మించి శిక్షపడగల ఆరోపణలను ఎదుర్కొంటూ అరెస్టు అయి, వరుసగా 30 రోజులు కస్టడీలో ఉంటే సదరు మంత్రులు వెంటనే రాజీనామా చేయాలి. లేకపోతే, వారు ఆయా పదవుల నుంచి ఆటోమేటిక్‌గా వైదొలగినట్లు పరిగణిస్తారన్నది సవరణ మూల సారాంశం. బిల్లును సమర్థించుకునేందుకు చెబుతున్న ఆశయాలు గొప్పవిగానే ఉన్నాయి. అవి: రాజ్యాంగ నైతికతను కాపాడటం, ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించడం, ఉన్నత పదవుల్లో ఉన్నవారు తాము చట్టానికి అతీతులమనే భావనకు లోను కాకుండా చూడటం. కానీ, ఉన్నతాశయాలు ఎల్లప్పుడూ ఉన్నతమైన ఫలితాలనే ఇస్తాయనే పూచీ ఏమీ లేదు. రాజకీయాలలో వ్యూహం తరచు నైతికతను పక్కకు నెడుతున్న పరిస్థితుల్లో ఈ రాజ్యాంగ సవరణ ఆయుధంగా పరిణమించవచ్చు.

పరిశుద్ధ రాజకీయాలపై వాగ్దానమేనా?

మంత్రులు నిజాయతీకి ప్రతీకలుగా ఉండి తీరాలనీ, వారు కస్టడీలో ఉన్నప్పుడు పరిపాలనకు భంగం కలుగకుండా నివారించవలసి ఉందనీ ఈ బిల్లును తేవడంలోని లక్ష్యాలు, కారణాల పత్రంలో పేర్కొన్నారు. రాజకీయ వాస్తవికత ముందు ఈ నైతిక విజ్ఞాపన తేలిపోవచ్చు. అరెస్టయి, కస్టడీలో ఉన్నంత మాత్రాన ఎవరూ దోషి కారు. అధికారంలో ఉన్నవారికి జీ హుజూర్ అనే పోలీసు వ్యవస్థ ఉన్న ప్రజాస్వామ్యంలో నిజాన్ని రాబట్టడానికి, వేధించడానికి మధ్య నున్న రేఖ బహు పల్చనైనది. ఈ సవరణ, అరెస్టు చేసేందుకు ఉన్న అవకాశాలను తక్కువ చేసే బదులు, అరెస్టు చేయడానికి మరిన్ని అవకాశాలను సృష్టించేలా ఉంది.

దీనిలో కొట్టొచ్చినట్లు కనిపించే అంశం 30 రోజుల వ్యవధి. ఒక మంత్రి 30 రోజులకు మించి నిర్బంధంలో ఉంటే రాజీనామా చేసి తీరాలి. ఆచరణలో, ప్రభుత్వాన్ని మార్చేందుకు రాజ్యాంగం ప్రసాదించిన 'కూల్చివేత ఆయుధం'గా ఇది ఉపకరించవచ్చు. ప్రతిపక్షానికి చెందిన ఒక ముఖ్యమంత్రి ఎన్నికలకు వెళ్ళబోతున్నాడు అనుకుందాం. పోలింగ్‌కు ఒక నెల ముందు పన్నాగంతో చేయించిన అరెస్టుతో అతని పార్టీ నిర్వీర్యం అయిపోతుంది. ప్రభుత్వాలను



దించడానికి బ్యాలట్ కన్నా లాకప్ ఒక మార్గంగా మారుతుంది.

వ్యవస్థలు రాజకీయమయం

ఈ నిబంధన తటస్థంగా ఉండవలసిన వ్యవస్థలను అనివార్యంగా రాజకీయమయం చేస్తుంది. ఇప్పటికే రాజకీయ ఒత్తిడులకు లొంగిపోయేవారిగానున్న పోలీసు అధికారులు తాము ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేస్తే అతను లేదా ఆమె ప్రభుత్వం కూలిపోవచ్చని గ్రహించుకుంటారు. బెయిలు దరఖాస్తులను నిర్ణయించే జడ్జీలు ఎవరు పాలించాలో నిర్ణయించే శక్తిమంతులుగా మారతారు. బెయిలు సంపాదించి పెట్టడంలో వ్యూహాత్మక మాయోపాయాలకు పాల్పడే యుక్తిపరులైన న్యాయవాదులు భారీ ప్రయోజనాలు పణంగా పెట్టే రాజకీయ పోరాటంలో ముఖ్యమైన పాత్రధారులుగా మారతారు. చట్టాలను అమలుపరచవలసిన వ్యవస్థలకూ, రాజకీయ ఇంజనీరింగ్‌కూ మధ్య రేఖ గుర్తుపట్టలేనంతగా మారిపోతుంది.

పాకిస్తాన్ నేర్పుతున్న పాఠాలు

లీగల్ సాధనాలు ప్రజాస్వామ్యాన్ని ఎలా డొల్ల చేయగలవో తెలుసుకునేందుకు పాకిస్తాన్ ప్రత్యక్ష ఉదాహరణ. రాజకీయ ప్రేరేపితమైనవిగా చాలా మంది భావించిన ఆరోపణలపై సుప్రీం కోర్టు 2017లో నవాజ్ షరీఫ్‌ను అనర్హుడిగా ప్రకటించింది. ఆయన తొలగింపు ప్రజాస్వామిక ప్రక్రియలను అస్థిరపరచి, ఎన్నిక కాని పాత్రధారులను బలోపేతులను చేసింది.

ఒకప్పుడు పాకిస్తాన్ అసలైన పాలక వ్యవస్థకు ప్రీతిపాత్రుడుగా ఉన్న ఇమ్రాన్ ఖాన్ అనర్హుడుగా ప్రకటితుడై ఇపుడు జైలులో మగ్గుతున్నారు. ఓటర్లలో ఇమ్రాన్ ఖాన్‌కు ఉన్న ప్రజాదరణ జుడీషియల్ మాయోపాయాల నుంచి ఆయనను కాపాడలేకపోయింది. నైతికత ముసుగు కప్పుకున్న చట్టాలు అనర్హత వేటు వేసేందుకు, చట్టబద్ధతను తొలగించడానికి సాధనాలుగా ఎలా ఉపయోగపడగలవో ఆ రెండు కేసులు తేటతెల్లం చేస్తున్నాయి. ప్రభుత్వాల మార్పులో కోర్టులు కూడా ఒక పావుగా మారిపోబట్టే పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యం బలహీనపడింది. అదే దారిని రాజ్యాంగంలో చొప్పించే ప్రమాదంలో ఇపుడు భారతదేశం ఉంది.

- రాజకీయాలలో వ్యూహం తరచు నైతికతను పక్కకు నెడుతున్న పరిస్థితుల్లో ఈ 130వ రాజ్యాంగ సవరణ ఆయుధంగా పరిణమించవచ్చు.
- ప్రతిపక్షానికి చెందిన ఒక ముఖ్యమంత్రిని పోలింగ్‌కు ఒక నెల ముందు పన్నాగంతో అరెస్ట్ చేస్తే అతని పార్టీ నిర్వీర్యం అవుతుంది.
- ప్రభుత్వాలను దించడానికి బ్యాలట్ కన్నా లాకప్ ఒక మార్గంగా మారుతుంది.

వ్యాధికన్నా దుర్భరమైన వైద్యం

సుదీర్ఘ కాలం కస్టడీలో ఉన్న మంత్రి విధులను నిర్వర్తించలేడని బిల్లు మద్దతుదారులు వాదిస్తున్నారు. అది నిజమే. కానీ, దానికి విరుగుడులు ఇప్పటికే ఉన్నాయి. మంత్రిత్వ శాఖలను ఒకరి నుంచి మరొకరికి మార్చవచ్చు. తాత్కాలిక అధిపతులను నియమించవచ్చు. కస్టడీలో ఉన్న నాయకునికి మద్దతు కొనసాగించాలో వద్దో చట్ట సభలు నిర్ణయించుకుంటాయి. ఈ ప్రక్రియలను పక్కనపెట్టేసి, ఒక నిర్దిష్ట గడువును విధించడం ద్వారా, ఈ సవరణ నియమానికన్నా అవసరానికి పెద్ద పీట వేస్తోంది. అరెస్టు అయిన వ్యక్తి నిర్దోషి కూడా కావచ్చుననే సూత్రానికి నీళ్ళు వదులుతోంది.

ప్రతి సవరణ ఒక ప్రమాణాన్ని నెలకొల్పుతుంది. ఈ రోజున మంత్రులను 30 రోజులు కాగానే పదవుల నుంచి తొలగిస్తే, రేపు 15 రోజులు కాగానే, శాసన సభ్యులను లేదా పార్లమెంట్ సభ్యులను అనర్హులుగా ప్రకటించవచ్చు. రాజకీయాలను ప్రక్షాళన చేసే ప్రయత్నం కాస్తా, అరెస్టును రాజకీయాల్లో సర్వ సాధారణమైనదిగా రూపొందించవచ్చు. నాయకత్వం బ్యాలెట్ ద్వారా కాకుండా పోలీసు స్టేషన్లు, కోర్టులలో నిర్ణయమవుతుందని పౌరులు భావించడం ప్రారంభిస్తారు.

ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా రాజ్యాంగాన్ని ఉద్దేశించారు కానీ, ప్రత్యర్థులను దునుమాడే కత్తులను సమకూర్చడానికి కాదు. 130వ సవరణ బిల్లు అభిమతం మంచిదే కానీ, అది అరెస్టులను ప్రోత్సహించేదిగా, సంకుచిత రాజకీయాలకు ధైర్యం కల్పించేదిగా, న్యాయవ్యవస్థను కూడా రాజకీయమయం చేసే ప్రమాదాలను కొనితెచ్చేదిగా ఉంది. అంతిమంగా, పాలకుడు అంటే, పోలీసు అధికారో లేదా మేజిస్ట్రేటో కాదు, ఓటరు. ఎవరు అధికారంలో ఉండాలో ఎవరు వైదొలగాలో ఓటరు మాత్రమే నిర్ణయించాలి.

వ్యాసకర్త సుప్రీం కోర్టు న్యాయవాది
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

ఆర్థిక వ్యవస్థకు ప్రమాద సంకేతం

తాత్కాలికంగా లేదా శాశ్వతంగా ఉద్యోగులను తొలగించడం (లే ఆఫ్) అనేది ఆర్థిక సవాళ్ల లేదా పని లేకపోవడం వల్ల కంపెనీలు తీసుకునే చర్య. లే ఆఫ్‌లు 1980–90లలో వాటాదారుల విలువను పెంచడానికి ఖర్చు తగ్గించే వ్యూహంలో భాగంగా విస్తృతంగా ప్రాచుర్యం పొందాయి. ఇది కంపెనీలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చినప్పటికీ, ఉద్యోగుల తొలగింపులు తరచుగా అనిశ్చితిని సృష్టిస్తాయి. ఉద్యోగుల ప్రేరణను, ధైర్యాన్ని దెబ్బతీస్తాయి.

ఇటీవల, పరిశ్రమలలోని అనేక ప్రధాన సంస్థలు గణనీయమైన తొలగింపులను ప్రకటించాయి. ఈ చర్య ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ఉద్యోగులను ప్రభావితం చేసింది. ఆర్థిక మందగమనం, వేగవంతమైన సాంకేతిక మార్పుల వల్ల ప్రపంచవ్యాప్త ధోరణిని ప్రతిబింబిస్తూ... భారతదేశం, మెక్సికో వంటి దేశాలపై కూడా తొలగింపులు ప్రభావం చూపాయి. టెక్ రంగంలో మైక్రోసాఫ్ట్, ఇంటెల్, గూగుల్ వంటి కంపెనీలు గణనీయమైన ఉద్యోగ కోతలు విధించాయి. భారతదేశంలో అతిపెద్ద ఐటీ సంస్థ అయిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన శ్రామిక శక్తిని 2% తగ్గిస్తోంది. అమెజాన్, మెటా, సిస్కో, డెల్ వంటివి కూడా తగ్గించుకున్నాయి. టెక్‌తో పాటు రిటైల్, మీడియా, బయోటెక్/ఫార్మా రంగాలు కూడా విస్తృతమైన కోతలను చవిచూశాయి.



- ఉద్యోగులు తమ వృత్తిపరమైన భవిష్యత్తును కాపాడుకోవడానికి కృత్రిమ మేధ, డేటా ఎనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి డిమాండ్ ఉన్న నైపుణ్యాలను సంతరించుకోవాలి.

స్వతంత్ర ట్రాకర్ 'లేఆఫ్స్.ఎఫ్‌వైఐ' ప్రకారం, గత సంవత్సరం 549 కంపెనీలలో 1,50,000కు పైగా ఉద్యోగులు తొలగింపునకు గురయ్యారు. 2025లో ఇప్పటివరకు 22,000కు పైగా టెక్ కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోయారు. ఈ వివరాలు టెక్ రంగంలో కొనసాగుతున్న అస్థిరతను నొక్కి చెబుతున్నాయి. ఇటీవలి ఛాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్ నుండి వచ్చిన నివేదిక ప్రకారం... అన్ని పరిశ్రమలలో, అమెరికా–ఆధారిత యజమానులు జూలై 2025 చివరి నాటికి 8,00,000 కంటే ఎక్కువ ఉద్యోగాల కోతలను ప్రకటించారు.

అయితే, ఆకస్మిక తొలగింపుల కారణంగా ఉద్యోగుల జీవితాలు అగమ్యగోచరం అవుతున్నాయి. ఆందోళన, ఒత్తిడి, నిరాశ వంటి మానసిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. కంపెనీలూ తమ ప్రతిష్ఠనూ, ఉత్పత్తి సామర్థ్యాన్నీ కోల్పోతున్నాయి. విస్తృత స్థాయిలో ఉద్యోగుల తొలగింపులు అధిక నిరుద్యోగానికి దారితీస్తాయి. స్థానిక ఆర్థిక వ్యవస్థలకు హాని చేస్తాయి.

2025లో భారతదేశం ముఖ్యంగా టెక్, స్టార్టప్, సాంకేతికత, సేవల రంగాలలో గణనీయమైన తొలగింపులను చవిచూసింది. ప్రధానంగా నిధుల కొరతను ఎదుర్కొంటున్న స్టార్టప్ వ్యవస్థ ఆగస్టు 2025 నాటికి 17,000 కంటే ఎక్కువ తొలగింపులను చూసింది.

ఆర్థిక అనిశ్చితి, తరచుగా కార్పొరేట్ పునర్నిర్మాణాలు జరిగే సమయాల్లో... ఉద్యోగులు తమ వృత్తిపరమైన భవిష్యత్తును కాపాడుకోవడానికి చురుకైన కెరీర్ రక్షణ వ్యూహాలను అవలంబించడం అవసరం. కృత్రిమ మేధ, డేటా ఎనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి డిమాండ్ ఉన్న నైపుణ్యాలను సంతరించుకోవాలి. బలమైన ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌ను నిర్వహించడం, రెజ్యూమ్, పోర్ట్‌ఫోలియోను నవీకరించడం, ఫ్రీలాన్స్ లేదా కన్సల్టింగ్ అవకాశాలను అన్వేషించడం వంటి కెరీర్ ప్లానింగ్‌లు కూడా ముఖ్యమే.

– డా॥ పి.ఎస్. చారి । కామర్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో ప్రొఫెసర్

అంతరిక్ష పరిశోధనలో నవ శకం

ఇన్ బాక్స్

భారత్ నూతన అంతరిక్ష సాంకేతికతతో విశ్వ రహస్యాల అన్వేషణకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో నేడు రెండవ జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకొంటోంది. 2023 ఆగస్టు 23న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్–3లోని విక్రమ్ ల్యాండర్ 'శివశక్తి' అనే ప్రదేశంలో సురక్షితంగా దిగింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఆగస్టు 23ను జాతీయ అంత రిక్ష దినోత్సవంగా నిర్ణయించింది. ఈ దినోత్సవం అంతరిక్ష పరిశోధన ప్రాముఖ్యతపై అవగాహన, విద్యను ప్రోత్సహించడానికి ఒక వేదిక కానుంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితంలో వృత్తిని కొనసాగించడానికి భవిష్యత్తు తరాలకు ప్రేరణ ఇవ్వనుంది. ఈ యేడు 'ఆర్యభట్ట నుండి గగన్‌యాన్ వరకు: ప్రాచీన జ్ఞానం నుంచి అనంతమైన అవకాశాలు' అనే ఇతివృత్తంతో అంతరిక్ష దినోత్సవం నిర్వహించుకొంటున్నాం.



2040 నాటికి భారతీయ వ్యోమగామిని చంద్రుడిపైకి పంపాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని ఇస్రో నిర్దేశించుకున్నది. ఈ లక్ష్య సాధన దిశగా ప్రయాణించడానికి గగన్‌యాన్ మిషన్ కీలకం కానుంది. వ్యోమగాములను భూమికి దగ్గరగా 400 కిలోమీటర్ల దూరంలో భూ కక్ష్యలోకి పంపి, వారిని సురక్షితంగా తిరిగి తీసుకురావడం ఈ మిషన్ తొలి లక్ష్యం. ఇందులో భాగంగా మొదట 2026 నాటికి 'వ్యోమమిత్ర' అనే రోబోను అంతరిక్షంలోకి పంపనున్నారు. అనంతరం 2027లో మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ మిషన్ చేపట్టనున్నారు. మరోవైపు మానవ సహిత చంద్రుడి యాత్రకు ముందు ఇస్రో 2035 నాటికి సొంతంగా ఒక అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అనంతరం మానవ సహిత చంద్రుడి యాత్రకు సిద్ధం కానుంది. చంద్రయాన్–4లో చంద్రుడి ఉపరితలం నుంచి నమూనాలను సేకరించి భూమికి తిరిగి తీసుకురావడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం. ఎల్వీఎం అనే పెద్ద రాకెట్లతో డాకింగ్ ద్వారా ఈ ప్రయోగం నిర్వహించనున్నారు.

అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా భారత్ అంతరిక్ష ప్రయోగాలు కొనసాగుతున్నప్పటికీ... భారతదేశం ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో కేవలం 2 శాతం మాత్రమే కలిగి ఉంది. దీన్ని ఇంకా పెంచాల్సిన అవసరం ఉంది. అంతరిక్ష ప్రయోగాల పట్ల పిల్లలు, యువతలో ఆసక్తిని పెంచాలి. ఇప్పటికే ఈ రంగంలో మక్కువ ఉన్న విద్యార్థులను ప్రోత్సాహించేందుకు ఇస్రో 'యువిక (యంగ్ సైంటిస్ట్)– 2025' కార్యక్రమం నిర్వహిస్తున్నది.

– సంపతి రమేష్ మహారాజ్ । జన విజ్ఞాన వేదిక
(నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవం)

డేటా పాయింట్

75 ఏళ్లలో... '60 ప్లస్' రెట్టింపయ్యారు!

ప్రస్తుతం భారతదేశ జనాభా సగటు వయసు 29 సంవత్సరాలు. 1950లో ఇది 20 ఏళ్లే. 'ఐక్యరాజ్యసమితి వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ 2024' ప్రకారం... దేశ జనాభాలో 14 ఏళ్లలోపు వారు 1950లో సుమారు 38 శాతం ఉండేవారు. 65 ఏళ్లకు పైబడిన వృద్ధులు కేవలం 3.1 శాతమే. 2025 గడిచే నాటికి 14 ఏళ్లలోపు వారు 24.2 శాతానికి తగ్గిపోతారని అంచనా. వృద్ధులు 7.3 శాతానికి పెరగనున్నారు.





శుద్ధాంత రంగం

జ్యోతిర్మయం

ఒక చిట్టెలుక ఉండేది. దానికి ఎప్పుడూ పిల్లి తనను తినేస్తుందేమోనన్న భయం. ఆ భయాన్ని పోగొట్టుకోవటానికి ఒక మంత్రగాణ్ణి ఆశ్రయించి తనను పిల్లిగా మార్చమని వేడుకొంది. మంత్రగాడు దాన్ని పిల్లిగా మార్చాడు. అప్పుడా పిల్లికి కుక్క భయం పట్టుకొంది. అది మళ్ళీ మంత్రగాని వద్దకు వెళ్ళి తనను కుక్కగా మార్చమంది. వాడు దాన్ని కుక్కగా మార్చాడు. ఇప్పుడా కుక్కకు పులి తనను చంపుతుందేమోనన్న భయం పట్టుకొంది. మరొక్కమారు మంత్రగాడిని కలిసి తనను పులిగా మార్చమని వేడుకొంది. వాడు అలాగే చేశాడు. అప్పుడా పులికి ఎప్పుడు ఏ వేటగాడు బాణం ప్రయోగించి చంపేస్తాడో అనే భయం వెంటాడింది. చిట్టెలుకకు పైపై రూపాలు మారాయిగానీ లోపలున్న భయం మాత్రం పోలేదు. 'పంచ తంత్రం'లోని ఈ కథను చెప్పి... చాలామంది మనుషుల జీవితం ఇలాగే ఉంటుందని అంటాడు ఓషో (రజనీష్) (పుట 27–ద బుక్ ఆఫ్ ద సీక్రెట్స్ – వాల్యూమ్–4).

ఒకడు ఎన్నో దుర్గుణాలను కలిగి ఉంటాడు. నుదుట కుంకుమ బొట్టు పెట్టుకొని గుడికి వెళ్ళొస్తే బాగుంటుందని ఎవరో చెప్పగా విని అది అలవరచుకొంటాడు. కొద్ది రోజుల తర్వాత నామాలు పెట్టుకోవటం మొదలెడుతాడు. కొన్ని ఏండ్ల తర్వాత గుండు గీయించుకొని సన్యాసి అవతారాన్ని ఎత్తుతాడు. అతని లోపల దుర్గుణాలన్నీ పదిలంగా ఉంటాయి. అలా కాక హృదయంలోని మలినాలను, దుర్గుణాలను వదిలించుకొంటే దివ్యత్వం బహిర్గతమవుతుంది, ప్రకాశిస్తుంది. బాహ్య ఆచారాలను పాటించటం మొదటి మెట్టు. ఆ ఆచారాల సహాయంతో అంతరంగాన్ని శుభ్రపరచుకోవటం రెండవ మెట్టు, బాహ్యంగానూ, అంతరంగంలోనూ పవిత్రంగా జీవించటం తదుపరి మెట్టు. 'కామం, క్రోధం, లోభం, మోహం త్యక్త్వాత్మానం పశ్యతి సోహం' అంటుంది భజగోవింద శ్లోకం.

– రాచమడుగు శ్రీనివాసులు

25న రాష్ట్ర కేబినెట్ భేటీ

- స్థానిక సంస్థల ఎన్నికల తేదీలు ఖరారు చేసే అవకాశం
- అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నిర్వహణపైనా నిర్ణయం
- కాళేశ్వరం కమిషన్, పంట నష్టపరిహారంపై నిర్ణయం తీసుకొనే అవకాశం
- ఈ నెల 29 నుంచి లేదా సెప్టెంబర్ మొదటి వారంలో అసెంబ్లీ భేటీ?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కేబినెట్ సమావేశం ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, కాళేశ్వరం కమిషన్ నివే దిక తదితర అంశాలపై ప్రధానంగా చర్చ జరగనుంది. అదేవిధంగా ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జరిగిన నష్టంపై చర్చించి, పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం అందించే విషయంపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. యూరియా కొరతపై కూడా చర్చించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా హైకోర్టు తీర్పు మేరకు వచ్చే నెలాఖరు నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున.. ఈ ఎన్నికల తేదీలను మంత్రివర్గం ఖరారు చేసే అవకాశం ఉంది. శనివారం జరిగే కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో వెల్లడయ్యే అభిప్రాయాలకు అనుగుణంగా కేబినెట్‌లో స్థానిక ఎన్నికలపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తేదీలు కూడా ఈ సమావేశంలోనే ఖరారు కానున్నాయి. ఈ నెల 29 నుంచి లేదంటే సెప్టెంబర్ మొదటి వారంలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సమావేశాలు వారం పాటు నిర్వహిస్తారని, కాళేశ్వరం ప్రాజెక్టు పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన అంశాలే ఎజెండాగా సమావేశాలు ఉంటాయని తెలిసింది. ఘోష్ కమిషన్ నివేదికపై తీసుకోవాల్సిన చర్యలు, హైకోర్టులో కౌంటర్ దాఖలుపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

424 కేజీలు.. రూ.2 కోట్లు

- భద్రాద్రి జిల్లాలో భారీగా గంజాయి స్వాధీనం
- ఇద్దరి అరెస్టు, లారీ సీజ్



టేకులపల్లి: ఒడిశా నుంచి రాజస్తాన్‌కు తరలి స్తున్న గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఇల్లెందు డీఎస్పీ నూనావత్ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ ఈ ఘటన వివరాలు వెల్లడించారు. సీసీఎస్, టేకులపల్లి పోలీసులు గురువారం సాయంత్రం వెంకట్యాతండా వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 10 టైర్ల లారీ రావడంతో దానిని పరిశీలించారు. అందులో నికేబిన్‌లో సీట్ల కింద రూ.2,12,47,500 విలువైన 424.950 కేజీల గంజాయి లభించింది. ఒడిశా రాష్ట్రం కలిమెలకు చెందిన రాంబాబు రాజస్తాన్‌కు చెందిన లారీ డ్రైవర్ ప్రభులాల్ గుర్జార్‌ను సంప్రదించి ఒడిశా నుంచి రాజస్తాన్‌లోని బిల్లా జిల్లా నేగ్దియా గ్రామానికి చెందిన నారాయణకు గంజాయిని అందజేస్తే రూ.2 లక్షలు ఇస్తానని ఆశ చూపడంతో అతను అంగీకరించాడు. ఆపై మరో డ్రైవర్ శివరాజ్ గుర్జార్‌కు రూ.20 వేలు ఇచ్చేలా మాట్లాడుకుని, ప్రభులాల్ ఒడిశా నుంచి గంజాయిని తీసుకుని బయలుదేరాడు. అయితే టేకులపల్లి వద్ద వారు పోలీసులకు దొరికిపోయారు. ఈ ఘటనకు సంబంధించి ప్రభులాల్ గుర్జార్, శివలాల్ గుర్జార్‌ను అరెస్టు చేసి, రాంబాబు, నారాయణ గుర్జార్‌పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయిని, అలాగే లారీని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో సీసీఎస్ సీఐ రమాకాంత్, ఎస్‌ఐలు అలకుంట రాజేందర్, పాడిశెట్టి శ్రీకాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కుటుంబంలో చిచ్చు పెట్టిన సీరియల్..

- టీవీ చూస్తూ భర్తను నిర్లక్ష్యం చేయడంతో మొదలైన వివాదం
- భర్త చేయి చేసుకోవడంతో ఆత్మహత్యాయత్నం చేసిన భార్య
- తల్లి పురుగు మందు తాగడంతో తానూ తాగిన కుమారుడు.. పరిస్థితి విషమం

బయ్యారం: పచ్చని కుటుంబంలో టీవీ సీరియల్ చిచ్చుపెట్టింది. సీరియల్ చూస్తూ తనను పట్టించుకోవడంలేదని ఆవేదనకు గురైన భర్త.. భార్యతో ఘర్షణకు దిగాడు. దీంతో ఆమె పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడాన్ని గమనించిన కొడుకు కూడా పురుగు మంది తాగాడు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోడిపుంజుల తండాలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కోడిపుంజుల తండాకు చెందిన ధరావత్ రాజుకు మహబూబాబాద్ మండలం సాలార్ తండాకు చెందిన కవితతో పది సంవత్సరాల క్రితం రెండో వివాహమైంది. అప్పటికే కవితకు వివాహం జరగగా మున్న (11) అనే కుమారుడు ఉన్నాడు. కొడుకుతో సహా ఆమె రాజుతో కోడిపుంజులతండాలో ఉంటోంది. ఈ క్రమంలో ఆ జంటకు కుమార్తె భవ్యశ్రీ జన్మించింది. కాగా, గురువారం రాత్రి రాజు అన్నం పెట్టమని అడుగగా.. కవిత టీవీలో సీరియల్ చూస్తూ.. కొంత సమయం ఆగమని చెప్పింది. దీంతో ఆగ్రహానికి గురైన రాజు భార్య కవితతో వాదనకు దిగి చేయి చేసుకోవడంతో వివాదం పెద్దదైంది. ఇరుగు, పొరుగువారు వచ్చి సర్దిచెప్పడంతో అప్పటికి వివాదం సద్దుమణిగింది. శుక్రవారం ఉదయం ఆత్మహత్య చేసుకుంటానని కవిత తమ వ్యవసాయబావి వద్దకు వెళ్లగా స్థానికులు ఆమెను అక్కడి నుంచి ఇంటికి తీసుకొచ్చారు. తర్వాత రాజు వ్యవసాయబావి వద్దకు వెళ్లగా, ఇంట్లో ఉన్న కవిత గడ్డిమందు తాగింది. ఇది చూసి ఆమె కుమారుడు మున్న కూడా గడ్డిమందు తాగాడు. స్థానికులు ఈ విషయం గమనించి ఇద్దరినీ మహబూబాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. కాగా, బాలుడు మున్న పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు. ఇదిలా ఉండగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

చర్చించాకే చర్యలు

▶ మొదటి పేజీ తరువాయి

జారీ చేయాలని కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామ శేషాద్రినాయుడు, ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి, కమిషన్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. అనంతరం ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

మీడియా భేటీ వెనుక దురుద్దేశం ఉందన్న పిటిషనర్లు

'కాళేశ్వరం ప్రాజెక్టుపై 2024, మార్చి 14న విచారణ కమిషన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 6 జారీ చేసింది. పిటిషనర్లు సహా పలువుర్ని కమిషన్ విచారించింది. ఈ ఏడాది జూలై 31న సర్కార్‌కు నివేదిక సమర్పించింది. అయితే కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ 1952లోని సెక్షన్ 8బీ, 8సీ ప్రకారం తమ నోటీసులు జారీ చేయలేదని పిటిషనర్లు పేర్కొన్నారు. నివేదికలోని అంశాలు తమ ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయని, ఈ నెల 4న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చెప్పడంతో తమ పరువుకు భంగం వాటిల్లిందని పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుండా ప్రభుత్వం మీడియాకు వివరాలు వెల్లడించిందని తెలిపారు. ఈ మేరకు సెక్షన్ 8బీ, 8సీకి సంబంధించి కిరణ్ బేడీ వర్సెస్ కమిటీ ఆఫ్ ఎంక్వైరీ, స్టేట్ ఆఫ్ బిహార్ వర్సెస్ ఎల్‌కే అద్వానీ తీర్పు కాపీలను కూడా అందజేశారు. నివేదిక కాపీని తమకు అందించకుండా పదే పదే వివరాలు వెల్లడించడం ఏకపక్షం, చట్టవిరుద్ధమని.. దీని వెనుక దురుద్దేశం ఉందని.. సహజ న్యాయ సూత్రాలను సర్కార్ ఉల్లంఘించిందని పేర్కొన్నారు. జీవో 6ను రద్దు చేయాలని, కమిషన్ నివేదిక పిటిషనర్ల పరువుకు నష్టం కలిగించేదిగా ఉందని ప్రకటించాలని కోరారు..' అని హైకోర్టు తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

అసెంబ్లీలో చర్చకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్న ఏజీ

'కమిషన్ సమర్పించిన నివేదికను అధ్యయనం చేయడానికి, పరిశీలనాంశాలను మంత్రిమండలికి సమర్పించడానికి నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శితో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిందని ఏజీ తెలిపారు. తమ నివేదిక సారాంశాన్ని ఈ కమిటీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో పాటు మంత్రిమండలి పరిశీలనకు సమర్పించిందని చెప్పారు. కాగా కమిషన్ నివేదికను ఆమోదించాలని, చర్చ కోసం అసెంబ్లీ ముందుంచాలని ఈ నెల 4న కేబినెట్ నిర్ణయించిందని వివరించారు. అయితే అసెంబ్లీలో చర్చకు ముందే ఏవైనా చర్యలు తీసుకునే అవకాశం ఉందా? అని గురువారం ఏజీని అడిగాం. అసెంబ్లీలో చర్చ తర్వాతే నివేదికపై తదుపరి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ఇచ్చిన లిఖిత పూర్వక వివరణను ఏజీ శుక్రవారం కోర్టుకు సమర్పించారు. రిపోర్టును అసెంబ్లీలో పెట్టేందుకు 6 నెలల గడువు ఉందని తెలిపారు' అని హైకోర్టు తన ఉత్తర్వుల్లో వివరించింది.

స్టే, రద్దు ఉత్తర్వులివ్వని ధర్మాసనం

'నివేదికలోని అంశాలను మీడియాకు వెల్లడించడం ద్వారా ప్రభుత్వం పక్షపాత వైఖరితో వ్యవహరించిందన్నది పిటిషనర్ల ఆరోపణ. అధికారిక వెబ్‌సైట్‌లో కూడా నివేదిక ఉంచినట్లు పేర్కొన్నారు. కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ చేపట్టే ముందు, నివేదికను మంత్రిమండలి ఆమోదించి, చర్చ కోసం అసెంబ్లీ ముందు ఉంచాలని నిర్ణయించుకున్న తర్వాత నివేదికను బహిర్గతం చేయడం సరికాదు. నివేదికను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లయితే, దానిని తొలగించాలి. 8బీ, 8సీ కింద నోటీసులు ఇవ్వకుండా, సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించి పిటిషనర్ల ప్రతిష్టను కించపరిచేలా కమిషన్ నివేదికలోని అంశాలు ఉంటే అంటే అది సరికాదు. అలాగే, అసెంబ్లీలో చర్చించిన తర్వాతే చర్యలు తీసుకుంటామని సర్కార్ చెబుతున్నందున పిటిషనర్లకు 'ముందస్తు చర్యలు' అనే భావన అవసరం లేదు. నివేదికపై స్టే ఇస్తూ, రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేయవలసిన అవసరం లేదు. కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి చట్టం వీలు కల్పిస్తుంది. అక్కడ దానిని చర్చించాలి. పిటిషనర్లు లేవనెత్తిన అంశాలపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, నీటిపారుదల శాఖ కార్యదర్శిని ఆదేశిస్తున్నాం. మూడు వారాలు సమయం ఇస్తున్నాం..' అని హైకోర్టు తెలిపింది. ఈ మేరకు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది.

అసెంబ్లీ వేదికగానే ఎండగడదాం!

'కాళేశ్వరం నివేదికపై హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై దాఖలైన పిటిషన్లకు సంబంధించి రాష్ట్ర హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో..బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో కీలక భేటీ నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్ హాజరైన ఈ సమావేశంలో.. హైకోర్టు చేసిన వ్యాఖ్యలు, మధ్యంతర ఉత్తర్వులు, తదుపరి కార్యాచరణపై చర్చించారు. ఉత్తర్వులో పేర్కొన్న అంశాలపై న్యాయ నిపుణుల అభిప్రాయం కోరారు. ఈ నెల 25న రాష్ట్ర కేబినెట్ సమావేశం నేపథ్యంలో ప్రభుత్వం త్వరలో అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి నివేదికపై చర్చించే అవకాశముందనే అభిప్రాయం కేసీఆర్ వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. అసెంబ్లీ వేదికగా విచారణ కమిషన్ నివేదికలోని డొల్లతనాన్ని బయట పెట్టాలని సూచించినట్లు తెలిసింది.

స్థానిక సంస్థల ఎన్నికలపై కసరత్తు

ఇదిలా ఉండగా సెప్టెంబర్ 30వ తేదీలోగా స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలనే హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో 25న జరిగే కేబినెట్ భేటీలో ప్రభుత్వం ఈ దిశగా నిర్ణయం తీసుకుంటుందనే అభిప్రాయాన్ని కేసీఆర్ వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపైనా కేసీఆర్ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా రెండు రోజులుగా ఎర్రవల్లి నివాసంలోనే ఉన్న కేటీఆర్ మరో రెండురోజులు కూడా అక్కడే ఉంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయం, అభ్యర్థుల ఎంపిక, ప్రచారం తదితరాలకు సంబంధించిన ప్రణాళికపై కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.

హరీశ్‌కు అసెంబ్లీలో చర్చ, న్యాయ పోరాటం బాధ్యతలు

కాళేశ్వరం కమిషన్ రిపోర్టుకు సంబంధించిన న్యాయ పోరాటం, అసెంబ్లీలో చర్చ, సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం తదితరాలకు సంబంధించిన బాధ్యతలు మాజీమంత్రి హరీశ్‌రావుకు కేసీఆర్ అప్పగించినట్లు తెలిసింది. హైకోర్టులో పిటిషన్ల దాఖలు కోసం రెండు పర్యాయాలు ఢిల్లీకి వెళ్లివచ్చిన హరీశ్‌రావు.. న్యాయ పోరాటానికి సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిసింది. కాళేశ్వరం కమిషన్ రిపోర్టు విషయంలో సీఎం, రాష్ట్ర ప్రభుత్వ అత్యుత్సాహాన్ని హైకోర్టు తప్పు పట్టడాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కేసీఆర్ ఆదేశించారు. సీఎం రేవంత్ ముందస్తుగా మీడియా సమావేశం నిర్వహించి 60 పేజీల రిపోర్టు బయట పెట్టడాన్ని హైకోర్టు తప్పు పట్టడం, పబ్లిక్ డొమైన్ల నుంచి నివేదికను తొలగించాలని ఆదేశించడం అనుకూల అంశాలుగా బీఆర్‌ఎస్ భావిస్తోంది. విచారణ కమిషన్ 8బీ, 8సీ నోటీసులు ఇవ్వకపోవడం, పిటిషనర్లపై ఆరోపణలు చేయడాన్ని చట్ట విరుద్ధం అనే భావన హై కోర్టు వ్యక్తం చేయడం .. ప్రభుత్వ దురుద్దేశాన్ని బయట పెట్టిందనే అభిప్రాయం కూడా కేసీఆర్‌తో జరిగిన భేటీలో వ్యక్తమైనట్లు సమాచారం.

శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రమసింఘే అరెస్ట్



కొలంబో: అధికారంలో ఉండగా ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘే(76)ను పోలీసులు అరెస్ట్ చేశారు. కొలంబోలోని క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్(సీఐడీ)ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న అధికారులు ఆ వెంటనే అరెస్ట్ చేశారు. మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. శ్రీలంక అధ్యక్షుడిగా 2022–24 సంవత్సరాల్లో విక్రమసింఘే శ్రీలంక అధ్యక్షుడిగా పనిచేశారు. 2023 సెప్టెంబర్‌లో తన భార్య ప్రొఫెసర్ మైత్రి పాల్గొన్న కార్యక్రమానికి హాజరయ్యేందుకు లండన్ వెళ్లిన విక్రమసింఘే ప్రభుత్వ నిధులను వాడుకున్నట్లు ఆరోపణలున్నాయి. లాయర్, సీనియర్ రాజకీయ నేత అయిన విక్రమసింఘే ఐదు దశాబ్దాలకు పైగా పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నారు. వేర్వేరు సమయాల్లో ఆరుసార్లు ప్రధానిగా పనిచేశారు. గొటబయ రాజపక్స రాజీనామాతో 2022లో అధ్యక్ష పగ్గాలు చేపట్టిన ఆయన దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేశారన్న ప్రతిష్టను సంపాదించుకున్నారు. అనంతరం ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అధ్యక్షుడిగా ఆయన చేపట్టిన 23 విదేశీ పర్యటనల ఖర్చు రూ.17.50 కోట్లని మీడియా తెలిపింది. కాగా, అరెస్టయిన ఏకైక శ్రీలంక మాజీ అధ్యక్షుడిగా విక్రమ సింఘే నిలిచిపోయారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికకు ముఖాముఖి పోరు

పూర్తయిన నామినేషన్ల పరిశీలన

న్యూఢిల్లీ: దేశ 17వ ఉపరాష్ట్రపతి పదవికి సెప్టెంబర్ 9వ తేదీన జరిగే ఎన్నిక బరిలో అధికార ఎన్డీయే బలపరిచిన సీపీ రాధాకృష్ణన్, ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డి మిగిలారు. ఈ ఇద్దరు అభ్యర్థులు అందజేసిన నాలుగేసి సెట్ల నామినేషన్ పత్రాలు సరిగ్గా ఉన్నాయని ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న రాజ్యసభ సెక్రటరీ జనరల్ తెలిపారు. వీటిని అంగీకరించామని చెప్పారు. శుక్రవారంతో నామినేషన్ల పరిశీలనకు గడువు ముగియడంతో, దక్షిణాదికే చెందిన ఇద్దరు అభ్యర్థుల మధ్య ద్విముఖ పోటీ ఖరారైనట్లయింది. ఈ నెల 7 నుంచి 21వ తేదీ వరకు మొత్తం 46 మంది అభ్యర్థులు 68 నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. సీపీ రాధాకృష్ణన్, సుదర్శన్‌రెడ్డిల నామినేషన్లు మినహా సరిగా లేని మిగతా అన్ని నామినేషన్ పత్రాలను తిరస్కరించినట్లు రాజ్యసభ సెక్రటరీ జనరల్ వివరించారు.



కాలభైరవ.. దేశీయ రిమోట్ యుద్ధ విమానం

రూపొందించిన బెంగళూరు స్టార్టప్

బెంగళూరు: బెంగళూరుకు చెందిన ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్(ఎఫ్‌డబ్ల్యూడీఏ) సంస్థ మొట్టమొదటిసారిగా దేశీయంగా మీడియం అల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యురెన్స్(మేల్) రిమోట్ యుద్ధ విమానం 'కాల భైరవ'ను సిద్ధం చేసింది. సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో సుహాస్ తేజస్కంద దీనిని శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. కాల భైరవుని స్ఫూర్తితో ఈ విమానం డిజైన్, అభివృద్ధి, ఉత్పత్తి దేశీయంగానే పూర్తి చేశామని వివరించారు. కాల భైరవ విమానం 3 వేల కిలోమీటర్ల దూరం 30 గంటలపాటు ఏకబిగిన ప్రయాణించగలదన్నారు. దక్షిణాసియాలోని ఒక దేశం నుంచి ఇప్పటికే 25 లక్షల డాలర్ల విలువైన ఒక ఆర్డర్ వచ్చిందని వివరించారు. అమెరికా నుంచి మన ప్రభుత్వం కొనుగోలు చేసే ఒక్కో రిమోట్ ప్రిడేటర్ విమానం ఖరీదు రూ.1,000 కోట్లు కాగా, అదే ఖర్చుతో 10 కాల భైరవలను దేశీయంగా సొంతం చేసుకోవచ్చని, ఇందులో ఒకటి దెబ్బతిన్నా లక్ష్య సాధనలో ఎటువంటి మార్పు ఉండదని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న విధానాలు, అమెరికా ప్రభుత్వ ఆంక్షల నడుమ భారత ప్రభుత్వం యుద్ధ అవసరాల కోసం ఇతరులపై ఆధారపడరాదని ఆయన తెలిపారు. వేరే దేశాల వంక చూడటం వల్ల మన వ్యూహాత్మక స్వాతంత్ర్యం దెబ్బతింటుందని, రహస్య సమాచారం లీకయ్యే ప్రమాదముందని సుహాస్ పేర్కొన్నారు.

20 ఏళ్లు పైబడిన వాహనాల రెన్యువల్ ఫీజు పెంపు

న్యూఢిల్లీ: 20 ఏళ్లు పైబడిన మోటారు వాహనాల రిజిస్ట్రేషన్ రెన్యువల్ ఫీజును కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచింది. తద్వారా ఇటువంటి వాహనాల వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. ఇరవయ్యేళ్లు పైబడిన లైట్ మోటారు వెహికల్(ఎల్ఎంవీ)ల రెన్యువల్ ఫీజును ప్రస్తుతమున్న రూ.5 వేల నుంచి రెట్టింపు చేసి రూ.10 వేలకు పెంచింది. మోటారు సైకిళ్లకైతే ఈ ఫీజును రూ.వెయ్యి నుంచి రూ.2 వేలకు, త్రీ వీలర్స్, నాలుగు చక్రాల వాహనాలకైతే ఇది రూ.3,500 నుంచి రూ.5,000కు పెంచింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా హైవేల శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దిగుమతి చేసుకున్న టూ–త్రీ వీలర్‌కైతే రెన్యువల్ ఫీజు రూ.20వేలు చెల్లించాల్సి ఉంటుంది. నాలుగు లేదా అంతకంటే ఎక్కువ చక్రాలుండే వాహనాల రెన్యువల్ ఫీజు రూ.80వేలని కేంద్రం తెలిపింది. ఈ మేరకు ముసాయిదా సవరణను ఫిబ్రవరిలో జారీ చేసిన కేంద్రం, ఈ నెల 21వ తేదీన దీనిని ఆమోదించింది. వాహనాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ ఫీజును కేంద్రం చివరిగా 2021 అక్టోబర్‌లో పెంచింది.

మరణం అంచున గాజా


అన్నార్తుల ఎదురు చూపులు

- అక్కడ అత్యంత తీవ్రమైన కరువు
- యూఎన్ డబ్ల్యూఎఫ్‌పీ చీఫ్ అధికారిక ప్రకటన
- తక్షణం స్పందించకపోతే మరింత విస్తరిస్తుందని హెచ్చరిక

గాజా స్ట్రిప్: రెండేళ్ల యాజన్.. గాజా నగరంలోని బీచ్‌లో ఉన్న శరణార్థి శిబిరంలో ఉన్నాడు. ఆ శిబిరానికి రెండు నెలలుగా పిండే కాదు.. ఎలాంటి ఆహార సహాయం అందడం లేదు. విశాలమైన అతని కళ్లు.. ఆహారం కోసం ఎదురుచూసి.. చూసి.. అలసటతో బరువెక్కాయి. ఎముకలు తేలిన శరీరం అతని ఆకలిని చెబుతోంది. ఏడవడానికి కాదు కదా.. చివరికి తిండి తినడానికి కూడా ఓపికలేక.. చిరిగిపోయిన పరుపుపై జీవచ్ఛవంలా కూర్చున్నాడు. ఇది ఒక్క యాజన్ స్థితి కాదు.. గాజా స్ట్రిప్‌లోని పిల్లలందరి సామూహిక దుంఖః. ప్రస్తుతం గాజాలో పోషకాహార లోపం వేగంగా వ్యాపిస్తోంది. గాజా నగరంలో ఆకలి మరణాలు ఫిబ్రవరి నుంచి నాలుగు రెట్లు పెరిగాయి. ప్రస్తుతం గాజాలో 5లక్షల మంది తీవ్రమైన కరువును ఎదుర్కొంటున్నారని ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిండీ మెక్ కెయిన్ హెచ్చరించారు. మధ్యప్రాచ్యంలో అధికారికంగా కరువు నిర్ధారించడం ఇదే మొదటిసారి. రాబోయే రోజుల్లో ఇది గాజా గవర్నరేట్ నుంచి డెయిర్ అల్ బలాహ్, ఖాన్ యూనిస్‌కు వ్యాపిస్తుందని ఆందోళన వ్యక్తంచేసింది. 'రోజుల తరబడి తినడానికి ఏమీ లేక లక్షలాది మంది బతుకీడుస్తున్నారు. పోషకాహార లోపం స్థాయి వేగంగా పెరుగుతోంది. ఆకలి మరణాలు పెరుగుతున్నాయి. ఈ సమయంలో తక్షణ, పూర్తి స్థాయి మానవతా సాయం అవసరమని ప్రపంచ ఆహార కార్యక్రమం, ప్రపంచ ఆరోగ్య సంస్థ నొక్కి చెప్పాయి. కరువును ఎలాగైనా ఆపాలని ఆమె పిలుపునిచ్చారు. ఆ ప్రజల ప్రాణాలు కాపడేందుకు అడ్డంకులు లేని మానవతా సహాయం, తక్షణ కాల్పుల విరమణ అవసరమని సూచించారు. లేని పక్షంలో సెప్టెంబర్ చివరి నాటికి, గాజా స్ట్రిప్ అంతటా దాదాపు 7 లక్షల మంది కరువును ఎదుర్కొంటారని ఆమె హెచ్చరించారు.

ప్రాణాంతకంగా మారిన పోషకాహార లోపం

రెండు సంవత్సరాల సంఘర్షణ ప్రజలను పదే పదే నిరాశ్రయులను చేస్తే.. మానవతా సాయంపై ఆంక్షలు ప్రజలను ఆకలిలోకి నెట్టాయి. ఇక్కడ ఆహారం దొరకడం లేదు. జూలై, మే నెలతో పోలిస్తే ప్రజలు రెట్టింపు సంఖ్యలో ఆకలితో అలమటిస్తున్నారు. ఇక గాజా నగరంలో మూడు రెట్లు ఎక్కువైంది. ప్రతి ముగ్గురిలో ఒకరికి రోజుల తరబడి ఆహారం దొరకడం లేదు. దొరికిన కొద్ది మొత్తంతో పిల్లల కడుపు నింపి, పెద్దలు పస్తులుంటున్నారు. పిల్లల్లో పోషకాహార లోపం వేగంగా పెరుగుతోంది. నలుగురిలో ఒకరు తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. అది అత్యంత ప్రాణాంతకం. జూన్ 2026 చివరి నాటికి పోషకాహార లోపం వల్ల మరణించే ప్రమాదం ఉన్న పిల్లల సంఖ్య 14,100 నుంచి 43,400 కు అంటే మూడు రెట్లు పెరుగుతుంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో 98 శాతం పంట భూములు దెబ్బతిన్నాయి. వ్యవసాయం లేదు. ప్రతి పది కుటుంబాల్లో తొమ్మిది కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. జూలై నుంచి గాజాలోకి వచ్చే ఆహారం, సహాయ సామగ్రి పెరిగింది. కానీ.. అవసరంతో పోలిస్తే అది చాలా తక్కువ. సహాయ ట్రక్కుల నుంచి ఆహారం దోచుకుంటున్నారు. వంట చేసుకోవడానికి నీళ్లు కూడా లేవంటే పరిస్థితిని ఊహించొచ్చు.

మనుషులు సృష్టించిన కరువు

అయితే ఈ కరువు మనుషులు సృష్టించింది, అవకాశం ఉన్నా నివారించలేకపోవడం వెంటాడే విషయమని ఐక్యరాజ్యసమితి సహాయ అధిపతి టామ్ ఫ్లెచర్ అన్నారు. జెనీవాలో మీడియాతో మాట్లాడిన ఆయన ఇజ్రాయెల్ విధిస్తున్న అడ్డంకుల కారణంగా పాలస్తీనా భూభాగానికి ఆహారం చేరుకోలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'మమ్మల్ని అనుమతిస్తే మనం నివారించగలిగే కరువు ఇది. ఇజ్రాయెల్ అడ్డంకుల కారణంగానే సరిహద్దుల వద్ద ఆహారం నిల్వలు నిలిచిపోయాయి' అని తెలిపారు.

ఫిర్యాదులకు 'ఆధార'మే

- ఓటర్ల తొలగింపుపై ఫిర్యాదు చేయొచ్చు
- బిహార్ ఉదంతంలో సుప్రీం స్పష్టీకరణ
- పౌరులను పట్టించుకోని పార్టీలెందుకు?
- ఫిర్యాదుల దాఖలులో సహకరించండి
- మీ కార్యకర్తలను రంగంలోకి దింపండి
- బిహార్‌లోని 12 పార్టీలకు ఆదేశాలు

న్యూఢిల్లీ: బిహార్‌లో ఓటర్ల జాబితా నుంచి తొలగింపునకు గురైన వాళ్లు దాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసే ఫిర్యాదులకు మద్దతుగా ఆధార్‌ను కూడా సమర్పించవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ విషయమై ఎన్నికల సంఘం పేర్కొన్న 11 డాక్యుమెంట్లతో పాటు ఆధార్ కూడా చెల్లుబాటవుతుందని స్పష్టం చేసింది. ఎన్నికల జాబితా ముసాయిదాపై సకాలంలో అభ్యంతరాలు లేవనెత్తడంలో బిహార్‌లోని 12 రాజకీయ పార్టీలూ విఫలమయ్యాయంటూ గట్టిగా తలంటింది. ఈ విషయంలో వాటిది పూర్తిగా చేతగానితనమేనంటూ ఆక్షేపించింది. బిహార్‌లో తాము చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సందర్భంగా ముసాయిదాపై ఒక్క పార్టీ కూడా తమవద్ద అభ్యంతరాలు దాఖలు చేయలేదన్న కేంద్ర ఎన్నికల సంఘం అఫిడవిట్‌ను ఉటంకిస్తూ ఈ మేరకు పార్టీలను గట్టిగా మందలించింది. పైపెచ్చు ఓటర్ల జాబితా నుంచి తొలగింపునకు గురైన పౌరులకు కనీసం ఈసీ వద్ద అభ్యంతరాలు దాఖలు చేయడంలో ఒక్క పార్టీ కూడా చురుగ్గా వ్యవహరించి సాయం చేయలేదంటూ తీవ్రంగా ఆక్షేపించింది. ప్రజలతో ఇంతటి దూరం ఎందుకు ఏర్పడిందంటూ ప్రశ్నించింది. ఈ విషయమై పార్టీలన్నీ ఆత్మవిమర్శ చేసుకోవాలంటూ ఉద్బోధించింది. ఎస్ఐఆర్ కసరత్తును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ఇద్దరు సభ్యుల ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ''ఓటర్ల ముసాయిదాలో పేర్లు గల్లంతైన వారికి ఫారం–6 సాయంతో ఈసీ వద్ద ఫిర్యాదులు చేయడంలో పూర్తిస్థాయిలో సహకరించండి. ఆ మేరకు మీ పార్టీల కార్యకర్తలందరికీ స్పష్టమైన ఆదేశాలివ్వండి'' అంటూ బిహార్‌లోని 12 పార్టీలనూ ఆదేశించింది. వ్యక్తిగతంగా అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు వీలు కల్పించాల్సిందిగా ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. ఎస్ఐఆర్ కసరత్తు గడువు విషయమై ఈ దశలో ఎలాంటి మార్పుచేర్పులూ చేయలేదని స్పష్టం చేసింది.

బూత్ ఏజెంట్లు ఏం చేస్తున్నట్టు?

బిహార్‌లో ఏకంగా 1.68 లక్షల మంది బూత్‌స్థాయి ఏజెంట్లున్నట్టు ఈసీ నివేదించింది. అలాంటప్పుడు ఓటర్ల జాబితా నుంచి తొలగింపులకు సంబంధించి ఇప్పటిదాకా కేవలం రెండంటే రెండే అభ్యంతరాలు దాఖలవడంపై ధర్మాసనానికి విస్మయం వ్యక్తం చేసింది. ఈ విషయంలో పార్టీలు, అవి నియమించిన బూత్‌స్థాయి ఏజెంట్లు ఏం చేస్తున్నట్టని ప్రశ్నించింది. ''తొలగించిన 65 లక్షల ఓటర్లు మరణించారా, నివాసాలు మార్చారా, మరేమైనా జరిగిందా అన్నది తేలాలి. ఈ దిశగా అన్ని పార్టీల ఏజెంట్లు పూర్తి స్థాయిలో తనిఖీలు జరపాలి'' అని ఆదేశించింది.

స్టెరిలైజేషన్ తర్వాత వదిలేయాల్సిందే

- ఎక్కడి నుంచి తీసుకొచ్చారో అక్కడే వదిలేయాలి
- వ్యాధులు, ఆవేశపూరిత ప్రవర్తన ఉన్న కుక్కలను షెల్టర్‌కు తరలించాలి
- బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలకు ఆహారం పెట్టడం నేరం
- సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఆదేశాలు



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వీధి కుక్కల సమస్యపై అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 8వ తేదీన ఇచ్చిన ఉత్తర్వు పట్ల జంతు ప్రేమికుల నుంచి ఆగ్రహావేశాలు వెల్లువెత్తడంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు అభ్యంతరం వ్యక్తంచేయడంతో.. ఆ ఉత్తర్వులో మార్పులు చేస్తూ శుక్రవారం తీర్పు వెలువరించింది. కుక్కలకు స్టెరిలైజేషన్(పిల్లలు పుట్టకుండా శస్త్రచికిత్స) పూర్తి చేసిన తర్వాత ఎక్కడి నుంచి తీసుకొచ్చారో అక్కడే వదిలేయాలని తేల్చిచెప్పింది. రేబిస్ వంటి వ్యాధులు, ఆవేశపూరిత, విపరీత ప్రవర్తన ఉన్న కుక్కలను మాత్రం స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ అనంతరం ప్రత్యేక షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. ఈ నెల 8న ఇచ్చిన ఉత్తర్వు అత్యంత కఠినంగా ఉన్న మాట వాస్తవమేనని సుప్రీంకోర్టు అంగీకరించింది. వీధి కుక్కల బెడద దేశమంతటా ఉన్నట్లు గుర్తుచేసింది. ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రాణాలు సైతం కోల్పోతున్నారని, అందుకే దేశవ్యాప్తంగా వీధి కుక్కల నియంత్రణకు ఒక జాతీయ విధానం తీసుకొచ్చే విషయం ఆలోచించాలని ప్రభుత్వానికి సూచించింది. ఢిల్లీలో వీధి కుక్కల వ్యవహారంపై ఈనెల 8న ఇచ్చిన ఉత్తర్వుపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. కుక్కలన్నింటినీ 8 వారాల్లోగా బంధించి, షెల్టర్లకు తరలించాలంటూ జస్టిస్ పార్దివాలా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను జంతు ప్రేమికులు తప్పుబట్టారు. దాంతో ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ త్రిసభ్య ధర్మాసనానికి ఇప్పగించారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం మళ్లీ విచారణ చేపట్టింది. తగిన మౌలిక సదుపాయాలు ఉన్నాయో లేదో తెలుసుకోకుండా అన్ని కుక్కలను బంధించి, షెల్టర్‌కు తరలిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంది. ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు ఏమిటంటే..

- వీధి కుక్కలకు బహిరంగ ప్రదేశాల్లో ఆహారం పెట్టడం నేరం. ఉల్లంఘించినవారికి శిక్ష తప్పదు.
- వాటికి ఆహారం అందించడానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వీధుల్లో ఇళ్ల ముందు కుక్కలకు అన్నం పెట్టినవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.
- వీధి కుక్కలను జంతు ప్రేమికులు దత్తత తీసుకోవచ్చు. వాటిని వారు సరిగ్గా సంరక్షించాలి. మళ్లీ వీధుల్లోకి వదిలేయకూడదు.
- ఢిల్లీలో వీధి కుక్కలను కాపాడాలంటే పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తి రూ.25,000, ఎన్జీఓలు రూ.2 లక్షల చొప్పున కోర్టులో డిపాజిట్ చేయాలి.
- కుక్కల సమస్యకు సంబంధించిన హైకోర్టుల్లో ఉన్న పిటిషన్లను సుప్రీంకోర్టుకు బదిలీ చేస్తున్నాం. ఒక జాతీయ పాలసీని రూపొందించే దిశగా విచారణ చేపడతాం.
- వీధి కుక్కల కేసులో కేవలం ఢిల్లీని మాత్రమే కాకుండా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సైతం భాగస్వామ్య పక్షాలుగా చేరుస్తున్నాం.
- సుప్రీంకోర్టు తాజా తీర్పు పట్ల జంతు ప్రేమికులు హర్షం వ్యక్తంచేశారు.

నేరగాళ్లు జైలు నుంచి పరిపాలించాలా?


ప్రధాని మోదీ

అవినీతిపరులను పదవుల నుంచి తొలగిస్తామంటే భయమెందుకు?

- ఊచలు లెక్కిస్తూ ఫైళ్లపై సంతకాలు చేస్తున్నారంటే మనం చింతించాలి
- చొరబాటుదార్లపై చర్యలు తీసుకుంటే మీకు ఉలుకెందుకు?
- ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ ఆగ్రహం
- బిహార్, బెంగాల్‌లో పర్యటించిన ప్రధాని
- పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం..

గయాజీ: అవినీతికి పాల్పడి జైలుపాలైన ప్రజాప్రతినిధులను పదవుల నుంచి తప్పించడానికి చట్టం తీసుకొస్తామంటే ప్రతిపక్షాలు ఎందుకు భయపడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశ్నించారు. అధికారం వెలగబెడుతున్న వ్యక్తులు జైలుకెళ్లి, అక్కడి నుంచే పరిపాలన సాగిస్తున్న పరిస్థితులు చూసి మనం నిజంగా బాధపడాలని అన్నారు. ఒకవైపు ఊచలు లెక్కిస్తూ మరోవైపు ఫైళ్లపై సంతకాలు చేస్తున్నారంటే మనం చింతించాలని చెప్పారు. అలాంటి వ్యక్తులు(ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేరును పరోక్షంగా ప్రస్తావిస్తూ) రాజ్యాంగ విలువలను హేళన చేస్తున్నారని ధ్వజమెత్తారు. నేరగాళ్లు జైలు నుంచే పరిపాలన చేస్తామంటే మనం చూస్తూ ఉండిపోవాలా? అని నిలదీశారు. 11 ఏళ్ల మా పాలనలో ఎలాంటి అవినీతి మరక లేదని గర్వంగా చెబుతున్నామని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కార్ పాలనలో ఎన్నో కుంభకోణాలు జరిగాయని, బిహార్‌లో ఆర్జేడీ అవినీతి బాగోతాలు ప్రతి ఒక్కరికీ తెలుసని చెప్పారు. అందుకే అవినీతి ముఖ్యమంత్రులు వరుసగా 30 రోజులు జైల్లో ఉంటే పదవి నుంచే తొలగించేలా చట్టం తీసుకురావాలని నిర్ణయించామని, ప్రధానమంత్రి సైతం వరుసగా 30 రోజులు జైల్లో ఉంటే పదవి నుంచి దిగిపోవాల్సిందేనని స్పష్టంచేశారు. ఒక సాధారణ ప్రభుత్వ ఉద్యోగి ఏదైనా తప్పుచేసి 50 గంటలు జైల్లో ఉంటే పోస్టు నుంచి తొలగిస్తారని, మరి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులను ఎందుకు వదిలిపెట్టాలి? అని ప్రశ్నించారు. తాము తీసుకొస్తున్న కఠినమైన చట్టాన్ని కాంగ్రెస్, ఆర్జేడీ సహా ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని, చేసిన పాపాలకు శిక్ష పడుతుందని భయపడుతున్నాయని విమర్శించారు. నేరగాళ్లు ఉండాల్సింది జైల్లోనే తప్ప పదవుల్లో కాదన్నారు. కాంగ్రెస్, ఆర్జేడీలు అధికారంలో ఉన్నప్పుడు జనం సొమ్ముతో బొజ్జలు నింపుకున్నాయని నిప్పులు చెరిగారు. ప్రధాని మోదీ శుక్రవారం బిహార్, పశ్చిమ బెంగాల్‌లో పర్యటించారు. బిహార్‌లోని గయాజీ జిల్లాలో రూ.13,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. బెంగాల్ రాజధాని కోల్‌కతాలో మూడు మెట్రో రైలు మార్గాలను ప్రారంభించారు. ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. బహిరంగ సభల్లో ప్రసంగించారు. ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రాజ్యాంగ(130 సవరణ) బిల్లు–2025తోపాటు బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను పరోక్షంగా సమర్థించారు. వ్యవస్థలో ఉన్న లోపాలను సరి చేస్తున్నామని చెప్పారు. ఇంకా ఆయన ఏం చెప్పారంటే...

''పహల్గాంలో మన పర్యాటకులను బలి తీసుకున్న ముష్కరులపై ప్రతీకారం తీర్చుకుంటామని బిహార్ గడ్డపైనే ప్రతిజ్ఞ చేసి, నెరవేర్చి చూపించా. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్ ఉగ్రవాదుల భరతం పట్టాం.

ఓట్ల కోసమే విపక్షాల ఆరాటం: దేశంలో జనాభా స్వరూపం మారకుండా చూడాలన్న లక్ష్యంతో అక్రమ వలసదార్లు, చొరబాటుదార్లపై చర్యలు తీసుకుంటే విపక్షాలకు ఉలుకెందుకు? మన దేశానికి వలసదార్లు, చొరబాటుదార్లు అతిపెద్ద ముప్పుగా మారారు. ఈ సమస్య గురించి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించా. కొన్ని రాష్ట్రాల్లో జనాభా స్వరూపమే మారిపోతోంది. స్థానికులు మైనార్టీలుగా మారుతున్నారు. ఇది ఇకపై సాగడానికి వీల్లేదు. అందుకే డెమోగ్రఫీ మిషన్ ప్రారంభించాలని నిర్ణయించాం. కానీ, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదార్లను కాపాడేందుకు ప్రతిపక్షాలు ఆరాటపడుతున్నాయి.

చొరబాట్లను సహించే ప్రసక్తే లేదు: పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చొరబాటుదార్లను ప్రోత్సహిస్తోంది. కేవలం అధికారం దాహంతో దేశ భద్రతను పణంగా పెడుతోంది. చొరబాటుదార్లను గుర్తించి, వెనక్కి పంపించే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. చొరబాట్లను సహించే ప్రసక్తే లేదు. వారు మన దేశంలో తిష్ట వేస్తామంటే ఒప్పుకోం. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ తదితర పార్టీలు బుజ్జగింపు రాజకీయాలను నమ్ముకుంటున్నాయి. చొరబాటుదార్ల ఓట్లతో ఎన్నికల్లో నెగ్గాలని చూస్తున్నాయి. అక్రమంగా వచ్చినవారంతా దేశం విడిచి వెళ్లిపోవాల్సిందే. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇక ఇంటికి సాగనంపాలి''.


పార్లమెంట్‌లోకి చొరబాటు యత్నం

యువకుడిని అదుపులోకి తీసుకున్న భద్రతా సిబ్బంది

న్యూఢిల్లీ: ఓ ఆగంతకుడు పార్లమెంట్ ఆవరణలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. నిచ్చెన సహాయంతో లోపలికి ప్రవేశించాడు. శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో రైల్ భవన్ వైపు నుంచి గోడ ఎక్కి పాత పార్లమెంట్ భవనం గరుడ ద్వారం వరకు చేరుకోగలిగాడు. కాంప్లెక్స్ లోపల మోహరించిన భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. అతడిని అదుపులోకి తీసుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. దుండగుడు ఉత్తరప్రదేశ్ నివాసి రామ్‌కుమార్ బింద్(20) అని, గుజరాత్‌లోని సూరత్‌లో ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడని అధికార వర్గాలు తెలిపాయి. అదుపులోకి తీసుకున్న సమయంలో అతను మానసికంగా బాధపడుతున్నట్లు తెలిసింది. తాను ఇంటికి వెళ్లాలనుకుంటున్నానని, పార్లమెంట్‌కు చేరుకునే ముందు రైల్వే స్టేషన్‌కు కూడా వెళ్లానని, కానీ రైలు ఎక్కలేకపోయానని విచారణలో చెప్పాడు. ప్రస్తుతం, పార్లమెంట్ భద్రతా విభాగం అతడిని ప్రశ్నిస్తోంది. ప్రాథమిక విచారణ పూర్తయిన తరువాత చొరబాటుదారుడిని స్థానిక పోలీసులకు విచారణ కోసం అప్పగిస్తామని అధికారులు తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన ఒక రోజు తర్వాత ఈ ఘటన జరిగింది. ఉల్లంఘన జరిగిన సమయంలో పార్లమెంటు సభ్యులెవరూ అక్కడ లేరు. ఈ ఘటన నేపథ్యంలో పార్లమెంట్ భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆయన నక్సలైట్ల మద్దతుదారుడు

- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సల్వాజుడుంకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు
- నక్సలైట్లకు మద్దతివ్వడానికి సుప్రీం కోర్టును వాడుకున్నారు
- వామపక్షాల ఒత్తిడి వల్లే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి
- కేంద్ర మంత్రి అమిత్ షా ఆగ్రహం


అమిత్ షా

కొచ్చీ/తిరునల్వేలి: నక్సలైట్లకు గట్టి మద్దతుదారుడైన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని విపక్ష 'ఇండియా' కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసుకుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తప్పుపట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లపై పోరాటానికి గిరిజన యువకులతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సల్వాజుడుం' చట్టవ్యతిరేకం, రాజ్యాంగ విరుద్ధం అంటూ 2011లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. శుక్రవారం కేరళలో ఓ కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడారు. నక్సలైట్ల ఉద్యమానికి మద్దతు ఇవ్వడానికి సుప్రీంకోర్టును జస్టిస్ సుదర్శన్ రెడ్డి వాడుకున్నారని ఆరోపించారు. ఆయన ఆ తీర్పు ఇవ్వకుంటే, సల్వాజుడుం అమల్లో ఉంటే నక్సలైట్ల ఉద్యమం 2020 నాటికే అంతమయ్యేదని అన్నారు. నక్సలైట్ల సిద్ధాంతంతో స్ఫూర్తి పొందిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సల్వాజుడుంకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారని మండిపడ్డారు. వామపక్షాల ఒత్తిడి మేరకే కాంగ్రెస్ పార్టీ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేసుకుందని ధ్వజమెత్తారు.

కేజ్రీవాల్ రాజీనామా చేసి ఉంటే...

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అప్పటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైల్లో ఉండగానే పదవికి రాజీనామా చేసి ఉంటే.. రాజ్యాంగ(130 సవరణ) బిల్లు–2025ను తీసుకురావాల్సిన అవసరం ఉండేది కాదని అమిత్ షా అన్నారు. 30 రోజులపాటు జైల్లో ఉన్న వారిని పదవుల నుంచి తొలగించే బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించడం సరైంది కాదని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలను అన్ని రాజకీయ పార్టీలూ పాటించాలని సూచించారు. ఏ ముఖ్యమంత్రి అయినా జైలులో ఉండి ప్రభుత్వాన్ని నడపాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు. జైల్లో ఉంటూ కూడా పరిపాలన సాగిస్తారని మన రాజ్యాంగ రూపకర్తలు ఊహించలేదని, అందుకే ఈ అంశాన్ని రాజ్యాంగంలోని చేర్చలేదని స్పష్టంచేశారు. జైల్లో ఉన్న నేతలను పదవుల నుంచి తొలగించడంలో తప్పేమీ లేదన్నారు.

సోనియా, స్టాలిన్ కలలు నెరవేరవు

రాజ్యాంగ(130 సవరణ) బిల్లును 'నల్ల బిల్లు' అనే హక్కు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు లేదని అమిత్ షా తేల్చిచెప్పారు. శుక్రవారం తమిళనాడులోని తిరునల్వేలిలో బీజేపీ బూత్ కమిటీల సమావేశంలో ప్రసంగించారు. చీకటి పనులు చేసిన చరిత్ర స్టాలిన్‌కు ఉందన్నారు. డీఎంకే ప్రభుత్వం దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వమని ఆరోపించారు. స్టాలిన్ పాలనలో ఎన్నో కుంభకోణాలు జరిగాయని విమర్శించారు. కుమారుడు రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసుకోవడం సోనియా గాంధీ ఎజెండా, కుమారుడు ఉదయనిధి స్టాలిన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవడం స్టాలిన్ ఎజెండా అని దుయ్యబట్టారు. వారి కలలు నెరవేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. 2026లో తమిళనాడులో ఎన్డీయే అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడుకు చెందిన అబ్దుల్ కలాంను అప్పట్లో రాష్ట్రపతిని చేసింది, నేడు అదే తమిళనాడు బిడ్డ సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేసింది ఎన్డీయే ప్రభుత్వమేనని వ్యాఖ్యానించారు.

ట్రంప్ మాజీ సలహాదారు బోల్టన్ ఇంట్లో సోదాలు


బోల్టన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మొదటి సారిగా ఎన్నికైన సమయంలో 2018–19 సంవత్సరాల్లో జాతీయ భద్రతా సలహాదారుగా వ్యవహరించిన జాన్ బోల్టన్ నివాసంపై ఎఫ్‌బీఐ అధికారులు దాడులు జరిపారు. మేరీల్యాండ్‌లోని బెథెస్డాలో ఉన్న బోల్టన్ ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ఈ విషయాన్ని ఎఫ్‌బీఐ అధికారులు ధ్రువీకరించారు. ఇతర వివరాలను మాత్రం వెల్లడించలేదు. రహస్య పత్రాలకు సంబంధించిన దర్యాప్తులో భాగంగానే సోదాలు చేపట్టినట్లు మీడియా అంటోంది. వాషింగ్టన్ డీసీలోని బోల్టన్ కార్యాలయంలోనూ సోదాలు జరిగాయని తెలిపింది. అప్పటి ట్రంప్ పాలనపై బోల్టన్ 2020లో ఒక పుస్తకం రాశారు. ఇందులో ట్రంప్ చర్యలను తీవ్రంగా తప్పుబట్టారు. పుస్తకంలోని పలు అంశాలను అధికార రహస్య పత్రాల ద్వారానే బోల్టన్ పొందినట్లు ట్రంప్ గతంలో విమర్శలు చేశారు. దాడులపై బోల్టన్ స్పందించలేదు. దాడుల విషయంతనకు తెలియదని అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు.

బాలమ్మకు ఇల్లు

'సాక్షి' కథనానికి అరికపూడి సేవ ట్రస్ట్ స్పందన



పీర్లపల్లిలో బాలమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసి భూమిపూజ చేస్తున్న అరికపూడి సేవ ట్రస్ట్ చైర్మన్ రఘు

సాక్షి ఎఫెక్ట్

జగదేవ్‌పూర్ (గజ్వేల్): సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి గ్రామంలో శ్రీపతి బాలమ్మకు చెందిన పాత ఇల్లు కూలిపోవడంతో మరుగుదొడ్డిలోనే నివాసముంటోంది. ఈనెల 21న 'మరుగుదొడ్డిలో నివాసం.. అమ్మకిదే ఆవాసం' పేరిట సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అరికపూడి సేవ ట్రస్ట్ స్పందించింది. గూడు లేక మరుగుదొడ్డిలో నివాసముంటున్న బాలమ్మకు ఇల్లు కట్టించేందుకు ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రస్ట్ చైర్మన్ రఘు పీర్లపల్లి గ్రామానికి చేరుకొని బాలమ్మ ఉంటున్న నివాసాన్ని పరిశీలించి, ఆమె పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో మేస్త్రీని పిలిపించి బాలమ్మకు చెందిన ఇంటి ఖాళీ స్థలంలో ముగ్గుపోసి ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలమ్మ పరిస్థితిని చూసి చలించిపోయానని, ఆమెకు గూడు కట్టించే అదృష్టం తమ సంస్థకు దక్కడం సంతోషంగా ఉందన్నారు. త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు.

అలాగైతే ఓకే

ఇచ్ఛంపల్లికి షరతులతో తెలంగాణ సమ్మతి

సాక్షి, హైదరాబాద్: గోదావరి– కావేరీ నదుల అనుసంధానంలో భాగంగా గోదావరిపై ఇచ్ఛంపల్లి వద్ద బరాజ్ నిర్మించి నీళ్లను తరలించాలనే ప్రతిపాదనలకు తెలంగాణ షరతులతో సమ్మతి తెలిపింది. ఇచ్ఛంపల్లి బరాజ్ వల్ల దిగువన ఉన్న సమ్మక్క సాగర్‌పై ఏ ప్రభావం పడదని అధ్యయనాల్లో తేలిన తర్వాతే ముందుకెళ్లాలని స్పష్టం చేసింది. దేవాదుల కింద 38 టీఎంసీలు, సీతారామ కింద 67 టీఎంసీలు, సమ్మక్క సాగర్ కింద 47 టీఎంసీల నీళ్లను తాము వినియోగించుకున్న తర్వాత మిగిలే నీళ్లను గోదావరి – కావేరి అనుసంధానంలో భాగంగా తరలించేందుకు ఉన్న అవకాశాలపై సిమ్యులేషన్ స్టడీస్ జరిపి.. సానుకూల ఫలితాలు వస్తేనే ముందుకు వెళ్లాలని సూచించింది. నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఆధ్వర్యంలో నదుల అనుసంధానంపై ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో సంబంధిత రాష్ట్రాలతో సంప్రదింపుల సమావేశం నిర్వహించింది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అతుల్‌కుమార్ జైన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అధికారులు ప్రత్యక్షంగా హాజరుకాగా, మహారాష్ట్ర, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, కేరళ రాష్ట్రాల అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు. తెలంగాణ తరఫున హాజరైన వారిలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుస్సేన్, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.సుబ్రమణ్యం ప్రసాద్, కృష్ణా బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ ఉన్నారు. ఏపీ జలవనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నర్సింహమూర్తి, అంతర్రాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ సుధాకర్ హాజరయ్యారు.

కేంద్రం నిధులతో 2 జలాశయాలు కట్టించాలి

జాతీయ ప్రయోజనాలు ఇమిడిలేని ఇంట్రా లింక్ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వరాదని, గోదావరి–కావేరీ అనుసంధానం ద్వారా తరలించే నీటిలో 50 శాతం వాటా తెలంగాణకు ఇవ్వాలని రాహుల్ బొజ్జా కోరారు. ఇచ్ఛంపల్లి బరాజ్ కడితే అక్కడి నుంచి 200 టీఎంసీల వరద జలాలను వాడుకోవడానికి రాష్ట్రానికి అవకాశం ఇవ్వాలని కోరారు. అనుసంధానం ద్వారా లభించే రాష్ట్ర వాటా జలాలను ఎక్కడైనా వినియోగించుకుంటామని చెప్పారు. ఈ నీళ్లను నిల్వ చేసేందుకు రెండు జలాశయాలను కేంద్ర నిధులతో కట్టించి ఇవ్వాలన్నారు. సాధ్యమైనంత మేర ముంపును తగ్గించాలని సూచించారు. ఇచ్ఛంపల్లి నుంచి తరలించే జలాలను నాగార్జునసాగర్‌లో కాకుండా దిగువన 7 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న సాగర్ టెయిల్ పాండ్‌లో వేయాలన్నారు.



ఏపీ ఇంట్రా లింక్ ప్రాజెక్టులపై అభ్యంతరం

ఇదే ప్రాజెక్ట్ కింద ఏపీ ప్రతిపాదించిన నాలుగు ఇంట్రా లింక్ ప్రాజెక్టులను ఎన్‌డబ్ల్యూడీఏ పరిగణనలోకి తీసుకుని డీపీఆర్‌లను సమర్పించాల్సిందిగా ఆ రాష్ట్రాన్ని కోరడంపై రాహుల్ బొజ్జా తీవ్ర అభ్యంతరం తెలిపారు. కృష్ణా, గోదావరి ట్రిబ్యునల్ తీర్పులకు విరుద్ధంగా గోదావరి–బనకచర్ల అనుసంధానం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నాకే.. ఈ నాలుగు ఇంట్రా లింక్ ప్రాజెక్టులను ఏపీ ప్రతిపాదించిందని సమావేశం దృష్టికి తెచ్చారు. అనుసంధానం ప్రాజెక్టుపై సమ్మతి తెలుపుతూ అవగాహన ఒప్పందంపై.. అందరి సమ్మతి, అధ్యయనాల తర్వాతే సంతకాలు చేస్తామని స్పష్టం చేశారు. గోదావరి పరీవాహకంలో రాష్ట్రంలో 968 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టిన ప్రాజెక్టులకు సత్వరంగా క్లియరెన్స్ ఇవ్వాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

పోలవరం నుంచే చేపట్టాలి: ఆంధ్రప్రదేశ్

పోలవరం ప్రాజెక్టు నుంచే గోదావరి–కావేరీ అనుసంధానం చేపట్టాలని ఏపీ కోరింది. గోదావరిలో నీటి లభ్యతపై 2023 జూన్‌లో సీడబ్ల్యూసీ ఇచ్చిన నివేదిక ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని, దాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపింది. ఆ నివేదిక ఆధారంగానే గోదావరి–కావేరీ అనుసంధానం ప్రాజెక్టును ప్రతిపాదించారంటూ అభ్యంతరం తెలిపింది. 'అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా కృష్ణాబేసిన్‌లో గోదావరి నీళ్లు వేస్తే.. బేసిన్‌పై ఆధారపడిన ఇతర రాష్ట్రాలూ వాటాలు కోరే అవకాశం ఉంది. గోదావరిలో నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ, వ్యాప్కోస్ అధ్యయనాల్లో తేడా ఉంది. అభ్యంతరాలన్నీ పరిగణనలోకి తీసుకోవాలి..' అని ఏపీ కోరింది.

కనీసం 40 టీఎంసీలైనా ఇవ్వండి: కర్ణాటక

ప్రాజెక్టు ద్వారా తరలించే జలాల్లో తమకు కనీసం 40 టీఎంసీలను కేటాయించాలని కర్ణాటక కోరింది. 'పూడికతో తుంగభద్ర జలాశయం 30 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయింది. బెడ్తీ – వర్ధా అనుసంధానంతో ఏ మాత్రం ప్రయోజనం లేదు. తుంగభద్ర ఎగువన మరో లింకు ప్రతిపాదిస్తాం..' అని తెలిపింది.

గోదావరి నీటిని వాడుకోం: సీడబ్ల్యూసీ చైర్మన్

'గోదావరి–కావేరీ అనుసంధానంలో భాగంగా గోదావరి జలాలు చుక్క కూడా వాడుకోము. హిమాలయన్ కాంపోనెంట్ నుంచి నీటిని తీసుకొచ్చి గోదావరిలో వేసి ఆ నీళ్లను తరలిస్తాం. రాష్ట్రాలన్నీ పెద్ద మనసుతో, ఉదార స్వభావంతో ఈ ప్రాజెక్టుకు అంగీకరించాలి. ప్రస్తుతం గోదావరిలో ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 147 టీఎంసీల నీటిని తరలిస్తున్నాం. ఛత్తీస్‌గఢ్ గనుక తమ పూర్తి వాటా నీటిని వినియోగించుకునేందుకు వీలుగా ప్రాజెక్టులను నిర్మించుకుంటే తరలింపును నిలిపివేస్తాం. అయితే మరో 15 ఏళ్లయినా ఛత్తీస్‌గఢ్ తన వాటాను వాడుకునే అవకాశాల్లేవు..' అని సీడబ్ల్యూసీ చైర్మన్ అతుల్‌కుమార్ జైన్ అన్నారు.

48% పరీవాహకం ఉన్నా నీళ్లు ఇవ్వరా?: మహారాష్ట్ర

'గోదావరిలో 48 శాతం పరీవాహక ప్రాంతం మహారాష్ట్రలోనే ఉన్నా మా రాష్ట్రానికి ప్రాజెక్టు కింద నీళ్లు కేటాయించలేదు. కృష్ణా ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు నీళ్లను తరలిస్తే ఆ బేసిన్ పరిధిలోని అన్ని రాష్ట్రాలకు ఆ నీటిపై హక్కు ఉంటుంది. దాని ప్రకారం నీటి కేటాయింపులు చేయాలి..' అని మహారాష్ట్ర కోరింది.

మా వాటా నీళ్లన్నీ వాడుకుంటాం: ఛత్తీస్‌గఢ్

'గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన మా వాటా నీళ్లను పూర్తిగా వాడుకుంటాం. మాకు గోదావరిలో 301 టీఎంసీల నీటి కేటాయింపులు ఉండగా, 163 టీఎంసీల వినియోగానికి అనుగుణంగా ప్రణాళికలు ఉన్నాయి. 100 టీఎంసీలతో బోధఘాట్ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నాం..' అని ఛత్తీస్‌గఢ్ పేర్కొనగా, సీడబ్ల్యూసీ జోక్యం చేసుకొని ఆ ప్రాజెక్టు జలవిద్యుత్ ప్రాజెక్టు కదా? వేరే నీటి అవసరాలు లేవుగా? అని ప్రశ్నించింది. దీంతో ఛత్తీస్‌గఢ్ స్పందిస్తూ.. ఇది బహుళార్థ సాధక ప్రాజెక్టు అని తెలిపింది. ఇచ్ఛంపల్లి బరాజ్‌తో నాలుగు గ్రామాలు, 170 హెక్టార్ల భూమి ముంపునకు గురి అవుతాయని పేర్కొంది.

వెంటనే పనులు చేపట్టాలి: తమిళనాడు

అనుసంధానం ప్రాజెక్టుకు సమ్మతి తెలుపుతూ ఇప్పటికే సంతకాలు చేశామని, కావేరీ తీవ్ర లోటు బేసిన్ అని, తక్షణమే ప్రాజెక్టు పనులు చేపట్టాలని తమిళనాడు కోరింది. తమకు 24 టీఎంసీలు కాదని, 74 టీఎంసీలు కేటాయించాలని పుదుచ్చేరి విజ్ఞప్తి చేసింది.

సమాజం సిగ్గుతో తలదించుకోవాలి

▶ మొదటి పేజీ తరువాయి

విద్యుత్ స్తంభాలపై ప్రమాదకరంగా ఉన్న కేబుల్ వైర్ల తొలగింపునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడం తెలిసిందే. దీన్ని సవాల్‌చేస్తూ భారతీ ఎయిర్‌టెల్ సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు.

కరెన్సీ నోట్లు మాత్రం కనిపిస్తాయ్..

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.రవి వాదనలు వినిపిస్తూ అనుమతులు తీసుకున్నాకే స్తంభాల ద్వారా కేబుళ్లు తీసుకున్నామని.. ప్రభుత్వం నోటీసు జారీ చేయకుండా నగరమంతా కేబుళ్లను కట్ చేయడం సరికాదన్నారు. టీజీఎస్పీడీసీఎల్ తరఫున శ్రీధర్‌రెడ్డి వాదిస్తూ నగరంలో దాదాపు 20 లక్షలకుపైగా స్తంభాలుంటే 1.70 లక్షల స్తంభాలపైనే కేబుళ్ల ఏర్పాటుకు అనుమతులున్నాయన్నారు. పరిమితికి మించి కేబుళ్ల వల్ల స్తంభాలు వంగిపోతున్నాయన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ మామూళ్లతో కొందరి జేబులు కూడా బరువెక్కి వంగిపోతున్నాయని వ్యాఖ్యానించారు. అనుమతులున్న కేబుల్ ఏజెన్సీలు అనధికారిక కేబుళ్ల తొలగింపు విషయంలో విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆదేశించారు. స్తంభాలపై అన్ని వైర్లు నల్లగా ఉన్నందున ఏవి అనుమతులున్నవో ఏవి లేనివో గుర్తుపట్టడం కష్టంగా ఉందన్న వాదనను తోసిపుచ్చారు. అనుమతులు తీసుకోని సంస్థలు ఇచ్చిన కరెన్సీ నోట్లు మాత్రం అక్రమార్కులకు బాగా కనిపిస్తాయని చురకలంటించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే హక్కు ఎవరికీ లేదన్నారు. ఆరు కుటుంబాలు అనుభవిస్తున్న వేదనకు సమష్టి బాధ్యత వహించాలన్నారు. తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేసింది. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

ఉద్యోగి చేతికే యూఏఎన్ యాక్టివేషన్

- యాజమాన్యం ప్రమేయం లేకుండానే ఈపీఎఫ్‌ఓ సవరణలు
- చందాదారుల చేతికి కీలక బాధ్యతలు అప్పగించిన ఈపీఎఫ్‌ఓ
- ఉమంగ్‌లో రిజిస్ట్రేషన్‌తో సేవలు మరింత సులభతరం



సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) సేవలు సులభతరమయ్యాయి. ఇప్పటివరకు యాజమాన్యం ప్రమేయంతోనే చందాదారులకు ఎక్కువ సేవలు అందేవి. ఈ విధానం వల్ల సేవల్లో తీవ్ర జాప్యంతో ఇబ్బందులు పడేవారు. దీన్ని అధిగమించేందుకు కొత్తగా ఉమంగ్ ద్వారా ఈపీఎఫ్‌ఓ సేవలను విస్తృతం చేసింది. సాధారణంగా ఉద్యోగంలో చేరిన వ్యక్తికి యాజమాన్యమే యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్) కేటాయించేది. ఇప్పుడు నేరుగా యూఏఎన్ నంబర్ జనరేట్ చేసుకునే విధానం ఉమంగ్ ద్వారా సాధ్యమైంది. అంతేకాకుండా ఈపీఎఫ్‌ఓకు సంబంధించి పలు రకాల సేవలను యాజమాన్యంతో పనిలేకుండా వేగవంతంగా పొందే అవకాశం ఉంది. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి చందాదారుడు ఈ సేవలను పొందవచ్చు.

ఆధార్ అనుసంధానంతో...

ఈపీఎఫ్‌ఓ చందాదారులు వ్యక్తిగత స్మార్ట్ ఫోన్ ద్వారా ఉమంగ్ (యూనిఫైడ్ మొబైల్ అప్లికేషన్ ఫర్ న్యూ ఏజ్ గవర్నెన్స్) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్, ఫోన్ నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దీంతోపాటు ఆధార్ ఫేస్ ఆర్‌డీ యాప్ కూడా ఇన్‌స్టాల్ చేయాలి. ఈ ప్రక్రియలో ఆధార్ లింక్‌డ్ ఫోన్ నంబర్ అవసరం ఉంటుంది. ఆ ఫోన్ నంబర్‌కు వచ్చే వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) ద్వారా యాప్ ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ యాప్‌ల ద్వారా నేరుగా ఈపీఎఫ్‌ఓ సేవలు పొందొచ్చు. ఫేస్ అథెంటికేషన్ ద్వారా ఆధార్ డాటాతో యూఏఎన్ కేటాయింపు, యాక్టివేషన్ సేవలను వేగవంతంగా పొందవచ్చు. ఒక ఉద్యోగికి ఒక యూఏఎన్ ఉంటే సరిపోతుంది. ఎన్ని సంస్థలు మారినా అదే యూఏఎన్ ద్వారా సేవలు కొనసాగించవచ్చు. అదేవిధంగా ఉమంగ్ ద్వారా ఈపీఎఫ్‌ఓ చందాదారులు వేగవంతంగా ఈపీఎఫ్ పాస్‌బుక్ సేవలు, కేవైసీ అప్‌డేషన్, క్లెయిమ్స్ నమోదు, దరఖాస్తు స్థితి (అప్లికేషన్ స్టేటస్) తదితర సేవలను వేగవంతంగా పొందవచ్చు. ఈ సేవల్లో ఇబ్బందులు, సందేహాలను ఉమాంగ్ హెల్ప్‌డెస్క్ లేదా ఈపీఎఫ్‌ఓ కస్టమర్ సపోర్ట్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చు.

వాగు దాటి వైద్యసేవలు




వాగు దాటుతున్న డాక్టర్ క్రాంతి కుమార్, వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఎదిర వైద్య సిబ్బంది ప్రజలకు వైద్యసేవలను అందించారు. అయితే సీతారాంపురం వెళ్లాలంటే అడవిలో వాగులు, వంకలను దాటుకుంటూ కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పలు కష్టనష్టాలకు ఓర్చి కాంత్రి కుమార్ బృందం సీతారాంపురం గ్రామానికి చేరుకుంది. వైద్య సిబ్బంది గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మనోహర్, హెచ్ఈఓ కోటిరెడ్డి, హెచ్ఏ రఘు, మోహన్ కృష్ణ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

జడ్జీలపై వ్యక్తిగత ఆరోపణలు ప్రమాదకరం

- ఈ ధోరణి న్యాయవ్యవస్థను దెబ్బతీస్తుంది
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌషుమి భట్టాచార్య
- ఓ కేసులో ముగ్గురి క్షమాపణలకు అనుమతి



సాక్షి, హైదరాబాద్: న్యాయమూర్తులపై విమర్శలు చేయడం, దూషించడం ఇటీవలి కాలంలో పరిపాటిగా మారిందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌషుమీ భట్టాచార్య ఆవేదన వ్యక్తంచేశారు. అసంతృప్తికి గురైన న్యాయవాదులు, క్లయింట్లు జడ్జీలపై ఆరోపణలు చేయడమే కాకుండా కేసు విచారణ నుంచి తప్పుకోవాలని బెదిరించే స్థాయికి దిగజారుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ చర్యలు న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీస్తాయని, అనిశ్చితికి దారి తీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓ కేసులో ముగ్గురి క్షమాపణలను అనుమతిస్తూ న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిపై గతంలో నమోదైన అట్రాసిటీ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ మౌషుమి భట్టాచార్య వివక్షతో వ్యవహరించారని పిటిషనర్ పెద్దిరాజు సుప్రీంకోర్టులో అప్పీల్ చేయగా.. దానిని అత్యున్నత న్యాయస్థానం ఈ నెల 11న కొట్టివేసింది. పిటిషనర్‌తోపాటు ఆయన తరఫు న్యాయవాదులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. జస్టిస్ మౌషుమి భట్టాచార్యకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. దీంతో జస్టిస్ మౌషుమి భటాచార్య ధర్మాసనం ముందు శుక్రవారం పెద్దిరాజు, రితీశ్‌పాటిల్, నితిన్ మేశ్రమ్ బేషరతుగా క్షమాపణ చెప్పారు. అప్పీల్‌లో వాడిన భాషకు చింతిస్తున్నామని తెలిపారు. ఆ అఫిడవిట్‌ను న్యాయమూర్తి అనుమతించారు.

న్యాయమూర్తులకు వేదిక లేదు

తనపట్ల సుప్రీంకోర్టు వ్యవహరించిన తీరుకు న్యాయమూర్తి మౌషుమి భట్టాచార్య కృతజ్ఞత తెలిపారు. జడ్జీలపై దాడులు చేసేవారు ఇష్టారాజ్యంగా మీడియాలో ఒక క్లిక్‌తో ప్రచారం చేస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై తన వాదన వినిపించేందుకు సంబంధిత న్యాయమూర్తికి వేదికే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని కాపాడటంలో జడ్జీలది కీలక పాత్ర అని, వారిపై దాడులు కోర్టుల గౌరవానికి భంగం కలిగిస్తాయని అన్నారు. న్యాయమూర్తి పదవి అంటే చైర్మన్ అధికారం కాదని.. మనస్సాక్షి, నిబద్ధత, కరుణతో న్యాయం అందించే బాధ్యత అని స్పష్టంచేశారు. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా కోర్టులు న్యాయం అందించడంలో పతాకధారులుగా నిలుస్తుండటం అభినందనీయమని ప్రశంసించారు.

టెన్త్ క్లాస్ కిల్లర్!

కూకట్‌పల్లి బాలిక హత్య కేసులో వీడిన మిస్టరీ.. వెలుగులోకి సంచలన విషయాలు


సాక్షి, హైదరాబాద్/మూసాపేట: ఆ బాలుడికి క్రికెట్ బ్యాట్‌పై మక్కువ... ఎన్నిసార్లు అడిగినా తల్లిదండ్రులు కొనివ్వలేదు... పక్క భవనంలోని స్నేహితుడి ఇంటి నుంచి ఆ బ్యాట్ చోరీకి స్కెచ్ వేశాడు. ఒకవేళ బ్యాట్ కనిపించకపోతే అందినకాడికి డబ్బు దోచుకొని ఆ సొమ్ముతో బ్యాట్ కొనుక్కుందామనుకున్నాడు. చోరీ అనంతరం ఇంటిని గ్యాస్ లీక్‌తో తగలబెట్టాలని వచ్చీరాని ఆంగ్లంలో ఓ పేపర్‌పై రాసుకొని మరీ కుట్రపన్నాడు. అయితే చోరీ చేస్తుండగా ఆ ఇంటి యజమాని కుమార్తె చూడటంతో తప్పించుకోవడం కోసం ఆమెను దారుణంగా హతమార్చాడు. కూకట్‌పల్లి దయార్‌గూడలో ఈ నెల 18న సహస్ర (11) అనే బాలికను చంపిన పదో తరగతి బాలుడి వ్యవహారమిది. పోలీసులను తప్పుదోవపట్టిస్తూ, ముప్పతిప్పలు పెట్టిన నిందితుడు.. ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పోలీసులకు ఇచ్చిన సమాచారంతో చిక్కాడు.

పుట్టిన రోజున వచ్చి కేక్ తినిపించి...

పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ఒంగోలుకు చెందిన భార్యాభర్తలు తమ కుమారుడితో కలిసి దాదాపు రెండేళ్ల క్రితం హైదరాబాద్ వలసవచ్చి కూకట్‌పల్లి దయార్‌గూడలోని ఓ భవనం నాలుగో అంతస్తులో నివసిస్తున్నారు. భర్త గతంలో చిరుద్యోగం చేసి మానేయగా భార్య కొన్నాళ్ల క్రితం వరకు కిరాణా దుకాణం నిర్వహించి ప్రస్తుతం ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. స్థానిక పాఠశాలలో పదో తరగతి చదివే వారి కుమారుడు (15) సక్రమంగా బడికి వెళ్లకుండా టీవీ, ఓటీటీల్లో వచ్చే క్రైమ్, హారర్ చిత్రాలు, వెబ్ సిరీస్‌లు, సీరియల్స్ ఎక్కువగా చూసేవాడు. కొన్నాళ్లుగా ధ్రువ్ రాఠీ అనే యూట్యూబర్‌కు చెందిన చానల్ వీక్షిస్తున్నాడు. తమ ఇంటికి ఆనుకొని ఉన్న మూడంతస్తుల భవనంపై ఉన్న పెంట్ హౌస్‌లో సహస్ర అనే బాలిక తన తల్లిదండ్రులు, సోదరుడితో కలిసి సింగిల్ బెడ్రూం ఇంట్లో నివసిస్తోంది. పక్కపక్క భవనాల్లో ఉండటంతోపాటు ఆమె సోదరుడు కూడా బాలుడు చదివే పాఠశాలలోనే చదువుతుండటంతో ఇరు కుటుంబాల మధ్య పరిచయం ఉంది. మార్చిలో జరిగిన సహస్ర పుట్టిన రోజు వేడుకకు సైతం హాజరైన బాలుడు.. ఆమెకు కేక్ కూడా తినిపించాడు.

క్రికెట్ కిట్ కొనివ్వని కారణంగా...

సహస్ర సోదరుడితోపాటు కాలనీలో ఉండే పిల్లలతో కలిసి బాలుడు తరచూ క్రికెట్ ఆడేవాడు. కొన్నాళ్ల క్రితమే సహస్ర సోదరుడు ఎంఆర్ఎఫ్ కంపెనీకి చెందిన ఓ క్రికెట్ బ్యాట్ కొనుక్కోవడంతో తనకు కూడా క్రికెట్ బ్యాట్ కొనివ్వాలని తల్లిదండ్రుల్ని పలుమార్లు అడిగాడు. వారు కొనకపోవడంతో సహస్ర ఇంట్లో చోరీకి స్కెచ్చేశాడు. తరచూ సహస్ర ఇంటికి వెళ్లి వస్తుండటం వల్ల ఆ ఇంట్లో ఏవి ఎక్కడున్నాయో తెలిసిన బాలుడు.. ఆ ఇంట్లో ఎవ్వరూ లేనివేళ బ్యాట్ కాజేసి.. ఆపై సాక్ష్యాధారాలు లేకుండా చేసేందుకు గ్యాస్ లీక్ ద్వారా ఇంటికి నిప్పంటించాలని కుట్ర పన్నా డు. ఇందుకోసం వచ్చీరాని ఆంగ్లంలో ఓ పేపర్‌పై రాసుకొని చివర్లో 'మిషన్ డన్' అని రాశాడు.



బాలుడు రాసుకున్న దొంగతనం ప్లాన్

పాఠశాలకు సెలవులు కావడంతో...

చోరీ కోసం పథకం వేసిన బాలుడు ఈ నెల 18న సహస్ర, ఆమె సోదరుడు స్కూళ్లకు వెళ్లిపోతారని.. తండ్రి మెకానిక్ షాపుకి, తల్లి విధులకు వెళ్తుందని భావించాడు. అయితే సహస్ర చదువుతున్న బోయిన్‌పల్లి కేంద్రీయ విద్యాలయాలో స్పోర్ట్స్ మీట్ ఉండటంతో నాలుగు రోజులు పాఠశాలకు సెలవులు ఇచ్చారు. దీంతో ఆమె మాత్రం ఇంట్లోనే ఉండిపోయింది. ఈ విషయం తెలియని బాలుడు.. తమ భవనం నాలుగో అంతస్తు నుంచి మూడో అంతస్తుకు వచ్చి సైడ్ వాల్ మీదుగా సహస్ర కుటుంబం ఉంటున్న భవనం మూడో అంతస్తులోకి వెళ్లాడు. అక్కడి పెంట్‌హౌస్‌కు చేరుకున్నాడు. తలుపు తీసి ఉండటంతో నేరుగా లోపలకు వెళ్లి చోరీకి ప్రయత్నించాడు. అదే సమయంలో లోపల గదిలోంచి హాల్లోకి వచ్చిన సహస్ర బాలుడిని చూసింది. ఆమె అరిస్తే పట్టుపడతాననే భయంతో బాలుడు ఆమె నోరు నొక్కి తన వద్ద ఉన్న కత్తితో నేరుగా ఆమె గొంతులో పొడిచాడు. దీంతో సహస్ర అరవలేక అక్కడే కూలిపోయింది. అయినప్పటికీ చావలేదని భావించిన నిందితుడు.. ఆమెను విచక్షణారహితంగా దాదాపు 20 పోట్లు పొడిచి వచ్చిన మార్గంలోనే తన ఇంటికి పారిపోయాడు. బయట ఆరేసిన దుస్తులు తన మీద వేసుకొని రక్తం మరకలు తల్లిదండ్రులకు కనిపించకుండా ఇంట్లోకి వెళ్లాడు. కత్తి, లేఖను దాచి... రక్తం మరకలు దుస్తుల్ని వాషింగ్ మెషీన్‌లో వడేసి ఆన్ చేశాడు. ఆపై ఏమీ ఎరగనట్లు తండ్రితో కలిసి పెంపుడు కుందేలును పశువైద్యుడి వద్దకు తీసుకెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం 12 గంట ప్రాంతంలో లంచ్ బాక్స్ కోసం ఇంటికి వచ్చిన సహస్ర తండ్రి.. కుమార్తె రక్తపుమడుగులో మృతిచెంది ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పోలీసులనూ తప్పదోవ పట్టించి..

ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఈ కేసు దర్యాప్తు జటిలంగా మారింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు చుట్టుపక్కల అందరితోపాటు ఈ బాలుడినీ విచారించారు. అయితే పోలీసులను తప్పుదోవ పట్టించేలా అతను.. సహస్ర ఇంటి నుంచి డాడీ, డాడీ అంటూ అరుపులు వినిపించాయని చెప్పి బాలిక తండ్రినే అనుమానితుడిగా చేశాడు. దీంతో ఆమె తండ్రిని విచారించిన పోలీసులు.. క్షుద్రపూజల అంశాన్నీ పరిగణనలోకి తీసుకొని దర్యాప్తు చేశారు.

ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇచ్చిన సమాచారంతో...

స్థానికంగా నివసించే ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు ఈ బాలుడి వ్యవహార శైలిపై అనుమానం వచ్చింది. దీంతో ఆయన ఆ సమాచారాన్ని పోలీసులకు అందించారు. శుక్రవారం ఉదయం ఆ బాలుడు చదివే పాఠశాలకు వెళ్లిన పోలీసులు సహస్ర హత్య విషయమై ప్రశ్నించారు. అతడు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రుల సమక్షంలో సోదాలు చేశారు. దీంతో కత్తి, రక్తం మరకలతో ఉన్న దుస్తులు, లేఖ లభించాయి. బాలుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు. ఆంగ్లంలో 11 లైన్లలో రాసి ఉన్న ఆ లేఖలో 'ఫస్ట్ గో హోం... అండ్ టేక్ గ్యాస్ అండ్ ఎ టేబుల్ అండ్ నెక్స్ట్ కీప్ ఎట్ ద డోర్ అండ్ ఫైర్ ద గ్యాస్' అంటూ లేఖలో రాసి ఉంది. దీన్ని పరిశీలించిన పోలీసులు చోరీ తర్వాత ఆధారాలు దొరక్కుండా ఇంటిని గ్యాస్ లీక్ చేసి కాల్చాలని కుట్రపన్నినట్లు భావిస్తున్నారు. ఈ ఉదంతంపై శనివారం అధికార ప్రకటన చేయనున్నారు.

జీవో నం.49 రద్దుకు అసెంబ్లీలో పోరాటం

- బీజేపీ శాసనసభా పక్షనేత, ఎమ్మెల్యేల ప్రకటన

కాగజ్‌నగర్ టౌన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 49 రద్దుకు అసెంబ్లీలో పోరాటం చేస్తామని బీజేపీ ఎమ్మెల్యేలు ప్రకటించారు. జీవో నం.49 రద్దు, పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కాగజ్‌నగర్ పట్టణంలోని తన నివాసంలో చేపట్టిన సత్యాగ్రహ దీక్ష శుక్రవారం ఐదో రోజుకు చేరింది. బీజేపీ శాసన సభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, రాకేశ్‌రెడ్డి, పాయల్ శంకర్ కాగజ్‌నగర్‌కు చేరుకుని ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దొంగదారిలో రాష్ట్ర ప్రభుత్వం జూన్ 30న జీవో 49 తీసుకురావడంతో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని 3.75 లక్షల ఎకరాల భూమి ఫారెస్ట్ రిజర్వ్ పరిధిలోకి వెళ్తుందన్నారు. జీవో పూర్తి రద్దుకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేస్తామన్నారు. పోడు భూముల సమస్య పరిష్కరించకపోతే కేసీఆర్‌కు పట్టిన గతే సీఎం రేవంత్‌రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాల్వాయి హరీశ్‌బాబుకు నిమ్మరసం ఇస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

సాక్షి హైదరాబాద్

శనివారం । 23 । ఆగస్టు । 2025



ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్.. ఆరుగురి అరెస్టు

నగరానికి చెందిన ఓ మహిళ నుంచి రూ.1.05 కోట్లు కాజేసిన ఆరుగురు సైబర్ నేరగాళ్లు చిక్కారు. వీరిలో ప్రధాన నిందితుడిగా ఓ చైనీయుడిని పోలీసులు గుర్తించారు. -10లో



స్థూల'ఖాయం'

నగరం బరువెక్కుతోంది.. స్థూలకాయుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పని ఒత్తిడి, డిప్రెషన్ దీనికి తోడు పోషకాహార లోపం తదితర సమస్యలు నతమతం చేస్తున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0/23.0

నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై.. మధ్యాహ్నం పొడి వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 30, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

జెడ్‌సీసీల పనితీరు భేష్

నగర కొత్వాల్ ఆనంద్ కితాబు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ బాధితులకు మరింత ఊరట కల్పించేందుకు ఏర్పాటు చేసిన జోనల్ సైబర్ సెల్స్ (జెడ్‌సీసీ) పని తీరుపై నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇవి అమలులోకి వచ్చిన రెండు నెలలు పూర్తి అయిన నేపథ్యంలో శుక్రవారం ఆయన బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో సమీక్ష నిర్వహించారు. నగరంలోని ఏడు జోన్లలోనూ పని చేస్తున్న జెడ్‌సీసీల పురోగతిని అధికారులు కొత్వాల్‌కు వివరించారు. రెండు నెలల్లో ఈ సెల్స్ 8,209 ఫిర్యాదులను పరిష్కరించాయి. గతంలో పరిష్కారమైన 4,970 ఫిర్యాదులతో పోలిస్తే ఇది 65.15 శాతం అధికం. 768 కేసుల్లో బాధితులు కోల్పోయిన మొత్తం నుంచి రూ.1,41,72,664 రీఫండ్ చేశారు. ఈ కోణంలో 87.03 పెరుగుదల నమోదైంది. ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెరుగుతున్న తీరునూ ఆనంద్ అభినందించారు. సురక్షితమైన డిజిటల్ వ్యవస్థ కోసం ప్రజల భాగస్వామ్యం చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. సైబర్ నేరాల కేసులను త్వరగా పరిష్కరించడానికి బ్యాంకులు, టెలికాం సంస్థలు, న్యాయ విభాగాలతో కలిసి పని చేయాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరంలో బాధితులుగా మారితే తక్షణం 1930 నంబర్‌కు కాల్ చేసి లేదా స్థానిక ఠాణా, సైబర్ సెల్‌లో ఫిర్యాదు చేయాలని ఆనంద్ సూచించారు. సమావేశంలో అదనపు సీపీ పి.విశ్వ ప్రసాద్, డీసీపీ దారా కవిత, ఏసీపీ ఆర్‌జీ శివమారుతి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్



లంచం డబ్బులతో సబ్ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్, సహాయకుడు రమేష్

వనస్థలిపురం: వనస్థలిపురం కార్యాలయంలో రూ.70 వేలు లంచం తీసుకుంటున్న సబ్ రిజిస్ట్రార్ ఎస్.రాజేష్‌కుమార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తుర్కయాంజాల్ పరిధిలోని 200 గజాల స్థల విషయం వివాదాస్పదంగా మారింది. దీని రిజిస్ట్రేషన్‌కు సబ్‌రిజిస్ట్రార్ రూ.లక్ష డిమాండ్ చేయడంతో బాధితుడు రూ.70 వేలు ఇస్తానన్నాడు. ఈ మేరకు శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ తన సహాయకుడు, డాక్యుమెంట్ రైటర్ వద్ద టైపిస్ట్‌గా పని చేసే రమేష్ ద్వారా రూ.70 వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. కార్యాలయంలో జరిగే అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడితే టోల్ ఫ్రీ నెం. 1064కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

పరిశ్రమల్లో తనిఖీలు తప్పనిసరి

- ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ హరిచందన దాసరి

సాక్షి, సిటీబ్యూరో: పరిశ్రమల్లో భద్రతా పరంగా ప్రమాణాలను తనిఖీ చేసి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రతిష్ట చర్యలు తీసుకోవాలని హరిచందన దాసరి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫైర్ సేఫ్టీపై ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫ్యాక్టరీస్ విభాగం జారీ చేసిన జీఓ ఆర్టీ నెం.331 ప్రకారం జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి పరిశ్రమల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. తొలి దశలో అన్ని రకాల పరిశ్రమలు, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలను తనిఖీ చేయాలన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రత కోసం క్రమం తప్పకుండా శిక్షణ కార్యక్రమాలతో పాటు మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. పరిశ్రమలు కార్మికులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తూ, భద్రతా చర్యలు చిత్తంగా పాటించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎన్జీ వైదేహి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పవన్ కుమార్, పీసీబీ ఈఈ సురేష్ , డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ జాన్సన్, అగ్నిమాపక శాఖ అధికారి టి.వెంకన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్





మట్టి మేలు తలపెట్టాలని..

- లక్ష వినాయక విగ్రహాల పంపిణీ లక్ష్యం
- 24 నుంచి 26 వరకు ఉచితంగా అందించనున్న హెచ్‌ఎండీఏ

సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణహిత లక్ష మట్టి విగ్రహాల ఉచిత పంపిణీకి హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది. నగరంలోని 34 కేంద్రాల్లో 8 ఇంచుల మట్టి ప్రతిమలను పంపిణీ చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ 2017 నుంచి మట్టి విగ్రహాలను అందజేస్తోంది. స్వచ్ఛంద సంస్థలు, అపార్ట్‌మెంట్‌లు, కాలనీ సంఘాల ద్వారా విగ్రహాలను అందుబాటులో ఉంచుతోంది. వినాయకచవితి వేడుకలను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 24 నుంచి 26 వరకు రెండు రోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సంప్రదించాల్సిన నంబర్లు:
కె.శంకర్, ఈఈ: 98499 09845,
జి.గణేశ్ డిప్యూటీ ఈఈ : 79893 71104

లెక్కే లేదు!

ప్రభుత్వ స్తంభాలపై ప్రైవేటు ఆధిపత్యం

- సాలెగూళ్లను తలపిస్తున్న విద్యుత్ స్తంభాలు
- ఏ కేబుల్ ఎవరిదో గుర్తించలేని దుస్థితి
- వరుస ప్రమాదాలతో హడావుడి
- అడ్డగోలు పద్ధతిలో కేబుళ్ల కత్తిరింపు



సాక్షి, సిటీబ్యూరో

సరఫరా చేసే ప్రతి యూనిట్‌ను పక్కాగా లెక్కించే సామర్థ్యం కలిగి ఉన్న దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ.. తన అధీనంలో ఉన్న విద్యుత్ స్తంభాలపై ఇప్పటికీ ఓ స్పష్టత లేకపోవడం అనేక అనుమానాలకు ఆస్కారం కల్పిస్తోంది. ఏ సర్కిల్ పరిధిలో ఎన్ని విద్యుత్ స్తంభాలు ఉన్నాయి? ఎన్ని మీటర్ల దూరం విస్తరించి ఉన్నాయి? ఏ స్తంభంపై ఏయే కంపెనీలకు చెందిన ఎన్ని కేబుళ్లు వేలాడుతున్నాయి? వంటి కనీస వివరాలను సేకరించకపోవడాన్ని పరిశీలిస్తే.. ఆడిట్ విషయంలో డిస్కం ఇంజినీర్ల నిర్లక్ష్యం ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కుంగిపోతున్న స్తంభాలు

గ్రేటర్‌లో 33/11కేవీ సబ్‌స్టేషన్లు 498 ఉండగా, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు 1,022 ఉన్నాయి. 33కేవీ యూజీ కేబుల్ లైన్లు 1,280 కిలోమీటర్లు విస్తరించి ఉండగా, 33 కేవీ ఓవర్‌హెడ్‌లైన్లు 3,725 కిలోమీటర్లు, 11 కేవీ ఓవర్‌హెడల్ లైన్లు 21,643 కిలోమీటర్లు, 11కేవీ యూజీ కేబుల్ లైన్లు 957 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 1,50,992 ఉండగా, వీటి పరిధిలో 63 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఫీడర్ నుంచి డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చే 11 కేవీ స్తంభాలు ఎన్ని ఉన్నాయో తెలియదు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గృహానికి విద్యుత్ సరఫరా చేసే 11 కేవీ ఎల్టీ స్తంభాలు ఎన్ని ఉన్నాయో కూడా సరైన లెక్కలేదు.

- నిజాం కాలంలో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలు 12 మీటర్లకుపైగా ఉండేవి. సిమెంట్ పోల్స్ వచ్చిన తర్వాత ఎత్తు తగ్గించారు. వాటికి సపోర్టింగ్ వైర్లను కూడా తొలగించారు. సాధారణంగా 11 కేవీ విద్యుత్ స్తంభం ఎత్తు తొమ్మిది మీటర్లపైగా ఉండగా అదే 33 కేవీ స్తంభం పది మీటర్లకుపైగా ఎత్తు ఉంటుంది. మెజార్టీ సర్వీసు ప్రొవైడర్లు ఐదారు మీటర్ల ఎత్తు నుంచే వైర్లను రోడ్డుకు అటు ఇటుగా ఉన్న గృహాలకు లాగుతున్నారు. లైన్ వేయగా మిగిలిన వైర్లను ఉండలుగా చుట్టూ స్తంభాలకు వేలాడదీస్తున్నారు. ఇలా ఒక్కో స్తంభానికి 500 కేజీల బరువు ఉన్న తీగలు వేలాడుతున్నాయి. సామర్థ్యానికి మించిన బరువును తట్టుకోలేక ఆయా స్తంభాలు ఏదో ఒక వైపు వంగి కన్పిస్తున్నాయి.

1.73 లక్షల స్తంభాలకే అనుమతులు..

- నగరంలో ఎల్టీ 11కేవీ, 33 కేవీ సహా అన్ని రకాల విద్యుత్ స్తంభాలు 20 లక్షలకుపైగా ఉన్నట్లు డిస్కం ప్రకటించింది. వీటిలో 1.73 స్తంభాల వినియోగానికి మాత్రమే ఆయా సర్వీసు ప్రొవైడర్లకు అనుమతి ఉన్నట్లు పేర్కొంది. ఆప్టికల్ ఫైబర్ కేబుల్, కో–యాక్సిల్ (లోపల మెటల్ కండక్టర్‌తో ఇన్సులేషన్ ఉన్న కేబుల్ టీవీ వైర్) కేబుల్స్ వాడుతున్నట్లు తెలిపింది. ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌ను విద్యుత్ స్తంభాలపై వేయడం సహా భద్రతా చర్యలను అమలు చేయడం ఆయా ఏజెన్సీదే పూర్తి బాధ్యత. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వేసిన విద్యుత్ స్తంభాలను సులభంగా గుర్తించేందుకు వాటిపై పెయింటింగ్ తప్పనిసరిగా చేయాలి.
- విద్యుత్ స్తంభాలపై బ్యాక్‌హాల్ ఎక్విప్‌మెంట్ వంటి అదనపు పరికరాలను ఇన్‌స్టాల్ చేయరాదు. అనుమతించిన సంఖ్యకు మించి స్తంభాలను ఉపయోగించకూడదు. సమీపంలోని లైన్ల నుంచి విద్యుత్ సరఫరాను డైరెక్ట్ ట్యాపింగ్ చేయరాదు. కానీ.. అనేక ప్రదేశాలలో కేబుల్స్ కిందికి 5 అడుగుల ఎత్తులో వదిలేస్తున్నారు. కాంక్రీట్ మిక్సర్ వాహనాలు, బోర్ డ్రిల్లింగ్ వంటి భారీ వాహనాలు రోడ్డును దాటేటప్పుడు తక్కువ ఎత్తులో వేయబడిన ఈ కేబుల్స్ వల్ల విద్యుత్ నెట్‌వర్క్‌కు భారీ నష్టం వాటిల్లుతోంది. ఐఎస్‌పీలు, కేబుల్ ఆపరేటర్లు కొత్త కనెక్షన్ కోసం కేబుల్ వేస్తున్నారే కానీ ఇప్పటికే పాడైన, వినియోగంలో లేని కేబుల్స్‌ను తొలగించట్లేదు. ఇవి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అనుమతి తీసుకున్న కేబుళ్లను కూడా గుర్తించే పరిస్థితి లేకపోవడంతోనే అన్ని తీగలను తొలగించాల్సి వస్తోందని డిస్కం స్పష్టం చేస్తోంది.

పర్యవేక్షణ లేదు.. ప్రమాణాలు పాటించరు

కరెంట్ సరఫరా, లైన్లు పర్యవేక్షణ, రెవెన్యూ వసూళ్లపై ప్రత్యేక ఆడిట్ ఉంది. గ్రేటర్‌లో స్టార్ కేబుళ్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్ సర్వీసు ఆపరేటర్లు 30 మందికిపైగా ఉన్నట్లు అంచనా. నిజానికి విద్యుత్ సంస్థ కంటే ఇంటర్నెట్, స్టార్ కేబుళ్ల ఆదాయం ఎక్కువ. లైన్లు, కేబుళ్ల ఏర్పాటు విషయంలో విద్యుత్ సంస్థకు కొన్ని కచ్చితమైన ప్రమాణాలు, నియమ నిబంధనలు ఉన్నాయి. కానీ కేబుల్ ఆపరేటర్లకు, సర్వీసు ప్రొవైడర్లకు కనీస భద్రత ప్రమాణాలు, నియమ నిబంధనలు లేవు. వీరి పని తీరుపై పర్యవేక్షించే ప్రభుత్వ యంత్రాంగం కూడా లేదు. మార్కెట్లో తక్కువ ధరకు లభించే నాసిరకం కేబుళ్లు కొనుగోలు చేసి విద్యుత్ స్తంభాలపై వేలాడదీస్తున్నారు. ఈదురు గాలితో కూడిన వర్షాలకు తరచూ తెగిపడుతుండటంతో వాటికి సపోర్టింగ్ కోసం జే వైర్లతో అనుసంధానిస్తున్నారు.

- ఎలాంటి అనుమతులు లేకుండా స్తంభాలకు జంక్షన్ బాక్సులను ఏర్పాటు చేయడంతో పాటు వాటికి అక్రమంగా కరెంట్ వాడుతున్నారు. ఈ విషయం ఇటు క్షేత్రస్థాయి ఇంజినీర్లు మొదలు.. సీఎండీ వరకు తెలుసు కానీ ఇప్పటి వరకు ఏ ఒక్క ఆపరేటర్‌పై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తాజాగా రామంతాపూర్, అంబర్‌పేట్, బండ్లగూడ ఘటనలతో అప్రమత్తమైన డిస్కం.. స్తంభాలకు వేలాడుతున్న వైర్లను తొలగించే పని మొదలు పెట్టింది. అయితే.. ఇప్పటికే డిస్కం నిర్ణయించిన చార్జీలు చెల్లించి, స్తంభాల ద్వారా కేబుళ్లను ఏర్పాటు చేసుకున్న సర్వీసు ప్రొవైడర్లు డిస్కం ఇంజినీర్ల తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా అన్ని అనుమతులు తీసుకున్న తమ కేబుళ్లను కూడా తొలగించడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

వెంకట రామారెడ్డి సేవలు అజరామరం: సీవీ ఆనంద్



పోలీసులను సత్కరిస్తున్న సీవీ ఆనంద్

హిమాయత్‌నగర్: విద్యా సంస్థలను స్థాపించి మహిళల విద్యకు పెద్ద పీట వేసిన గొప్ప వ్యక్తి రాజా బహదూర్ వెంకట రామారెడ్డి అని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు టి.మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వెంకట రామారెడ్డి 156వ జయంతి వేడుకలను ఇక్కడ ఘనంగా నిర్వహించారు. నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి సీవీ ఆనంద్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. నిజాం పాలనలో వెంకట రామారెడ్డి కొత్వాల్‌గా 14 ఏళ్లు సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన తన 14 ఏళ్ల సేవలో పౌర, పోలీస్ విధులను సమర్థంగా నిర్వహిస్తూ, సాంఘిక దురాచారాల నిర్మూలనకు, మహిళా విద్య, వితంతు పునర్వివాహం వంటి వాటికి అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ సేవలను సీపీ ఆనంద్ అభినందించారు. రాజా బహదూర్ సొసైటీ తరఫున ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె.సతీష్ రెడ్డి, ఎస్‌ఐ ఎస్.సురేష్, షాద్‌నగర్ డీఐ ఎస్.వెంకటేశ్వర్లులకు బంగారు పతకంతో పాటు నగదు పురస్కారాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ బి.బాలస్వామి ఐపీఎస్, రాజా బహదూర్ వెంకట రామారెడ్డి సొసైటీ కార్యదర్శి తీగల మోహన్ రెడ్డి, అధ్యక్షుడు ఎంవీ రంగా రెడ్డి, ఉపాధ్యక్షురాలు ఎ.సుకన్యా రెడ్డి, సంయుక్త కార్యదర్శి వాసుదేవా రెడ్డి, కోశాధికారి జి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్రైమ్ సిరీస్.. చైల్డ్ వర్రీస్!

నేర స్వభావాన్ని ముందే గుర్తించాలంటున్న సైకాలజిస్టులు



సాక్షి, సిటీబ్యూరో: పాఠశాల చదువు కూడా ఇంకా పూర్తి కాని ఓ బాలుడు.. పక్కింట్లో ఉన్న ఓ అమాయక బాలికను అత్యంత దారుణంగా హత్య చేశాడు. తనకు కావాల్సిన ఓ చిన్న బ్యాట్ దొంగతనం చేయాలనుకునే క్రమంలో అభమూ శుభమూ తెలియని చిన్నారిని బలిగొన్నాడు. రాజధాని నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిన ఈ అమానుష ఘటనలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయి. పదో తరగతి చదువుతున్న బాలుడు ఇంతటి దారుణానికి ఒడిగట్టడమేంటి? అదీ నడిబొడ్డున జరగడం ఏమిటి? రేపటి పౌరులను రేపటి నేరగాళ్లుగా మారుస్తున్న ఈ పాపం ఎవరిది? అనే ప్రశ్నలు అందరి మదిలోనూ తలెత్తుతున్నాయి. దొంగతనానికి వెళ్లే ముందు తాను పక్కాగా ప్లాన్ చేసుకున్నానని.. అవసరమైతే హత్య ఎలా చేయాలి? అనేది కూడా ముందే ఆలోచించానని కూకట్‌పల్లిలో బాలిక హత్య కేసు నిందితుడైన బాలుడు చెబుతున్నాడు. ఆ బాలుడికి క్రైమ్ సిరీస్ చూసే అలవాటు కూడా ఉందని వెల్లడైంది. దీంతో ఈ తరహా క్రైమ్ నేపథ్య సినిమా/సిరీస్‌ల ప్రభావంపై చర్చ మొదలైంది.

మోగుతున్నాయ్.. డేంజర్ బెల్స్

కోవిడ్ 19, లాక్ డౌన్ ప్రభావంతో పిల్లలతో సహా ప్రతి ఒక్కరికీ స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, టాబ్లెట్‌లు.. ఇలా ఇంటర్నెట్‌కు అనుసంధానిత పరికరాల వాడకం పెరిగింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను కూడా సులభంగా యాక్సెస్ చేయడం వల్ల వెబ్ సిరీస్‌లు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. అవి చాలా మందికి ఒక రకమైన వ్యసనంలా మారిపోయాయి. వెబ్‌సిరీస్‌తో సమస్య ఏమిటంటే.. సిరీస్ నచ్చితే వీక్షకులు ఒక ఎపిసోడ్ చూసి ఆపడం సాధ్యం కాక మొత్తం సిరీస్‌ను చూస్తున్నారు.

పరిశోధనలు చెబుతోందదే..

యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌కు చెందిన క్రిమినాలజీ రిసెర్చర్స్ చేసిన పరిశోధనలో కేవలం వెబ్ సిరీస్ చూడడం వల్ల 34 శాతం మంది పిల్లలు ఒత్తిడికి గురవుతున్నారని, భయాందోళనలకు రాత్రివేళ పీడ కలలకు గురవుతున్నారని తేల్చారు. క్రైమ్ కంటెంట్ చూసిన ప్రతీ నలుగురు టీనేజర్లలో ఒకరు అభద్రతకు లోనవుతున్నారని, క్రిమినల్స్‌ను హీరోలుగా అపోహపడే ప్రమాదం పెరుగుతోందని స్పష్టం చేసింది. ఈ తరహా క్రైమ్ కంటెంట్ పెద్దలకు మాత్రమే అనే హెచ్చరికలతో వస్తున్నప్పటికీ చిన్నారులు మాత్రం సులభంగానే చూడగలుగుతున్నారని వెల్లడించింది.

పర్యవేక్షణే శరణ్యం..

ఈ నేపథ్యంలో కొందరు పిల్లల్లో అభద్రతా భావం పెరుగుతుంటే.. మరికొందరిలో నేర పూరిత మనస్తత్వం విజృంభిస్తోంది. ఈ పరిస్థితుల్లో చిన్నారులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ మరింత పెరగాల్సిన అవసరం కనిపిస్తోంది. వారిని స్క్రీన్ వీక్షణ నుంచి మళ్లించి ఆరోగ్యకరమైన ఆటలు, హాబీల వైపు దృష్టి నిలిపేలా చేయడం, అలాగే క్రైమ్ కంటెంట్‌ను చిన్నారులు చూడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సైకాలజిస్టులు సూచిస్తున్నారు.

అదీ ఒక కారణమే.. కాని అదే కారణం కాదు...



హింసాత్మక ప్రవృత్తికి కేవలం సోషల్ మీడియా మాత్రమే కారణం అని చెప్పలేం. అయితే.. అదీ ఒక కారణమే. సాధారణంగా వంశపారంపర్యంగా వచ్చే కొన్ని లక్షణాలకు ఇవి ప్రేరకంగా పనిచేస్తాయని అనొచ్చు. అలాగే తల్లి గర్భంతో ఉన్నప్పుడు ఎదుర్కొన్న కొన్ని పరిస్థితులు కూడా అగ్రెసివ్ నెస్‌ను పెంచుతాయి. ఏదేమైనా ఈ స్వభావాన్ని ముందుగానే గుర్తించడం చాలా ముఖ్యం.

– డా.చరణ్ తేజ్, న్యూరో సైక్రియాట్రిస్ట్

కొత్త కార్డులకు రేషన్

సెప్టెంబర్ కోటా విడుదల

- 1వ తేదీ నుంచి సరుకుల పంపిణీ
- కొత్తగా లక్ష కుటుంబాలకు లబ్ధి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో కొత్త ఆహార భద్రత (రేషన్)కార్డుదారులకు శుభవార్త. వీరికి వచ్చే నెల నుంచి రేషన్ సరుకులు అందనున్నాయి. పాత కార్డుదారులతో పాటు కొత్తగా రేషన్ కార్డులు మంజూరైన కుటుంబాలకు కూడా నెలవారీ రేషన్ కోటా విడుదలైంది. పౌరసరఫరాల గోదాంల నుంచి ప్రభుత్వ చౌకధరల దుకాణాలకు ఇండెంట్ ప్రకారం బియ్యం స్టాక్ సరఫరా ప్రారంభమైంది. సెప్టెంబర్ నుంచి సుమారు లక్షకు పైగా కొత్త కార్డుదారులకు బియ్యం అందనున్నాయి. పౌరసరఫరాల శాఖ గత ఐదు నెలల నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తూ వస్తోంది. ఈ నెల 20 వరకు మంజూరైన కార్డుదారులకు సెప్టెంబర్ కోటా కేటాయించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాత కార్డుదారులకు జూన్ నెలలోనే ఒకేసారి మూడు నెలల కోటా కింద రేషన్ బియ్యం పంపిణీ జరిగింది. అయితే.. మే 20 వరకు మంజూరైన కొత్త కార్డుదారులకు కూడా మూడు నెలల కోటా ఒకేసారి అందజేశారు. అప్పటి నుంచి కొత్త రేషన్ కార్డు మంజూరు ప్రక్రియ కొనసాగుతున్నా... రేషన్ కోటా మాత్రం కేటాయించలేదు. మూడు నెలల కోటా గడువు ముగియడంతో తాజాగా పాత కార్డుదారులతో పాటు కొత్తవారికి కూడా సెప్టెంబర్ కోటా కేటాయించారు.



గ్రేటర్‌లో 13.76 లక్షలకుపైగా కార్డులు

గ్రేటర్ పరిధిలో సుమారు 13.76 లక్షల కార్డులు ఉండగా, అందులో దాదాపు 60.01 లక్షల యూనిట్లు (లబ్ధిదారులు) ఉన్నారు. ప్రతి కార్డులోని యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం కోటా కేటాయించారు. ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా వచ్చే నెల 1 నుంచి 15 వరకు నెలవారీ కోటా పంపిణీ చేస్తారు. లబ్ధి కుటుంబాలు సెలవులు మినహా మిగతా రోజుల్లో నెలవారీ కోటాను డ్రా చేసుకోవచ్చు. రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లోని సభ్యులు(కార్డులో పేరు ఉన్న సభ్యులు) ఒకరు ప్రభుత్వ చౌక ధరల దుకాణానికి వెళ్లి బయోమెట్రిక్ ఇచ్చి కుటుంబానికి కేటాయించిన సరుకుల కోటాను డ్రా చేయవచ్చు సన్న బియ్యం మాత్రమే ఉచితంగా పంపిణీ చేస్తారు. మిగతా సరుకులు సబ్సిడీపై కొనుగోలు చేయాల్సి ఉంది.

గ్రేటర్ పరిధిలో రేషన్ కార్డులు ఇలా

అర్బన్ ఏరియా	కార్డుల సంఖ్య	యూనిట్లు
హైదరాబాద్	7,12,952	26,88,567
మేడ్చల్–మల్కాజిగిరి	4,21,400	14,68,82
రంగారెడ్డి	2,19,316	763,585
సంగారెడ్డి	23,091	80,963

27 వేల చోట్ల చెత్త తొలగించిన హైడ్రా

- 810 ప్రాంతాల్లో నేలకొరిగిన చెట్లు సైతం..
- వర్షాల నేపథ్యంలో నిరంతరాయంగా..

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) నేతృత్వంలోని బృందాలు నగరంలో నిరంతరాయంగా, నిర్విరామంగా పని చేస్తున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో వరద నీటి తొలగింపు, మిగిలిన సమయాల్లో పూడిక తరలింపు చర్యలు చేపడుతోంది. ఇలా గత నెల ఒకటి నుంచి శుక్రవారం వరకు హైడ్రా మొత్తం 27 వేల ప్రాంతాల నుంచి చెత్త, బురద, పూడికను తొలగించింది. 810 ప్రాంతాల్లో నేలకూలిన వృక్షాలను తీసింది. మొత్తమ్మీద 15,665 క్యాచ్‌పిట్లను శుభ్రం చేయడంతో పాటు 359 కల్వర్టుల వద్ద అడ్డంకుల్ని తొలగించింది. అదనంగా 1670 చోట్ల నాలాల్లో చెత్తను బయటకు తీయడంతో పాటు 4609 వాటర్ లాగింగ్ పాయింట్లను క్లియర్ చేసింది. వర్షాల వేళ 4974 ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేసింది. మొత్తం 27,272 చోట్ల చెత్త, పూడిక, వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టింది. అల్వాల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, టోలిచౌకి, తలాబ్‌చంచలన్‌లో పెద్దఎత్తున పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి.

అమీర్‌పేట మైత్రి వనం వద్ద ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకువచ్చిన చెత్తను తొలగించే పని నిరంతరంగా సాగుతోంది. ఇక్కడ శాశ్వత పరిష్కారం దొరికే వరకూ ఈ ప్రక్రియను కొనసాగిస్తూ వరద నిలవకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. టోలిచౌకి ప్రాంతంలో బుల్కాపూర్ నాలాతో పాటు గౌరీశంకర్ బస్తీలో నాలాల క్లీనింగ్ దాదాపు పూర్తి కాగా పాతబస్తీలోని తలాబ్‌చంచలన్ ప్రాంతంలో నాలాలోని పూడిక తొలగింపు కొనసాగుతోంది.



టోలిచౌకిలో పనుల్ని పర్యవేక్షిస్తున్న రంగనాథ్

కత్తితో సంచరిస్తున్న పాత నేరస్తుడి అరెస్టు

సనత్‌నగర్: జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన పాత నేరస్థుడు మారణాయుధంతో తిరుగుతుండగా సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. సనత్‌నగర్ ఎస్ఐ మల్లేశం పెట్రోలింగ్ మొబైల్–2 సిబ్బంది రామకృష్ణ, అశోక్‌కుమార్‌లతో కలిసి ఈ నెల 20న నైట్ పెట్రోలింగ్ విధులు నిర్వర్తిస్తున్నారు. 21వ తేదీ తెల్లవారుజామున ఫతేనగర్ రైల్వే వంతెన కింద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గమనించారు. పోలీసు పెట్రోలింగ్ మొబైల్ వాహనాన్ని చూడగానే అతను అక్కడి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు అతన్ని పట్టుకుని తనిఖీ చేయగా కత్తి బయటపడింది. ఇతను బాలానగర్ రాజుకాలనీకి చెందిన ఓన్నపురం ప్రవీణ్‌గా పోలీసులు గుర్తించారు. బాలానగర్, సనత్‌నగర్, ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్లలో ప్రవీణ్‌పై దొంగతనం, దోపిడీ, హత్య కేసులు నమోదై ఉన్నట్లు తెలుసుకున్నారు. సాగర్‌సింగ్ అనే వ్యక్తితో పాటు మరికొంతమందితో కలిసి ప్రవీణ్ ఆ నేరాలకు పాల్పడ్డట్లు విచారణలో తేలింది. గత సంవత్సరం ఓ హత్య కేసులో ప్రవీణ్‌ను సనత్‌నగర్ పోలీసులు రిమాండ్ చేశారు. ఇటీవలే బెయిల్‌పై విడుదలై కొన్ని రోజుల పాటు తన స్వగ్రామానికి వెళ్లాడు. పోలీసులు ప్రవీణ్ వద్ద నుంచి కత్తిని స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాకట్టు పెట్టిన నగలతో ఉడాయించిన వ్యాపారి

బంజారాహిల్స్: శ్రీకృష్ణానగర్‌లో ఓ వ్యాపారి తన వద్ద తాకట్టు పెట్టిన బంగారు, వెండి నగలతో ఉడాయించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జూబ్లీహిల్స్ గురుబ్రహ్మనగర్ బస్తీకి చెందిన గోపాల్‌నాయక్ ఇటీవల శ్రీకృష్ణానగర్‌లోని ముఖేష్‌జైన్ పాన్‌బ్రోకర్ వద్ద రెండున్నర తులాల బంగారం, అరకేజీ వెండి ఆభరణాలు తాకట్టు పెట్టాడు. గత మార్చిలో విడిపించుకోవడం కోసం వెళ్లగా లాకర్లు ఉన్నాయంటూ ముఖేష్‌జైన్ బుకాయించాడు. నెల రోజుల తర్వాత ముఖేష్‌జైన్ తన వ్యాపారాన్ని బాబాయి బాబూలాల్‌జైన్‌కు అప్పగించి ఉడాయించాడు. నెలలు గడిచినా బాధితుడికి ఆభరణాలు వెనక్కి ఇవ్వలేదు. బాబూలాల్‌జైన్ కూడా వస్తువులను లాకర్ నుంచి తెచ్చిన తర్వాత ఇస్తానంటూ కాలయాపన చేస్తున్నాడని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ గత జూన్ 24న తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఇంతవరకు కేసు నమోదు చేయలేదని గోపాల్‌నాయక్ ఆరోపించారు. ముఖేష్‌జైన్‌తో పాటు బాబూలాల్‌జైన్‌పై కేసు నమోదు చేసి న్యాయం చేయాలంటూ శుక్రవారం పోలీస్‌స్టేషన్ వద్ద మీడియా ముందు తన గోడు వెళ్లబోసుకున్నాడు. జూబ్లీహిల్స్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్.. ఆరుగురి అరెస్టు

- ప్రధాన సూత్రధారి చైనీయుడిగా గుర్తింపు
- 50 బ్యాంకు ఖాతాలు సమకూర్చిన నిందితులు
- ప్రతి దశలోని కమీషన్లు తీసుకుంటూ వ్యవహారం



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ మహిళను సోషల్ మీడియా ద్వారా సంప్రదించి, తమ ద్వారా పెట్టుబడి పెడితే భారీ లాభాలని ఆశ చూపి, తొలినాళ్లల్లో తక్కువ మొత్తానికి లాభాలు ఇచ్చి, వర్చువల్ ఖాతాలో రూ.6.05 కోట్ల బ్యాలెన్స్ చూపిస్తూ రూ.1.05 కోట్లు కాజేసిన సైబర్ నేరంగా ఆరుగురు నిందితులు చిక్కారు. వీరిని అరెస్టు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ప్రధాన నిందితుడు చైనీయుడిగా గుర్తించారని డీసీపీ దార కవిత శుక్రవారం ప్రకటించారు. బాధితురాలికి ఈ ఏడాది జనవరిలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్, కాయిన్ ఎస్ఎస్‌డీసీఎక్స్‌లకు చెందిన అధికారులుగా కొందరు సంప్రదించారు. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ యాప్స్‌లోని గ్రూపుల్లో చేర్చారు. తాము ఇచ్చే చిన్న చిన్న టాస్కులు పూర్తి చేస్తే కమీషన్లు ఇస్తామంటూ ఎర వేశారు. తొలినాళ్లలో లైక్స్, షేరింగ్ వంటి టాస్కులు ఇచ్చి నిర్ణీత మొత్తాలు చెల్లించారు. ఆపై తమ ద్వారా పెట్టుబడులు పెట్టి భారీ లాభాలు పొందాలని సూచించారు. వీరి మాటలు నమ్మిన ఆమె అంగీకరించడంతో టెలిగ్రామ్ ద్వారా లింకు పంపిన సైబర్ నేరగాళ్లు ఓ వర్చువల్ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. దాని ద్వారానే ఇన్వెస్ట్‌మెంట్ చేయాలని, లావాదేవీలన్నీ అందులో కనిపిస్తాయని నమ్మబలికారు. ఆమె అలానే చేయగా... తొలుత చిన్న మొత్తాలు పెట్టుబడిగా పెట్టించి లాభాలు ఇచ్చారు. తక్షణం విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం లేదని, యాప్ ద్వారా లాభం ఎంతో తెలుసుకోవచ్చని నమ్మించారు. అందులో ఆమె నుంచి దశల వారీగా రూ.1.05 కోట్లు వివిధ బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేయించుకున్న నేరగాళ్లు లాభాలతో కలిపి ఏకంగా రూ.6.05 కోట్లు ఆమె వర్చువల్ ఖాతాలో ఉన్నట్లు చూపించారు. ఆ మొత్తం డ్రా చేసుకోవడానికి మరికొంత మొత్తం డిపాజిట్ చేయాలని షరతులు పెట్టడంతో అనుమానించిన బాధితురాలు ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదుతో సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు కాగా... ఏసీపీ ఆర్‌జీ శివమారుతి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఎం.సీతారాములు నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేసింది. బాధితురాలు కోల్పోయిన మొత్తం నుంచి రూ.90 వేలు లక్ష్మణ్ ఖాతాలోకి వెళ్లినట్లు గుర్తించారు. ఇతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆ ఖాతాకు సంబంధించిన ఏటీఎం కార్డును పచ్చిపాల వినోద్ కుమార్‌కు అప్పగించి, నగదు తీసుకున్నట్లు చెప్పాడు. ఇతడు దీన్ని మైలాపురం ప్రదీప్‌కు అప్పగించి ప్రతి లావాదేవీ పైనా 4 శాతం కమీషన్ తీసుకుంటున్నాడని తేలింది. ప్రదీప్ ఈ ఏటీఎం కార్డుల్ని కొండూరు వేణు ద్వారా పి.వంశీ తదితరులకు చేరాయి. వీటిని వినియోగించిన ఈ నిందితులు ఏటీఎం సెంటర్లు, పెట్రోల్ బంకుల్లో నగదు డ్రా చేసుకున్నారు. ఈ మొత్తం నుంచి ఒక్కో విత్‌డ్రాకు రూ.1000 చొప్పున తీసుకుంటూ.... మిగిలిన మొత్తం ఎ.హర్షవర్ధన్‌కు అప్పగించాడు. ఇతగాడు తన కమీషన్ మినహాయించుకుని మిగిలిన మొత్తం క్రిప్టో కరెన్సీగా మార్చి చైనాలో ఉన్న సూత్రధారి చెన్ చెన్‌కు పంపాడు. లక్ష్మణ్ ఇటీవల కాలంలో ఇలా దాదాపు 50 బ్యాంకు ఖాతాలు తెరిచి ఏటీఎం కార్డులు ఈ గ్యాంగ్‌కు అందించాడు. దీంతో పోలీసులు చెన్ చెన్ మినహా మిగిలిన ఆరుగురినీ అరెస్టు చేశారు.

ఓయూ దూరవిద్య దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15 వరకు పొడిగించినట్లు డైరెక్టర్ ప్రొ.భట్టా చార్యులు శుక్రవారం తెలిపారు. డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, ఇతర కోర్సులలో 2025–26 విద్యా సంవత్సరానికి మొదటి విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

ఫ్రీడమ్ ఆయిల్స్ ఆధ్వర్యంలో సీడ్ గణేశా...

సాక్షి, సిటీబ్యూరో: ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ ఆధ్వర్యంలో పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించే ప్రయత్నాలలో భాగంగా 10,000 పర్యావరణ అనుకూల విత్తన గణేశ విగ్రహాలను పంపిణీ చేయనుంది. పర్యావరణ అనుకూల విధానాలను ప్రోత్సహించడానికి ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ హైదరాబాద్‌లో 5 వేల పర్యావరణ అనుకూల విత్తన గణేశ విగ్రహాలను బెంగళూరులో మరో 5 వేల విగ్రహాలను పంపిణీ చేయనుంది. నగరంలోని రిడ్జ్ టవర్స్, మై హోమ్ జ్యువెల్, వన్ సిటీ, సాయి మిత్రా టవర్స్, కృష్ణకుంజ్ గార్డెనియా, మలేషియన్ టౌన్‌షిప్స్ రెయిన్ ట్రీ పార్క్, స్వాన్‌లేక్ అపార్ట్‌మెంట్స్, రెయిన్‌బో విస్టా, జనప్రియ మెట్రోపోలిస్ అపార్ట్‌మెంట్స్, శాటిలైట్ అపార్ట్‌మెంట్, వెర్టెక్స్ ప్రైమ్, రెయిన్‌బో విస్టాస్ రాక్ గార్డెన్–1, 2 మొదలైన అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌ల వద్ద పంపిణీ చేయనున్నట్లు డిజిఎం చేతన్ పింపాల్‌ఖుటే తెలిపారు.

ఇంటింటి సర్వే చేపట్టండి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఏకధాటి వర్షాలు.. భారీ వరదల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు సోమవారం నుంచి ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పారిశుద్ధ్య నిర్వహణ పనులు, దోమల నియంత్రణ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ప్రతి రోజూ కాలనీలు/బస్తీల్లో ఫాగింగ్ చేయడంతో పాటు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. క్లోరినేషన్ తర్వాతే తాగునీటిని సరఫరా చేయాలని, పైపులైన్లకు లీకేజీలు లేకుండా, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రైడే పాటించాలని, ఈ నెలాఖరులోగా వనమహోత్సవాన్ని పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, సంబంధిత అధికారులు ల్గొన్నారు.

పాఠశాల భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఇబ్రహీంపట్నం: గురుకుల పాఠశాల భవనంపై నుంచి ఓ విద్యార్థిని దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన పట్నం ఠాణా పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చర్లపటేల్‌గూడ గ్రామ పరిధి ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో మహాత్మాజ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల విద్యాలయం కొనసాగుతోంది. ఈ పాఠశాలలో 6వ తరగతి చదవుతున్న బాలిక మధ్యాహ్నం భవనం పై నుంచి దూకింది. చెట్టుపై పడటంతో ప్రాణాపాయం తప్పింది. తీవ్ర గాయాలతో పడున్న చిన్నారిని తొలుత స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. మెరుగైన మరో ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. గద్వాలకు విద్యార్థిని ఈ నెల మొదటి వారంలో గురుకులం చేరినట్లు తెలుస్తోంది. ఇంటిపై బెంగతో ఇక్కడ ఉండటం ఇష్టంలేకనే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు తెలిసింది. అయితే కళాశాల సిబ్బంది, అధికారులు మాత్రం ప్రమాద విషయాన్ని గోప్యంగా ఉంచడం గమనార్హం.

పోలీసు 'గ్రూపుల్లో' అసాంఘికశక్తులు!

- కీలక సమాచారం లీక్ చేయడానికే ఇలా...
- సభ్యుల వివరాలు మరోసారి సరిచూడండి
- హెచ్చరికలు జారీ చేసిన కేంద్ర నిఘా వర్గాలు
- ఔరంగాబాద్ ఉదంతాన్ని ఉటంకిస్తూ అలర్ట్

సాక్షి, సిటీబ్యూరో: పోలీసు విభాగం ఇటీవల కాలంలో సమాచార మార్పిడి కోసం వాట్సాప్ గ్రూపుల్ని ఏర్పాటు చేస్తోంది. ప్రధానంగా మీడియాతో సమన్వయానికి పోలీసు–మీడియా సభ్యులతో ఉన్న గ్రూపులు ఉంటున్నాయి. ఇలాంటి ఉమ్మడి గ్రూపుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్ర నిఘా వర్గాలు శుక్రవారం హెచ్చరికలు జారీ చేశాయి. వాటిలో అసాంఘికశక్తులు ప్రవేశించే అవకాశం ఉందని, కీలక సమాచారంతో పాటు పోలీసుల కదలికల్నీ లీక్ చేయడానికి ఇలాంటి కుట్రలు చేస్తున్నట్లు అలెర్ట్ ఇచ్చాయి. బుధవారం బీహార్ పోలీసులు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో సుదీర్ఘకాలంగా వాంటెడ్‌గా ఉన్న మావోయిస్టు అలోక్ శర్మను అరెస్టు చేసిన నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బీహార్‌కు చెందిన అలోక్ శర్మ సుదీర్ఘకాలంగా మావోయిస్టు కార్యకలాపాలు సాగిస్తున్నాడు. గతంలో రెండు కేసుల్లో అరెస్టు అయిన ఇతగాడు బెయిల్‌పై బయటకు వచ్చాడు. తన పంథా మార్చుకోకుండా కార్యకలాపాలు సాగిస్తున్న అలోక్ శర్మపై బీహార్‌లోని బాంకే బజార్, డియో పోలీసుస్టేషన్లలో రెండు కేసులు నమోదయ్యాయి. కొన్నాళ్లుగా అజ్ఞాతంలో ఉన్న ఇతడి కోసం బీహార్‌లోని గయ పోలీసులు ముమ్మరంగా గాలించారు. ఎట్టకేలకు ఔరంగాబాద్‌లో తలదాచుకున్నట్లు గుర్తించి బుధవారం పట్టుకున్నారు. ఇతడి నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌ను విశ్లేషించిన నేపథ్యంలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఔరంగాబాద్ పోలీసు విభాగం మీడియా ప్రతినిధులతో సమన్వయం కోసం ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపులో ఇతడూ సభ్యుడిగా ఉన్నట్లు తేలింది. తాను మీడియా ముసుగులో ఆ గ్రూపులో చేరానని, అలా పోలీసులతో పాటు సాయుధ బలగాల కదలికల్ని తెలుసుకుంటూ మావోయిస్టులకు సమాచారం ఇచ్చానని అలోక్ శర్మ అంగీకరించాడు. దీంతో ఔరంగాబాద్ పోలీసులు మీడియా కో–ఆర్డినేషన్ గ్రూపులోని సభ్యులు అందరినీ రిమూవ్ చేయడంతో పాటు గ్రూపునే డిలీట్ చేశారు. దీనిపై బీహార్ పోలీసులు కేంద్ర నిఘా వర్గాలకు సమాచారం ఇచ్చాయి. దీని ఆధారంగా దేశంలోని అన్ని పోలీసు బలగాలను అప్రమత్తం చేసిన కేంద్ర నిఘా వర్గాలు మీడియాతో సమన్వయం కోసం ఏర్పాటు చేసినవే కాకుండా సున్నితమైన ప్రతి వాట్సాప్ గ్రూపును క్షుణ్ణంగా సమీక్షించాలని సూచించాయి. వాటిలోని సభ్యుల వివరాలు సరిచూసుకోవాలని అప్రమత్తం చేశాయి.

ఏడు బ్లేడ్‌లు మింగిన ఆటోడ్రైవర్

'గాంధీ'లో విజయవంతంగా చికిత్స

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి వైద్యులు అరుదైన వైద్యసేవలను అందించి ఏడుబ్లేడ్‌లు మింగిన వ్యక్తికి పునర్జన్మను ప్రసాదించారు. డిప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ తెలిపిన మేరకు.. మౌలాలికి చెందిన రియాజుద్దీన్ పాషా (36) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 16న ఏడు బ్లేడ్‌లను మింగాడు. తీవ్రమైన కడుపునొప్పితో అదే రోజు గాంధీ అత్యవసర విభాగంలో అడ్మిట్ అయ్యాడు. పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి, ఎక్స్‌రే తీయగా కడుపులో ఏడు బ్లేడ్‌లు కనిపించాయి. సర్జరీ చేసి బ్లేడ్‌లు బయటకు తీయడం ప్రాణాపాయమని భావించిన వైద్యులు గ్యాస్ట్రోఎంట్రాలజీ ఎండోస్కోపీ ద్వారా ప్రయత్నించాలని నిర్ణయించారు. బ్లేడ్‌లు జీర్ణాశయంలో ఉండడంతో బయటకు తీసే క్రమంలో అన్నవాహిక ఇతర సున్నితమైన భాగాలకు గాయాలు అయ్యే అవకాశం ఉండడంతో ఎండోస్కోపీ పద్ధతిని విరమించుకున్నారు. లిక్విడ్ డైట్, ఐవీఫ్లూయిడ్స్, కడుపులోని ఆమ్లాలను తగ్గించే మందులు ఇచ్చి నిరంతరం అబ్జర్వేషన్‌లో ఉంచారు. ఈరకమైన వైద్యవిధానం సత్ఫలితాలు ఇచ్చింది. జీర్ణాశయంలో ఉన్న ఏడు బ్లేడ్‌లు మెల్లగా చిన్న ప్రేగుకు, అక్కడి నుంచి పెద్దపేగుకు చేరుకుని రెండు రోజుల తర్వాత మలద్వారం నుంచి వచ్చేలా చేశారు. పదునైన వస్తువులు మింగిన క్రమంలో జీర్ణాశయంతోపాటు ఇతర అవయవాలకు తగిలి అంతర్గతగాయాలు, రక్తస్రావం జరిగి ప్రాణాలకు ముప్పు ఉంటుందని, ఈ కేసులో ఎటువంటి ప్రమాదం జరగలేదని ప్రొఫెసర్ సునీల్‌కుమార్ వివరించారు. అరుదైన కేసులో అత్యంత ప్రతిభావంతమైన వైద్యసేవలు అందించి బాధితునికి పునర్జన్మ ప్రసాదించిన గాంధీ వైద్యులను సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎన్ రాజకుమారి అభినందించారు.

పెట్టుబడుల పేరుతో మోసం



నాగోలు పోలీసుల అదుపులో నిందితులు ఖాన్ రియాజ్, సురేష్

నాగోలు: పెట్టుబడుల పేరుతో ప్రజలను నమ్మించి డబ్బు కాజేస్తున్న ఇద్దరిని నాగోలు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. నాగోలు ఇన్‌స్పెక్టర్ తెలిపిన మేరకు.. చిత్తూరు జిల్లాకు చెందిన ఖాన్ రియాజ్(33) మణికొండలో నివాసముంటున్నాడు. చిక్కడపల్లికి చెందిన సురేష్(50)తో కలిసి నాగోలు చౌరస్తా వద్ద మామ మెటల్స్ పేరుతో కంపెనీని స్థాపించారు. తమ కంపెనీలో లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే రోజుకు రూ. 2 వేలు లాభం ఇస్తామని చెప్పారు. 100 రోజుల్లో డబ్బు రెట్టింపు అవుతుందని స్థానికులు వివరించారు. దుబాయ్ నుంచి బంగారం తెప్పించి తక్కువ ధరలో ఇస్తాం అంటూ ఆకర్షణీయమైన వాగ్దానాలతో అనేక మందిని నమ్మించారు. వారి మాటలు నమ్మిన స్థానికులు మామ మెటల్స్ కంపెనీలో పెట్టుబడి పెట్టారు. కొంతకాలంగా నిందితులు కనిపించకపోవడంతో మోసపోయిన బాధితులు నాగోలు పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ప్రజల నుండి దాదాపు కోటి రూపాయలు పెట్టుబడిగా వసూలు చేసినట్లు దర్యాప్తులో తెలినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

సహకార సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరిచందన

సాక్షి, సిటీబ్యూరో: మహిళా సహకార సంఘాలు, వీధి వ్యాపారులు సొసైటీలుగా ఏర్పాటైతే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ హరిచందన దాసరి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు. అన్ని రంగాలను సహకార రంగ పరిధిలోకి తీసుకువచ్చి విస్తరింపజేసి వారి ఆర్థిక బలోపేతానికి ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. వివిధ రంగాల్లో ఉన్నటువంటి వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. నూతనంగా మహిళా సహకార సంఘాలు, వీధి వ్యాపారస్తుల సహకార సంఘాలు, చౌక దుకాణాల సహకార సంఘాలు, సంఘాలను రిజిస్ట్రేషన్ చేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

మద్యం మత్తులో కారు నడిపిన వైద్యుడు

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడుపుతూ రోడ్డు ప్రమాదానికి కారకుడైన వైద్యుడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. సనత్ నగర్‌లో నివసించే కామగిరి అనీష్ (28) ఓ ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున మాసబ్‌ట్యాంక్ వైపు నుంచి బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1 మీదుగా మద్యం మత్తులో కారు నడుపుతూ సిటీ సెంట్రల్ మాల్ వద్ద ఫుట్‌పాత్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. డాక్టర్ అనీష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అనీష్‌ను అదుపులోకి తీసుకుని డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా మద్యం తాగినట్లుగా నిర్ధారణ అయ్యింది. కారును సీజ్ చేసి అనీష్‌పై కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గురువారం రాత్రి ఓ విందుకు హాజరై అక్కడ పీకలదాకా మద్యం సేవించి తెల్లవారుజామున మద్యం మత్తులో అదుపుతప్పిన వేగంతో దూసుకెళ్తున్నట్లుగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

27 వారాల చిన్నారికి ప్రాణం పోసిన వైద్యులు

సాక్షి, సిటీబ్యూరో: శిశువు వయస్సు కేవలం 27 వారాలు మాత్రమే.బరువు 504 గ్రాములు. దీంతో ఆ చిన్నారికి అపోలో క్రేడిల్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్ వైద్యులు ప్రాణం పోశారని డా. కే రాజసుబ్బారెడ్డి తెలిపారు. శిశువు గర్భంలో ఉన్నపుడే డాప్లర్ రీడింగ్స్‌లో తీవ్రమైన మార్పులు, రక్త ప్రసరణలో రివర్స్ ఫ్లో కనిపించడం వల్ల క్లిష్టమైన శస్త్రచికిత్స చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎన్ఐసీయూలో 61 రోజులు ఇంటెన్సివ్ కేర్లో ఉంచిన అనంతరం శిశువు 1.568 కిలోల బరువుతో పూర్తిగా నోటిద్వారా ఆహారం తీసుకునే స్థాయికి చేరుకుందన్నారు. అనంతరం డిశ్చార్జ్ చేశామని వివరించారు.

ఐదేళ్ల పీజీ కోర్సుల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు మొదటి విడత ఆన్‌లైన్ కౌన్సెలింగ్ షెడ్యూల్డును శుక్రవారం విడుదల చేశారు. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఫార్మషుటికల్ కెమిస్ట్రీ, ఎంఏ ఎకనామిక్స్ ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశానికి సీపీగేట్–2025 అర్హత సాధించిన అభ్యర్థులు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. ఈ నెల 25, 26 తేదీలలో పేర్లను రిజిస్ట్రేషన్, 28న వెరిఫికేషన్, 28, 29 వెబ్ ఆప్షన్స్, 30 ఎడిటింగ్, సెప్టెంబరు 1న సీట్లు సాధించిన అభ్యర్థుల జాబిత విడుదల, 3 వరకు కాలేజీల్లో రిపోర్టు, 5న రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పీసీగేట్–2025 కన్వీనర్ ప్రొ.పాండురంగా రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

వివిధ మార్గాల్లో 170 ప్రత్యేక రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: దసరా, దీపావళి, ఛాత్ పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణమధ్యరైల్వే పరిధిలో 170 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ప్రణాళికలను రూపొందించినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.సెప్టెంబర్ నుంచి నవంబర్ నెలాఖరు వరకు వివిధ మార్గాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఈ రైళ్లను ఏర్పాటు చేస్తారు.చర్లపల్లి–రెక్సాల్, చర్లపల్లి–తిరుపతి, చర్లపల్లి–వెలాంకిణి, తదితర ప్రాంతాల మధ్య ఈ రైళ్లు నడువనున్నాయి.

లారీని ఢీకొన్న బైక్: యువకుడి దుర్మరణం

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మామిడి కిశోర్ తెలిపిన మేరకు.. శంషాబాద్ ప్రాంతానికి చెందిన అర్బాజ్ ఖాన్ (24) ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్లాడు. స్నేహితులతో కలిసి మూడు ద్విచక్ర వాహనాలపై శంషాబాద్ నుంచి ఆరాంఘర్ వైపు ప్రయాణిస్తున్నారు. యూనివర్సిటీ ప్రధాన ద్వారం ప్రధాన బ్రిడ్జి వద్దకు రాగానే ముందు వెళుతున్న తమిళనాడుకు చెందిన లారీని ఓవర్ టేక్ చేస్తూ ఢీకొట్టాడు. అదుపు తప్పిన అర్బాజ్ ఖాన్ వెనుక చక్రాల కింద పడ్డాడు. వెనుక చక్రాల కింద పడటంతో లారీ అర్బాజ్ ఖాన్‌ను 10 మీటర్ల వరకు ఈడ్చుకెళ్లింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలకు గురైన అర్బాజ్ ఖాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని సోదరుడు జాఫర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మామిడి కిశోర్ తెలిపిన మేరకు.. బీరయ్య(26), శ్రావణిలు బుద్వేల్ ప్రాంతంలో నివాసముంటున్నారు. ప్రైవేటు జాబ్ చేసే బీరయ్య కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాడు. శుక్రవారం ఇంట్లో భార్య శ్రావణి వంట చేస్తుండగా గ్యాస్ అయిపోయింది. దీంతో బీరయ్య ఇదే ప్రాంతంలో ఉంటున్న అత్తగారింటికి వెళ్లి అన్నం అక్కడే వండుకొని రమ్మని భార్యకు తెలిపాడు. దీంతో భార్య శ్రావణి తల్లిగారింటికి వెళ్లింది. భార్య వెళ్లిన అనంతరం బీరయ్య ఇంట్లో దూలానికి నైలాన్ తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భోజనానికి వస్తానని చెప్పిన భర్త ఇంకా రాకపోవడంతో శ్రావణి ఇంటి వద్దకు వచ్చి చూడగా తలుపులు మూసి ఉన్నాయి. ఎంతకూ తెరవకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు పగలగొట్టి చూడగా ఉరేసుకొని ఉన్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచమానా నిర్వహించి ఉస్మానియా మార్చురీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఇద్దరి నిర్వాహకుల అరెస్టు

సనత్‌నగర్: వ్యభిచారం గృహంపై దాడి చేసి ఇద్దరు నిర్వాహకులతో పాటు ఒక విటుడిని సనత్ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. మరో యువతిని రిహబిలిటేషన్ సెంటర్‌కు పంపించారు. పోలీసులు తెలిపిన మేరకు.. కడప జిల్లా అరవీడు కూర్మయ్యగారిపల్లికి చెందిన పల్లపు నరేష్ (34) నగరానికి వలస వచ్చి మూసాపేట భవానీ నగర్‌లో ఉంటున్నాడు. చిత్తూరు జిల్లాకు చెందిన కొండా నాగరాజు (51)తో కలిసి అద్దెకు తీసుకున్న ఇంటిని వ్యభిచార గృహంగా మార్చి రెండు నెలలుగా యువతులతో వ్యభిచారం చేయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సనత్‌నగర్ పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించగా నరేష్, నాగరాజులతో పాటు మూసాపేట రాఘవేంద్రకాలనీకి చెందిన గుణశేఖర్ (26) అనే విటుడిని అరెస్టు చేశారు. అలాగే మరో యువతిని పునరావాస కేంద్రానికి తరలించారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

తొలిపూజకు గవర్నర్‌కు ఆహ్వానం


గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: ఖైరతాబాద్ బడా గణేశ్ తొలి పూజకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో పాటు ఉత్సవ కమిటీ నిర్వాహకులు శుక్రవారం ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. 11 రోజుల పాటు జరిగే ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ మేళా కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు. శ్రీగణేష్ ఉత్సవ సమితి చైర్మన్ రాజ్‌కుమార్, అధ్యక్షులు మహేష్‌యాదవ్, రామిరెడ్డి, అశోక్‌కుమార్, కృష్ణయాదవ్, గజ్జల నగేష్, చందు, విశాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



వెంగళరావునగర్: జీటీఎస్ కాలనీలోని శ్రీవీరాంజనేయ భవానీ శంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచే పూజాది కార్యక్రమాలను ప్రారంభించారు. 9.30కు రాజశ్యామలా హోమం, అనంతరం వారాహి హోమం జరిగింది. మధ్యాహ్నం ఒంటిగంటకు పూర్ణాహుతి, నీరజన మంత్రపుష్పం, భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గుమ్మడిదల సుధాకర్ పర్యవేక్షించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో రహమత్‌నగర్, వెంగళరావునగర్, జీటీఎస్ కాలనీ, రాజీవ్‌నగర్‌కాలనీ, కళ్యాణ్‌నగర్‌కాలనీ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

ఘనంగా తీజ్ సంబురాలు


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఖైరతాబాద్: లంబాడాలు ఘనంగా నిర్వహించే తీజ్ సంబరాల సందర్భంగా శుక్రవారం నిజాం కాలేజీ బంజారా యూనియన్ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు తుల్జాభవానీ, సేవాలాల్ మహారాజ్‌లను పూజిస్తూ బుట్టలో గోధుమలను మొలకలు వచ్చే వరకు పెంచి వాటిని పూజించి హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేశారు. తీజ్ సంబరాల సందర్భంగా విద్యార్థినీవిద్యార్థులు గోధుమ మొలకలను పట్టుకొని సంప్రదాయ లంబాడా దుస్తులు ధరించి ర్యాలీగా తరలివెళ్లి హుస్సేన్ సాగర్‌లో మొలకలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నిజాం కాలేజ్ బంజారా యూనియన్ విద్యార్థులు స్వప్న, స్వాతి, బిందు, విజయ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖబరస్థాన్‌కు స్థలం కోసం ముస్లింల నిరసన



రహమత్‌నగర్: ఖబరస్థాన్ కోసం స్థలం కేటాయించాలని బోరబండ ముస్లింలు శుక్రవారం శాంతియుతంగా నిరసన తెలిపారు. స్వరాజ్‌నగర్ మహ్మదీయ జమా మసీదు, ఎస్ఆర్‌టీనగర్ మసీద్ ఏ మేరాజ్, మసీద్ ఏ అమీనా అబ్దుల్లా నసీర్ అజమ్‌నగర్, మసీద్ ఏ ఇబ్రహీం గల్షానీ, సైట్–3, మసీద్ ఏ ఖైర్, హనీషా మసీదు, హమ్జ మసీదు తౌహీద్ మసీదు, ఇలాహీ మసీదు కమిటీల ప్రతినిధులు శుక్రవారం ప్రార్థనల అనంతరం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బోరబండ డివిజన్‌లో ఖబరస్థాన్‌లు లేక ముస్లింలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

నాలాల నుంచి భారీగా చెత్త తొలగింపు

బంజారాహిల్స్: ఇటీవల వర్షాలకు పెద్ద ఎత్తున వరద నిలిచిపోయి నాలాలన్నీ బురద వ్యర్థాలతో నిండిపోయాయి. దీంతో రెండు రోజుల నుంచి వర్షాలు తెరిపినివ్వడంతో హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు రంగంలోకి దిగాయి. జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో హైడ్రా మాన్సూన్ టీమ్‌లు నాలాల్లో బురదతో పాటు చెత్తను, వ్యర్థాలు పెద్ద ఎత్తున తొలగిస్తున్నారు. గత రెండు రోజుల నుంచి భారీగా కొట్టుకువచ్చిన చెత్తను, మట్టిని తొలగించారు. జేసీబీల సహాయంతో నాలా రిటైనింగ్ వాల్ దగ్గర పేరుకుపోయిన మట్టి, వ్యర్థాలు తొలగించారు. టోలిచౌకి ప్రాంతంలోని బుల్కాపూర్ నాలాతో పాటు గౌరీశంకర్‌బస్తీలో నాలాల క్లీనింగ్ దాదాపు పూర్తయ్యింది. హకీంపేట కుంట, పారామౌంట్ కాలనీ ప్రాంతాల్లో నాలాల్లో పెద్ద ఎత్తున డీసిల్టింగ్ చేపట్టారు.

పోలీసులపై 'గణేశ్' బాధ్యతలు.. అన్నీ మీరే చేయాలి..!

- గుంతలు పడినా.. చెట్ల కొమ్మలు అడ్డొచ్చినా..
- పోలీసులే దగ్గరుండి పరిష్కారం చూపుతున్న వైనం
- జీహెచ్ఎంసీ ఇంజనీర్లను వేడుకుంటున్న పోలీసులు
- ఎప్పటికప్పుడు చెట్ల కొమ్మలు తొలగించడమూ వీరి పనే..
- జీహెచ్ఎంసీ చేయాల్సిన పనులన్నీ పోలీసుల భుజాల పైనే..


బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12 ప్రధాన రోడ్డులో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: వినాయక చవితి పర్వదినం సమీపిస్తుండగా గణేశ్ నవరాత్రి మహోత్సవాలకు ప్రజలు సిద్ధమవుతున్నారు. వాడవాడలా వినాయక మండపాల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. శ్రావణ మాసం మంచి రోజులు కావడంతో వారం రోజులుగా నిర్వాహకులు విగ్రహాలను మండపాలకు తరలిస్తున్నారు. ఇంకోవైపు మండపాల వద్ద కర్ర పూజలు కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే వినాయక విగ్రహాలను మండపాలకు తరలించడం, నవరాత్రుల అనంతరం నిమజ్జన శోభాయాత్ర నిర్వహించడం వంటి కీలక పరిణామాలు ఉంటుండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు.

◆ జీహెచ్ఎంసీ, హైడ్రా యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్న నేపథ్యంలో పోలీసులు కళ్లు తెరిచారు. రామంతాపూర్, అంబర్‌పేట ఘటనల నేపథ్యంలో పోలీసులు మేల్కొని ముందుజాగ్రత్త చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే గడచిన వారం రోజులుగా అటు గణేశ్ మండపాల నిర్వాహకులతో, ఇటు శాంతి కమిటీలతో ముమ్మరంగా సమావేశాలు ఏర్పాటుచేస్తున్నారు. ఇంతటితో సరిపెట్టకుండా జీహెచ్ఎంసీ చేయాల్సిన పనులను పోలీసులే దగ్గరుండి చేయిస్తున్నారు.

◆ వెస్ట్‌జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్, పంజగుట్ట, మధురానగర్, బోరబండ, ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు ప్రతి రోజూ తమ సెక్టార్ల పరిధిలోని రోడ్లపై గుంతలను గుర్తించాల్సి ఉంటుంది. ఎక్కడ రోడ్లపై గుంతలు ఉన్నాయో ఆ ఫొటోలను తీసి జీహెచ్ఎంసీ ఇంజనీర్లతో సమన్వయం చేసుకుని ఆ గుంతలను పూడ్పించాల్సి ఉంటుంది. వినాయక విగ్రహాల తరలింపులోనూ, శోభాయాత్రలోనూ గుంతల్లో లారీ చక్రాలు పడితే విగ్రహం కిందపడి భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉండడంతో ముందుగా గుంతలు పూడ్చించే పనిని పోలీసులు భుజాలకెత్తుకున్నారు. స్థానిక జీహెచ్ఎంసీ ఏఈ వర్క్ ఇన్‌స్పెక్టర్లను బతిమలాడుతూ గుంతలను పూడ్చండి మహాప్రభో..! అంటూ వేడుకుంటున్నారు.

◆ విగ్రహాల తరలింపులోనూ, నిమజ్జన యాత్ర సందర్భంగా చెట్ల కొమ్మలు అడ్డుపడి విగ్రహాల తలభాగం దెబ్బతినడమే కాకుండా భక్తులకు చెట్ల కొమ్మలు తగిలి దెబ్బలు తగిలే ప్రమాదం ఉండడంతో ఎక్కడెక్కడ విగ్రహాలకు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నాయో స్థానిక పోలీసులు వాటిని గుర్తించి ఫొటోలు తీసి జీహెచ్ఎంసీ ట్రీ కటింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకుని వాటిని కట్ చేయిస్తున్నారు. శుక్రవారం నుంచి పోలీసులు దగ్గరుండి విగ్రహాలకు అడ్డు వచ్చే చెట్ల కొమ్మలను గుర్తించి వాటిని కట్ చేయిస్తున్నారు.

◆ వినాయక విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా కరెంటు వైర్లు ఎక్కడైనా వేలాడుతూ ఉంటే వాటిని పోలీసులే గుర్తించాల్సి ఉంటుంది. సంబంధిత విద్యుత్ అధికారులతో సమన్వయం చేసుకుని ఆ తీగలను వేలాడకుండా సక్రమంగా ఉండేలా చూడాల్సి ఉంది.

◆ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ ఎక్కడెక్కడ పొంగి పొర్లుతున్నాయో, మ్యాన్‌హోల్ మూతలు ఎక్కడెక్కడ తెరిచి ఉన్నాయో, పోలీసులు వాటిని గుర్తించి ఫోటోలు తీసి జలమండలి అధికారులకు పంపించి సిబ్బందిని పిలిపించి సమస్యను పరిష్కరించాల్సి ఉంటుంది.

◆ రోడ్డుకు అడ్డుగా, పైనుంచి వేలాడుతున్న కేబుల్ వైర్లు ఎక్కడెక్కడ ఉన్నాయో వాటిని గుర్తించి సంబంధిత సిబ్బందిని పిలిపించి వాటిని తొలగిస్తున్నారు.

◆ భారీ వర్షాల నేపథ్యంలో వరదనీరు నిలిచే వాటర్ లాగింగ్ పాయింట్ల వివరాలు పోలీసులు నమోదు చేసుకుని వివరాలను జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులకు పంపించి సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉంటుంది.

◆ కట్ చేసిన చెట్ల కొమ్మలను, కేబుల్ వైర్లను, వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తరలించేలా సంబంధిత సిబ్బందితో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పోలీసులే తరలించాల్సి ఉంటుంది. బీఫ్ షాపులు, మటన్, చికెన్ విక్రయాల షాపులు ఎక్కడెక్కడ ఉన్నాయో పోలీసులు గుర్తించి నవరాత్రుల్లో వారికి బ్లాక్ కవర్లు అందజేస్తూ మాంసం వ్యర్థాలను అందులోనే భద్రపరిచి స్వచ్ఛ ఆటోకు ఇచ్చేదాకా పోలీసులదే బాధ్యత.

◆ ఇలా జీహెచ్ఎంసీ, జలమండలి, హైడ్రా అధికారులు, సిబ్బంది కార్యాలయాలు, ఇళ్లల్లో నిద్రపోతుంటే, పోలీసులు మాత్రం వారు చేయాల్సిన పనులన్నీ భుజాలకెత్తుకుని వారిని రిక్వెస్ట్ చేస్తూ వారు చేయాల్సిన పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

◆ పోలీసులే జీహెచ్ఎంసీ, విద్యుత్, జలమండలి, హైడ్రా, రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని సమన్వయం చేసుకుంటున్నారు.

24 నుంచి మట్టి గణేశ్ విగ్రహాల పంపిణీ



బంజారాహిల్స్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణహిత మట్టి గణపతుల విగ్రహాల పంపిణీకి ఈ సారి కూడా హెచ్ఎండీఏ సిద్ధమైంది. ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో గుర్తించిన కేంద్రాల్లో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని హెచ్ఎండీఏ అధికారులు చేపట్టనున్నారు.

పంపిణీ చేయనున్న కేంద్రాలివే..

- జూబ్లీహిల్స్ సైలెంట్ వ్యాలీహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ కేంద్రం
- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లోని ఐఏఎస్, ఐపీఎస్ క్వార్టర్స్
- బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ప్రధాన ద్వారం
- గ్రీన్‌ల్యాండ్స్‌లోని హిందూ న్యూస్ పేపర్ కార్యాలయ సమీపంలో...
- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్
- బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం.
- జూబ్లీహిల్స్ టూప్స్ రెస్టారెంట్ వద్ద
- జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ దేవాలయం వద్ద
- అమీర్‌పేట మైత్రీవనం స్వర్ణ జయంతి హెచ్ఎండీఏ కార్యాలయంలో...
- ట్యాంక్‌బండ్ వద్ద
- సెక్రటేరియట్ ముందు
- ఎన్టీఆర్ గార్డెన్ ఎదుట
- బేగంపేట కుందన్‌బాగ్ ఐఏఎస్‌కాలనీ
- నారాయణగూడ మెల్కోటే పార్కు.

నూతన సీవరేజి లైన్‌కు ప్రతిపాదనలు


గౌరీశంకర్ కాలనీ బస్తీలో పర్యటిస్తున్న జీఎం ప్రభాకర్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌రోడ్ నెం 10లోని గౌరీ శంకర్ కాలనీ బస్తీలో వర్షం వచ్చిన ప్రతిసారి సీవరేజి లైన్లు నిండిపోయి కిందున్న బస్తీలోకి మురుగు నీరు ఓవర్ ఫ్లో అవుతున్నది. స్థానికుల ఈ సమస్యను జలమండలి జీఎం ప్రభాకర్ దృష్టికి తీసుకురావడంతో ఆయన గురువారం మేనేజర్ శివకుమార్‌తో కలిసి ఇక్కడ పర్యటించారు. రామాలయం వద్ద ఉన్న లైన్ పాతది కావడంతో పాటు సామర్థ్యం సరిపోవడం లేదనే అందువల్లే ఈ సమస్య ఉత్పన్నమవుతున్నదని త్వరలోనే ఇక్కడ నూతన లైన్ మంజూరు చేస్తామని ఆయన అన్నారు. వచ్చే నెల మొదటి వారంలో 300 మీటర్ల మేర 200 డయా సామర్థ్యంతో మురుగు నీటి లైన్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన అనానరు. మురుగు సమస్యపరిష్కారానికి కృషి చేస్తామని బస్తీవాసులకు ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మురుగు వల్ల పడుతున్న ఇబ్బందులను బస్తీవాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

అలరించిన మిలాంజ్ కల్చరల్ ఫెస్ట్





బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని మెరిడియన్ స్కూల్‌లో గురువారం మిలాంజ్–2025 ఇంటర్ స్కూల్ లిటరరీ, కల్చరల్ ఫెస్ట్ ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. నగరంలోని 35 పాఠశాలల నుంచి 800 మందికి పైగా విద్యార్థులు ఈ కాంపిటీషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు పాటలు, ఆటలు, రచనలు, నాటికలు, గేయాలు, కూచిపూడి, భరతనాట్యం, వెస్ట్రన్ డ్యాన్స్‌లు, అందాల పోటీలు, ఫేస్ ఆర్ట్‌తో పాటు పలు పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ ఇంటర్ స్కూల్ కాంపిటీషన్ నిర్వహించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ పూనంజా అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రహత్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

తాజ్ కృష్ణలో ఆకృతి ఎగ్జిబిషన్

సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో ఆకృతి ఫెస్టివల్ స్పెషల్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



బస్తీల అభివృద్ధికి కృషి


అంజన్‌కుమార్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న బస్తీవాసులు

శ్రీనగర్‌కాలనీ: బస్తీల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకుసాగుతోందని, ఆదర్శంగా బస్తీలు, కాలనీలు చేస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ శాస్త్రీనగర్‌లో బస్తీవాసులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. బస్తీకమిటీ పెద్దలు బస్తీలోని సమస్యల గురించి వినతిని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, పథకాలను చూసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పార్టీని గెలిపించాలని కోరారు. యూసుఫ్‌గూడ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని కృష్ణానగర్‌లో నిర్వహించారు. బస్తీ ప్రెసిడెంట్ బాలరాజు, జ్యోతిబాయి, నర్సింగరావు, మోసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కూటములు బీసీలను మోసం చేశాయి'

పంజగుట్ట: వర్షాకాలం పార్లమెంట్ సమావేశాలు సెలవులు మినహాయిస్తే 21 రోజులు జరిగాయని అందులో బీసీ రిజర్వేషన్‌ల అంశం ఒక్కసారి కూడా చర్చకు రాకపోవడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రశ్నించాల్సిన ఇండియా కూటమి ప్రశ్నించలేదని, చేయాల్సిన ఎన్‌డీఏ కూటమి చెయ్యలేదని రెండు కూటములు బీసీలకు అన్యాయం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రం బృందం 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఆగస్టు 27 నుంచి డిసెంబర్ 27 వరకు నిర్వహించనున్న 33 జిల్లాల పర్యటన పోస్టర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. సమావేశంలో రమేష్, సి.హెచ్.సునీల్, శ్రీనివాస్, రాజన్న, భీంరావు, వెంకట్ గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బోరబండలో కాంగ్రెస్ సత్తాచాటాలి

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి త్వరలో జరగనున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం పార్టీ శ్రేణులంతా శ్రమించి సత్తా చాటాలని రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణి, నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వ విజయ్‌బాబు పిలుపునిచ్చారు. బోరబండ డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌తో కలిసి వారు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన బూత్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ఆరు గ్యారంటీ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అశోక్, నగర నాయకుడు కాసుల మహేష్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


మహమ్మద్ అఖిల్

బంజారాహిల్స్: కిరాణా దుకాణానికి వెళ్లిన ఓ వృద్ధుడు ఇంటికి తిరిగిరాని సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... వెంకటగిరి హైలాం కాలనీకి చెందిన మహ్మద్ అఖిల్ ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4.30 గంటల సమయంలో స్థానికంగా ఉండే కిరాణాషాపునకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ప్రయోజనం లేదు. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు


జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు


పూజలు చేస్తున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం కావడంతో అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మతల్లిని దర్శించుకునేందుకు నగర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయంతో పా టు ఆలయానికి దారితీసే మార్గాలన్నీ కిటకిటలాడాయి.ఫిలింనగర్ రోడ్ నెం. 1లోని శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయంలో అమ్మవారి కి అర్చకులు పంచామృతాలతో అభిషేకం అనంతరం పుష్పాభిషేకం చేశారు.

తుమ్మలబస్తీలో కార్పొరేటర్ విజయారెడ్డి...

పంజగుట్ట: ఖైరతాబాద్ మహిళా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో తుమ్మలబస్తీలో సంఘం కార్యాలయంలో శ్రావణ శుక్రవారం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మహిళా నేతలు విజయారెడ్డికి పసుపు, కుంకుమ ఇచ్చారు. కార్యక్రమంలోసంఘం అధ్యక్షురాలు సునిత, తులసి, లావణ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలని వినతి

వెంగళరావునగర్: పలు ప్రాంతాల్లో అధ్వానంగా తయారైన సీసీ రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు నిర్మించాలని మధురానగర్‌కాలనీ నేతలు జీహెచ్ఎంసీ ఉప కమిషనర్‌ను కోరారు. మధురానగర్‌కాలనీ సంక్షేమ సంఘం నేతలు శుక్రవారం యూసుఫ్‌గూడ జీహెచ్‌హెంసీ సర్కిల్–19 కార్యాలయానికి వెళ్లి డీఎంసీ రజినీకాంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు ఎస్.వి.మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ హనుమంతరావు, కోశాధికారి సుగుణ పాల్గొన్నారు.



స్థూలఖాయం

నగరంలో పెరుగుతున్న ఒబెసిటి సమస్య

నగరం బరువెక్కుతోంది.. స్థూలకాయంతో బాధపడేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఓవైపు పని ఒత్తిడి, మరోవైపు డిప్రెషన్ దీనికి తోడు పోషకాహార లోపం ఇవన్నీ క్రమంగా నగరవాసులను రోగాలవైపు నెడుతున్నాయి. ఫలితంగా నగరవాసుల శరీరాకృతుల్లో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని, తద్వారా ఒబెసిటీతో బాధపడుతున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. ముఖ్యంగా మహిళల్లో ఈ పోషకాహార లోపం మరీ ఎక్కువగా ఉంది. దీంతో అలసట, కీళ్ల నొప్పులు, చిరాకు వంటి సమస్యలతో బాధపడుతున్నారని ఇటీవల నగరంలో నిర్వహించిన వెయిట్ గెయిన్ ట్రెండ్స్ సర్వే వెల్లడిస్తోంది. ఈ కారణంగా బీపీ, షుగర్ వంటి ఇతర రోగాలు చుట్టుముడుతున్నాయని, ఆహారపు అలవాట్లు కూడా దీనికి ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.. - సాక్షి, సిటీబ్యూరో

ఓవైపు పని ఒత్తిడి, మరోవైపు డిప్రెషన్

బీపీ, షుగర్ వంటి రోగాలతో అవస్థలు

వెంటాడుతోన్న పోషకాహార లోపం

శరీరాకృతుల్లోనూ భారీగా మార్పులు

మహిళల్లో అలసట, కీళ్ల నొప్పులు, చిరాకు

వెయిట్ గెయిన్ ట్రెండ్స్ సర్వేలో వెల్లడి



చుట్టూ ఎత్తయిన భవనాలు.. అద్దాల మేడలు.. ఖరీదైన కార్లు.. అత్యాధునిక వసతులు. చూడ్డానికి విలాసవంతమైన జీవితం.. అంతా బానే ఉందిగా!.. ఇది నాణేనికి ఓ వైపు మాత్రమే.. వాస్తవానికి అవతలవైపు చూస్తే.. ఉరుకుల పరుగుల జీవనం, నిత్యం పని ఒత్తిడి, తీరికలేని జీవితం, ఆందోళన, డిప్రెషన్, ఉద్యోగ భద్రత గురించిన ఆలోచన, లోన్లు, ఈఎంఐల భయాలు, నెలవారీ ఖర్చులు, లక్షల్లో పిల్లల ఫీజులు, నెలాఖరుకు జీరో బ్యాలెన్స్ అకౌంట్లు ఇది సగటున నగర జీవిని వేధిస్తోన్న ప్రధాన సమస్య.. ఫలితంగా ఒత్తిడికి లోనై కంటికి కనిపించని రోగాలైన బీపీ, షుగర్ వంటి ఆరోగ్య సమస్యలతో నిత్యం యుద్ధం చేస్తున్నాడు.

సర్వే చెబుతోందేంటి?

హైదరాబాద్ టెక్ రంగంలో ప్రపంచ దేశాలకు సేవలందిస్తోంది. ఐటీ కారిడార్, చుట్టూ పరిసర ప్రాంతాలు పది కిలో మీటర్ల పరిధిలో కిమ్స్ ఆస్పత్రి నిర్వహించిన వెయిట్ గెయిన్ ట్రెండ్స్ సర్వేలో ఆశ్చర్యకరమైన అంశాలు వెలుగు చూశాయి. 18 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వయసు గల 6 వేల మంది ఆరోగ్య సమాచారాన్ని పరిశీలించగా అందులో ఉద్యోగుల్లో 45 శాతం మంది డిప్రెషన్‌లో ఉంటున్నారట. ఆందోళన, భయం, యాంగ్జైటీతో బాధపడుతున్నారని తేలింది. మరో వైపు ఇంటి పట్టునే ఉంటున్న వ్యక్తులు మధుమేహం, రక్త పోటుతో నిత్యం ఇబ్బంది పడుతున్నారట. ఆపై ఉబకాయం, డయాబెటిస్, రక్తపోటు, లివర్ సమ్యలు, థైరాయిడ్, పీసీఓడీ వంటి రోగాలతో నిత్యం సతమతమవుతున్నారని స్పష్టమవుతోంది. మహిళల్లో అత్యధికంగా ఉబకాయం, కీళ్ల నొప్పులు, ఇల్‌నెస్ వంటి సమస్యలు వేధిస్తున్నాయి. 35 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కుల్లో ఎక్కువ మంది ఉపవాసం (ఫాస్టింగ్) చేస్తున్నారు. మరికొంత మంది సిక్స్‌ప్యాక్, జీరోప్యాక్, స్లిమ్ అంటూ ఎక్కువ సమయం జిమ్‌లో కాలం గడుపుతున్నారు. ఆహారానికి బదులుగా ప్రొటీన్, ఇతర సప్లిమెంట్స్ తీసుకుంటున్నారు. దీంతో అనర్థాలు తలెత్తుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.







వ్యాయామం అవసరం..

ఇటీవల కాలంలో కార్డియాక్ అరెస్ట్ సంఘటనలను దృష్టిలో ఉంచుకుని అవసరం మేరకు మాత్రమే వ్యాయామం చేయడం మంచిదని సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆహారపు అలవాట్లలో మార్పులు అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. ఊబకాయంతో బాధపడుతున్న వ్యక్తులు వారం రోజుల్లో 6 కేజీల వరకూ తగ్గే అవకాశాం ఉంది. అయితే ఒకేసారి మొత్తం బరువు తగ్గిపోవాలని అనుకోవడం మంచిది కాదు. వెయిట్ లాస్ కోసం వ్యాయామంతో పాటే వివిధ రకాల శస్త్రచికిత్సలు, అధునాతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని, ఇవి దీర్ఘకాలంలో సత్ఫలితాలను అందిస్తాయంటున్నారు.

లైఫ్ స్టైల్‌లో మార్పులు..


టెక్ కంపెనీలు, అనుబంధంగా పనిచేస్తున్న రంగాల్లో ఎక్కువ మంది ఉద్యోగులు మిడ్ షిఫ్ట్, పూర్తిగా నైట్ షిఫ్ట్ పద్ధతుల్లో రాత్రి విధుల్లో ఉంటున్నారు. దీనికి తోడు నిత్యం టార్గెట్లతో విపరీతమైన ఒత్తిడిలో విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు గ్యాడ్జెట్స్‌కు అతుక్కుపోతున్నారు. కొంత మంది పగలు నిద్ర పోదామన్నా పరిస్థితులు అనుకూలించడం లేదని అంటున్నారు. కనీసం 7 గంటలు నిద్రపోవాల్సి ఉన్నా డీప్ స్లీప్ రెండు నుంచి మూడు గంటలే ఉంటుందని చెబుతున్నారు. సరైన నిద్ర లేకపోవడం మరిన్ని సమస్యలకు దారితీస్తుంది. తీసుకునే ఆహారంలోనూ పాశ్చాత్య రుచులకు అలవాటుపడి పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. చైనీస్, కొరియన్, అమెరికన్ స్టైల్ ఆహారానికి ఎక్కువ మంది ఆకర్షితులవుతున్నారు. పోషకాల లోటును భర్తీ చేయడం కోసం వివిధ రకాల ప్రొటీన్, ఇతర పౌడర్లను తీసుకుంటున్నారు. ఫలితంగా శరీరంలోని కెమికల్ ఇంబ్యాలెన్స్ ఏర్పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



హమారే రామ్ థియేట్రికల్ ప్రదర్శన..

- శిల్పకళా వేదికగా బాలీవుడ్ ఇతిహాసం
- కైలాష్ ఖేర్, శంకర్ మహదేవన్, సోను నిగమ్ స్వర-సాహిత్య వెల్లువ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని శిల్పకళా వేదికగా ప్రముఖ థియేటర్ సంస్థ ఫెలిసిటీ థియేటర్ ఆధ్వర్యంలో ఇతిహాస ప్రధానాంశంగా మాగ్నమ్ ఓపస్ ప్లే 'హమారే రామ్' ప్రదర్శించనున్నారు. గౌరవ్ భరద్వాజ్ దర్శకత్వం వహించిన ఈ మాగ్నమ్ ఓపస్‌లో భాగంగా.. రామాయణం నుంచి అపురూపమైన దృశ్యాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30, 31 తేదీల్లో ప్రదర్శించనున్న ప్రదర్శనలో బాలీవుడ్ ప్రముఖులు మినరీ అషుటోష్ (రావన్), నటుడు రాహుల్ ఆర్ భువర్ (రాముడు), హర్లీన్ కౌర్ రేఖి (సీత), డానిష్ అక్తర్ (హనుమాన్ పాత్రలో), తారూన్ ఖన్నా (శివుడు) తదితర సెలబ్రిటీలు భాగస్వామ్యం కానున్నారు. నగరంతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో ఇదే థియేట్రికల్ ప్రదర్శనలు పూర్తి చేశామని ఫెలిసిటీ థియేటర్ నిర్మాత రాహుల్ భుచర్ పేర్కొన్నారు. ఈ ప్రదర్శనకు సంగీత ప్రముఖులు కైలాష్ ఖేర్, శంకర్ మహదేవన్, సోను నిగమ్ హైటెక్ విఎఫ్ఎక్స్ మ్యాజిక్‌తో స్వర-సంగీతాన్ని అందించనున్నారు. హమారే రామ్ రామాయణం వంటి చెప్పలేని కథలను ప్రత్యేకంగా ప్రదర్శిస్తుందని అన్నారు.




నేడు నాద్ నీడ్ దశాబ్ద ఉత్సవం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సాంస్కృతిక వేదికగా పేరొందిన రవీంద్రభారతి మరో ప్రత్యేక ప్రదర్శనకు సిద్ధమవుతోంది. నాద్ నీడ్ డ్యాన్స్ స్టూడియో పదేళ్ల కళా ప్రస్థానాన్ని శనివారం ఘనంగా జరుపుకోనుంది. ఇందులో భాగంగా 75 మందికి పైగా శిక్షణ పొందిన నర్తకులు ఒకే వేదికపై ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా కథల రూపంలో అందించే నృత్య ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలువనుందని నిర్వాహకులు తెలిపారు. కథలు, ఇతిహాసాలతో పాటు 'భక్త శల బేగ కథ' వంటి ప్రత్యేక నృత్య రూపకాలను ప్రదర్శించనున్నారు. కళలు, సంప్రదాయం, ఆధ్యాత్మికత కలగలిపి ఒకే వేదికపై సదర్శకులను అలరించనుందని తెలిపారు.

టెక్ ఎక్స్‌పెడైట్‌లో ఎంపికైన సిటీ స్టార్టప్స్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సాంకేతిక ఉత్పత్తుల సంస్థ గేమ్స్ 24/7, స్టార్టప్స్‌కు మద్దతు అందించే ప్రత్యేక యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ 'టెక్‌ఎక్స్‌పెడైట్'ను మరోసారి ప్రకటించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. కీలకమైన ఏఐ, గేమింగ్, స్పోర్ట్స్‌లలో నైపుణ్యాలను వృద్ధి చేసుకునేందుకు వీలుగా రూపుదిద్దిన 90రోజుల కార్యక్రమం 'టెక్‌ఎక్స్‌పెడైట్'లో పాల్గొని నగరానికి చెందిన బీ ఏబుల్ హెల్త్, హోమ్ గ్రౌండ్ అనే స్టార్టప్స్ ఎంపికయ్యాయని, ఈ నేపథ్యంలో మరోసారి ఈ కార్యక్రమం కోసం నగర స్టార్టప్‌ల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. దరఖాస్తుల గడువు వచ్చే సెప్టెంబర్ 19గా తెలియజేశారు.

హారియర్ ఈవీ క్వాడ్ డే..



- హిల్ స్టేషన్‌లో కార్ డ్రైవింగ్ నైపుణ్యాలపై శిక్షణ..
- నేడు, రేపు జింఖానా గ్రౌండ్‌లో క్వాడ్ డే..
- నగర ఔత్సాహికులకు ఉచిత రిజిస్ట్రేషన్

సాక్షి, సిటీబ్యూరో: ఈ తరం కార్ లవర్స్‌కు లాంగ్ డ్రైవ్ వెళ్లడం చాలా ఇష్టం. స్టైలిష్‌గా డ్రైవ్ చేయడం కూడా ట్రెండ్‌గా భావిస్తుంటారు. కానీ సురక్షితంగా డ్రైవ్ చేయడం, ముఖ్యంగా హిల్ స్టేషన్, మడ్ డ్రైవింగ్‌లో మెళకువలు, నైపుణ్యాలు తప్పనిసరి. దీనికి సంబంధించి నగరంలోని జింఖానా గ్రౌండ్ వేదికగా నేడు, రేపు (23, 24 తేదీల్లో) డ్రైవింగ్ పై అవగాహన కల్పించనున్నారు. దేశంలో అతిపెద్ద 4-వీలర్ ఈవీ సంస్థ టాటా మోటార్స్ ఆధ్వర్యంలో 'హారియర్ ఈవీ క్వాడ్ డే' నిర్వహిస్తున్నారు. నగరంలోని ఫోర్ వీలర్ ఆటోమొబైల్ ఔత్సాహికులు ఎవరైనా ఈ క్వాడ్ డేలో పాల్గొని అవగాహన పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. హారియర్ ఈవీ క్వాడ్ డేలో పాల్గొనదలచిన నగర ఔత్సాహికులు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ క్వాడ్ డేలో పాల్గొనదలచినవారు స్థానిక టాటా మోటార్స్ డీలర్ షిప్‌ను సందర్శించి నమోదు చేసుకోవచ్చు. లేదా https:// forms. gle/ CKSo2 AJ2 kPwAxavr6 ఈ లింక్‌పై క్లిక్ చేసి రిజిస్టర్ చేసుకోవచ్చని నిర్వాహకులు వివరించారు.

నేడు నేచర్ క్యాంప్



గచ్చిబౌలి: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నేచర్ క్యాంప్, బర్డ్స్ వాక్ నిర్వహిస్తున్నట్లు ఎకో-టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రంజిత్ నాయక్ తెలిపారు. మంచిరేవులలోని ఫారెస్ట్ ట్రెక్‌పార్క్‌లో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఆదివారం ఉదయం పది గంటల వరకూ నేచర్ క్యాంప్ నిర్వహించనున్నారు.

- ఇందులో టీం బిల్డింగ్, టెంట్ పిచింగ్, నోక్టర్నల్ వాక్, నైట్ క్యాంపింగ్, క్యాంప్ ఫైర్, ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 9.30 గంటల వరకూ ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో బర్డ్‌వాక్ నిర్వహిస్తామని తెలిపారు. వృక్షాల్లో ఏ రకమైన పక్షులు గూళ్లు కడతాయి, ఎలా ఎగురుతాయి, ఆహారపు అలవాట్లు, ఏ రకమైన వాతావరణంలో ఏరకమైన పక్షులు ఉంటాయో నేచరిస్టులు వివరిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు 73823-07476, 94935-49399 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



పోర్టు నుంచి పర్వతారోహణకు

- మౌంట్ ఎల్బ్రాస్ అధిరోహించిన నగరవాసి
- పోర్టు సెక్టార్‌లోనే అరుదైన రికార్డు సొంతం
- 79 మీటర్ల జాతీయ పతాకాలు ఆవిష్కరణ

ఆయనో పోర్ట్ అధికారి.. ఎవరెస్ట్ సహా ప్రపంచంలోని ఏడు ఖండాల్లోని ఎత్తయిన పర్వత శిఖరాలను అధిరోహించాలనుకున్నాడు.. దీనిని సెవెన్ సమ్మిట్ ఛాలెంజ్ మిషన్ అని కూడా అంటారు.. ఇందులో తొలి మిషన్‌గా మౌంట్ ఎల్బ్రాస్ అధిరోహణను పరిగణిస్తారు.. ఈ నెల 7న ముంబై నుంచి ఈ సాహస యాత్రకు బయలుదేరాడు. ఆయనే నగరానికి చెందిన ప్రణయ్. దాదాపు పదేళ్లుగా ముంబై పోర్ట్ అథారిటీలో సీనియర్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీ చైర్మన్ సుశీల్ కుమార్ సింగ్ 79 మీటర్ల పొడవైన జాతీయ జెండాతో పాటు పోర్టు జెండాను అధికారికంగా ప్రణయ్‌కు అందించారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా 'సాక్షి'తో పంచుకున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

ముంబై పోర్టులో ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న హైదరాబాదీ బి.ప్రణయ్ రెడ్డి పోర్టు సెక్టార్‌లోనే అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. రష్యాలో అత్యంత ఎత్తైన మౌంట్ ఎల్బ్రాస్ శిఖరాన్ని అధిరోహించి ఆ సెక్టార్ నుంచి ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తిగా రికార్డుల్లోకి ఎక్కారు. రష్యన్ కాలమానం ప్రకారం ఈ నెల 16 ఉదయం 5.50 గంటలకు శిఖరాగ్రానికి (5,642 మీటర్లు) చేరుకున్న ఆయన 79వ స్వాతంత్ర దినోత్సవానికి గుర్తుగా తన బృందంతో కలిసి 79 మీటర్ల జాతీయ జెండాలను ఎగరేశారు. దీంతో పాటు దీన్‌దయాళ్ పోర్టు అథారిటీ జెండాను అక్కడ ఎగరేశారు. ఈ మేరకు ప్రణయ్ రెడ్డికి రష్యా ప్రభుత్వం గునిసెస్ ప్రపంచ రికార్డుకు అవసరమైన సర్టిఫికెట్ జారీ చేసింది.



వారి సహకారం కీలకం..

"'దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీ, ముంబై పోర్ట్ అథారిటీలతో పాటు నా తల్లిదండ్రులు బి.కృష్ణారెడ్డి, బి.నాగమణి, నా భార్య బి.అపర్ణ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలపాలి. వారందరి సహకారం లేకుంటే ఈ విజయం సాధించలేకపోయే వాడిని.' రష్యా- జార్జియా సరిహద్దు సమీపంలో కాకసస్ పర్వతాల్లోని ఎల్బ్రస్ సముద్ర మట్టానికి 18,510 అడుగుల (5,642 మీటర్లు) ఎత్తులో ఉంటుంది. ఇది రష్యాలోనే కాదు.. యూరప్‌లోనే ఎత్తైన అగ్నిపర్వతం." - ప్రణయ్ రెడ్డి



నిర్మాణ వ్యయం.. చౌక గృహాలకు భారం!

ఐదేళ్లలో 40 శాతం పెరిగిన కన్‌స్ట్రక్షన్ కాస్ట్

సొంతిల్లు ప్రతిఒక్కరి కల.. సామాన్య, మధ్యతరగతి వాసుల కల సాకారం చేసే చౌక గృహాలకు నిర్మాణ వ్యయం భారంగా మారుతోంది. దేశంలో దశాబ్ద కాలంలో నిర్మాణ వ్యయాలు బాగా పెరిగాయి. ద్రవ్యోల్బణం, నైపుణ్య కార్మికుల జీతభత్యాలు, లాజిస్టిక్స్ కొరత, ఇంధన ధరల పెరుగుదల, ముడి పదార్థాల సరఫరాలో అంతరాయాలు, మౌలిక సదుపాయాలకు డిమాండ్ పెరగడం, ప్రపంచ వ్యాప్తంగా స్థూల ఆర్థిక ఒడిదుడుకులు, ప్రభుత్వ విధానాలు వంటి కారణాలతో 2021 నుంచి కన్‌స్ట్రక్షన్ కాస్ట్ విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ పెరుగుదలతో గృహాల ధరలు వృద్ధి చెందడంతో పాటు అందుబాటు, మధ్యశ్రేణి గృహాల సరఫరా, డిమాండ్ తగ్గే అవకాశాలు ఉన్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో



ద్రవ్యోల్బణం, కార్మికులు, ముడి పదార్థాల కొరత కారణాలనేకం..	దీంతో ఏటా ఇళ్ల ధరలు 9–12 శాతం పెరుగుదల	తక్కువ మార్జిన్లతో చౌక గృహాల సరఫరాలో క్షీణత
మన దగ్గర చ.అ. నిర్మాణానికి రూ.1,600–రూ.2,700	ఐదేళ్లలో 12 శాతం తగ్గిన అఫర్డబుల్ హౌసింగ్	లగ్జరీ ఇళ్లకైతే రూ.4 వేలకంటే ఎక్కువే ఖర్చు

2019 నుంచి 2024 మధ్య ఐదేళ్లలో గృహ నిర్మాణ వ్యయాలు దాదాపు 40 శాతం మేర పెరిగాయి. మూడేళ్లలోనే ఏకంగా 27.3 శాతం పెరిగాయి. 2021 అక్టోబర్‌లో ప్రథమ శ్రేణి నగరాలలో గ్రేడ్–ఏ ప్రాజెక్ట్‌ల సగటు నిర్మాణ వ్యయం చ.అ.కు రూ.2,200లుగా ఉండగా.. 2024 అక్టోబర్ నాటికి రూ.2,800లకు పెరిగిందని అనరాక్ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాలలో అఫర్డబుల్ హౌసింగ్ నిర్మాణానికి చ.అ.కు రూ.1,500–2,000, మధ్య శ్రేణి గృహాల నిర్మాణానికి చ.అ.కు రూ.2,000–2,800 మధ్య ఖర్చు అవుతుంది. ఇక, లగ్జరీ గృహాల నిర్మాణం చేపట్టాలంటే చ.అ.కు రూ.4–5 వేల మధ్య ఖర్చవుతుంది.

ప్రధాన నగరాల్లో నిర్మాణ వ్యయాలు: (రూ./చ.అ.)

నగరం	చౌక గృహాలు	మధ్యశ్రేణి	లగ్జరీ
ముంబై	2,500-4,500	3,500-5,000	5,000+
ఢిల్లీ–ఎన్సీఆర్	2,000-3,500	3,000-4,000	4,500+
బెంగళూరు	1,800-3,200	2,800-4,000	4,500+
చెన్నై	1,700-2,800	2,500-3,800	4,200+
హైదరాబాద్	1,600-2,700	2,400-3,500	4,000+
పుణె	1,800-3,000	2,400-4,000	4,500+
కోల్‌కతా	1,500-2,500	2,200-3500	4,000+

విభాగాల వారీగా చూస్తే..



స్టాండర్డ్ మెటీరియల్స్, బేసిక్ ఫినిషింగ్‌లతో కూడిన చౌక గృహాల నిర్మాణానికి చ.అ.కు రూ.1,500– రూ.2 వేల మధ్య వ్యయం అవుతుంది. హైగ్రేడ్ మెటీరియల్స్, బ్రాండెడ్ ఫిట్టింగ్స్‌తో కూడిన మధ్యశ్రేణి ఇళ్ల కన్‌స్ట్రక్షన్‌కు చ.అ.కు రూ.2 వేల నుంచి రూ.2,800 మధ్య వ్యయమైతే.. విదేశీ ఉత్పత్తులు, హైఎండ్ ఆర్కిటెక్చర్, ఆధునిక వసతులు ఉండే లగ్జరీ గృహాల నిర్మాణానికి చ.అ.కు రూ.3 వేల నుంచి రూ.5 వేలు అంతకంటే ఎక్కువ ఖర్చవుతుంది.



వ్యయాల పెరుగుదల ఎందుకంటే?

- **ముడి పదార్థాలు:** సిమెంట్, ఉక్కు, రాగి, అల్యూమీనియం వంటి నిర్మాణ సామగ్రి ధరలు స్థిరంగా ఉండటం లేదు. గతేడాదితో పోలిస్తే సిమెంట్ ధరలు 15 శాతం మేర తగ్గితే.. ఉక్కు ధరలు 1 శాతం మాత్రమే తగ్గాయి. కానీ, ఐదేళ్లలో ఈ రెండు ముడి పదార్థాల ధరలు ఏకంగా 30–57 శాతం మేర పెరిగాయి. రాగి, అల్యూమీనియం ధరలూ ఇంచుమించుగా ఇదే రీతిలో పెరిగాయి. రాగి ధరలు ఏడాది కాలంలో 19 శాతం, ఐదేళ్లలో (2019–24) 91 శాతం వృద్ధి చెందాయి.
- **కార్మికుల వ్యయాలు:** నిర్మాణ వ్యయాలు పెరగడానికి ప్రధాన కారణం నైపుణ్య కార్మికుల కొరతే. దీంతో అందుబాటులో ఉన్న కార్మికులకు అధిక జీతభత్యాలు చెల్లించక తప్పని పరిస్థితి. గతేడాదితో పోలిస్తే కార్మికుల వ్యయాలు 25 శాతం, 2019తో పోలిస్తే ఏకంగా 150 శాతం మేర పెరిగాయి.
- **అనుమతులు:** నిర్మాణ అనుమతుల ఆలస్యం, లాజిస్టిక్స్ ఖర్చులు కూడా నిర్మాణ వ్యయాల పెరుగుదలకు కారణాలే. ఇంధన ధరల పెరుగుదల, కార్యాలయ నిర్వహణ వ్యయాలు కూడా ప్రభావం చూపిస్తున్నాయి.

కష్టమర్ల మీదే భారం..

చాలా మంది డెవలపర్లు పెరిగిన ఇన్‌పుట్ ఖర్చులను పాక్షికంగా లేదా పూర్తిగా కొనుగోలుదారులకు బదిలీ చేస్తారు. ఇన్‌పుట్ ఖర్చుల కారణంగా ఏటా గృహాల ధరలు 9–12 శాతం మేర పెరుగుతున్నాయి. చౌక గృహాల ధరలు చ.అ.కు రూ.500–800లు పెరిగినా కొనుగోలుదారులపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఎందుకంటే ప్రీమియం, లగ్జరీ ఇళ్లు కొనుగోలు చేసే వారితో పోలిస్తే రూ.5 లక్షల పెరుగుదల కస్టమర్లకు భారీ అదనపు భారమే అవుతుంది. ఇప్పటికే అఫర్డబుల్ హౌసింగ్ చేపట్టే డెవలపర్లు తక్కువ మార్జిన్ల కారణంగా కొత్త ప్రాజెక్ట్‌ల జోలికి వెళ్లడం లేదు. అనరాక్ రీసెర్చ్ డేటా ప్రకారం.. 2019లో చౌక గృహాల లాంచింగ్స్ 40 శాతంగా ఉండగా.. 2025 తొలి అర్ధభాగం నాటికి ఏకంగా 12 శాతానికి తగ్గింది. విక్రయాల్లో 2019లో సరసమైన గృహాల వాటా 38 శాతంగా ఉండగా.. 18 శాతానికి పడిపోయింది.

జీఎస్టీ సవరణ మేలు..

ప్రభుత్వం వస్తు సేవల పన్ను(జీఎస్టీ) సవరణ ప్రతిపాదనలు నిర్మాణ రంగానికి భారీ ఉపశమనాన్ని కలిగిస్తాయి. జీఎస్టీలో కేవలం 5, 18 శాతం అనే రెండు రేట్లు మాత్రమే ఉంటాయని, అలాగే సిమెంట్‌పై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తూ ప్రతిపాదించింది. ఇది కీలకమైన ఇన్‌పుట్ ఖర్చులపై మొత్తం పన్ను భారాన్ని తగ్గిస్తుంది. అయితే ఈ తగ్గింపులు ఇప్పటికే 1 శాతం పన్ను విధిస్తున్న చౌక గృహాలపై తగ్గింపు పరిమితంగానే ఉంటుంది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను పునరుద్ధరిస్తే ధరలు 2–4 శాతం వరకు తగ్గుతాయి. మధ్యశ్రేణి గృహ విభాగంలో జీఎస్టీ 5–3 శాతం మేర తగ్గిస్తే.. ధరలు 2–4 శాతం తగ్గుతాయి. అయితే లగ్జరీ గృహ విభాగంలో ఇన్‌పుట్ ఖర్చులు తగ్గినప్పటికీ.. ఆయా ప్రాజెక్ట్‌లలో వినియోగించే ప్రీమియం, బ్రాండెడ్ నిర్మాణ సామగ్రితో ధరల తగ్గింపు పెద్దగా ఉండకపోవచ్చు.

సుంకాల పెరుగుదల..

అమెరికా, చైనా, యూరప్ వంటి దేశాల నుంచి దిగుమతి అయ్యే ఉక్కు, అల్యూమీనియం, ఇతర నిర్మాణ సామగ్రిలపై సుంకాల పెరుగుదల కూడా నిర్మాణ వ్యయంపై ప్రభావం చూపిస్తుంది. 25 శాతం సుంకాలు పెరిగితే దిగుమతులపై ఆధారపడే ప్రాజెక్ట్‌ల నిర్మాణ ఖర్చులు ప్రస్తుత స్థాయి కంటే 1.5–2.5 శాతం మేర పెరగవచ్చు. ఒకవేళ 50 శాతం మేర సుంకం విధించినట్లయితే నిర్మాణ వ్యయాలు 5 శాతం, అంతకంటే ఎక్కువే పెరుగుతాయి. దీంతో దిగుమతులపై ఆధారపడే లగ్జరీ, వాణిజ్య ప్రాజెక్ట్‌ల నిర్మాణాలు కాస్త ఆలస్యమవుతాయి.

ఇల్లు కొంటున్నారా?



తమకంటూ ఓ సొంత ఇల్లు కొనుక్కోవాలని అందరూ కోరుకుంటారు. అయితే ఇల్లు తీసుకోవాలన్న నిర్ణయానికి వచ్చాక అందుకు సంబంధించి పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని రియల్ రంగ నిపుణులు సూచిస్తున్నారు. సొంతింటి కోసం ముందు నుంచి పక్కా ప్రణాళికతో ప్రిపేరైతే ఇల్లు కొనుక్కోవడం పెద్ద కష్టమేమీ కాదని చెబుతున్నారు. ఇంటి కొనుగోలు నిర్ణయం తీసుకున్నాక ప్రాంతం, ప్రాజెక్ట్, బడ్జెట్‌తో పాటు ఆర్థికపరమైన అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. ఎవరి బడ్జెట్‌కు అనుగుణంగా, వారి వారి వెసులుబాటు బట్టి ఎక్కడో ఓ చోట తమకంటూ సొంత ఇల్లు కట్టుకోవాలనో, కొనుక్కోవాలనో అనుకుంటారు. అయితే ఇల్లు అంటేనే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం.

– సాక్షి, సిటీబ్యూరో

ఐదారేళ్ల ముందు నుంచే ఆర్థిక ప్రణాళిక అవసరం | **బడ్జెట్ అంచనా వేశాకే కొనుగోలు నిర్ణయం**

సొంతింటిని కొంతమంది చిన్న వయసులోనే సొంతం చేసుకుంటుంటే.. మరికొందరు ఉద్యోగ విరమణ వయసు నాటికి గానీ కొనుక్కోలేరు. మరి కొంతమందికి సొంతిల్లు తీరని కలగానే మిగిలిపోతుంది. కనీసం ఐదారేళ్ల ముందు నుంచే ఆర్థిక ప్రణాళిక చేస్తేనే సొంతింటి కలను సాకారం చేసుకోవచ్చు. ప్రస్తుతం చాలా మంది ఉద్యోగం, ఉపాధి కోసం నగరాలు, పట్టణాలకు వలస వచ్చి అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈక్రమంలో ఎవరి స్థాయిలో వారు సొంతింటి కోసం ప్రయత్నిస్తున్నారు. శివారు ప్రాంతాల్లో ఇప్పటికీ అన్ని వర్గాలకు అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలను పలువురు డెవలపర్లు చేపడుతూనే ఉన్నారు. అయినప్పటికీ ఇంటి కొనుగోలు ఎంతో ఖర్చుతో కూడుకున్నది కాబట్టి ముందు నుంచే పక్కా ఆర్థిక ప్రణాళికంగా వ్యవహరించాలి.

పొదుపు చేస్తేనే..

సొంతింటి కల ఉన్నవారు సంపాదన ప్రారంభించిన వెంటనే ఇంటి కోసం ప్రతినెలా కొంత మొత్తం పొదుపు చేయాలి. ఎన్నేళ్లలో ఇల్లు కొనాలనుకుంటున్నారు అనే దాన్ని బట్టి ప్రతినెలా సంపాదనలో కొంత మొత్తం దాచుకోవాలి. కనీసం నెలకు రూ.10 వేల నుంచి, ఆ తర్వాత ఎవరి ఆదాయాన్ని బట్టి ఎంత వీలైతే అంత మొత్తం పొదుపు చేసుకోవాలి.



గృహరుణం తీసుకుంటే నెలనెలా ఎలా ఈఎంఐ చెల్లిస్తారో అలా ఇంటి కోసం మొదటి నుంచి పొదుపు రూపంలో ఈఎంఐ చెల్లించాలన్నమాట. ఇంటి కోసం డౌన్‌పేమెంట్‌కు అవసరమయ్యే 15–20 శాతం నిధులను సమకూర్చుకుంటే మిగతా మొత్తాన్ని గృహ రుణాన్ని తీసుకోవచ్చు.

బడ్జెట్‌ను బట్టే నిర్ణయం..

ప్రతినెలా పొదుపు చేసిన మొత్తాన్ని అధిక రాబడి వచ్చే పెట్టుబడి పథకాల్లో పెట్టుబడి పెట్టాలి. ఉద్యోగస్తులైతే పీపీఎఫ్‌లో మదుపు చేయడం, లేదంటే బంగారం కొనుగోలు, నమ్మకమైన సంస్థల్లో చిట్టీలు వేయడం, మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ చేయడం వంటి మార్గాలను అన్వేషించాలి. అంతేకాకుండా బ్యాంక్‌లు, పోస్టల్ పథకాలు ఇలా ఎక్కడ వీలైతే అక్కడ అసలుకు హామీ ఉండి అధిక రాబడి వచ్చే వాటిలో పెట్టుబడి పెట్టాలి. ఇంటి బడ్జెట్ ఎంతో ముందుగా అంచనాకు రావాలి. ఎవరి బడ్జెట్‌కు అనుగుణంగా ఆయా ధరల్లో ఇల్లు కొనుగోలు ప్రయత్నం చేయాలి. ఇల్లు కొన్నాక బ్యాంకు రుణానికి చెల్లించే ఈఎంఐ భారం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ ఇల్లు అత్యవసరమని భావించకపోతే ముందు ఇంటి స్థలం కొనుగోలు చేసి, ఆ తర్వాత భవిష్యత్తులో అక్కడే ఇల్లు కట్టుకోవచ్చు.

క్లబ్‌హౌస్‌లోనే.. సేఫ్టీ లాకర్!

- కమ్యూనిటీల్లోనే సేఫ్ డిపాజిట్ స్టోరేజ్‌లు
- 24/7 యాక్సెస్, బీమా కూడా..

సాక్షి, సిటీబ్యూరో: భారతీయులకు సంపద అనేది కేవలం ఆర్థిక భరోసా మాత్రమే కాదు.. అదో భావోద్వేగాలతో ముడిపడిన అంశం కూడా.. అందుకే సంపాదించడమే కాదు సంపదను భద్రపరుచుకునేందుకూ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. బ్యాంక్‌లు, ప్రైవేట్ సంస్థలు సేఫ్టీ లాకర్ల సేవలు అందిస్తున్నా.. వాటి పనిదినాల్లో తప్ప 24/7 వాటిని వినియోగించుకోలేం. అలా కాకుండా క్లబ్‌హౌస్‌లో, నివాస సముదాయంలోనే సాయుధ దళాల వంటి భద్రత ఉంటే ఎంత బాగుంటుందో కదూ. ఈమేరకు దేశంలోనే తొలి సేఫ్టీ డిపాజిట్ లాకర్ సేవల సంస్థ ఆరంతో ప్రముఖ నిర్మాణ సంస్థ సత్వా గ్రూప్ చేతులు కలిపింది.

- ఎంత విలాసవంతమైన నివాస సముదాయంలో ఉన్నా సరే బంగారం, డబ్బు, ఆస్తి పత్రాలకు భద్రత విషయంలో కాస్త భయాందోళనలు ఉంటూనే ఉంటాయి. సాధారణంగా నివాస సముదాయాలలో జిమ్, స్విమ్మింగ్ పూల్, ప్లే ఏరియా వంటివి ఉంటాయి. కానీ, నివాసితుల సంపదకు భద్రత, సౌకర్యవంతం కలిగించడం వసతుల్లో భాగమే. కస్టమర్ల సంపదకు గోప్యత, సౌలభ్యం, ఆనందం, భద్రత అందించడమే వీటి ప్రత్యేకతలు.



భద్రత, బీమా..

బీఐఎస్, అంతర్జాతీయ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా మిలిటరీ గ్రేడ్ వాల్ట్‌తో స్టోరేజ్ స్పేస్ ఉంటుంది. ప్రతీ లాకర్‌కు బయోమెట్రిక్ ఉంటుంది. అనుమతి లేకుండా ఎవరైనా చొరబడితే గుర్తించే నిఘా వ్యవస్థ ఉంటుంది. ప్రతి లాకర్‌కు రూ.కోటి బీమా సౌకర్యం కూడా ఉంటుంది. అలాగే లాకర్ లోపల ఏముందో ఎప్పటికప్పుడు ట్రాక్ చేయవచ్చు. దీంతో మీ సంపద ఎల్లవేళలా మీ నియంత్రణలోనే ఉంటుంది. కస్టమర్ల బంగారం, వజ్రాలు వంటి ఆభరణాలను సేఫ్టీ లాకర్‌లో భద్రపరిచే ముందు, తర్వాత వినియోగించిన ప్రతీసారి మీ కళ్లముందే తూకం వేస్తారు. ఏళ్ల పాటు బ్యాంక్ లాకర్ల వెయిటింగ్ జాబితాలు ఉండటం, అధిక విలువ డిపాజిట్‌లు, యాక్సెస్ పరిమితంగా ఉండటం వంటి సవాళ్లు ఉన్నాయి. అయితే వీటిల్లో మాత్రం కమ్యూనిటీలోని క్లబ్‌హౌస్‌లోనే ఈ సేఫ్టీ లాకర్ ఉంటుంది. దీంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా నివాసితులకు 24/7 అందుబాటులో ఉంటుంది. అందులోనే డ్రెస్సింగ్ రూమ్ కూడా ఉంటుంది. దీంతో ఆభరణాల వంటివి అలంకరించుకొని బయటకు రావొచ్చు.

మూసీ, ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ ఆర్..

గేమ్ చేంజర్లు!

రాష్ట్రాభివృద్ధిని మార్చే ప్రాజెక్ట్‌లివీ..

రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం చేసే పనులు, అవలంభించే విధానాలు ప్రజలకు తెలిస్తేనే మరింత సక్సెస్ అవుతాయి. రాబోయే తరాల భవిష్యత్తును మార్చేసే అలాంటి కీలక ప్రాజెక్ట్‌లకే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హైటెక్ సిటీ, ఎయిర్ పోర్ట్, ఔటర్ రింగ్‌లతో సుమారు మూడు దశాబ్దాలుగా రాష్ట్ర ముఖచిత్రం ఎలా మారిపోయిందో అంతకు రెట్టింపు స్థాయిలో మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్‌లతో తెలంగాణ దశదిశలు మారిపోతాయి. ఎయిర్ పోర్ట్‌తో హైదరాబాద్ నుంచి ప్రపంచం మొత్తానికి తలుపు తెరిచినట్టే.. ఔటర్‌తో తెలంగాణ మొత్తానికి కనెక్టివిటీ పెరిగింది. ఇప్పుడిదే స్థాయిలో ప్రపంచ దేశాలను ఆకర్షించే ఈ మూడు గేమ్ చేంజర్ ప్రాజెక్ట్‌లు రాష్ట్రాభివృద్ధిని మార్చనున్నాయని భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య(క్రెడాయ్) తెలంగాణ ప్రెసిడెంట్ కే.ఇంద్రసేనా రెడ్డి అన్నారు. – సాక్షి, సిటీబ్యూరో



- మెట్రో విస్తరణతో మెరుగైన కనెక్టివిటీ
- గ్రీన్‌ఫీల్డ్ రోడ్లతో కొత్త ప్రాంతాల అభివృద్ధి
- త్వరలోనే ఫ్యూచర్ సిటీ క్రెడాయ్ చాప్టర్
- ఏటా లక్ష మంది కార్మికులకు నైపుణ్య శిక్షణ
- 'సాక్షి'తో క్రెడాయ్ తెలంగాణ ప్రెసిడెంట్ ఇంద్రసేనారెడ్డి

వరుస ఎన్నికలు, కొత్త ప్రభుత్వ విధానాలు వంటి హనీమూన్ పీరియడ్ ముగిసింది. దీంతో స్థిరాస్తి రంగం మళ్లీ పుంజుకుంటోంది. 18 నెలల్లో నగరంలో 2 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరగడమే ఇందుకు ఉదాహరణ. వంద చ.అ.కు ఒక జాబ్ చొప్పున 2 లక్షల కొత్త ఉద్యోగాలు వచ్చాయి. దీంతో గృహాలకు డిమాండ్ ఏర్పడింది. పాత ప్రభుత్వాలు కేవలం పశ్చిమ హైదరాబాద్ మీదనే దృష్టి పెట్టాయి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం పాతబస్తీలో మెట్రో విస్తరణ, దక్షిణ హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్.. ఇలా ఎక్కడికక్కడ అభివృద్ధి ప్రణాళికలు చేస్తోంది. గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు, ఓఆర్ఆర్– ట్రిపుల్ ఆర్ మధ్య కొత్త ప్రాంతాలలో భూములు అందుబాటులోకి వస్తాయి. వ్యాపార అవకాశాలూ పెరుగుతాయి. రోడ్లను వెడల్పు చేస్తే కార్ల సంఖ్య పెరగడమే తప్ప పెద్దగా ప్రయోజనం ఉండదు. మెట్రో విస్తరణ దూరాలు దగ్గరవుతాయి. ప్రజా రవాణా పెంచితేనే సిటీ అభివృద్ధి, దూరం పెరుగుతుంది. దీంతో కస్టమర్లు ఎక్కడికక్కడ ఇళ్లు కొనుగోలు చేయవచ్చు.

హైడ్రా లాగే రెరా..

ప్రస్తుతం దేశంలో సుమారు 1.10 లక్షల మంది బిల్డర్లు ఉన్నారు. నిర్మాణ రంగంలో అసంఘటిత బిజినెస్ ఎక్కువగా ఉంటుంది. నకిలీ బిల్డర్లు, మధ్యవర్తుల మాయమాటలు నమ్మి, తక్కువ ధరకు వస్తుందనే ఆశతో వారి చేతిలో కస్టమర్లు మోసపోతున్నారు. గృహ కొనుగోలుదారులకు భరోసా, వారి పెట్టుబడులకు భద్రత కల్పించే పదునైనా అస్త్రం రెరా. దీన్ని గత ప్రభుత్వం విస్మరించింది. దీంతో ప్రీలాంచ్, సాఫ్ట్‌లాంచ్‌ల పేరుతో అమాయక కస్టమర్ల కష్టార్జితాన్ని కాజేశారు. కస్టమర్లు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. అనుమతులు లేకుండా, రూపాయి పన్ను చెల్లించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించే నకిలీ బిల్డర్లను హైడ్రా తరహాలో కఠినంగా వ్యవహరించాలి. ఈమేరకు రెరాను మరింత బలోపేతం చేయాలి.

ఏటా లక్ష కార్మికులకు నైపుణ్య శిక్షణ..

దేశీయ నిర్మాణ రంగంలో వచ్చే పదేళ్లలో 4.5 కోట్ల మంది నైపుణ్య కార్మికులు అవసరం. ఒడిశా, జార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల నుంచి సుమారు 18 లక్షల మంది కార్మికులు తెలంగాణ నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారు. వీరిలో చాలా మంది నైపుణ్య కార్మికులు నెలకు రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకూ సంపాదిస్తున్నారు. కొడంగల్, నిజామాబాద్, పరిగి, కరీంనగర్, వరంగల్ వంటి మన తెలంగాణ నుంచి యువత ముంబై, ఎన్సీఆర్–ఢిల్లీ, దుబాయ్, గల్ఫ్ వంటి దేశాలకు వలస వెళ్తున్నారు. నెలకు రూ.25–రూ.30 వేలకు పనిచేస్తున్నారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో సుమారు వెయ్యి ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కాలేజీలున్నాయి. ఆయా విద్యా సంస్థలు అకడమిక్ స్థాయిలో బాగానే ఉన్నా ఆన్‌సైట్ ప్రాక్టికల్ శిక్షణలో వెనుకబడి ఉన్నాయి. 12 తరగతిలోపు, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు 180 రోజుల పాటు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం. 90 రోజుల పాటు క్లాస్‌రూమ్ శిక్షణ, 90 రోజులు ఆన్‌సైట్ ట్రెయినింగ్ ఉంటుంది. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే జరగనున్న క్రెడాయ్ స్టేట్‌కాన్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించనున్నాం.

త్వరలోనే ఫ్యూచర్ సిటీ చాప్టర్..

ప్రస్తుతం క్రెడాయ్ తెలంగాణలో 15 చాప్టర్లు, వెయ్యి మంది సభ్యులు ఉన్నారు. వీటిని 25 చాప్టర్లకు విస్తరించాలన్నది లక్ష్యం. త్వరలోనే ఫ్యూచర్ సిటీ క్రెడాయ్ చాప్టర్‌ను ప్రారంభించనున్నాం. కనీసం ఒక్క ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) పొందిన, నాణ్యమైన 30 మంది సభ్యులతో ఈ చాప్టర్‌ను తెరవనున్నాం. కోడ్ ఆఫ్ కండక్ట్ విధిగా పాటించే సభ్యులతో ఆ తర్వాత సంగారెడ్డి, జహీరాబాబాద్ చాప్టర్లు కూడా రానున్నాయి. ప్రభుత్వం, బిల్డర్లకు మధ్య క్రెడాయ్ వారధిలా పనిచేస్తుంది. ప్రభుత్వ పాలసీలు, పన్నులు తదితరాలపై బిల్డర్లకు అవగాహన కల్పిస్తుంది.

మఠం కూల్చివేయొద్దు: కవిత



సాక్షి, హైదరాబాద్: తిరుపతి హాథీరామ్ బావాజీ మఠం కూల్చివేత ప్రయత్నాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విరమించుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కె.కవిత డిమాండ్ చేశారు. మఠం కూల్చివేత నిర్ణయం హాథీరామ్ బావాజీని ఆరాధించే బంజారాల మనోగతాన్ని దెబ్బతీస్తుందని 'ఎక్స్'లో ఆమె పేర్కొన్నారు. భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంలో.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకోవాలని కవిత కోరారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కొత్త విధానం తేవాలి

- ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఇళ్ల స్థలాల కేటాయింపుపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు నేపథ్యంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానం తీసుకురావాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) విజ్ఞప్తి చేసింది. కనీస వేతనాలు కూడా అందని పరిస్థితుల్లో జర్నలిస్టులు దుర్భర జీవనం గడుపుతున్నారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై దృష్టి పెట్టి జర్నలిస్టులకు తగిన న్యాయం చేయాలన్నారు. అవసరమైతే మార్కెట్ ధర ప్రకారమైనా ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు.

ఉద్యోగం పోతే.. మీరు భద్రమేనా?

ఒడిదుడుకులకు లోనవుతున్న జాబ్ మార్కెట్
అనిశ్చితిని ఎదుర్కోవడానికి 'ఫండ్' తప్పనిసరి
అదనపు ఆదాయ వనరులపైనా దృష్టిపెట్టాలి



ప్రపంచవ్యాప్తంగా 2023లో 1,193 టెక్ కంపెనీలు 2,64,220 మంది ఉద్యోగులను.. గతేడాది 551 టెక్ సంస్థలు 1,52,922 మందిని తొలగించాయి. ఈ ఏడాది ఇప్పటికే 186 కంపెనీలు 81,567 మందిని ఇంటికి సాగనంపాయి. ఒక్క టెక్ ఇండస్ట్రీలోనే ఇలా ఉంటే ఇతర రంగాల్లో పరిస్థితి? ఇదంతా ఎందుకంటే.. ఉద్యోగం కోల్పోయినప్పుడు ఉండే మానసిక వేదన అంతా ఇంతా కాదు. ఆర్థికంగా బలంగా ఉన్నవారైతే ఏ ఇబ్బందీ లేదు. నెల జీతం మీద బతికేవారికే సమస్యల్లా. నిత్యావసరాలు, ఇంటి అద్దె, నెల వాయిదాలు, పిల్లల ఫీజులు, వైద్యం.. ఇలా తప్పించుకోలేని ఖర్చుల జాబితా పెద్దదిగానే ఉంటుంది. అనుకోని కష్టం ఎదురైతే ఎదుర్కొనే ప్రణాళిక లేకపోతే చాలామంది ఆర్థికంగా చితికిపోతారు. అప్పుల ఊబిలో కూరుకుపోతారు. జాబ్ మార్కెట్‌లో ప్రస్తుత తరుణంలో ఉన్న అనిశ్చితి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కొన్ని సూత్రాలు పాటించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

అత్యవసర నిధి

సగటు ఉద్యోగికి.. అలాగే కుటుంబానికి ఇదే పెద్ద ధీమా. కనీసం 6-12 నెలల ఇంటి ఖర్చులకు సమానమైన మొత్తంలో అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోండి. తద్వారా ఆర్థిక భద్రత పెరుగుతుంది. అకస్మాత్తుగా ఉద్యోగం పోతే.. ఊహించని, అత్యవసర ఖర్చులను తీర్చడానికి ఈ ఫండ్ సమయానికి ఆదుకుంటుంది.

- ఈ నిధి లేకపోతే అధిక వడ్డీతో అప్పులు, లేదా ఇతర ప్రత్యామ్నాయాలపై ఆధారపడవలసి వస్తుంది. ఇదే జరిగితే ఆర్థిక సమస్యలు మరింత తీవ్రమవుతాయి.
- ఆర్థికంగా బలంగా ఉంటే మనశ్శాంతి ఉంటుంది. అన్నింటికీ మించి ఒత్తిడి తగ్గుతుంది.
- ఆహారం, వైద్య బిల్లులు, బీమా ప్రీమియం వంటి ముఖ్యమైన ఖర్చుల కోసం మాత్రమే ఈ అత్యవసర ఫండ్‌ను ఉపయోగించండి.
- జాబ్ కోల్పోయిన తర్వాత కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకోవడానికి ఈ నిధుల నుంచి కొంత మొత్తాన్ని కేటాయించండి. కొత్త కోర్సు, శిక్షణ పూర్తి అయితే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

అదనపు ఆదాయ మార్గాలు

ప్రతి ఒక్కరిలో ఏదో ఒక నైపుణ్యం, అభిరుచి, ఆసక్తి దాగి ఉంటుంది. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగంతో పాటు వీటి ద్వారా అదనపు ఆదాయాన్ని సంపాదించడానికి ప్రయత్నించండి. ఆదాయ నష్టాలను అధిగమించడంలో ఇవి మీకు సహాయపడతాయి. ఇదే సమయంలో వీలైనంత పొదుపు చేయడం, పెట్టుబడి పెట్టడం కూడా మర్చిపోవద్దు.

ఆరోగ్య బీమా

చాలా మంది ఉద్యోగులు సంస్థ అందించే గ్రూప్ హెల్త్ కవరేజీపైనే ఆధారపడతారు. సొంతంగా బీమా పాలసీ తీసుకోరు. కంపెనీ నుంచి ఉంది కదా అన్న ధీమా, నిర్లక్ష్యపు ధోరణి ఉంటుంది. ఉద్యోగం కోల్పోయినప్పుడు ఈ బీమా వర్తించదు. అందుకే కుటుంబం అంతటికీ వర్తించే సమగ్ర వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీని కొనుగోలు చేయడం ఉత్తమం. వ్యక్తిగత బీమా ఉంటే జాబ్ పోయినా, మానేసినా చింత ఉండదు. కుటుంబంలోని వారందరికీ నిరంతర ఆరోగ్య బీమా రక్షణ ఉంటుంది.

తక్కువ అప్పు

ఉద్యోగం కోల్పోతామన్న అభద్రతకు లోనైతే.. అప్పులు / రుణాలను కనిష్ట స్థాయిలో ఉంచడానికి ప్రయత్నించండి. కొత్త రుణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోకూడదు. వీలైతే ముందస్తుగా ఈఎంఐలు చెల్లించండి.

బ్యాంకులకు చెల్లించాల్సిన వాయిదాల క్రమం తప్పితే క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. ఇదే జరిగితే భవిష్యత్తులో రుణం పొందడంలో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు.

ఉద్యోగాన్ని కోల్పోయినట్టయితే రుణదాతకు ఈ విషయాన్ని తెలియజేయడంతో పాటు మారటోరియం, నెల వాయిదాల (ఈఎంఐ) గడువు పెంచడం (రీషెడ్యూల్) గురించి విన్నవించండి.

బంధువులు, స్నేహితులు, తెలిసిన వారి నుంచి అప్పు తీసుకున్నట్టయితే పరిస్థితిని నిజాయితీగా వివరించండి.

బడ్జెట్‌లో మార్పులు

అనిశ్చితి సమయాల్లో విచ్చలవిడి ఖర్చులను తగ్గించుకోండి. అత్యవసరమైతే తప్ప ఖర్చు చేయండి.

- అనవసర ఖర్చులు తగ్గిస్తే చేతిలో డబ్బులు మిగులుతాయి. ఉద్యోగ నష్టానికి సంబంధించిన ఒత్తిడి తగ్గుతుంది.
- ఉద్యోగం కోల్పోవడం వల్ల తలెత్తే ఆర్థిక పరిణామాలు, తదుపరి ఉద్యోగ అన్వేషణ, జాబ్ మార్కెట్ గురించి మీ ఆలోచనలు, భావాలు, ప్రణాళికలను కుటుంబంతో పంచుకోండి.
- కుటుంబ సభ్యులు తమ భావాలను వ్యక్తీకరించడానికి, నిర్ణయం తీసుకునే ప్రక్రియకు దోహదపడే సుహృద్భావ వాతావరణాన్ని కల్పించండి. ఈ విధానం కుటుంబ బంధాలను బలోపేతం చేస్తుంది.
- మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, రిటైర్‌మెంట్ ఇన్వెస్ట్‌మెంట్స్ వంటి వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ కదిలించొద్దు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే అరెస్టులా?

- హైదరాబాద్‌లో సమస్యల పరిష్కారంలో సర్కారు విఫలం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు ఆగ్రహం
- బీజేపీ చేపట్టిన 'సేవ్ హైదరాబాద్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తం



రాంచందర్‌రావు అరెస్టును అడ్డుకుంటున్న కార్యకర్తలు

సాక్షి, హైదరాబాద్/మొయినాబాద్: ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్టు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో రోడ్లు, విద్యుత్ వ్యవస్థ ఘోరంగా తయారయ్యాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో తాగునీరు, డ్రైనేజీ, కరెంట్, ట్రాఫిక్ సమస్యలపై నిరసన వ్యక్తంచేస్తూ బీజేపీ శుక్రవారం 'సేవ్ హైదరాబాద్'పేరుతో సచివాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టింది. బీజేపీ శ్రేణులు భారీ సంఖ్యలో సచివాలయం వైపు దూసుకొచ్చారు. గేట్లుదూకి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకొని ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఈ కార్యక్రమానికి వస్తున్న రాంచందర్‌రావును అరెస్టు చేసి మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వర్షాకాలంలో హైదరాబాద్‌లో రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలను సక్రమంగా నిర్వహించటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రామంతాపూర్, అంబర్‌పేట, సికింద్రాబాద్‌లో విద్యుత్ ప్రమాదాలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని స్పష్టంచేశారు. సచివాలయ ముట్టడిలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నేను బీజేపీ నేతనుకాదు.. నన్నెందుకు అరెస్టు చేశారు?

సచివాలయం వద్ద బీజేపీ శ్రేణులను అరెస్టు చేసే క్రమంలో పోలీసులు అక్కడ ఉన్న పలువురు సామాన్యులను కూడా అదుపులోకి తీసుకున్నారు. గేట్-2 వద్ద ఎవరు కనిపించినా అదుపులోకి తీసుకొని పోలీసు వాహనాలు ఎక్కించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అనుచరుడిని కూడా అరెస్టు చేసి వ్యాన్‌లో ఎక్కించారు. దీంతో 'నేను బీజేపీ నేతను కాదు. నేను కాంగ్రెస్ నేతను'అని అతడు మొత్తుకున్నాడు. అది గమనించిన పోలీసులు నవ్వుతూ ముందు చెప్పాలి కదా అన్న.. అని అంటూ ఆయనను వదిలేశారు.

బీజేపీ నేతల అరెస్టులకు కేంద్రమంత్రుల ఖండన

సాక్షి, హైదరాబాద్: 'సేవ్ హైదరాబాద్'నినాదంతో సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునిచ్చిన బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుతో సహా ఇతర నాయకులు, కార్యకర్తలను శుక్రవారం అక్రమ అరెస్ట్, హౌస్ అరెస్టులు చేయడాన్ని కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

సీపీఐ పగ్గాలు మళ్లీ కూనంనేనికే

- రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటీ.నర్సింహ
- సీపీఐ రాష్ట్ర 4వ మహాసభల్లో నూతన కార్యవర్గం ఎన్నిక



మహాసభల్లో అభివాదం చేస్తున్న డి.రాజా, తక్కెళ్లపల్లి, అజీజ్‌పాషా, కూనంనేని , నారాయణ, చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, హేమంతరావు, పశ్య పద్మ

సాక్షి, హైదరాబాద్: సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మరోసారి ఎన్నికయ్యారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా గాజులరామారంలో జరిగిన సీపీఐ 4వ రాష్ట్ర మహాసభల్లో శుక్రవారం నూతన రాష్ట్ర సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటీ.నర్సింహలకు అవకాశం దక్కింది. సీపీఐ సీనియర్ నేత పల్లా వెంకట్‌రెడ్డి ప్రతిపాదించగా, పార్టీ నేత కలవేన శంకర్ బలపరిస్తే, రాష్ట్ర సమితి ఏకగ్రీవంగా ఆమోదించింది. కొత్తగా ఎన్నికైన రాష్ట్ర కార్యదర్శివర్గంలో 10 మంది సభ్యులు, కార్యవర్గంలో 32 మంది సభ్యులు ఉండగా, మొత్తం 101 మందితో రాష్ట్ర సమితి ఏర్పడింది. అదనంగా క్యాండిడేట్ సభ్యులు, ఆహ్వానితులు, జిల్లా ప్రతినిధులను కూడా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాతోపాటు డా. కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా తదితరులు కొత్త నాయకత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా ఉద్యమాలను ముందుకు నడిపించాలని వారు దిశానిర్దేశం చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకట్‌రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, భాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనర్సింహ, వీఎస్.బోస్, ఈటీ.నరసింహ.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గం ఇదే
పూర్తి వివరాలు: సాక్షి ప్లస్ (ఈ-పేపర్)లో

ఈగల్‌లో నియామకాలు అవాస్తవం

- ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య



సాక్షి, హైదరాబాద్: ఈగల్ (యాంటీ నార్కోటిక్స్ యూనిట్) సెల్‌లో హోంగార్డుల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్టు సోషల్ మీడియాలో ప్రసారమవుతున్న వార్త పూర్తిగా అవాస్తవమని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తెలంగాణ పోలీస్‌శాఖ లేదా ఈగల్ సెల్ అలాంటి నోటిఫికేషన్ విడుదల చేయలేదని వెల్లడించారు. ఆ నోటిఫికేషన్‌ను, ఆ తరహా నకిలీ సందేశాలను నమ్మవద్దని.. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు లావాదేవీల వివరాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేసేవారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని సందీప్‌శాండిల్య హెచ్చరించారు.

కిడ్నీ రాకెట్ కేసులో మరొకరి అరెస్టు


- విశాఖలో డాక్టర్ సంతోష్ నాయుడిని అరెస్టు చేసిన సీఐడీ
- అక్రమ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సల మత్తు డాక్టర్‌గా నిందితుడు

సాక్షి, హైదరాబాద్: సరూర్‌నగర్ అలకనంద కిడ్నీ రాకెట్ కేసులో అరెస్టులు కొనసాగుతున్నాయి. కిడ్నీ మార్పిడుల్లో కీలకంగా వ్యవహరించిన మత్తు వైద్యుడు డాక్టర్ రుట్టల వెంకట రామ సంతోష్ నాయుడు (36)ను తెలంగాణ సీఐడీ అధికారులు శుక్రవారం ఏలూరులో అరెస్ట్ చేశారు. అనంతరం హైదరాబాద్‌కు తరలించి రంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరుపరిచినట్టు సీఐడీ అడిషనల్ డీజీ చారుసిన్హా తెలిపారు. కిడ్నీ మార్పిడి వ్యవహారంలో ఈ ఏడాది జనవరి 22న సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఆస్పత్రి నిర్వాహకులు, వైద్యులు సహా మొత్తం 19 మందిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. సమగ్ర దర్యాప్తు కోసం కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించడం తెలిసిందే. వెంకట రామ సంతోష్ నాయుడు 24వ నిందితుడు. అక్రమ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సల్లో మత్తు ఇచ్చేందుకు.. ఏ-3గా ఉన్న పవన్ కుమార్.. డాక్టర్ సంతోష్‌నాయుడిని విశాఖపట్నం నుంచి పిలిపించేవాడని సీఐడీ అధికారులు గుర్తించారు. ఒక్కొక్క సర్జరీకి రూ.2.5 లక్షలు వసూలు చేసేవాడని ఆధారాలు లభించాయి. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ఆమోదం

- రూ.16 కోట్ల వ్యయానికి పీఆర్ఆర్‌డీ అనుమతి

సాక్షి, హైదరాబాద్: వివిధ జిల్లాల్లో రూ.16 కోట్ల వ్యయంతో ప్రభుత్వ కార్యాలయాలు, భవనాల నిర్మాణానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిపాలనామోదం మంజూరు చేసింది. ఈ భవనాలను ములుగు, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో నిర్మించనున్నారు. ఈ నిధులను ములుగులోని ఎస్ఈ కార్యాలయం, రంగారెడ్డిలోని ఉప్పల్‌లో ఎస్ఈ (వీక్యూసీ) కార్యాలయం, వరంగల్‌లో ఇంటిగ్రేటెడ్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కాంప్లెక్స్, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో పీఆర్ సబ్ డివిజన్, పెద్దపల్లిలో పీఆర్ (వీక్యూసీ) సబ్ డివిజన్, మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో మహిళా స్వయం సహాయక బృందం కోసం భవనం, ములుగులో ముస్లింల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణం నిమిత్తం కేటాయించారు. ఈ మేరకు శుక్రవారం ఈ ఏడు పనులకు సంబంధించి పీఆర్ఆర్‌డీ (భవనాలు) విభాగం ఉత్తర్వులు జారీ చేసింది.



కుప్పం నుంచి కుట్రలకు క్లాప్!

ప్రభుత్వ వైద్య రంగంలో ఇప్పటికే ఉన్న సమర్థ వ్యవస్థలను నీరుగారుస్తూ తెరపైకి 'డింక్' ప్రాజెక్టు

గతంలో అందించిన టెలీ మెడిసిన్ సేవలకే కలరింగ్.. విలేజ్ క్లినిక్స్‌కు పాతర.. ప్రైవేట్ చేతికి సేవలు

ఇప్పుడేదో సరికొత్త వ్యవస్థను తెస్తున్నట్లు మభ్య పెడుతూ రూ.350 కోట్ల ప్రజాధనానికి టెండర్

- ఇప్పటికే కుప్పంలో మొదలైన 'పైలెట్'.. ఆపై రాష్ట్రమంతా అమలు
- రేషనలైజేషన్ పేరిట దాదాపు మూడువేల 'విలేజ్ క్లినిక్'లు మూత!
- ఇంత ఖర్చుపెట్టినా అందించేది కేవలం "టెలీ మెడిసిన్" సేవలే
- ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసి ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో రోగులకు సేవలు బంద్.. గొప్పగా ఉన్న ఆరోగ్య రంగాన్ని నాశనం చేసి బాబు సర్కారు 'ప్రైవేట్' పాట!

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



'ఆకాశంలో సగం' అనే మాట మనకు సుపరిచితం.
అయితే ఆరోజుల్లో 'స్పేస్ సైన్స్'కు సంబంధించి
మహిళా శాస్త్రవేత్తల సంఖ్య చాలా తక్కువ.
గతంతో పోల్చితే ఇప్పుడు ఉమెన్ స్పేస్ సైంటిస్ట్‌ల సంఖ్య బాగా పెరిగింది.
'ఇస్రో' మంగళ్‌యాన్ మిషన్ నుంచి చంద్రయాన్ మిషన్ వరకు
ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్‌లలో కీలక పాత్ర పోషించారు.
శాస్త్ర సాంకేతిక రంగంలో అడుగు పెట్టడానికి
ఈతరం అమ్మాయిలకు స్ఫూర్తిని ఇస్తున్నారు...

ఈ స్పేస్ మాది..!

ఆకాశమే అపూర్వ పాఠశాల


రీతూ కరిధాల్


ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన రీతూ కరిధాల్‌కు ఆకాశం ఎప్పుడూ వింతగా అనిపించేది. అంత పెద్దగా కనిపించిన చంద్రుడు ఎందుకు తగ్గుకుంటూ వెళతాడు? పగటి పూట చుక్కలు ఎందుకు కనిపించవు? ఇలాంటి సందేహాలెన్నో ఆ చిట్టి బుర్రకు వచ్చేవి. ఆకాశంపై అమితమైన ఆసక్తే రీతూను సైన్స్ వైపు నడిపించింది. స్కూల్ రోజుల్లో నాసా, ఇస్రోకు సంబంధించిన ప్రాజెక్ట్‌ల సమాచారం గురించి దినపత్రికలలో వెదికేది. కనిపిస్తే వాటిని కట్ చేసి దాచుకునేది.

పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తయిన తరువాత ఇస్రోలో స్పేస్ సైంటిస్ట్‌గా ప్రస్థానం ప్రారంభించింది. ప్రతిష్ఠాత్మకమైన మంగళ్‌యాన్ మిషన్‌తో పాటు ఇస్రోలోని ఎన్నో ప్రాజెక్ట్‌లలో కీలక బాధ్యతలు నిర్వహించింది రీతూ కరిధాల్.

'మంగళ్‌యాన్ మిషన్ కోసం పనిచేయడం అపూర్వ అనుభవం. నిరంతర మేధోమథనం జరుగుతుండేది. సెలవు అంటూ లేకుండా పని చేశాం. వృత్తి, కుటుంబ జీవితాన్ని సమన్వయం చేసుకోవడం అంత తేలిక కాదు. అయితే నా భర్త, కుటుంబ సభ్యుల సహకారం వల్ల అది సాధ్యం అయింది' అంటుంది రీతూ కరిధాల్.

భూదేవి అంత ఓపిక... ఆకాశమంత ప్రతిభ

ప్రతిష్ఠాత్మకమైన మంగళ్‌యాన్ మిషన్ ప్రతిభావంతులైన మహిళా శాస్త్రవేత్తలను లోకానికి పరిచయం చేసింది. ఆ మహిళా శాస్త్రవేత్తలపై 'ఇస్రో'స్ మాగ్నిఫిసియెంట్ ఉమెన్ అండ్ దెయిర్ ఫ్లైయింగ్ మెషీన్స్' పేరుతో పుస్తకం రాసింది మిన్నీ వేద్. నందిని, రీతూ కరిధాల్, మౌమిత దత్తా, మినై సంపత్... మొదలైనవారి గురించి ఈ పుస్తకంలో రాసింది. 'స్పేస్'ను కెరీర్‌గా ఎంచుకోవడానికి కారణం ఏమిటి? రకరకాల ఒత్తిళ్లను తట్టుకొని ఎలా ముందుకు వెళ్లారు? వృత్తి, కుటుంబ జీవితాన్ని ఎలా సమన్వయం చేసుకున్నారు?.... ఇలాంటి ప్రశ్నలకు ఈ పుస్తకం సమాధానం చెబుతుంది. మన దేశంలో ఫస్ట్ ఇండిజినస్ రాడార్ ఇమేజింగ్ శాటిలైట్ రిసాట్-1 ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేసిన వలర్మతి వ్యక్తిగత, ఉద్యోగ జీవిత అనుభవాలు కూడా ఈ పుస్తకంలో కనిపిస్తాయి. మంగళ్‌యాన్ మిషన్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ ఇన్‌చార్జిగా పనిచేసిన మినాల్ సంపత్ స్పేస్‌క్రాఫ్ట్ టెస్టింగ్ పనుల్లో భాగంగా బెంగళూరు, అహ్మదాబాద్‌ల మధ్య తరచు ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఆ సమయంలో మూడు సంవత్సరాల తన కుమారుడు గుర్తుకు వచ్చేవాడు. 'మా బాబు గుర్తుకు వచ్చిన సమయంలో పేలోడ్స్ కూడా నా బిడ్డలే కదా అనుకునేదాన్ని' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది మినాల్ సంపత్. ఇలాంటి జ్ఞాపకాలు ఎన్నో ఈ పుస్తకంలో కనిపిస్తాయి.



సైన్స్ ఫిక్షన్ టు ఇస్రో సైంటిస్ట్

తన చిన్నప్పుడు టెలివిజన్‌లో వచ్చే స్టార్ ట్రెక్, సైన్స్ ఫిక్షన్ అంటే నందిని హరినాథ్‌కు చాలా ఇష్టం. టీవీలో వచ్చే సైన్స్ ప్రోగ్రామ్స్‌పై అమిత ఆసక్తి ప్రదర్శించే నందిని తాను స్పేస్ సైంటిస్ట్ అవుతానని అనుకోలేదు.

'జస్ట్ అలా జరిగింది అంతే!' అని స్పేస్ సైంటిస్ట్‌గా తన ప్రయాణం గురించి నవ్వుతూ చెబుతుంది నందిని.


నందిని హరినాథ్

ఉద్యోగంలో చేరిన కొత్తలో రోజుకు పన్నెండు నుంచి పద్నాలుగు గంటలు పనిచేసిన రోజులు ఉన్నాయి. భోజనం చేయడం కూడా మరిచి పనిచేసిన రోజులు ఉన్నాయి.

'ఇస్రో సైంటిస్ట్ అని పరిచయం చేసినప్పుడు ప్రజలు గౌరవించే తీరు వృత్తిపట్ల బాధ్యతను మరింత పెంచుతుంది. మంగళ్‌యాన్ ప్రాజెక్ట్‌లో భాగం కావడం గర్వంగా భావిస్తున్నాను. ఆ ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్ కోసం పనిచేస్తున్నప్పుడు నిద్ర, తిండి గురించి పట్టించుకునేవాళ్లం కాదు. ఇంట్లో తక్కువ సమయం మాత్రమే గడిపేవాళ్లం. ఈ ప్రాజెక్ట్ కోసం ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాం' అంటుంది నందిని హరినాథ్.

వివక్ష లేదు... ప్రతిభే ప్రమాణం


అనురాధ టీకె

'నేను ఇస్రోలో 1982లో చేరినప్పుడు అక్కడ కొద్ది మంది మహిళా ఉద్యోగులు మాత్రమే కనిపించేవారు. ఊహకు అందని రీతిలో ఇప్పుడు ఎంతో మంది పనిచేస్తున్నారు' అంటుంది అనురాధ టికె. ఇస్రో శాటిలైట్ సెంటర్‌లో జియోశాట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ అయిన అనురాధ ఎంతోమంది అమ్మాయిలకు రోల్ మోడల్. 'తొమ్మిది సంవత్సరాల వయసులోనే ఆకాశంపై ఆసక్తి మొదలైంది' అని తన బాల్యాన్ని గుర్తు తెచ్చుకుంటుంది అనురాధ. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై అడుగు పెట్టడం గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ద్వారా విన్న అనురాధ సంభ్రమాశ్చర్యాలకు గురైంది. 'చంద్రుడిపై మానవుడు' అనే అంశంపై తన మాతృభాష కన్నడంలో కవిత రాసింది.

'ఇస్రోలో స్త్రీ, పురుషులు అనే భేదం ఉండదు. ప్రతిభ, అంకితభావం మాత్రమే ప్రమాణం. స్పేస్ ప్రోగ్రామ్స్‌లో ఎంతమంది మహిళలు పనిచేస్తే అంత మంచిది. అది ఎంతో అమ్మాయిలకు స్ఫూర్తినిస్తుంది. వారు చేస్తున్నారు. మేము కూడా చేయగలం అనే ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది' అంటుంది అనురాధ.

వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ ఇస్రో

ఒకప్పుడు ఇస్రోలో పనిచేసిన మహిళలు రిటైర్ అయిన తరువాత ఇంటికే పరిమితం కావచ్చుగాక, అయితే వారు ఎక్కడ ఉంటే అక్కడ ఇస్రో కొలువుదీరుతుంది. ఆనాటి శాస్త్రసాంకేతిక విషయాల గురించి చందమామ కథల్లా ఈతరం పిల్లలకు చెబుతుంటారు. అలాంటి వారిలో ఇస్రోలో తొలి మహిళా కెమికల్ ఇంజనీర్ లలితా రామచంద్రన్ ఒకరు. 1969లో విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వియస్ఎస్‌సి)లో టెక్నికల్ అసిస్టెంట్‌గా చేరినప్పుడు ఆమె వయసు 22 సంవత్సరాలు. తిరువనంతపురంలో క్రయోజనిక్ అప్పర్ స్టేజ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఆమె రిటైర్ అయ్యారు. 'ఆ రోజుల్లో పెద్దగా సౌకర్యాలు లేకపోవచ్చు. అయితే ప్రఖ్యాత శాస్త్రవేత్తలతో కలిసి పనిచేసే అదృష్టం దక్కింది' అంటారు లలిత.


లలితా రామచంద్రన్

1972లో ఇస్రోలో చేరారు జె.గీత. 'ఆరోజుల్లో నెట్ లేదు. డేటా సేకరణ అనేది ప్రధాన సవాలుగా ఉండేది. రిసెర్చ్, రిఫరెన్స్ కోసం లైబ్రరీలకు వెళ్లి గంటల కొద్ది సమయం గడిపేవాళ్లం' అంటున్న గీత... సతీష్‌ధావన్, వసంత్ ఆర్ గోవరికర్‌లాంటి స్టాల్‌వార్ట్స్ మార్గదర్శకత్వంలో పనిచేశారు.

'ప్రాజెక్ట్‌లకు సంబంధించిన చర్చల్లో చురుగ్గా పాల్గొనేవాళ్లం. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా చెప్పే స్వేచ్ఛ ఉండేది. జూనియర్ చెప్పినా సరే, ఆ అభిప్రాయం నచ్చితే ఆమోదించేవారు' అంటున్న రాధిక రామచంద్రన్ 'కేరళ యూనివర్సిటీ'లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయిన తరువాత 1984లో ఇస్రోలో చేరారు.

వంటిల్లు



స్వీట్ కార్న్‌తో హాట్‌హాట్‌గా...

ఉడికించిన స్వీట్‌కార్న్ రుచే వేరే లెవల్! ఉప్పూ కారం జోడించి, కాసింత నిమ్మరసం తగిలిస్తే అహో అద్భుతం అనాల్సిందే. అలాంటి స్వీట్‌కార్న్‌తో వెరైటీ వంటకాలంటే నోరూరుతుంది కదూ! మరింకెందుకు ఆలస్యం ఇలా ట్రై చేసి చూడండి!

స్వీట్‌కార్న్ ఇడియాప్పం



కావలసినవి: స్వీట్ కార్న్ గుజ్జు – 3 కప్పులు; బియ్యప్పిండి – 2 కప్పులు; ఓట్స్ పౌడర్, మైదా లేదా గోధుమ పిండి – పావు కప్పు చొప్పున; జీలకర్ర పొడి – పావు టీ స్పూన్; చిక్కటి పాలు – పావు కప్పు (కాచి చల్లార్చినవి); నీళ్లు – కొద్దిగా, నెయ్యి – టీ స్పూన్; ఎల్లో ఫుడ్ కలర్ – (అభిరుచి బట్టి).

తయారీ: ముందుగా ఒక బౌల్ తీసుకుని అందులో బియ్యప్పిండి, ఓట్స్ పౌడర్, మైదా లేదా గోధుమ పిండి, జీలకర్ర పొడి, స్వీట్ కార్న్ గుజ్జు, పాలు వేసుకుని కలుపుకోవాలి. అవసరాన్ని బట్టి నీళ్లు పోసుకుంటూ ముద్దలా చేసుకోవాలి. ఇప్పుడు ఫుడ్ కలర్ వేసుకుని.. మరోసారి బాగా కలుపుకోవాలి. తర్వాత ఇడ్లీ పాన్‌కి బ్రష్‌తో నెయ్యి పూసుకుని, మురుకుల మేకర్‌కి సన్నని హోల్స్ ఉండే ప్లేట్‌ని అమర్చి, అందులో ఈ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా నింపుకుని, ఇడ్లీ పాన్‌లో నూడుల్స్‌లా ఒత్తుకోవాలి. అనంతరం ఆవిరిపై ఉడికించాలి. అభిరుచిని బట్టి ఆవాలు, కరివేపాకు, కొత్తిమీరలతో తాలింపు వేసి, కలుపుకుని.. సర్వ్ చేసుకుంటే అదిరిపోతుంది.

స్వీట్ కార్న్ హల్వా



కావలసినవి: స్వీట్ కార్న్ – 2 కప్పులు (నీళ్లు పోసి మెత్తగా గుజ్జులా చేసుకోవాలి); బాదం పాలు – ఒక కప్పు; కస్టర్డ్ మిల్క్ – పావు కప్పు; పంచదార – 4 లేదా 6 టేబుల్ స్పూన్లు (పెంచుకోవచ్చు); ఏలకుల పొడి – ఒక టీ స్పూన్; నెయ్యి – 4 టేబుల్ స్పూన్లపైనే; కుంకుమ పువ్వు – చిటికెడు(అభిరుచిని బట్టి); వెనీలా ఎసెన్స్ – ఒక టీ స్పూన్; బాదపప్పు – 2 టేబుల్ స్పూన్లు (దోరగా నేతిలో వేయించాలి, అభిరుచిని బట్టి జీడిపప్పు, కిస్మిస్ వంటివి జోడించుకోవచ్చు)

తయారీ: ముందుగా ఒక పెద్ద బౌల్ తీసుకుని అందులో కస్టర్డ్ మిల్క్, బాదం పాలు, పంచదార, ఏలకుల పొడి, స్వీట్‌కార్న్ గుజ్జు ఒకదాని తర్వాత ఒకటి వేసుకుని మరోసారి కలుపుకోవాలి. అనంతరం స్టవ్ ఆన్ చేసుకుని.. పాన్ బౌల్‌లో సగం నెయ్యి వేసుకుని, వేడి చేసుకుని.. అందులో ఈ మిశ్రమం మొత్తం వేసుకుని చిన్న మంట మీద ఉడికించుకోవాలి. ఆ సమయంలో గరిటెతో తిప్పుతూనే ఉండాలి. మధ్యలో మిగిలిన నెయ్యి వేసుకుని గరిటెతో బాగా కలుపుకోవాలి. కాస్త దగ్గర పడుతున్నప్పుడు వెనీలా ఎసెన్స్ వేసుకుని మరోసారి కలపాలి. ఆ మిశ్రమం మరింత దగ్గర పడుతున్న సమయంలో నేతిలో వేయించిన బాదం పప్పు వంటి వేసుకుని స్టవ్ ఆఫ్ చేసుకుని సర్వ్ చేసుకోవచ్చు.

స్వీట్‌కార్న్ కేక్



కావలసినవి: స్వీట్ కార్న్ – 5 కప్పులు (ఉడికించి, గుజ్జులా చేసుకోవాలి), పిస్తా, వాల్‌నట్స్, బాదం – అర కప్పు చొప్పున, వెన్న – పావు కప్పు, బేకింగ్ పౌడర్ – టీ స్పూన్, పంచదార పొడి – సరిపడా, మైదాపిండి – పావు కప్పు, ఉప్పు – అర టీ స్పూన్, నెయ్యి – కొద్దిగా.

తయారీ: ముందుగా చిన్నబౌల్ తీసుకుని.. అందులో మైదా పిండి, బేకింగ్ పౌడర్, ఉప్పు వేసుకుని కలిపి పక్కన పెట్టుకోవాలి. తర్వాత వాల్‌నట్స్, బాదం, పిస్తాలను నేతిలో వేయించుకుని, చల్లారిన తర్వాత, వాటిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక పెద్ద బౌల్ తీసుకుని.. అందులో వెన్న, స్వీట్‌కార్న్ గుజ్జు వేసుకుని బాగా కలుపుకోవాలి. అవసరం అయితే మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమంలో, పంచదార పొడి, మైదాపిండి మిశ్రమాన్ని వేసుకుని బాగా కలుపుకోవాలి. చివరిగా వాల్‌నట్, బాదం, పిస్తా ముక్కలు వేసుకుని, ఒకసారి కలిపి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు గుండ్రటి బేకింగ్ టిన్‌కి నెయ్యి రాసి.. అందులో ఈ మిశ్రమాన్ని మొత్తం వేసుకుని సమాంతరంగా చేసుకోవాలి. తర్వాత ఓవెన్‌లో బేక్ చేసుకుంటే సరిపోతుంది. కేక్ బేక్ అయిన తర్వాత క్రీమ్‌తో డెకరేట్ చేసి.. నచ్చిన విధంగా అలంకరించుకుని నచ్చిన విధంగా కట్ చేసుకుని సర్వ్ చేసుకోవచ్చు.

● సౌందర్యాత్మక హింస

భార్యల బాడీ షేమింగ్ ఎన్నాళ్లు?



భార్యను బాడీ షేమింగ్ చేయడం ఎప్పటి నుంచో ఉంది. శరీర ఆకృతిని బట్టి పేర్లు పెట్టి పిలుస్తూ వేధిస్తారు భర్తలు. తాజాగా ఒక భర్త మరీ శృతి మించాడు. భార్యను నోరా ఫతేహీలా మారమని రోజుకు మూడు గంటలు జిమ్ చేయిస్తున్నాడు. జిమ్ చేయలేని రోజు పస్తు పెడుతున్నాడు. గర్భం వస్తే అబార్షన్‌కూ వెనుకాడటం లేదు. ఘజియాబాద్‌లో ఆ భార్య పోలీస్ స్టేషన్‌కు వచ్చి 'ఈ భర్త నాకు వద్దు' అని ఫిర్యాదు చేసింది. అంతా నచ్చి, అన్నీ చూసి వివాహం చేసుకున్నాక భర్తలకు వస్తున్న ఈ పాడు జబ్బుకు మందు వెతకాలి.



భార్య పొట్టిగా ఉంటే ఒక నిక్‌నేమ్, సన్నగా ఉంటే మరొకటి, నల్లగా ఉంటే... లావుగా ఉంటే... పొడవుగా ఉంటే... పలువరుస సరిగా లేకపోతే... జుట్టు పలుచగా ఉంటే... శరీర అంగాలు పెద్దవో చిన్నవో ఉంటే... భర్తలు వాటిని కేంద్రంగా చేసుకుని నిక్‌నేమ్స్‌తో పిలుస్తూ ఇంట్లో, పిల్లల ఎదుట, బంధువుల సమక్షంలో ఆట పట్టించడం ఆనవాయితీ. దీనికి అంగీకారం ఉండటం మన సంప్రదాయం. ఆ నిక్‌నేమ్స్ ఏదో సరదాగా పెట్టినట్టు అనిపించినా, భర్త అలా పిలవడంలో ఏదో గారాబం కనిపించినా, ఆ పేర్లన్నీ భార్యను బాడీ షేమింగ్ చేసేవే. భార్య తన భర్తకు నిక్‌నేమ్ పెట్టదు. పెట్టలేదు. పెట్టి నలుగురిలో పిలిస్తే పర్యవసానాలు మనకు తెలుసు. కాని భర్తలు మాత్రం భార్యలను బాడీ షేమింగ్ చేయడం తమ హక్కుగా భావిస్తూ ఉంటారు.

ఫిట్‌నెస్ వేరు... అందం వేరు

భార్యాభర్తలు ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాల్సిందే. పిల్లలు పెరిగి ఒక వయసు వచ్చాక శారీరక మార్పులు స్త్రీ, పురుషుల్లో వస్తాయి. ఫిట్‌నెస్ కోసం కనీస వ్యాయామం, వాకింగ్, ఆహార జాగ్రత్తలు తీసుకోవడం ఇరువురూ పాటించాల్సిందే. భార్య ఫిట్‌నెస్ కోసం భర్తలు సూచనలు చేయడం, వ్యాయామం కోసం ప్రోత్సహించడం మంచి విషయం. కాని సౌందర్యాభిలాషతో, ఇతర స్త్రీలతో పోలుస్తూ... ఈ విధంగా ఉంటే నువ్వు బాగుంటావు... లేకుంటే నచ్చవు అనే సందేశం ఇస్తున్నట్టుగా మాట్లాడటం ఆమెను హింసించడమే. జన్యువుల వల్ల, శరీర తత్వం వల్ల కొందరు స్త్రీల శరీరంలో వ్యాయామంతో తగ్గని బరువు ఉండొచ్చు. లేదా కాన్పుల వల్ల, మెనోపాజ్ వల్ల కూడా తీవ్రమైన మార్పులు రావచ్చు. వాటిని అర్థం చేసుకుని, భార్య ఆరోగ్యం కోసం ప్రయత్నించాలి తప్ప అనునిత్యం కించ పరుస్తూ ఉంటే తప్పు,... నేరం కూడా. కాని భర్తలు ఈ విషయంలో మారడం లేదు. సొంత పిల్లల ఎదుట కూడా భార్యను గేలి చేస్తూ పిల్లలు ఆమెను తేలిగ్గా తీసుకునేలా చూస్తున్నారు.

నోరా ఫతేహీలా ఉండు

కాని ఆగస్టు 20వ తేదీన ఒక భార్య ఆవేదన ఇలాంటి భర్తల స్వభావాన్ని మరోసారి బట్టబయలు చేసింది. ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన ఒక వివాహిత అక్కడి మహిళా పోలీస్ స్టేషన్‌కు వచ్చి భర్త మీద కేసు పెట్టింది. ఆమె తన ఫిర్యాదులో– 'నేను ఈ సంవత్సరం మార్చి నెలలో వివాహం చేసుకున్నాను. నా భర్త ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్. పెళ్లిలో మా వాళ్లు 6 లక్షల బంగారం, 24 లక్షల స్కార్పియో, 10 లక్షల రొక్కం ఇచ్చారు. కాని పెళ్లయి వచ్చినప్పటి నుంచి నన్ను నా భర్త నోరా ఫతేహీ ఫిగర్‌లాంటిది సాధించాలని వేధిస్తున్నాడు. ఇందుకోసం నాకు రోజుకు 3 గంటల వర్కవుట్ చెప్పి చేయిస్తున్నాడు. ఆ వర్కవుట్లు చేసి అలసి ఏ రోజైనా చేయకపోతే ఆ రోజు నాకు అన్నం పెట్టడం లేదు. అత్తామామలు కూడా అతనికి వంత పాడుతున్నారు. నేను చూడటానికి బాగానే ఉంటాను. కాని అతను అది చాలదని, పిల్లలు కూడా ఇప్పుడే వద్దని, గర్భం వస్తే అబార్షన్ చేయించుకోవాలని చెబుతూ నన్ను భయభ్రాంతం చేస్తున్నాడు. ఈ భర్త వద్దు' అని ఫిర్యాదు చేసింది.

ఆరోగ్యం, అనురాగం

భార్యాభర్తల మధ్య ఉండాల్సింది అనుబంధం, అనురాగం, గౌరవం. వారిరువురూ తమ బంధాన్ని బలపరుచుకుంటూ పరస్పరం ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటూ సంతోషంగా జీవిస్తే రూపం సమస్య కాబోదు. రూపదోషాల నిర్వచనం ఒకరి సొత్తు కాదు. కొలతలతో ఉండేదే ఆకృతి కాదు. సంతోషకర దాంపత్యమే అందం, ఆనందం.

● బ్యూటిప్

నాలుగు బాదం పలుకులను పొడి చేయాలి. దీంట్లో టీ స్పూన్ రోజ్ వాటర్, టీ స్పూన్ పచ్చిపాలు కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి వేళ్లతో వలయాకారంలో పది నిమిషాల పాటు మర్దనా చేసి, అయిదు నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో కడిగేసి, పొడిగా తుడిచిన తరవాత మాయిశ్చరైజర్ అప్లై చేయాలి. ఈ విధంగా వారంలో ఒకసారి చేయడం వలన చర్మం నునుపవుతుంది.



బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఆగస్టు 22న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,01,510	94,460	1,17,300
విజయవాడ	1,02,310	92,150	1,17,400
విశాఖపట్నం	1,00,530	92,150	1,28,000
రాజమండ్రి	1,02,310	94,910	1,17,300
ప్రొద్దుటూరు	1,01,000	92.920	1,17,100
చెన్నై	1,00,530	92,150	1,28,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● అక్షరం

స్టడీ..రెడీ.. స్టార్టప్

అక్షరం అంటే ఆమెకు ఆరాధన. పుస్తక పఠనమంటే ప్రీతి. దాంతో అందరూ ఆమెను పుస్తకాల పురుగు అని పిలిచేవారు. పుస్తకాలు చదువుతూనే ఆమె మార్కెటింగ్‌లో ఎం.బి.ఎ. పూర్తి చేసింది. అయితే ఆ చదువును ఆమె కార్పొరేట్ సంస్థలలో లక్షలు సంపాదించి పెట్టే ఉద్యోగం చేయడానికి ఉపయోగించుకోదలచుకోలేదు. సెల్‌ఫోన్లతో... రకరకాల గ్యాడ్జెట్స్‌తో... కంప్యూటర్ గేమ్స్‌తో బిజీ బిజీగా ఉంటున్న నేటి తరంతో కూడా పుస్తకాలను చదివించాలనుకుంది. ముందు తన కూతురు చదవడం కోసం ఆమెను ఆకట్టుకునే పుస్తకాల కోసం వెతుకుతూ, తనకు కావలసిన పుస్తకాలేవీ కనిపించకపోయేసరికి తానే ఒక పుస్తకాలు అమ్మే వ్యాపారాన్ని ఎందుకు ప్రారంభించకూడదు.. అన్న ఆలోచన కలిగింది. అదే బిబ్లియోఫైల్స్ అనే స్టార్టప్‌కు పునాదిగా మారింది. ఆమే ముంబయ్‌కి చెందిన అపూర్వ మాత్రే.



ప్రారంభించిన 6 నెలల్లో 10 వేలకు పైగా కస్టమర్లు 150+ ప్రేరణాత్మక సమీక్షలు వచ్చాయి. ఎందుకంటే బిబ్లియోఫైల్స్ నినాదమే చదవడాన్ని ఒక జీవనశైలిగా మార్చుకోవడం. ఈ ఆలోచనతోనే, అపూర్వ మాత్రే 2020లో పిల్లల పుస్తకాలు అమ్మే స్టార్టప్‌ను స్థాపించింది.



ఒక ఆలోచన నుంచి పుట్టింది

స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలో అనుభవజ్ఞురాలైన అపూర్వ మాత్రే, గొప్ప కార్పొరేట్ నేపథ్యం కలిగిన వ్యూహాత్మక సలహాదారు అద్వైష్ దళ పతిని తన జీవితంలోనే కాదు... వ్యాపారం లో కూడా భాగస్వామిని చేసుకుంది. వారి భాగస్వామ్యం బిబ్లియోఫైల్స్‌కు మూలస్తంభం. విభిన్న నైపుణ్యాలతో కలబోసుకున్న కలలు అద్భుతమైన ఒక ఆలోచనను ఎలా సృష్టించగలవో ఇది రుజువు చేస్తుంది,

‘‘ఒక పుస్తక ప్రియురాలిగా నా బిడ్డకు బాల్యం నుంచే చదవడం పరిచయం చేయాలన్నది నా ఆలోచన. అయితే అది ఒక పనిగా అనిపించకూడదు – దానిని ఆనందదాయకంగా మార్చాలనుకున్నాను. నా కుమార్తె అభిరుచులకు సరిపోయే వయస్సుకు తగిన పుస్తకాలను నేను జాగ్రత్తగా పరిశోధించి ఎంచుకున్నాను. ఫలితంగా, ఆమె పుస్తకంతో ప్రేమలో పడింది. స్క్రీన్ సమయాన్ని తగ్గించేసింది.

త్వరలోనే ఆమె తన స్నేహితులు, కుటుంబ సభ్యులకు వయస్సుకు తగిన పుస్తకాలను సిఫార్సు చేయడం, అమ్మడం ప్రారంభించింది. పిల్లలు ఈ పుస్తకాలను ఇష్టపడ్డారు. చదవడం ఒక ఆహ్లాదకరమైన అనుభవంగా మారింది.

పుస్తకాలతోపాటు...

ప్రారంభంలో పుస్తకాలను మాత్రమే అమ్మే ఈ కంపెనీ చాలా దూరం వచ్చింది. ఇప్పుడు విద్యార్థుల కోసం వివిధ రకాల ఉత్పత్తులను అందుబాటు ధరలలో అందిస్తోంది. ఇందులో లంచ్‌బాక్స్‌లు, బాటిళ్లు, అందమైన స్టిక్కర్ ట్యాగ్‌లు ఇలాంటి అనేక ఇతర వస్తువులు ఉన్నాయి. పిల్లల పుస్తకాల విషయానికి వస్తే అనేక ఎంపికలు ఉన్నాయి.

అసలు చదవడం ఒక జీవనశైలిగా మార్చుకోవాలంటుంది అపూర్వ. దీనిని సాధించాలంటే... మనం మన పిల్లలకు ప్రినేటల్ దశ నుంచే అంటే గర్భంలో ఉన్నప్పటి నుంచే పుస్తకాలు చదివి వినిపించాలన్నది ఆమె ఆలోచన. ఇందుకోసం ప్రత్యేకమైన వాట్సాప్ గ్రూప్ కూడా ఉంది; అది కొత్తపుస్తకం మార్కెట్లోకి ప్రవేశించిన క్షణం నుంచి సిఫార్సులు పంచుకునే స్థలం. బిబ్లియోఫైల్స్ అంతిమ లక్ష్యం భవిష్యత్తు కోసం సిద్ధంగా ఉన్న... సంతోషంగా, బాగా అభివృద్ధి చెందిన పిల్లలను పెంచడం. ఆమె లక్ష్యం నెరవేరాలని ఆశిద్దాం.

> సోషల్ మీడియా, అధిక స్క్రీన్ సమయం ఉన్న సమకాలీన కాలంలో బిబ్లియోఫైల్స్ వంటి స్టార్టప్‌లు మనలోని సృజనాత్మక, ఊహాత్మక స్వభావాన్ని గ్రహించడంలో, దానితో కనెక్ట్ అవ్వడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇది ముఖ్యంగా మన ఆత్మను సజీవంగా ఉంచుతుంది. యువ హృదయాలలో ప్రేమ, కరుణ, సానుభూతిని పెంపొందించడం చాలా అవసరం, బిబ్లియోఫైల్స్ విలువలు, సూత్రాల ద్వారా దానిని సాధ్యం చేస్తోంది.

అవును... నేనే ఓ బిబ్లియోఫైల్

“నేను బిబ్లియోఫైల్స్‌ను ప్రారంభించినప్పుడు, దానిని ఎలా పెంచుకోవాలో నాకు తెలియదు. నా కుమార్తె జీవితాంతం చదవగలిగేందుకు సరిపడా పుస్తకాలు కొన్నప్పటికీ, నేను ఖర్చు చేసినంత సంపాదించలేదనే అపరాధ భావనలోకి నాకు తెలియకుండానే వెళ్లిపోయాను. ఈ ఆలోచన నిప్పురవ్వలా నా అభిరుచిని రగిలించింది, అది నా వృత్తిగా మారింది. అవును... బిబ్లియోఫైల్స్ పుట్టింది, ఎందుకంటే నేనే ఓ బిబ్లియోఫైల్ కాబట్టి. అందుకే నేను దీని ద్వారా ఎంత సంపాదించ గలిగాన్న దానికంటే ఏం సాధించానన్నదే నాకు సంతృప్తినిస్తుంది.”

– అపూర్వ మాత్రే



● విహారం

ఆయువు పెంచే ఆనంద తీరం!

సుదీర్ఘకాలం జీవించాలని కోరుకోని వారు ఎవరుంటారు చెప్పండి... అయితే అలా కోరుకుంటే మాత్రం ఆయుష్మంతులు కావడం అందరికీ సాధ్యం కాదు కదా... దీర్ఘాయువు కావాలనుకునే వారు మాత్రం ఈ అధ్యయనం గురించి చదివి తీరాల్సిందే.



అమెరికాలోని ఒహియో స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు జనాభా లెక్కల ప్రాంతాలలోని జనాభా డేటాను – ఆయుర్దాయంతో సహా – విశ్లేషించగా బయట పడిన విశేషం ఏమిటంటే సముద్రపు గాలి తగిలే ప్రదేశంలో నివసించే వారు తక్కిన వారికన్నా ఎక్కువ కాలం జీవిస్తున్నారట. వారి అధ్యయనం ప్రకారం...

తీరప్రాంత నివాసితులు 79 సంవత్సరాల సగటు కంటే ఒక సంవత్సరం లేదా అంతకంటే ఎక్కువ కాలం జీవిస్తారని అంచనా. తీరప్రాంత నివాసితులు బహుశా ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న వివిధ కారణాల వల్ల ఎక్కువ కాలం జీవిస్తారని పరిశోధకుడు జియాన్యోంగ్ జామీ వు అన్నారు.

తక్కువ ఉష్ణోగ్రతలు, మెరుగైన గాలి, వినోదం కోసం ఎక్కువ అవకాశాలు, మెరుగైన రవాణా, కరువుకు తక్కువ అవకాశం, అధిక ఆదాయాలు అన్నీ లోతట్టు ప్రాంతాలలో నివసించే వారితో పోలిస్తే తీరప్రాంత నివాసితులకు మెరుగైన దృక్పథానికి దోహదపడతాయని విశ్లేషణ సూచించింది.

‘కాలుష్యం, పేదరికం, శారీరకంగా చురుకుగా ఉండటానికి తగిన అవకాశాలు లేకపోవడం, వరదలు వచ్చే ప్రమాదం పెరగడం ఈ తేడాలకు కారణమయ్యే అవకాశం ఉంది’ అని పోస్ట్‌డాక్టోరల్ పరిశోధకురాలు యాని కావో అన్నారు. మొత్తం మీద వీరి పరిశోధన ‘నీలిరంగు స్థలం’ లో జీవించడం, ‘ఎక్కువ కాలం జీవించడం’ మధ్య సంబంధం ఉందా... అని ఆలోచించేలా చేసింది.

● ఆహారం

ఉపవాసం ఎలా ఉత్తమం?

బరువు తగ్గేందుకు చాలామంది చేస్తున్న రకరకాల ప్రయత్నాలలో ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యం పొందిన మాట ఇంటెర్మిటెంట్ ఫాస్టింగ్. అయితే స్త్రీలకు మాత్రం ఈ పద్ధతి అంత మంచిది కాదంటున్నారు వైద్యనిపుణులు.

ఇంటెర్మిటెంట్ ఫాస్టింగ్ అనేది తినే సమయానికి, ఉపవాసానికీ మధ్య నిర్దేశించుకున్న వ్యవధులను పాటించే పద్ధతి. ఉదాహరణకు ఆహారం తీసుకోవడం ఉదయం పది నుంచి సాయంత్రం ఆరుగంటల లోగా ముగించేయాలి. ఆ తర్వాత ఏమీ తినకూడదు. దీనివల్ల బరువు తగ్గడం, మెరుగైన జీవక్రియలు, మంచి జీవన నాణ్యత వంటి ప్రయోజనాలున్నాయి. ఈ ఐఎఫ్ అనేది మీరు ఎప్పుడు తింటారు అనే దానిపై దృష్టి పెట్టాలని చెబుతుంది.

స్త్రీలకు జాగ్రత్త ఎందుకు ?

అధిక ఉపవాసం మహిళల హార్మోన్లలో అసమతుల్యతకు దారితీస్తుంది – ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ – ఋతు చక్రాలు, అండోత్సర్గం, థైరాయిడ్ స్థాయిలు, పీసీఓస్, సంతానోత్పత్తిని కూడా ప్రభావితం చేస్తుంది. ఇది పునరుత్పత్తి పనితీరును నియంత్రిస్తుంది. అంతేకాదు.. ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్‌ను ప్రేరేపించడం వల్ల ఆందోళన, చిరాకు నిద్రపోవడంలో ఇబ్బందులు వంటి సమస్యలకు దారితీస్తుంది. అందువల్ల ఇలాంటి లక్షణాలు కనిపిస్తే మాత్రం ఈ తరహా ఉపవాసానికి దూరంగా ఉండటం ఉత్తమం.



నెమ్మదిగా ప్రారంభించండి, నెమ్మదిగా వెళ్లండి

16 గంటలు ఉపవాసం ఉండి మిగిలిన 8 గంటల వ్యవధిలోపు తినడం మంచిది. అంటే 12/12 మోడ్‌లో, ఉపవాసం రాత్రి 8 నుండి ఉదయం 8 గంటల వరకు, తినే సమయం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉండాలంటున్నారు. రాత్రి ఆలస్యంగా భోజనం చేసే అలవాటున్న వారికిది ప్రయోజనకరం.

సమృద్ధిగా తినండి... హైడ్రేటెడ్ గా ఉండండి

ఈ పద్ధతి పాటించేవారు కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు – ఫైబర్ వంటి అన్ని సూక్ష్మ పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు, బయోఫ్లేవనాయిడ్స్ వంటి ఇతర పోషకాలను తగినంత పరిమాణంలో అందేలా చూసుకోవాలి. ఇందుకోసం కూరగాయలు, పండ్లు, గింజలు, విత్తనాలు, తృణధాన్యాలు, లీన్ మాంసాలు, చేపలు, గుడ్లు, చిక్కుళ్ళు వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలకు ప్రాధాన్యత ఇస్తూనే, పెరుగు, పెరుగు వంటి ప్రోబయోటిక్స్, ఫైబర్ అధికంగా ఉండే కూరగాయలు, పండ్లు వంటి ప్రీ బయోటిక్ వనరులను చేర్చడం కూడా ముఖ్యం. ఉపవాస సమయాల్లో హైడ్రేటెడ్ గా ఉండటం కూడా ముఖ్యం. ఇంటి పని, వంట పని, ఆఫీసు పని తదితర పనుల ఒత్తిడిలో ఉండే స్త్రీలకు ఇన్ని జాగ్రత్తలను పాటించడం కష్టం కాబట్టి దీనికి దూరంగా ఉండటమే ఉత్తమం అంటున్నారు డైటీషియన్లు.

సాక్షి సినిమా


● చిరంజీవి

రియల్ నేమ్‌తో రీల్‌పై...

‘‘చిరంజీవిగారి సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయన కమ్ బ్యాక్ తర్వాత మెగా స్వాగ్ చూడాలని ఒక కోరిక ఉండేది. నాకు ఆ అవకాశం ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూశాను. ఫైనల్‌గా ఆ అవకాశం వచ్చింది. ఆయన బర్త్ డే సందర్భంగా ‘మన శంకర వరప్రసాద్‌గారు’ చిత్రం గ్లింప్స్, ఆయన లుక్ పరిచయం చేయాలనుకుని, చేశాం. చిరంజీవిగారిని మీరందరూ ఎలా చూడాలనుకుంటున్నారో అలా సంక్రాంతికి రెండింతలు చూస్తారు’’ అని దర్శకుడు అనిల్ రావిపూడి తెలిపారు. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా ‘మెగా 157’ (వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో నయనతార హీరోయిన్. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. శుక్రవారం (ఆగస్టు 22) చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రానికి ‘మన శంకర వరప్రసాద్‌గారు’ టైటిల్ ఫిక్స్ చేసి, గ్లింప్స్ లాంచ్ చేశారు. గ్లింప్స్‌కి హీరో వెంకటేశ్ వాయిస్ ఓవర్ ఇవ్వడం ఓ హైలైట్. ఈ టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ‘‘చిరంజీవిగారి అసలు పేరు శివశంకర వరప్రసాద్‌లో నుంచి శంకర వరప్రసాద్ తీసుకుని ఈ సినిమాలో క్యారెక్టర్‌కి పెట్టాం. వెంకటేశ్‌గారు ప్రస్తుతానికి వాయిస్ ఇచ్చారు. త్వరలో ఈ సినిమా షూట్‌లో ఎంట్రీ ఇవ్వనున్నారు’’ అని చెప్పారు. ‘‘నాన్నగారి పుట్టినరోజున మీ అందరి ముందు ఇలా ఉండడం నాకు స్పెషల్ మూమెంట్’’ అని సుస్మిత తెలిపారు. ‘‘యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులు, ఫ్యాన్స్... ఇలా అన్ని తరాలవారికి ఈ సినిమా నచ్చుతుంది’’ అన్నారు సాహు గారపాటి. సంగీతదర్శకుడు భీమ్స్ మాట్లాడారు.

రెండోసారి...

చిరంజీవి హీరోగా డైరెక్టర్ బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో వచ్చిన తొలి చిత్రం ‘వాల్తేరు వీరయ్య’. 2023 సంక్రాంతికి విడుదలైన ఈ సినిమా మంచి విజయం సాధించింది. చిరంజీవి, బాబీ కొల్లి కాంబినేషన్‌లో రెండో సినిమా రానుంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ ‘చిరుబాబీ 2’ అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం నిర్మించనుంది. ‘‘చిరంజీవిని కొత్త క్యారెక్టర్‌లో చూపించడానికి బాబీ పవర్‌ఫుల్ స్క్రిప్ట్ రెడీ చేశారు. తమిళంలో ‘జన నాయకన్, టాక్సిక్, బాలన్’ వంటి సినిమాలు నిర్మించిన కేవీఎన్ ప్రొడక్షన్స్ ‘చిరుబాబీ 2’తో తెలుగు సినీ రంగంలోకి అడుగుపెడుతోంది’’ అని మేకర్స్ తెలిపారు.


● మహేశ్‌బాబు

కామెరూన్‌తో ఫస్ట్ లుక్ రిలీజ్?

హీరో మహేశ్‌బాబు–దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్‌ను సెప్టెంబరులో నైరోబీ, టాంజానియా, సౌత్ ఆఫ్రికా లొకేషన్స్‌లో ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. కాగా ఈ సినిమా అప్‌డేట్‌ను నవంబరులో వెల్లడిస్తామని మహేశ్‌బాబు బర్త్ డే సందర్భంగా ఈ ఆగస్టు 9న రాజమౌళి పేర్కొన్నారు. ఈ సినిమాకు ‘జెన్ 63’ అనే టైటిల్‌ను అనుకుంటున్నారనే వార్త ప్రచారంలో ఉంది. ఇక ‘అవతార్: ఫైర్ అండ్ యాష్’ సినిమా ప్రమోషన్స్ కోసం చిత్రదర్శకుడు జేమ్స్ కామెరూన్ ఇండియా వచ్చినప్పుడు ఈ ‘జెన్ 63’ ఫస్ట్ లుక్, ప్రమోషనల్ కంటెంట్‌ను ఆయన చేతుల మీదుగా రిలీజ్ చేస్తే గ్లోబల్ రేంజ్‌లో రీచ్ ఉంటుందని రాజమౌళి భావిస్తున్నారట. అయితే ఈ విషయంపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. ఇదిలా ఉంటే... 2023లో జరిగిన ఓ అంతర్జాతీయ అవార్డుల వేడుకలో భాగంగా రాజమౌళి, జేమ్స్ కామెరూన్ కలుసుకున్న సంగతి గుర్తుండే ఉంటుంది. ఆ సమయంలో ‘ఆర్ఆర్ఆర్’ చిత్రాన్ని కామెరూన్ ప్రశంసించారు. ఇదిలా ఉంటే... జేమ్స్ కామెరూన్ డైరెక్షన్‌లోని ‘అవతార్: ఫైర్ అండ్ యాష్’ చిత్రం ఈ డిసెంబరు 19న తెలుగులోనూ రిలీజ్ కానుంది.

సస్పెన్స్... థ్రిల్


● రంజిత్, బాబూమోహన్, బిక్కునాథ్ నాయక్

రంజిత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం ‘త్రిశంకినీ’. ఎస్. బిక్కునాథ్ నాయక్ నిర్మిస్తున్న ఈ సినిమాలో పలువురు నూతన నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా టైటిల్ లాంచ్ ఈవెంట్‌కి ప్రముఖ నటుడు బాబుమోహన్ అతిథిగా హాజరై, మాట్లాడుతూ– ‘‘త్రిశంకినీ’ మంచి విజయం సాధించాలి’’ అన్నారు. ‘‘నా స్వస్థలం తిరుపతి. అందరి ఆశీర్వాదంతో మా సినిమా మంచి విజయం సాధించాలనుకుంటున్నా’’ అన్నారు రంజిత్ కుమార్. ‘‘నాకు సినిమాలంటే ప్యాషన్. కృష్ణగారి అభిమానిని. గతంలో పాటలు కూడా రాశాను. సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన ‘త్రిశంకినీ’ని అందరూ ఆదరించాలి’’ అని తెలిపారు ఎస్. బిక్కునాథ్ నాయక్.

రఘు విజయం సాధించాలి

– ఆకాశ్ జగన్నాథ్



● సాయికృష్ణ, ఆకాశ్, రామసత్యనారాయణ

నూతన నటీనటులతో కె. సాయికిశోర్ దర్శకత్వంలో తల్లాడ శ్రీనివాస్, తల్లాడ సాయికృష్ణ నిర్మిస్తున్న చిత్రం ‘రఘు’. హీరో ఆకాశ్ జగన్నాథ్, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ కలిసి ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆకాశ్ జగన్నాథ్ మాట్లాడుతూ–‘‘సినిమా టైటిల్’ అంటే ఒక పేరు మాత్రమే కాదు... ప్రేక్షకులకు సినిమా చూడాలనే ఆసక్తిని కలిగించే తొలిమెట్టు. ‘రఘు’ సినిమా టైటిల్ ఫస్ట్‌లుక్ లాంచ్ కావడం సంతోషంగా ఉంది. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను’’ అని అన్నారు. ‘‘మా శిష్యుడు దర్శక–నిర్మాత తల్లాడ సాయికృష్ణ నిర్మాతగా ‘రఘు’ సినిమా ప్రారంభించారు. ఈ సినిమాతో దర్శక–నిర్మాతలకు, టీమ్‌కి మంచి పేరు రావాలని ఆశిస్తున్నాను’’ అని పేర్కొన్నారు రామసత్యనారాయణ. ‘‘మా అన్నపూర్ణ క్రియేషన్స్ బ్యానర్‌లో తొమ్మిదో సినిమా ఇది. ఇందులో దాదాపు అందరూ కొత్తవాళ్లే నటిస్తున్నారు’’ అని చెప్పారు తల్లాడ సాయికృష్ణ.

కీ రోల్‌కి సై


● అంజలి

విశాల్ హీరోగా రవి అరసు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో దుషారా విజయన్ కథానాయికగా నటిస్తున్నారు. సూపర్ గుడ్ ఫిల్మ్స్‌పై ఆర్‌బీ చౌదరి నిర్మిస్తున్నారు. విశాల్ కెరీర్‌లో 35వ మూవీగా రూపొందుతోన్న ఈ చిత్రంలో హీరోయిన్ అంజలి కీ రోల్‌లో నటిస్తున్న విషయాన్ని మేకర్స్ ప్రకటించారు. ‘‘అంజలి ప్రస్తుతం ఆచితూచి పాత్రలను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో విశాల్ 35 కథ నచ్చి, ఆమె ఓకే చెప్పారు. ‘మద గద రాజా’ చిత్రంలో అంజలి, వరలక్ష్మిలతో విశాల్ చేసిన సందడికి కాసుల వర్షం కురిసింది. మళ్లీ ఇప్పుడు విశాల్, అంజలి కాంబోలో ఈ సినిమా రాబోతోంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది’’ అని యూనిట్ తెలిపింది.

క్యూట్ లవ్‌స్టోరీ


● గురుచరణ్, శ్రియ

గురుచరణ్ నేతి, జుహీ భట్, అమిషి రాఘవ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ‘మిస్టర్ రోమియో’. ఎస్‌కే ఖాదర్, నవనీత్ బన్సాలి, కుల్దీప్ రాజ్, పురోహిత్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. మనోజ్ కుమార్ కటోకర్ దర్శకత్వంలో శ్యామ్ సుందర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను లాంచ్ చేసిన హీరోయిన్ శ్రియ మాట్లాడుతూ– ‘‘టీజర్ చాలా బాగుంది. ‘నాకు రియల్ లవ్ కావాలి. రీల్స్ లవ్ కాదు’ డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. గురుచరణ్‌లో మంచి నటుడు ఉన్నాడు. మనోజ్ ఎప్పుడూ సినిమాల గురించే చెబుతుంటాడు. యంగ్ టీమ్ చేసిన ఈ సినిమా యూనిట్‌కు మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను’’ అన్నారు. ‘‘ఇదొక క్యూట్ లవ్ స్టోరీ’’ అని గురుచరణ్ నేతి అన్నారు. ‘‘గురుచరణ్ ఎనర్జిటిక్‌గా నటించాడు. మరో నెలలో సినిమాని రిలీజ్ చేస్తాం’’ అన్నారు మనోజ్‌కుమార్.

చాలా మంచోళ్లు



● రోషిణి, మొయిన్, యష్ణ

మున్నా ధూళిపూడి దర్శకత్వం వహిస్తున్న చిత్రం ‘బ్యాడ్ గాళ్స్’. ‘కానీ చాలా మంచోళ్లు’ ట్యాగ్ లైన్. అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, మొయిన్, రోహన్ సూర్య కీలక పాత్రల్లో శశిధర్ నల్లా, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మిస్తున్నారు. అనూప్ రూబెన్స్ స్వరపరచిన ఈ సినిమా నుంచి ‘ఇలా చూసుకుంటానే’ పాట త్వరలో విడుదల కానుంది. సిద్ శ్రీరామ్ పాడిన ఈ పాటలో రచయిత చంద్రబోస్ కనిపించడం విశేషం. ‘‘జాతి రత్నాలు, మ్యాడ్’ వంటి హిలేరియస్ చిత్రాలు అమ్మాయిలు చేస్తే ఎలా ఉంటుందో అలాంటి వినోదాత్మక చిత్రమిది’’ అన్నారు మున్నా.

ఓటీటీ | ఇది చూడొచ్చు

ఇష్టం ఎక్కువైనా కష్టమే

ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం ‘మామన్’ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



మన జీవితంలో మనల్ని బాగా ఇష్టపడేవాళ్ళు ఉంటారు, అలాగే ద్వేషించే వాళ్ళు కూడా ఉంటారు. సాధారణంగా మనల్ని ద్వేషించే వారికి దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తాం. అదే మనల్ని ఇష్టపడేవాళ్ళకు దగ్గరగా ఉండాలనుకుంటాం. అయితే అదే ఇష్టం ఎక్కువై, ఆ ఇష్టం మనకి కష్టం తెచ్చిపెడితే ఎలా ఉంటుంది? అన్న సున్నితమైన పాయింట్‌తో తీసిన ఓ భావోద్వేగంతో కూడిన అద్భుతమైన కుటుంబ కథా చిత్రం ‘మామన్’. జీ5 ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ తమిళ సినిమా తెలుగులోనూ లభ్యమవుతోంది. ప్రశాంత్ పాండ్యరాజన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిన్న సినిమా బాక్సాఫీస్ సూపర్ హిట్. అలా అని దీంట్లో పెద్ద స్టార్, గ్లామర్ యాక్షన్ ఇటువంటివి ఏమీ లేకపోయినా సినిమా చూస్తున్నంతసేపు సీటులోంచి కదలలేరు. అంతలా కట్టిపడేస్తుందీ సినిమా. ప్రముఖ తమిళ కమెడియన్ సూరి కథానాయకుడిగా ఈ సినిమాలో నటించి, మెప్పించారు. ఇంకా చెప్పాలంటే సినిమా చూసే ప్రేక్షకుల మనస్సులను కదిలించారు. అంతలా ఏముందో ఈ సినిమాలో ఓసారి చూద్దాం. ‘మామన్’ సినిమా కథ ప్రకారం తమిళనాడులోని తిరుచ్చి ప్రాంతంలో ఇన్బా, గిరిజ అక్కా తమ్ముళ్ళు. ఇన్బాకు అక్కంటే ప్రాణం. అక్కకు పెళ్ళైన చాలా కాలం తరువాత అతి కష్టం మీద ఓ బిడ్డ పుడతాడు. ఆ బిడ్డ పేరు లడ్డూ. అక్క బిడ్డను ఇన్బా అపురూపంగా చూసుకుంటుంటాడు. ఎంతలా అంటే తాను ప్రేమించి పెళ్ళి చేసుకున్న అమ్మాయి రేఖకన్నా లడ్డూ మీదే మమకారం పెంచుకుంటాడు. అయితే అదే సమయంలో ఇన్బా తండ్రి అవుతాడు. ఇక అక్కడి నుండి అసలు సిసలైన కథ మొదలవుతుంది. అక్క బిడ్డా లేక తనకు పుట్టబోయే బిడ్డా అన్న సంఘర్షణలో కథ ఏ మలుపులు తిరుగుతుందో సినిమాలోనే చూడాలి. చాలా సున్నితమైన అంశాన్ని ఎంతో భావుకతతో ప్రేక్షకుడికి ఎక్కడా బోర్ కొట్టనీయకుండా చక్కటి స్క్రీన్‌ప్లేతో సినిమాని నడిపిన విధానం నిజంగా అభినందనీయం. ఈ భూమ్మీద భావావేశాలున్న ప్రతి వ్యక్తి తెలుసుకోవాల్సిన అంశం ఈ సినిమాలో ఉంది. సకుటుంబ సపరివార సమేతంగా ఈ సినిమాని చూడవచ్చు, చూసి చాలా నేర్చుకోవచ్చు. ఆఖరుగా ‘మామన్’ మామూలు సినిమా అయితే కాదు. మస్ట్ వాచ్ ఫర్ ది వీకెండ్.

– హరికృష్ణ ఇంటూరు

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
694	214
81,307	24,870

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	21,527	▲	427
డోజోన్స్	45,694	▲	909
ఎఫ్‌టీఎస్ఈ 100	9,327	▲	17
డాక్స్	24,381	▲	88
హాంగ్‌సెంగ్	3,826	▲	55
నికాయ్	42,639	▲	23

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.95	87.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.80	118.75
€	యూరో	ఎస్‌బీఐ	100.10	102.85
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.13	59.62
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.51	57.55
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.99	69.38
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.46	23.98
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.96	24.97
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.32	13.14

వీసీలు, పీఈలకు గేమింగ్ షాక్



- రియల్ మనీ గేమ్స్‌పై నిషేధంతో భారీ నష్టాలు
- లిస్టులో టైగర్ గ్లోబల్, కలరీ క్యాపిటల్ మొదలైనవి
- గేమింగ్ కంపెనీల్లో 2.4 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసిన సంస్థలు

న్యూఢిల్లీ: రియల్ మనీ గేమ్స్‌పై నిషేధం విధించడం గేమింగ్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసిన పలు వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, ప్రైవేట్ ఈక్విటీ సంస్థలకు షాకింగ్ పరిణామంగా మారింది. దీనితో అవి భారీగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. టైగర్ గ్లోబల్, కలారి క్యాపిటల్, బేస్ పార్ట్‌నర్స్ మొదలైనవి ఈ జాబితాలో ఉన్నాయి. డ్రీమ్11, నజారా టెక్నాలజీస్, జూపీ, మొబైల్ ప్రీమియర్ లీగ్, గేమ్స్ 24x7 లాంటి అయిదు బడా గేమింగ్ కంపెనీలు, వెంచర్ ఫండ్స్ నుంచి దాదాపు 2.4 బిలియన్ డాలర్ల స్థాయిలో పెట్టుబడులు సమీకరించాయి. దేశీయంగా అతి పెద్ద ఫ్యాంటసీ స్పోర్ట్స్ ప్లాట్‌ఫాంలలో ఒకటైన డ్రీమ్11లో టెన్సెంట్, కలారి క్యాపిటల్, అల్ఫా వేవ్ గ్లోబల్, థింక్ ఇన్వెస్ట్‌మెంట్స్ మొదలైనవి 2014 నుంచి దాదాపు 1.6 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాయి. పరిశ్రమ వర్గాల డేటా ప్రకారం కలారీ క్యాపిటల్ 100 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత కొన్ని వాటాలను విక్రయించి పాక్షికంగా తప్పుకుంది. మరోవైపు, మొబైల్ ప్రీమియర్ లీగ్ దాదాపు 396 మిలియన్ డాలర్లు సమీకరించింది. పీక్ ఫిఫ్టీన్ పార్ట్‌నర్స్ టైమ్స్ ఇంటర్నెట్, గూగుల్ వెంచర్స్ లాంటివి ఇన్వెస్ట్ చేశాయి. అటు నజారా టెక్నాలజీస్ 14 విడతల్లో 128 మిలియన్ డాలర్లు పెట్టుబడులు దక్కించుకుంది. వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్, సెకోయా క్యాపిటల్, సీడ్‌ఫండ్ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. గేమ్స్ 24x7 సంస్థ ఆరు విడతల్లో టైగర్ గ్లోబల్ మేనేజ్‌మెంట్, రైన్, మలబార్ ఇన్వెస్ట్‌మెంట్స్ నుంచి 108 మిలియన్ డాలర్లు సమీకరించింది. జూపీలో వెస్ట్‌క్యాప్, జెడ్47, ఏజే క్యాపిటల్ పార్ట్‌నర్స్ తదితర ఇన్వెస్టర్లు 122 మిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టాయి.

ఐపీఎల్‌పైనా ఎఫెక్ట్..

రియల్ మనీ గేమింగ్స్‌పై నిషేధం అటు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)పైనా భారీగా ప్రభావం చూపనుంది. డ్రీమ్11, మై11సర్కిల్‌లాంటి సంస్థలు ఐపీఎల్‌కి బడా స్పాన్సర్లుగా ఉండటమే ఇందుకు కారణం. 2025 ఐపీఎల్‌కి వచ్చిన మొత్తం ప్రకటనల ఆదాయంలో ఫ్యాంటసీ స్పోర్ట్స్ స్పాన్సర్ల వాటా సుమారు రూ. 2,000 కోట్లు ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. డిజిటల్ అడ్వర్టైజింగ్‌పై గేమింగ్ కంపెనీలు అత్యధికంగా ఖర్చు చేస్తుంటాయి కనుక ఐపీఎల్‌తో పాటు ఇతరత్రా ఆటల ప్రసార హక్కులకు పలికే రేటుపైనా ప్రభావం పడుతుందని పేర్కొన్నాయి. ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధంతో అడ్వర్టైజింగ్ పరిశ్రమ ఆదాయంపై సుమారు 10–15 శాతం ప్రతికూల ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

పెయిడ్ గేమ్స్ నిలిపివేత..

కొత్త బిల్లుకు అనుగుణంగా తాము పెయిడ్ గేమ్స్‌ను నిలిపివేస్తున్నామని జూపీ తెలిపింది. అయితే, లూడో సుప్రీమ్, లూడో టర్బో, స్నేక్స్ అండ్ ల్యాడర్స్, ట్రంప్ కార్డ్ మానియాలాంటి ఉచిత గేమ్స్ అందుబాటులో ఉంటాయని వివరించింది. ఇక ఎంపీఎల్, విన్‌జో, నజారా టెక్నాలజీస్ ఇన్వెస్ట్ చేసిన మూన్‌షైన్ టెక్నాలజీస్ (పోకర్‌బాజీ) కూడా రియల్ మనీ ఆన్‌లైన్ గేమింగ్ కార్యకలాపాలు నిలిపివేసినట్లు తెలిపాయి. మూన్‌షైన్ టెక్నాలజీస్‌లో నజారా టెక్నాలజీస్‌కి 46.07 శాతం వాటాలు ఉన్నాయి.

విన్‌జో పోర్ట్‌ఫోలియోలో రమ్మీ, సాలిటైర్, ఫ్యాంటసీ క్రికెట్, పోకర్‌లాంటి 100 పైగా రియల్ మనీ గేమ్స్ ఉన్నాయి. ఎంపీఎల్‌కి ఆసియా, యూరప్, ఉత్తర అమెరికాలో 12 కోట్ల మంది యూజర్లు ఉన్నారు. ఇండియా గేమింగ్ రిపోర్ట్ 2025 ప్రకారం ప్రపంచవ్యాప్తంగా గేమింగ్ యూజర్లలో భారత్‌కి దాదాపు 20 శాతం, గ్లోబల్ గేమింగ్ యాప్ డౌన్‌లోడ్స్‌లో 15.1 శాతం వాటా ఉంది. మన దేశంలో 1,800 పైగా గేమింగ్ స్టార్టప్‌లు ఉన్నాయి. ఇక, రియల్ మనీ గేమ్స్ నిలిపివేతతో నజారా టెక్నాలజీస్ షేరు వరుసగా మూడు రోజుల్లో దాదాపు 18 శాతం పతనమైంది. శుక్రవారం నాడు గేమింగ్, హాస్పిటాలిటీ సంస్థ డెల్టా కార్ప్ 3.50 శాతం, ఆన్‌మొబైల్ గ్లోబల్ దాదాపు 3 శాతం క్షీణించాయి.

ఆందోళనలో పరిశ్రమ..

స్కిల్ గేమ్స్‌కి రాజ్యాంగపరమైన రక్షణ ఉన్నప్పటికీ గేమింగ్ మీద నిషేధం విధించడం ఆశ్చర్యకరమని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రభుత్వం దీన్ని పట్టించుకోకపోవడం సరికాదని డ్రీమ్11 వర్గాలు పేర్కొన్నాయి. దేశీయంగా ఫ్యాంటసీ స్పోర్ట్స్ పరిశ్రమ ప్రస్తుతం 1.82 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండగా 2030 నాటికి ఏకంగా 5.05 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందనే అంచనాలు నెలకొన్న తరుణంలో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సరికాదని అభిప్రాయపడ్డాయి. పెద్ద సంఖ్యలో దీనిపై ఆధారపడిన వారి ఉపాధి, స్పోర్ట్స్‌లో ఆవిష్కరణలు, అత్యధిక నైపుణ్యాలు అవసరమయ్యే ఉద్యోగాలకు నిషేధంతో విఘాతం కలుగుతుందని వివరించాయి.

లార్డ్ స్వరాజ్‌పాల్ కన్నుమూత



ప్రధాని మోదీ సంతాపం

లండన్/న్యూఢిల్లీ: ప్రముఖ ప్రవాస భారతీయ పారిశ్రామిక దిగ్గజం లార్డ్ స్వరాజ్ పాల్ (94) లండన్‌లో కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా ఇటీవల ఆయన చికిత్స కోసం ఆస్పత్రిలో చేరారు. స్వరాజ్‌పాల్ మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. పరిశ్రమ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పాటుపడిన దానశీలిగా ఆయన్ను అభివర్ణించారు. బ్రిటన్-భారత్ సంబంధాలను బలోపేతం చేసేందుకు స్వరాజ్ పాల్ ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. వ్యాపార దిగ్గజం, దానశీలి, అంతర్జాతీయంగా ప్రవాస భారతీయులకు ఆయనొక ఐకాన్ అని తెలిపారు. 1966లో కుమార్తె చికిత్స కోసం బ్రిటన్ వెళ్లిన లార్డ్ పాల్ ఆ తర్వాత అక్కడే అంతర్జాతీయ సంస్థ కపారో గ్రూప్‌ను నెలకొల్పారు. ఉక్కు, ఇంజినీరింగ్, ప్రాపర్టీ తదితర రంగాల్లో దిగ్గజంగా తీర్చిదిద్దారు. బ్రిటన్‌లో అత్యంత సంపన్న ఏషియన్‌గా ఎదిగారు. దశాబ్దాల పాటు వ్యాపార, రాజకీయ రంగాల్లో కీలకంగా నిల్చారు.

భారత్‌లో కింద్రిల్ భారీ ప్రణాళికలు



న్యూఢిల్లీ: అమెరికన్ ఐటీ దిగ్గజం కింద్రిల్ భారత్‌లో భారీ పెట్టుబడుల ప్రణాళికలను ప్రకటించింది. వచ్చే మూడేళ్లలో 2.25 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 19,600 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. భవిష్యత్ టెక్నాలజీ అవసరాలకు తగ్గట్లుగా సిబ్బందికి శిక్షణనివ్వడం, ఏఐ ల్యాబరేటరీ ఏర్పాటు మొదలైన వాటిపై ఈ మొత్తాన్ని వెచ్చించనున్నట్లు పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీతో కింద్రిల్ చైర్మన్ మార్టిన్ ష్రోటర్ భేటీ అనంతరం కంపెనీ ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. దిగ్గజ సంస్థలకు అవసరమైన టెక్నాలజీ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడంపై మరింతగా దృష్టి పెట్టనున్నట్లు వివరించింది. బెంగళూరులో ఏఐ ఇన్నోవేషన్ ల్యాబ్ ఏర్పాటు చేయడం, కృత్రిమ మేథపై భారత ప్రభుత్వంతో కలిసి పని చేయడం, దాదాపు 2,00,000 మంది పౌరులకు డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ కల్పించడంలాంటి అంశాలపై ఫోకస్ చేయనున్నట్లు కింద్రిల్ తెలిపింది. అలాగే, భారత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రా లక్ష్యాలకు, దీర్ఘకాలికంగా దేశ ఆర్థిక పరిస్థితులకు సహాయకరంగా ఉండే ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాల్లో తోడ్పాటు అందించనున్నట్లు వివరించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
భారత్ - బ్రిటన్ మధ్య స్నేహ వారధి .. పాల్ | భారత్‌లో ఓపెన్‌ఏఐ కార్యాలయం

మహిళా ఇన్వెస్టర్లపై సెబీ స్పెషల్ ఫోకస్


ఫస్ట్‌టైమ్ ఫండ్ పెట్టుబడులకు ప్రోత్సాహకాలు



ముంబై: మ్యూచువల్ ఫండ్స్‌లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచడంపై సెబీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మొదటిసారి పెట్టుబడులు పెట్టే మహిళలకు ప్రోత్సాహకాలు అందించే ప్రణాళికతో ఉన్నట్టు సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండే ప్రకటించారు. మహిళల సమాన ప్రాతినిధ్యం లేకుండా ఆర్థిక సమ్మిళితత్వం అసంపూర్ణంగా ఉండిపోతుందన్నారు. అందుకని వారికి పంపిణీ పరమైన ప్రోత్సాహకాలు ఇచ్చే ఆలోచనతో ఉన్నట్టు చెప్పారు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పాండే మాట్లాడారు. టాప్ 30కి (బీ30) వెలుపలి పట్టణాల్లో పంపిణీదారులకు రాయితీలు కల్పించాలన్న ఇటీవలి ప్రతిపాదనను ప్రస్తావించారు. ఈ చర్యలతో కొత్త పెట్టుబడిదారులను భాగస్వాములను చేయొచ్చని, మరింత మందికి మ్యూచువల్ ఫండ్స్ సేవలను చేరువ చేయొచ్చని అభిప్రాయపడ్డారు.

లాభాల స్వీకరణ

- ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ఆరు రోజుల లాభాలకు వారాంతాన బ్రేక్ పడింది. జాక్సన్ హోల్ సదస్సులో యూఎస్ ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగానికి ముందు అప్రమత్తత చోటు చేసుకుంది. ఇటీవల వరుస ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు కీలక రంగాల షేర్లలో లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఫలితంగా సెన్సెక్స్ 694 పాయింట్లు నష్టపోయి 81,307 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 214 పాయింట్లు పతనమై 24,870 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 709 పాయింట్లు కోల్పోయి 81,292 వద్ద, నిఫ్టీ 225 పాయింట్లు పతనమై 24,859 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. డాలర్ మారకంలో రూపాయి 27 పైసలు బలహీనపడి 87.52 వద్ద స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- ఫార్మా, టెలికం, వినిమయ షేర్లు మినహా అన్ని రంగాల్లో అమ్మకాలు వెల్లువెత్తాయి. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 0.35%, 0.23 శాతం పడిపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(–1.28%), రిలయన్స్ (–1%), ఐటీసీ (–2%) ఐసీఐసీఐ (–1%) నష్టపోయి సూచీల పతనానికి కారణమయ్యాయి.

బంగారం విలువపై 90 శాతం రుణం



న్యూఢిల్లీ: ప్రైవేటు రంగంలోని సౌత్ ఇండియన్ బ్యాంక్ 'ఎస్ఐబీ గోల్డ్ ఎక్స్‌ప్రెస్' పేరుతో కొత్త బంగారం రుణ పథకాన్ని ప్రారంభించింది. బంగారం విలువపై 90% వరకు రుణాన్ని ఈ పథకం కింద పొందొచ్చు. రూ.25,000 నుంచి రూ.25 లక్షల వరకు రుణం, గరిష్టంగా మూడేళ్ల కాలానికి తీసుకోవచ్చు. ఎంఎస్ఎంఈలు, నాన్ ఎంఎస్ఎంఈలు, చిన్న సంస్థలు తమ వ్యాపార విస్తరణ, మూలధన అవసరాల కోసం రుణాలు తీసుకోవచ్చని సౌత్ ఇండియన్ బ్యాంక్ ప్రకటించింది. ఎలాంటి రహస్య చార్జీల్లేకుండా, పారదర్శకంగా ఈ రుణ పథకం ఉంటుందని తెలిపింది. మొత్తం ప్రక్రియ డిజిటల్‌గా పూర్తవుతుందని, మొదటిసారి రుణం తీసుకునే వారు కూడా అర్హులేనని పేర్కొంది.



ప్రజ్ఞానంద హ్యాట్రిక్ 'డ్రా'

సింక్‌ఫీల్డ్ కప్ గ్రాండ్ చెస్ టూర్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద ఖాతాలో వరుసగా మూడో 'డ్రా' చేరింది. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో నాలుగో రౌండ్‌లో భారత గ్రాండ్ మాస్టర్లు ప్రజ్ఞానంద, దొమ్మరాజు గుకేశ్ తమ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. సామ్ సెవియాన్ (అమెరికా)తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 28 ఎత్తుల్లో... మాక్సిమి లాగ్రేవ్ (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌ను క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ గుకేశ్ 56 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించారు. ఇతర గేముల్లో ఫాబియానో కరువానా (అమెరికా) 30 ఎత్తుల్లో నొదిర్బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్)పై విజయం సాధించగా... అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)-వెస్లీ సో (అమెరికా) గేమ్ 35 ఎత్తుల్లో... అరోనియన్ (అమెరికా)-జాన్ క్రిస్టాఫ్ డూడా (పోలాండ్) గేమ్ 39 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. నాలుగో రౌండ్ తర్వాత కరువానా 3 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... 2.5 పాయింట్లతో ప్రజ్ఞానంద, అరోనియన్ సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు.



రెజ్లర్ కాజల్‌కు పసిడి పతకం

సమోకోవ్ (బల్గేరియా): ప్రపంచ అండర్–20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. మహిళల 72 కేజీల విభాగంలో భారత రెజ్లర్ కాజల్ పసిడి పతకం సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన ఫైనల్లో కాజల్ 8–6తో లియు యుకి (చైనా)పై విజయం సాధించింది. భారత్‌కే చెందిన సారిక (53 కేజీలు), శ్రుతి (50 కేజీలు) కాంస్య పతకాలు గెలిచారు. కాంస్య పతక బౌట్‌లలో సారిక 11–0తో ఇలోనా వాల్‌చుక్ (పోలాండ్)పై, శ్రుతి 6–0తో జోసిఫిన్ వ్రెంచ్ (జర్మనీ)పై నెగ్గారు. పురుషుల గ్రీకో రోమన్ స్టయిల్‌లో భారత రెజ్లర్ సూరజ్ కాంస్యం దక్కించుకున్నాడు. కాంస్య పతక పోరులో సూరజ్ ఫ్రాన్స్ రెజ్లర్ లుకాస్ లాగ్రాసోపై గెలుపొందాడు.

చిన్నస్వామిలో క్రికెట్ బంద్!

మహిళల వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌లకు దక్కని అనుమతి • నవీ ముంబైకి మ్యాచ్‌ల తరలింపు



చిన్నస్వామి స్టేడియం (ఫైల్)

న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరిగే మహిళల వన్డే వరల్డ్ కప్ వేదికల జాబితా నుంచి బెంగళూరును తొలగించారు. ఇక్కడ జరగాల్సిన మ్యాచ్‌లను నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియానికి తరలించారు. టోర్నీకి సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న భారత్, శ్రీలంక మధ్య చిన్నస్వామి స్టేడియంలో సెప్టెంబర్ 30న తొలి మ్యాచ్‌తో పాటు మరో నాలుగు మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. అయితే ఇక్కడ మ్యాచ్‌ల నిర్వహణకు బెంగళూరు పోలీసుల నుంచి అనుమతి పొందడంలో కర్నాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) విఫలమైంది. ఐపీఎల్–2025లో విజేతగా నిలిచిన అనంతరం జూన్ 4న ఇక్కడ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) నిర్వహించిన సంబరాల్లో ప్రమాదవశాత్తూ 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. అనంతరం జరిగిన దర్యాప్తులో ఆర్‌సీబీ యాజమాన్యాన్ని, కేఎస్‌సీఏను తప్పు పట్టిన కమిటీ... చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌లు నిర్వహించేదుకు సురక్షితం కాదని తేల్చింది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదని అధికారులు ఈ స్టేడియానికి విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేశారు. ఇలాంటి స్థితిలో వరల్డ్ కప్ కోసం అనుమతి సాధించడం అసాధ్యంగా మారింది. తగిన జాగ్రత్తలు తీసుకుంటామని కేఎస్‌సీఏ హామీ ఇచ్చినా పోలీసులు స్పందించలేదు. ఇదే కారణంతో ఇంతకు ముందే అసోసియేషన్ తమ ఫ్రాంచైజీ టోర్నీ మహారాజా ట్రోఫీని బెంగళూరు నుంచి మైసూరుకు తరలించింది. తాజా పరిణామాలన్నీ ఐసీసీ మ్యాచ్‌ల నిర్వహణా నిబంధనలకు ప్రతికూలంగా ఉండటంతో బెంగళూరు నుంచి మ్యాచ్‌లు తరలించాల్సి వచ్చింది. బెంగళూరులో సాధ్యం కాకపోతే తాము తిరువనంతపురంలో మ్యాచ్‌లు నిర్వహిస్తామని కేరళ సంఘం ముందుకు వచ్చినా... అక్కడి నుంచి ప్రధాన నగరాలకు తగినన్ని ఫ్లయిట్‌లు అందుబాటులో లేకపోవడంతో ఆ ఆలోచనను పక్కన పెట్టారు. డీవై పాటిల్ స్టేడియంలో సెమీఫైనల్‌తో పాటు పాక్ అర్హత సాధించకపోతే ఫైనల్‌ను కూడా నిర్వహిస్తారు. ఎనిమిది జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీకి నవీ ముంబైతో పాటు విశాఖపట్నం, గువహటి, ఇండోర్, కొలంబో ఆతిథ్యం ఇస్తాయి.



భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (ఫైల్)

'డ్రీమ్' బంధం ముగిసినట్లే!

- భారత జట్టు స్పాన్సర్‌షిప్ రద్దు చేసే అవకాశం
- ప్రభుత్వ నిబంధనలు పాటిస్తామన్న బీసీసీఐ

న్యూఢిల్లీ: 'సెబీ' నిబంధనలు ఉల్లంఘించిన సహారా గ్రూప్, కాంపిటీషన్ కమిషన్ విచారణను ఎదుర్కొన్న స్టార్ ఇండియా, ఆర్థిక సమస్యలతో ఒప్పో, చెల్లింపులు చేయలేక బాకీపడ్డ బైజూస్... భారత క్రికెట్ జట్టు గత నాలుగు ప్రధాన స్పాన్సర్లు ఏదో ఒక వివాదం లేదా సమస్యతో సహవాసం చేయడం బీసీసీఐకి ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఇప్పుడు ఈ జాబితాలో 'డ్రీమ్ 11' కూడా చేరింది. ఇందులో నేరుగా కంపెనీ పాత్ర లేకపోయినా... ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టంతో పరిస్థితి మారిపోయింది. ఇకపై 'డ్రీమ్ 11' భారత టీమ్ స్పాన్సర్‌గా కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. ఆన్‌లైన్ ఫాంటసీ స్పోర్ట్స్, గ్యాంబ్లింగ్ వేదికలపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఇదే కేటగిరీలో వచ్చే 'డ్రీమ్ 11'కు దీని కారణంగా ఆర్థిక పరంగా గట్టి దెబ్బ తగలనుంది. 2023లో రూ. 358 కోట్లతో మూడేళ్ల కాలానికి బీసీసీఐతో 'డ్రీమ్ 11' ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కాంట్రాక్ట్ 2026 మార్చి వరకు ఉంది. అయితే ఆసియా కప్‌కు ముందే స్పాన్సర్‌షిప్ ఒప్పందం రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా చేసిన వ్యాఖ్యలు దీనికి బలం చేకూరుస్తున్నాయి. 'ఫలానా సంస్థతో ఒప్పందానికి అనుమతి లేదంటే మేం ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకు వెళ్లం. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రతీ పాలసీ, నిబంధనలను బీసీసీఐ పాటిస్తుంది' అని ఆయన చెప్పారు. ఈ స్పాన్సర్‌షిప్‌కు సంబంధించి త్వరలోనే మరింత స్పష్టత రావచ్చు. తక్కువ సమయంలో బోర్డు మళ్లీ కొత్త స్పాన్సర్‌తో ఒప్పందం కుదుర్చుకుంటుందా అనేది ఆసక్తికరం. మరోవైపు డ్రీమ్ 11 శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది. 'డబ్బులు చెల్లించి ఆడే పోటీలన్నింటినీ మేం నిలిపివేశాం. ఉచితంగా ఆడుకునే ఆన్‌లైన్ సోషల్ గేమ్‌లుగా వాటిని మార్చేశాం. ఇన్నేళ్లు మేం నిబంధనల ప్రకారమే పని చేశాం. భారత ప్రభుత్వ చట్టాలను మేం గౌరవిస్తే. ఇకపై మా ఇతర సంస్థలు ఫ్యాన్‌కోడ్, డ్రీమ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ద్వారా క్రీడలతో అనుబంధాన్ని కొనసాగిస్తాం' అని పేర్కొంది.

ఇలవేనిల్‌కు స్వర్ణ పతకం



షిమ్‌కెంట్ (కజకిస్తాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ సీనియర్ విభాగంలో శుక్రవారం భారత్‌కు ఒక స్వర్ణం, రెండు కాంస్యాలు లభించాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో తమిళనాడుకు చెందిన ఇలవేనిల్ వలారివన్ భారత్‌కు పసిడి పతకాన్ని... ఇలవేనిల్, మెహులీ ఘోష్, అనన్య నాయుడులతో కూడిన బృందం కాంస్య పతకాన్ని అందించింది. స్కీట్ మిక్స్‌డ్ విభాగంలో గనీమత్ సెఖోన్-అభయ్ సింగ్ సెఖోన్ జోడీ భారత్ ఖాతాలో కాంస్య పతకాన్ని జమ చేసింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఫైనల్లో 26 ఏళ్ల ఇలవేనిల్ 253.6 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో ఇలవేనిల్ కొత్త ఆసియా రికార్డును నెలకొల్పింది. 2019 నుంచి అపూర్వీ చండేలా (భారత్; 252.9 పాయింట్లు) పేరిట ఉన్న ఆసియా రికార్డును ఇలవేనిల్ సవరించింది. భారత్‌కే చెందిన మెహులీ ఘోష్ 208.9 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. టీమ్ విభాగంలో ఇలవేనిల్ (630.7 పాయింట్లు), మెహులీ (630.3 పాయింట్లు), అనన్య (630 పాయింట్లు) మొత్తం 1891 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. స్కీట్ మిక్స్‌డ్ కాంస్య పతక మ్యాచ్‌లో గనీమత్-అభయ్ ద్వయం 39–37తో అబ్దుల్లా అల్‌రషీది-అఫ్రా (కువైట్) జంటపై నెగ్గింది.

మరోవైపు మహిళల జూనియర్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో శాంభవి, హృదయశ్రీ, ఇషాలతో కూడిన భారత జట్టు 1896.2 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. జూనియర్ స్కీట్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో హర్‌మెహర్ సింగ్-యశస్వి రాథోడ్ జోడీ కాంస్య పతకాన్ని సాధించింది.

భారత్ 'ఎ' 299 ఆలౌట్

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టుతో జరుగుతున్న ఏకైక అనధికారిక టెస్టులో భారత 'ఎ' జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 89.1 ఓవర్లలో 299 పరుగులకు ఆలౌటైంది. రాఘ్వి బిస్త్ (93; 16 ఫోర్లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా... జోషిత (51; 7 ఫోర్లు) కీలక అర్ధశతకంతో మెరిసింది. కెప్టెన్ రాధా యాదవ్ (69 బంతుల్లో 33; 5 ఫోర్లు), మిన్ను మణి (89 బంతుల్లో 28; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా 'ఎ' జట్టు బౌలర్లలో మైట్లాన్ బ్రౌన్, జార్జియా చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి 43 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. కెప్టెన్ తహిలా విల్సన్ (80 బంతుల్లో 49; 7 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

గౌహర్ సుల్తానా రిటైర్మెంట్

ఆటకు వీడ్కోలు పలికిన స్పిన్నర్ • ఐదు ప్రపంచకప్‌లలో భారత్‌కు ప్రాతినిధ్యం



హైదరాబాద్: సీనియర్ లెఫ్టార్మ్ స్పిన్నర్, హైదరాబాదీ గౌహర్ సుల్తానా క్రికెట్‌కు గుడ్‌బై చెప్పింది. అన్ని ఫార్మాట్‌లు, స్థాయిలలో ఆట నుంచి తప్పుకుంటున్నట్లు 37 ఏళ్ల గౌహర్ ప్రకటించింది. 'భారత క్రికెట్‌కు అత్యుత్తమ స్థాయిలో, వరల్డ్ కప్‌లలో ఆడే అవకాశం రావడం నా జీవితంలో దక్కిన గొప్ప గౌరవం. నేను తీసిన ప్రతీ వికెట్, మైదానంలో ఫీల్డింగ్, ఇతర క్రికెటర్ల సాహచర్యం నన్ను క్రికెటర్‌గా, వ్యక్తిగా కూడా ఎంతో తీర్చిదిద్దాయి' అని తన రిటైర్మెంట్ ప్రకటనలో ఆమె పేర్కొంది. 2008లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగు పెట్టిన గౌహర్ చివరిసారిగా 2014లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ఆరేళ్ల కెరీర్‌లో 50 వన్డేలలో 19.39 సగటుతో ఆమె 66 వికెట్లు పడగొట్టింది. 37 టి20 మ్యాచ్‌లలో 5.73 ఎకానమీతో 29 వికెట్లు తీసింది. భారత్ తరఫున ఆడిన రెండు వన్డే వరల్డ్ కప్ (2009, 2013)లలో 12 వికెట్లు తీసిన ఆమె... మూడు టి20 వరల్డ్ కప్ (2009, 2019, 2014)లలో 7 వికెట్లు పడగొట్టింది.

కష్టాల కడలిలో మునగకుండా...



మునగ సాగుతో మంచి ఆదాయం..

మిగతావాటికి ప్రత్యామ్నాయంగా రైతులను వీటివైపు మళ్లించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు

ఆకాంక్ష జిల్లాల కార్యక్రమంలో రోల్‌మోడల్‌గా జిల్లా

నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతుల ఆదాయం పెంపు, గిరిజనుల ఆరోగ్య పరిస్థితి మెరుగుదలకు మునగ సాగును ప్రత్యేక ప్రాజెక్ట్‌గా నీతిఆయోగ్ ముందుకు తెచ్చింది. ఇటీవల విడుదల చేసిన ఒక నివేదికలో నీతిఆయోగ్ ఈ ప్రత్యేక ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను అందించింది. 2018లో నీతిఆయోగ్ దేశవ్యాప్తంగా వెనుకబడిన జిల్లాల అభివృద్ధిలో భాగంగా ఆకాంక్ష జిల్లాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ నుంచి భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం జిల్లాల్లో ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, మౌలిక వసతుల రంగాల్లో వెనుకబాటుతనం ఎక్కువగా ఉన్నందున ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

ఆదాయం లేని పత్తి-మొక్కజొన్న

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రైతులు ఇప్పటివరకు పత్తి (2 లక్షల ఎకరాలు), మొక్కజొన్న (85 వేల ఎకరాలు) సాగు చేస్తూ ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు మాత్రమే ఆర్జిస్తున్నారు. అధిక ఖర్చులు, తక్కువ లాభాలు రైతుల జీవనోపాధిని కష్టాల్లోకి నెట్టాయి. మరోవైపు గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత, సికిల్ సెల్ అనీమియా వంటి సమస్యలు విస్తృతంగా ఉన్నాయి.

మునగ ప్రయోగంతో....

ఈ సమస్యలకు పరిష్కారంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార యంత్రాంగం మునగ సాగును ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చింది. ఎంఎన్ఆర్ఈజీఎస్ సహాయంతో జీరో ఖర్చు మోడల్ రూపొందించి, ఒక ఎకరంలో వెయ్యి మునగ చెట్లు నాటేలా రైతులను ప్రోత్సహించింది. కేవలం 7–8 నెలల్లోనే ఒక ఎకరానికి కనీసం రూ.2 లక్షల ఆదాయం, మునగ ఆకుల విక్రయం ద్వారా అదనంగా రూ.20 వేల వరకు లభిస్తోంది. ఫీల్డ్ డెమోస్, విజయవంతమైన రైతుల అనుభవాలను ప్రదర్శించడం వల్ల మునగ సాగుపై నమ్మకం పెరిగింది. ఇప్పటివరకు జిల్లాలో 415 ఎకరాలు మునగసాగు కిందకు వచ్చాయి. ఇందులో 100 ఎకరాలు ప్రత్యేకంగా, మిగతా 300 ఎకరాలు ఇతర పంటలతో కలిపి సాగు చేస్తున్నారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేనిపేట జీపీ గోపాతండాలో మునగ తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్ (ఫైల్)

పోషకాహారానికి తోడ్పాటు

మునగ ఆకులను కుటుంబ ఆహారంలోనూ, పశువుల మేతలోనూ వినియోగిస్తూ రైతులు కొత్త మార్గాలను ఆవిష్కరిస్తున్నారు. మైలారం గ్రామానికి చెందిన జమీల్ మునగ ఆకులను కోళ్లకు ఆహారంగా వాడి లాభాలు పొందుతున్నాడు. స్థానిక పరిస్థితులకు తగ్గట్టుగా, రైతులే చూపిన మార్గదర్శకత్వంతో ఈ పద్ధతి వేగంగా విస్తరిస్తోంది. జిల్లా అధికారులు మునగ సాగును రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి, గిరిజనుల పోషకాహార లోపాలను తగ్గించడానికి ప్రధాన మార్గంగా భావిస్తున్నారు. ఆకాంక్ష జిల్లాల కార్యక్రమం లక్ష్యాలైన సమగ్రాభివృద్ధి, ఆరోగ్య–పోషక భద్రత వైపు ఈ ప్రయత్నం పునరుద్ధరణ బాటలు వేస్తోంది.

ఇంజనీరింగ్‌లో 13,453 సీట్ల మిగులు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కన్వీనర్ కోటాలో ఇంకా 13,453 సీట్లు మిగిలిపోయాయి. ఈ నెల 18, 19 తేదీల్లో ఇంటర్నల్ స్లైడింగ్ చేపట్టారు. ఒకే కాలేజీలో బ్రాంచి మార్చుకోవడానికి నిర్వహించిన స్లైడింగ్‌లో.. 9,419 మంది 26,122 ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో 3,590 మందికి సీట్లు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 180 కాలేజీలు ఈ ఏడాది ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నాయి. కన్వీనర్ కోటా కింద 90,246 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో 76,893 (85.1 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ ఎ.దేవసేన ఈ వివరాలను వెల్లడించారు.

చేనేతపై జీఎస్టీని ఎత్తివేయాలి

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి

సాక్షి, హైదరాబాద్: చేనేత రంగంపై వస్తుసేవల పన్ను (జీఎస్టీ)ను ఎత్తివేయడం ద్వారా వారసత్వ చేనేత సంస్కృతిని కాపాడాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు శుక్రవారం ఆయన లేఖ రాశారు. తెలంగాణలో వ్యవసాయం తర్వాత అధిక సంఖ్యలో చేనేత రంగంలోనే ఉపాధి పొందుతున్న నేపథ్యంలో.. జీఎస్టీ కారణంగా వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆ లేఖలో వివరించారు. చేనేతపై జీఎస్టీ మినహాయింపు ద్వారా గ్రామీణ చేతి వృత్తుల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తదుపరి జీఎస్టీ సమావేశంలో ఈ అంశంపై చేనేత రంగానికి అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని ఆ లేఖలో చిన్నారెడ్డి విజ్ఞప్తి చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

డ్రాగన్ పండు.. పోషకాలు మెండు


డ్రాగన్ ఫ్రూట్ తోట సాగు


అనేక పోషకాలు సమృద్ధిగా లభించే డ్రాగన్ ఫ్రూట్ ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. వీటిని సాగుచేసే రైతులకూ లాభసాటి పంట అంటున్నారు. పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ గ్రామ **శివారులోని ఒక వ్యవసాయ క్షేత్రంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు.**

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

పాత బట్టలకు భలే గిరాకీ!



ఇంటింటికి తిరిగి స్టీల్ సామాన్లు ఇచ్చి పాతబట్టల కొనుగోలు

- వాటిని అంగట్లో విక్రయం
- పంట చేల చుట్టూ కట్టేందుకు చీరల కొనుగోలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి:

వ్యాపార రంగం ఎంత అభివృద్ధి చెందినా అంగళ్లకు మాత్రం ఆదరణ తగ్గలేదు. వారానికోసారి జరిగే అంగడి (వారపు సంత)లో తమకు అవసరమైన అన్ని వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. కూరగాయల నుంచి నిత్యావసర వస్తువులు, చెప్పులు, బట్టలు, అలంకరణ వస్తువులు.. ఇలా ప్రతీది అంగళ్లలో దొరుకుతాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రతి గురువారం జరిగే అంగడికి వేలాది మంది జనం వస్తుంటారు. పట్టణ ప్రజలే కాకుండా.. చుట్టుపక్కల మండలాల నుంచి కూడా వచ్చి.. తమకు అవసరమైనవన్నీ కొనుగోలు చేస్తారు. కామారెడ్డిలో మరో ప్రత్యేకత ఏమిటంటే వాహనాల అంగడి కూడా ఉంటుంది. పశువులు, మేకలు, గొర్రెల అంగడి కూడా నిర్వహిస్తారు. దీంతో అంగడికి ఆదరణ ఏటేటా పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. కాగా అంగట్లో పాత బట్టలకు భలే గిరాకీ కనిపిస్తోంది. అంగడిలో పాత బట్టల దందాను గమనిస్తే అనేక విషయాలు తెలిశాయి. నిరుపేదలు చాలామంది పాత బట్టలు కొనుగోలు చేస్తారని చెప్పారు. పిల్లలు, పెద్దలకు కావలసిన దుస్తులు పాతవి కొనుగోలు చేయడానికి చాలా మంది వస్తారు. రూ.10 నుంచి రూ.100 దాకా ధరలు ఉంటాయి. అమ్మేవారు ధర చెప్పగానే.. తమకు ఇంతకు కావాలంటూ బేరమాడి కొనుగోలు చేస్తారు.

చీరలకు భలే డిమాండ్

వానాకాలం పంటలు సాగవుతున్న సమయంలో పాత చీరలకు భలే డిమాండ్ ఉంది. చాలా మంది రైతులు అంగడికి వచ్చి చీరలు కొనుగోలు చేస్తున్నారు. పంట చేను చుట్టూరా రక్షణ కోసమంటూ చీరలు కడుతుంటారు. చిరిగిపోయిన చీరలు, దెబ్బతిన్న చీరలు ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.30 దాకా అమ్ముతున్నారు. ఒక్కొక్క రైతు ఇరవై, ముప్పయ్ చీరలు కొనుగోలు చేస్తారన్నారు. మార్కెట్‌కు చీరల మూటలు ఎక్కువగా వస్తున్నాయి. స్థానికులతో పాటు నిజామాబాద్ నుంచి కూడా ట్రాలీ ఆటోలు, వ్యాన్ల నిండా చీరల మూటలు నింపుకొచ్చి అమ్ముతున్నారు.

స్టీల్ సామాన్లకు పాత బట్టలు కొనుగోలు

పల్లెలు, పట్టణాల్లో ఇంటింటికీ తిరుగుతూ.. వస్తుమార్పిడి దందా చేస్తారు. పాత బట్టలు ఇస్తే స్టీల్ పాత్రలు ఇస్తారు. చాలా ఇళ్లల్లో తొడుక్కోకుండా మూలన పడేసిన బట్టలను వీరికి అమ్ముతారు. అలా సేకరించిన బట్టలన్నింటినీ ముల్లెలు కట్టుకుని అంగళ్లకు తీసుకెళ్తారు. స్టీల్ సామాన్లకు పాత బట్టలు కొనుగోలు చేసిన వారు అంగళ్లలో అమ్ముతూ ఎంతో కొంత సంపాదించుకుంటారు. కొందరు పాతబట్టలు మంచిగా ఉంటే.. వాటిని శుభ్రం చేసి ఎక్కువ ధరలకు విక్రయిస్తుంటారు. మంచిగా ఉండే డ్రెస్సులు రూ.50 నుంచి రూ.100 దాకా అమ్ముతుంటారు. మామూలువి అయితే అంతకన్నా తక్కువకు ఇస్తారు.

రోజుకోచోట..

సాధారణంగా అంగళ్లు (వారపుసంతలు) రోజుకో చోట జరుగుతాయి. పెద్ద గ్రామాల్లో జరిగే అంగళ్లకు ఎక్కువగా బట్టలు తీసుకువెళ్లి అమ్ముతుంటారు. కామారెడ్డి అంగట్లో ప్రతి వారం వేలాది పాత బట్టలు అమ్ముడుపోతాయి. ఎక్కడెక్కడి నుంచో తీసుకువచ్చి అమ్ముతుంటారు. అంగట్లో ఓ వైపున పాత బట్టల దందా నడుస్తుంది. ఇతర ప్రాంతాల్లో వేరే రోజుల్లో జరిగే అంగళ్లకు కూడా వెళ్తారు. అక్కడ కూడా అమ్ముతుంటారు. పాత బట్టల దందా దశాబ్దాలుగా నడుస్తోంది. చాలామంది తాతల కాలం నుంచి దందా చేస్తున్నామని చెబుతున్నారు. పాత బట్టల దందా కొందరికి ఉపాధి ఇస్తుండగా, మరికొందరి అవసరం తీరుస్తుంది.







కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అంగడి (వారపు సంత)లో పాత బట్టల అమ్మకాలు

నిండుకుండలా శ్రీశైలం

సాగర్‌కు కొనసాగుతున్న వరద ● 26 గేట్ల ద్వారా నీటి విడుదల

అచ్చంపేట/నాగార్జునసాగర్: ఎగువ నుంచి వస్తున్న కృష్ణానది వరద ప్రవాహం వల్ల శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో శ్రీశైలం ప్రాజెక్టుకు 4,57,237 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఇందులో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు విద్యుదుత్పత్తి, స్పిల్ వే ద్వారా 3,48,933 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,08,054 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్లు 18 అడుగుల మేర ఎత్తి 4,21,530 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. దీంతోపాటు ఎడమ గట్టు భూగర్భ కేంద్రం నుంచి 29,648, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కులు విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు అదనంగా విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.10 అడుగుల వద్ద 198.7354 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

సాగర్‌లో 26 క్రస్ట్ గేట్ల ఎత్తివేత

ఎగువనున్న శ్రీశైలం జలాశయం నుంచి వస్తున్న వరద నీటితో.. సాగర్ జలాశయం 26 క్రస్ట్‌గేట్లు 10 అడుగులు ఎత్తి స్పిల్‌వే మీదుగా 3,54,718 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 32,155 క్యూసెక్కులు.. మొత్తం దిగువ కృష్ణానదిలోకి 3,86,873 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 583.50 అడుగులు ఉంది. ఎగువ నుంచి వరద పోటెత్తుతుండటంతో సాగర్ జలాశయాన్ని కొంత ఖాళీగా ఉంచుతున్నారు.


సాగర్‌లో 26 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

91 కిలోల గంజాయి స్వాధీనం

రైళ్లలో తరలింపుపై ఈగల్ నిఘా



సాక్షి, హైదరాబాద్: గుట్టుచప్పుడు కాకుండా రైళ్లలో ఏసీ బోగీల్లో గంజాయి తరలిస్తున్న ముఠాలకు ఈగల్ బృందాలు చెక్ పెడుతున్నాయి. తాజాగా ఒడిశా నుంచి పుణే తరలిస్తున్న రూ.22.75 లక్షల విలువైన 91 కిలోల గంజాయిని ఈగల్ టీం అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను హైదరాబాద్‌లో అరెస్ట్ చేసినట్టు ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశాలోని గంజాం జిల్లా ముందుల గ్రామానికి చెందిన ప్రకాశ్ చంద్ర ప్రధాన్ (47).. అదే జిల్లాకు చెందిన బసంత బదత్య (20) ఘణశ్యామ్(33) చిత్రసేక జాని (19) కమీషన్ల కోసం రైళ్లలో ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలిస్తున్నారు. ట్రాలీ బ్యాగుల్లో 15 నుంచి 20 కిలోల చొప్పున గంజాయి ఏసీ కోచ్‌లలో.. భువనేశ్వర్ నుంచి పుణేకు తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో ఈ ముఠాను పట్టుకున్నట్టు సందీప్ శాండిల్య తెలిపారు.

ఎన్‌హెచ్-163లో సర్వీస్ రోడ్ల పనులు పూర్తి చేయండి

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ రహదారి–163లో సర్వీస్ రోడ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. యాదాద్రి–వరంగల్ జాతీయ రహదారి 163 (హైదరాబాద్–భూపాలపట్నం రోడ్డు)లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం ఢిల్లీలో రహదారి, ఉపరితల రవాణా శాఖమంత్రి నితిన్ గడ్కరీని కలిసి కావ్య వినతిపత్రం అందించారు. ఎన్‌హెచ్–163ని నాలుగు వరుసలుగా విస్తరించినప్పటికీ, కొన్ని గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు అనుసంధానం లేకపోవడం వల్ల ప్రజల ఇబ్బందులను కేంద్రమంత్రికి వివరించారు. నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్నపెండ్యాల్, కరుణాపురం గ్రామాల వద్ద రోడ్లు ఉన్నా, జనగాం నుంచి ఈ గ్రామాల మధ్యలో లింకులు లేకపోవడం పెద్ద సమస్యగా మారిందన్నారు. అందుకు నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందిస్తూ.. అధికారులతో మాట్లాడి, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని కావ్య తెలిపారు.

మోదీ అసమర్థ విధానాలతో సుంకాల భారం

బీఆర్‌ఎస్ నేత పుట్టా విష్ణువర్ధన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచి పెడుతోందని బీఆర్‌ఎస్ నేత పుట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. మోదీ అసమర్థ పాలనలో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రూ.88కి చేరిందన్నారు. తెలంగాణ భవన్‌లో విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. మోదీ అసమర్థ విధానాలతో దేశ ప్రజలపై అమెరికా రూ.5 లక్షల కోట్ల సుంకాల భారాన్ని మోపిందన్నారు. రష్యా నుంచి భారత్ పెద్ద ఎత్తున చమురు దిగుమతి చేసుకుంటోందనే కారణంతో అమెరికా విధించిన 50 శాతం సుంకాల భారం వస్త్ర, తయారీ రంగాలపై పడుతోందని తెలిపారు. ముఖేశ్ అంబానీ రిలయన్స్ సంస్థ రష్యా నుంచి తక్కువ ధరకు చమురు కొనుగోలు చేసి యూరప్ దేశాలకు ఎగుమతి ద్వారా రూ.1.50 లక్షల కోట్లు సంపాదించిందన్నారు. బీజేపీ నేతలకు దమ్ముంటే కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చిన నిధులపై చర్చకు రావాలని విష్ణువర్ధన్‌రెడ్డి సవాలు చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గం ఇదే

సాక్షి, హైదరాబాద్: సీపీఐ రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా గాజులరామారంలో జరిగిన సీపీఐ 4వ రాష్ట్ర మహాసభల్లో శుక్రవారం నూతన రాష్ట్ర సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

➜ రాష్ట్ర కార్యవర్గంలో కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకట్‌రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, భాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనరసింహ, వీఎస్.బోస్, ఈటి.నర్సింహ, బొమ్మగాని ప్రభాకర్, వి.సీతారామయ్య, పల్లా నర్సింహారెడ్డి, నెల్లికంటి సత్యం, ఎస్.కె.సాబీర్ పాషా, దండి సురేశ్, సీహెచ్.రాజారెడ్డి, ఎస్.బాలరాజ్, మందా పవన్, బి.విజయసారథి కర్రె భిక్షపతి, పాలమాకుల జంగయ్య, ఏ.జ్యోతి, బెజవాడ వెంకటేశ్వర్లు, ఛాయాదేవి, రామడుగు లక్ష్మణ్, కలకొండ కాంతయ్య, ఇ.ఉమామహేశ్, పంజాల శ్రీనివాస్, ముత్యాల విశ్వనాథం, యానాల దామోదర్‌రెడ్డి, షేక్ బాసుమియా ఉన్నారు.

ప్రత్యేక ఆహ్వానితులు: గన్నా చంద్రశేఖర్, జమ్ముల జితేందర్‌రెడ్డి, రమావత్ అంజయ్య నాయక్, కల్లూరి వెంకటేశ్వరరావు, తాండ్ర సదానందం ఎన్నిక కాగా, రంగారెడ్డి నుంచి ఒక స్థానాన్ని భర్తీ చేయాల్సి ఉంది.

రాష్ట్ర సమితి సభ్యులు: కేంద్రం నుంచి కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, పల్లా వెంకట్‌రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, భాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనరసింహ, ఈటి.నర్సింహ, వీఎస్.బోస్, ఏ.జ్యోతి, వి.సజన, ఎస్.బాలరాజ్, ఎండీ.యూసుఫ్, కలకొండ కాంతయ్య తదితరులు ఉన్నారు. వివిధ జిల్లాల నుంచి కూడా నలభైకి పైగా నాయకులను ఎన్నుకున్నారు.

క్యాండిడేట్ సభ్యులు: ముదుపు నళిని, ఎం.నరసింహ, బి.వెంకటేశ్, ఆజ్మీరా రామ్మూర్తి, కె.భూమయ్య, కేవీఎల్, జోగుల మల్లయ్య, సిద్దినేని కరుణాకర్, సలిగండి శ్రీనివాస్, బంటు వెంకటేశ్వర్లు తదితరులు ఎన్నికయ్యారు.

నల్లమల సొగసు చూడతరమా!

ఆకాశంలో తేలియాడుతూ భూమిపైకి వచ్చిన మేఘాలు.. నల్లమల అడవులపై నాట్యం చేశాయి. అటూఇటూ కదులుతూ కనువిందు చేశాయి. భారీగా పెరిగిన వృక్షాలపై గొడుగులుగా కనిపించాయి. 'పొలాల్లో నిలిచిన నీటిని తాగేందుకు వచ్చాయా' అన్నట్లు చలించాయి. చుక్క నీటిని వర్షించకుండా ప్రకృతి సౌందర్యాన్ని అందరికీ పంచాయి. ఈ సుందర దృశ్యాలు ఆత్మకూరు పట్టణ సమీపంలోని నల్లమల అడవి, సమీప ప్రాంతంలో ప్రకృతి ప్రేమికులను మైమరపించాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



కనుచూపు మేర కమనీయ దృశ్యం



మేఘాలు తాకగా.. కొండలు పరవశించగా..



నల్లమల ప్రయాణానికి పచ్చని హారం

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఎన్ఎంయూ

సాక్షి, అమరావతి: స్త్రీ శక్తి పథకం అమలుతో ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్ఎంయూ) రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బస్సుల కొరత, టికెట్లు జారీ చేసే టిమ్ మెషిన్ల చార్జింగ్, ఒక టికెట్‌కు బదులు మరో టికెట్ ప్రింట్ రావడం, ఒక స్టాప్‌లో దిగాల్సిన ప్రయాణికులు మరో స్టాప్ వరకు ప్రయాణించడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. బస్సుల డ్యామేజీకి డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ ఉద్యోగులను బాధ్యులను చేయవద్దని కోరారు.

రైతులకు ఎరువులు ఇవ్వలేకపోవడం సుపరిపాలనా?

సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సూటిప్రశ్న

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైతులకు సకాలంలో ఎరువులు అందించలేని చంద్రబాబు.. సుపరిపాలన అందిస్తున్నట్టు గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఎద్దేవా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, బ్లాక్ మార్కెటింగ్ అరికట్టి, ఎరువులను సక్రమంగా సరఫరా చేయాలని శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

దివ్యాంగులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం

గిరిజన సహకార సంస్థ మాజీ చైర్‌పర్సన్ స్వాతిరాణి

సాక్షి, అమరావతి: పెన్షన్ పెంచినట్టు గొప్పలు చెప్పుకున్న సీఎం చంద్రబాబు ఇప్పుడు వాటి సంఖ్యకు కోత పెట్టారని ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థ(జీసీసీ) మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దివ్యాంగుల పెన్షన్లు తొలగించడం ఆపాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. ఎన్నికల్లో దివ్యాంగులను నమ్మించి ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు పెన్షన్లు తొలగించే కుట్రను అమలు చేస్తూ దారుణంగా దగా చేస్తోందన్నారు. పది, పదిహేనేళ్లుగా పెన్షన్ తీసుకుంటున్న దివ్యాంగులు ఒక్క రోజులోనే అనర్హులా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించాలని స్వాతిరాణి డిమాండ్ చేశారు.

వ్యవసాయ భూ పరిరక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

సాక్షి, అమరావతి: నాలా చట్టాన్ని రద్దు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో వ్యవసాయ భూమి పరిరక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని, రైతులు, వ్యవసాయ కార్మికులతో సమావేశం నిర్వహించి చర్చించిన అనంతరమే 'నాలా'ను రద్దు అమలులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేవలం రియల్ ఎస్టేట్ ప్రయోజనం కోసం నాలా రద్దు చేయడాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఇప్పటికే కార్పొరేట్ల కోసం రాష్ట్రంలో విచ్చలవిడిగా భూ సేకరణ జరుగుతోందన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములను కంపెనీలకు అప్పగిస్తున్న ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా అనేక ప్రాంతాల్లో రైతులు ఉద్యమిస్తున్నారన్నారు. రైతుల అభిప్రాయాలకు భిన్నంగా నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్‌మెంట్ యాక్ట్(నాలా)-2006 చట్టాన్ని రద్దు చేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం సరికాదని శ్రీనివాసరావు తప్పుబట్టారు.

రైలులో లగేజీ మరింత భారం

విమానాల తరహాలో వాత పెట్టేందుకు సిద్ధం

- ఎప్పట్నుంచో ఆంక్షలున్నా.. ఇక పక్కాగా అమలు
- ఫస్ట్ ఏసీ ప్రయాణికులకు 70 కిలోలే గరిష్టం
- స్లీపర్ క్లాస్ అయితే 40 కిలోలు దాటితే జరిమానా
- ఎక్కువ బరువు ఉంటే.. ముందస్తు బుకింగ్ అవసరం
- లేదంటే ఒకటిన్నర రెట్లు ఫైన్ కట్టాల్సిందే.!
- బ్యాగ్ పెద్దదైనా బాదుడు తప్పదు



బ్యాగ్ సైజ్ పెరిగినా వాత పడుద్ది

లగేజీ పరిమితి ఇలా...

క్లాస్	ఉచిత పరిమితి	ఉచిత సడలింపు	గరిష్టం
ఫస్ట్ ఏసీ	70 కిలోలు	15 కిలోలు	150 కిలోలు
సెకెండ్ ఏసీ	50 కిలోలు	10 కిలోలు	100 కిలోలు
థర్డ్ ఏసీ	40 కిలోలు	10 కిలోలు	80 కిలోలు
స్లీపర్ క్లాస్	40 కిలోలు	10 కిలోలు	80 కిలోలు
జనరల్/సెకెండ్ సిట్టింగ్	35 కిలోలు	10 కిలోలు	70 కిలోలు

సాక్షి, విశాఖపట్నం: రైలు ప్రయాణం..అన్నీ సర్దేసుకుని పట్టేసుకుందాం. సీటు కింద బ్యాగులు ఇష్టం వచ్చినట్లు పెట్టేసుకుందాం అంటే కుదరదిక. మీ లగేజీ.. మీకు మరింత భారమవ్వనుంది. ఇకపై రైలులో ప్రయాణికుల లగేజీకి విమాన ప్రయాణంలో మాదిరిగా బాదుడు షురూ చెయ్యనున్నారు. ఎప్పటి నుంచే ఈ నిబంధనలున్నా.. ఇకపై తూ.చా. తప్పకుండా అమలు చెయ్యాలని నిర్ణయించారు. నిర్దేశించిన బరువు కంటే ఎక్కువ లగేజీ ఉంటే ఒకటిన్నర రెట్లు ఫైన్ పడనుంది. సీటు కంటే బ్యాగ్ సైజ్ పెద్దదైనా బాదుడు తప్పదని రైల్వే శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మధ్యతరగతి ప్రయాణికులపైనే అధిక భారం మోపేందుకు రంగం సిద్ధమైంది. ఫస్ట్ క్లాస్ ఏసీ కోచ్‌లో 70 కిలోల వరకూ అనుమతి ఉండగా సెకెండ్ క్లాస్ ప్రయాణికులకు కేవలం 40 కిలోల పరిమితికి మాత్రమే అనుమతించనున్నారు. విమానం ఎక్కేందుకు వెళ్లే ప్రయాణికుల లగేజీ బరువు కొలిచే పద్ధతి అమల్లో ఉంది. ఇప్పుడు రైలు ప్రయాణికులకూ అదే విధానం అమల్లోకి రాబోతోంది. ఇకపై లగేజీ కొలిచే విధానం రైల్వే స్టేషన్లలో కూడా ప్రారంభం కానుంది. కొత్త నిబంధనల ప్రకారం, ప్యాసింజర్లు తమ లగేజీని రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్లలో తనిఖీ చేయించుకోవాలి. రైల్వే శాఖ ప్రతి కోచ్‌కు నిర్దిష్ట లగేజీ బరువు పరిమితులను నిర్ణయించింది. నిర్దేశించిన బరువు మించితే అదనపు చార్జీలు, జరిమానాలు చెల్లించాల్సిందేనంటూ ఇండియన్ రైల్వేస్ కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. భారతదేశంలో ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులు రైలులో ప్రయాణిస్తారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిబంధనలు కఠినతరం చేస్తున్నట్లు రైల్వే బోర్డు చెబుతున్నా.. ఈ నూతన నిబంధనలు.. ప్రయాణికుల జేబులకు చిల్లులు పెట్టబోతున్నాయి.

మధ్యతరగతిపైనే అధిక భారం

ఈ నిబంధనలు గతంలో ఉన్నవే అయినా.. ఇకపై కచ్చితంగా అమలు చెయ్యాలని రైల్వే శాఖ భావిస్తోంది. ప్రతి ప్రయాణికుడి లగేజీ బరువు రైల్వే కోచ్ ప్రకారం నిర్ణయించారు. ఇందులో మధ్యతరగతి ప్రయాణికులు ఎక్కువగా ప్రయాణించే సెకెండ్‌క్లాస్, థర్డ్ ఏసీ పైనే భారం ఎక్కువగా ఉండనుంది. ప్రయాణికుల తరగతిని బట్టి ఉచిత లగేజీ పరిమితిని నిర్ణయించారు. దీని ప్రకారం, ఫస్ట్ ఏసీ ప్రయాణికులు 70 కిలోల వరకు లగేజీని తీసుకెళ్లవచ్చు. సెకండ్ ఏసీ ప్రయాణికులు 50 కిలోలు, థర్డ్ ఏసీ ప్రయాణికులు 40 కేజీల వరకు లగేజీని తీసుకెళ్లవచ్చు. స్లీపర్ క్లాస్ ప్రయాణికులకు కూడా కేవలం 40 కిలోలు మాత్రమే పరిమితి విధించవచ్చు. జనరల్, సెకండ్ సిట్టింగ్ ప్రయాణికులకు కేవలం 35 కిలోల వరకు ఉచిత పరిమితి విధించారు. రైల్వే నిబంధనల ప్రకారం.. నిర్దేశించిన పరిమితి కంటే 10 నుంచి 15 కిలోల వరకు ఎక్కువ లగేజీని తీసుకెళ్లడంలో సడలింపు ఉంటుంది. కానీ బరువు అంతకంటే ఎక్కువగా ఉంటే, ప్రయాణికులు స్టేషన్‌కు వెళ్లి లగేజీని బుక్ చేసుకోవాలి. ఒకవేళ ప్రయాణికుల్లో 5 నుంచి 12 ఏళ్ల వయసున్న వారు ఉన్నట్‌లెతై అనుమతించిన దానిలో సగం లగేజీని తీసుకెళ్లేందుకు అవకాశం ఉంది.

నిర్దేశించిన పరిమితి కంటే ఎక్కువ తీసుకెళ్లినందుకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఒక ప్రయాణికుడు బుకింగ్ పరిమితి కంటే ఎక్కువ లగేజీని తీసుకెళ్తున్నట్లు తేలితే.. సాధారణం కంటే 1.5 రెట్లు అధికంగా జరిమానా విధిస్తారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం ప్రయాణ సమయంలో ప్రతి ప్రయాణికుడి లగేజీ బరువు మాత్రమే కాకుండా బ్యాగ్ పరిమాణం పైనా భారం పడనుంది. ప్రయాణికుల బ్యాగ్ చాలా పెద్దదిగా ఉండి, కోచ్‌లో ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తే, దానిపైనా జరిమానా విధించే అవకాశం ఉందని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. అంటే బరువు తక్కువగా ఉన్నప్పటికీ, పెద్ద సైజు బ్యాగ్ పట్టుకెళ్లినా భారం తప్పదన్న విషయం ప్రయాణికులు గుర్తుపెట్టుకోవాలి. అంటే బుకింగ్ లేకుండా పరిమితి కంటే ఎక్కువ బరువు తీసుకెళ్లడం ఇక జేబుకు చిల్లు పడటమేనని ప్రయాణికులు వాపోతున్నారు. కొందరు ప్రయాణికులు పరిమితికి మించి లగేజీ తీసుకెళ్తుండటం వల్ల తోటి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇకపై ఈ సమస్య లేకుండా ఉండేందుకే నిబంధనలు కఠినతరం చేస్తున్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. వృద్ధుల చేతి కర్రలు, హ్యాండ్ బ్యాగులు, టిఫిన్ బాక్సులపై ఈ లగేజీ పరిమితి వర్తించదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. ఈ నిబంధనలు తొలుత ప్రయాగ్‌రాజ్ డివిజన్‌లోని ప్రధాన స్టేషన్లైన ప్రయాగ్‌రాజ్ జంక్షన్, కాన్పూర్ సెంట్రల్, అలీగఢ్ జంక్షన్ మొదలైన జంక్షన్లలో అమలుకు రంగం సిద్ధం చేశారు. త్వరలోనే మిగిలిన స్టేషన్లలో అమలు చేయనున్నామని రైల్వే అధికారులు వెల్లడించారు.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ లైన్ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు 65,112 మంది స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆది లక్ష్మీదేవికి ప్రాకారోత్సవం



రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో స్వయంభుగా వెలసిన ఆది లక్ష్మీదేవికి శుక్రవారం ఆస్థానసేవ, ప్రాకారోత్సవం, కుంకుమార్చన పూజ చేశారు. శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో ఆది లక్ష్మీదేవిని ఆలయం ముందు ఏర్పాటు చేసిన పద్మపీఠంపై కొలువుదీర్చి వివిధరకాల పుష్పాభరణాలతో అలంకరించి సహస్రనామార్చన, ఆస్థాన సేవ నిర్వహించారు. అనంతరం మేళతాళాలు మంగళవాయిద్యాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, ప్రాకారోత్సవాన్ని (ప్రదక్షిణలు) నిర్వహించి మహిళలచే కుంకుమార్చన సేవ నిర్వహించారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం



కైకలూరు: శ్రావణమాసం ఐదో శుక్రవారం సందర్భంగా ఏలూరు జిల్లా కైకలూరు మండలం కొల్లేటికోట గ్రామంలో కొలువైన పెద్దింట్లమ్మ దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సమీప కొల్లేటిలంక గ్రామాల నుంచి 470 మంది మహిళలు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పేటేటి పరమేశ్వరశర్మ మహిళా భక్తులతో శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతాన్ని చేయించారు. పెద్దింట్లమ్మ చెంత కొలువైన పార్వతీ సమేత జలదుర్గాదేవి ఉత్సవ విగ్రహాన్ని అవినేటి మండపంలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు.

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు



చౌడేపల్లి: చిత్తూరు జిల్లా బోయకొండలోని గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం రాహుకాల అభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల వరకు అర్చనలు, అభిషేక పూజలు చేశారు. శ్రావణమాసపు చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, పూలతో ముస్తాబుచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు ఉపవాస దీక్షలతో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఉభయదారులకు పవిత్ర తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఎంబీయూలో అంతర్జాతీయ సదస్సు

చంద్రగిరి : మోహన్‌బాబు యూనివర్శిటీ(ఎంబీయూ)లోని స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో హెర్బల్ మెడిసిన్స్ అండ్ న్యాచురల్స్ ప్రొడక్ట్స్ ఫ్రమ్ ట్రెడిషన్ టు మాడర్న్ థెరప్యూటిక్స్ అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో ప్రధాన అంశంగా 'మోడర్న్ సైన్స్ ద్వారా సంప్రదాయ వైద్యాన్ని గ్లోబలైజ్ చేయడం' పై చర్చలు నిర్వహించారు. ఎంబీయూ వీసీ ప్రొఫెసర్ నాగరాజ్ రామారావు అధ్యక్షతన ప్రసంగించారు. ఆరోగ్య చైతన్యం పెంపొందించడం, ఖరీదైన వైద్యం అవసరం లేకుండానే వారికి సుఖ సంతోషాలను అందించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా ఆయన పేర్కొన్నారు.

జానపద విజ్ఞానాన్ని కాపాడుకోవాలి

తిరుపతి సిటీ: మరుగున పడుతున్న జానపద విజ్ఞానాన్ని కాపాడుకోవాలని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పిలుపునిచ్చారు. ప్రపంచ జానపద విజ్ఞాన దినోత్సవాన్ని శుక్రవారం ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ.. ప్రాచీనమైన ఎన్నో జానపద కళలు అంతరిస్తున్నాయన్నారు. సరైన ఆదరణ లేకపోవడమే జానపద కళలు అంతరించడానికి ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు. జానపద కళలను రాబోయే తరానికి అందించాలని సూచించారు.

దేశానికే ఆదర్శం.. 'అల్లూరి' జిల్లా

- డీఎన్ఎఫ్ ద్వారా అభివృద్ధికి బాటలు
- నీతి ఆయోగ్ నివేదికలో ప్రశంస

సాక్షి, న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ ప్రారంభించిన ఆకాంక్ష జిల్లాల కార్యక్రమానికి ఎంపికైన అల్లూరి సీతారామరాజు జిల్లా ఇప్పుడు సహకార ఆధారిత అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా మారింది. ఎన్నో ఏళ్లుగా స్వచ్ఛంద సంస్థలు వేర్వేరుగా పని చేస్తూ.. పరిమిత ఫలితాలు మాత్రమే సాధించాయి. దీనిని అధిగమించేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన డిస్ట్రిక్ట్ నాన్ ప్రాఫిట్ ఫోరం(డీఎన్ఎఫ్) కీలక మార్పులు తెచ్చిందని ఇటీవల విడుదల చేసిన నివేదికలో నీతి ఆయోగ్ పేర్కొంది.

ఒకే వేదికపై స్వచ్ఛంద సంస్థలు..

జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు, అభివృద్ధి భాగస్వాములు, ప్రభుత్వ యంత్రాంగం, గ్రామ పంచాయతీలు డీఎన్ఎఫ్ ద్వారా ఒకే దారిలో పయనించాయి. దీంతో ప్రణాళికలు సక్రమంగా అమలవ్వడంతో పాటు సత్ఫలితాలు గ్రామ స్థాయికి చేరాయి. గిరిజనులకు కాఫీ ఆధారిత జీవనోపాధి బలపడింది. గ్రామాల్లో తాగునీరు, ఆరోగ్య సదుపాయాలు మెరుగయ్యాయి. అదనంగా.. ఐదు గ్రామాల్లో సుస్థిర వ్యవసాయ పద్ధతుల పైలట్ ప్రాజెక్ట్ అమలు చేసి రైతులకు కొత్త మార్గాలను చూపించారు. యువత, సివిల్ సొసైటీ భాగస్వామ్యం పెరిగి పంచాయతీల స్థాయిలో నిర్ణయాలు బలపడ్డాయి. సంఘటిత వేదిక లేకుండా అభివృద్ధి కష్టమని అల్లూరి జిల్లా ద్వారా స్పష్టమైందని నీతి ఆయోగ్ పేర్కొంది. డేటా ఆధారిత నిర్ణయాలు, పారదర్శక సమీక్షలు విశ్వసనీయతను తెచ్చాయని ప్రశంసించింది. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల్లో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కూడా మంచి ఫలితాలను ఇచ్చిందని పేర్కొంది. అభివృద్ధిలో సమన్వయం, సహకారం, సమగ్రత అనే సూత్రాలతో ముందుకు సాగుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లా ఇప్పుడు దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని అభినందించింది.

ఇక నుంచి 70:30 నిష్పత్తిలో యూరియా సరఫరా

- మార్క్‌ఫెడ్–ప్రైవేటు వ్యాపారులకు కేటాయింపులు
- ఆర్ఎస్‌కేలకు కేటాయింపులు పెంచాలి
- యూరియా లభ్యత–క్షేత్రస్థాయి పరిస్థితులపై మంత్రి అచ్చెన్న సమీక్ష

సాక్షి, అమరావతి: క్షేత్రస్థాయిలో అంతర్గత యాజమాన్యం సరిగా లేకపోవడం వల్ల యూరియా పంపిణీలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. రాష్ట్రానికి కేటాయించే యూరియా నిల్వలను సీజన్ ముగిసే వరకు మార్క్‌ఫెడ్-ప్రైవేటు వ్యాపారులకు 70:30 నిష్పత్తిలో కేటాయించాలన్నారు. రైతు సేవా కేంద్రాలతో పాటు సొసైటీలకు కేటాయింపులు పెంచాలని, రవాణా వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. 'దారిమళ్లుతున్న యూరియా' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనం నేపథ్యంలో యూరియా లభ్యత, క్షేత్ర స్థాయి పరిస్థితులపై ప్రభుత్వ అత్యున్నత స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో మంత్రి మాట్లాడుతూ యూరియాను తక్షణ పంట అవసరాలకు మాత్రమే కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయేతర పరిశ్రమల అవసరాలకు యూరియా వినియోగిస్తే కేసులు నమోదు చేయాలన్నారు. పంపిణీ వ్యవస్థలో సమస్యను సరిదిద్దాలన్నారు. మార్క్ ఫెడ్ బఫర్ కేటాయింపుల నుంచి రైతు సేవా కేంద్రాలకు ఎరువులను సకాలంలో అందించాలన్నారు. వీటికి అయ్యే రవాణా ఖర్చును ప్రభుత్వం భరించేలా ప్రతిపాదనలను పంపాలని కోరారు.



● సూపర్

పెద్దయ్యి ఏం చేస్తావ్‌' అని అందరూ అడుగుతుంటారు. పెద్దయ్యే ఏదైనా చేయాలా... చిన్నప్పుడే ఏదైనా సాధించవచ్చు కదా అనుకున్న పిల్లలు ఉన్నారు. ఇదిగో ఇక్కడ ఉన్న పిల్లలు అలాంటి వారే. వారు బుర్ర ఉపయోగించి కొన్ని పనులు చేసి శభాష్‌ అనిపించుకున్నారు. వారేం చేశారో చూసి మీరేం చేయగలరో ఆలోచించండి.



కిడ్స్ స్పెషల్




పదో తరగతి పిల్లలు అదరగొట్టేశారు





నిమ్‌ లెప్చా...


సిక్కిం రాష్ట్రంలోని గోర్‌ సెకండరీ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న నిమ్‌ లెప్చా- 2022 లో కేవలం 15 సంవత్సరాల వయస్సులో పాస్‌ కోడ్‌ ఆధారిత గ్యాస్‌ స్టవ్‌ లాకింగ్‌ సిస్టమ్‌ అనే నూతన ఆవిష్కరణ చేశాడు. చిన్న పిల్లలు గ్యాస్‌ స్టవ్‌ను ఆపరేట్‌ చేయడం వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు, ఈ సిస్టమ్‌ పాస్‌కోడ్‌తో స్టవ్‌ను లాక్‌ చేస్తుంది. అంటే మన మొబైల్‌ స్క్రీన్‌ లాక్‌ లాగన్నమాట.





దీప్తి మంజరీ దకువా...

ఒడిశాలోని బహదోర్ఘుల్‌ గర్ల్స్‌ హై స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థిని దీప్తి మంజరీ దకువా. సీడ్‌ కంటైనర్‌ విత్‌ జర్మ్‌ డిటెక్షన్‌ అనే నవకల్పనకు శ్రీకారం చుట్టింది. ఈ స్మార్ట్‌ కంటైనర్‌ విత్తనాలలో సూక్ష్మజీవుల పెరుగుదలను గుర్తిస్తుంది. వ్యవసాయంలో విత్తనాల నాణ్యతను కాపాడుతుంది.





హడాషా రువాంగ్మి...

నాగాలాండ్‌లోని లోర్నాస్‌ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థిని హడాషా రువాంగ్మి. 16 సంవత్సరాల వయస్సులో స్పెక్టకిల్‌ మైక్రోస్కోప్‌ అనే ఆవిష్కరణను రూపొందించింది. సాంప్రదాయ మైక్రోస్కోప్‌ల ఇబ్బందులను అధిగమించేందుకు, ఆమె తేలికైన, కళ్లజోడు లాంటి మైక్రోస్కోప్‌ను రూపొందించారు. ఇది విద్యార్థులకు మరియు శాస్త్రవేత్తలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

● చిత్రం చెప్పిన కథ



లైగర్‌తో దోస్తీ కడదామా



ఇక్కడున్న పెద్దమనిషి పేరు ధర్మవార్‌. థాయ్‌లాండ్‌లో ఒక మెకానిక్‌ షాప్‌ నడుపుతుంటాడు. అక్కడి చట్టాల ప్రకారం పులుల్ని, సింహాలను పెంచుకోవచ్చు. అయితే ఇక్కడ కనిపిస్తున్నది పులి కాదు, సింహం కాదు. రెంటి కలయిక వల్ల పుట్టిన 'లైగర్‌'. అంటే మగ సింహానికి, ఆడ పులికి పుట్టిన మిశ్రమ జంతువు అన్నమాట. మరి మగ పులికి, ఆడ సింహానికి పుడితే దానిని 'టైగాన్‌' అంటారు. లైగర్‌లు చూడటానికి సింహానికి దగ్గరగా ఉంటాయి. ధర్మవార్‌ పెంచుకుంటున్న లైగర్‌కు 'బిగ్‌ జార్జ్‌' అని పేరు పెట్టాడు. అది ధర్మవార్‌ వెనుక తోకలాగా తిరుగుతూ ఉంటుంది... తనకో తోక ఉన్నా. క్రూర జంతవులను పెంచుకుంటూ వాటిని సాధు జీవులుగా మార్చిన మనుషులు ఎందరో ఉన్నారు. క్రూర జంతువులే మారినప్పుడు చెడ్డ అలవాట్లు ఉన్న మనం మారలేమా?

● మహనీయులు


స్త్రీల మేలు కోరిన రచయిత్రి
కనుపర్తి వరలక్ష్మమ్మ



తెలుగు నేల మీద ఎంతోమంది రచయితలు సాంఘిక సంస్కరణకు, అభ్యుదయానికి పాటుపడ్డారు. తమ రచనలతో, జీవన విధానంతో అందరికీ ఆదర్శంగా నిలిచారు. వారిలో ఒకరు కనుపర్తి వరలక్ష్మమ్మ. వరలక్ష్మమ్మ 1896 అక్టోబర్‌ 6న పాలపర్తి శేషయ్య, హనుమాయమ్మ దంపతులకు బాపట్లలో జన్మించారు. ఆమెకు ఐదుగురు సోదరులు, ఇద్దరు సోదరీమణులు. ఆమెకు 1909లో కనుపర్తి హనుమంతరావుతో ఆమె వివాహం జరిగింది. హనుమంతరావు హెల్త్‌ ఇన్స్‌పెక్టరుగా పనిచేసేవారు. చిన్ననాటి నుంచి పుస్తకాలు చదవడం అలవాటున్న వరలక్ష్మమ్మ సొంతంగా రాయడం ప్రారంభించారు. ఆరోజుల్లో ప్రముఖ పత్రికలన్నీ ఆమె రచనలు ప్రచురించేవి. కనుపర్తి వరలక్ష్మమ్మ రచనల్లో ఎక్కువగా స్త్రీల జీవితాలు, వారు పడే ఇబ్బందులు, వాటికి పరిష్కారాలు ఉండేవి. దీనివల్ల ఆమెను మహిళా పాఠకులు విపరీతంగా అభిమానించేవారు. ప్రధానంగా ఆమె రాసిన 'శారద లేఖలు' ప్రాచుర్యం పొందాయి. గృహలక్ష్మి మాసపత్రికలో 1929 నుంచి 1934 వరకు ఈ లేఖలు ప్రచురితమయ్యాయి. ఒక స్నేహితురాలు మరో స్నేహితురాలికి రాసినట్లు సాగే ఈ లేఖలు ఎన్నో సామాజిక అంశాలను చర్చించేవి. ఆ రోజుల్లో వీటికి చాలా ఆదరణ ఉండేది. వాటితోపాటు వరలక్ష్మమ్మ అనేక కథలు రాశారు. కావ్యాలు, గేయాలు, అనువాదాలు, వ్యాసాలు రాశారు. ఆంధ్రప్రదేశ్‌ సాహిత్య అకాడమీ ఉత్తమ రచయిత్రిగా గుర్తింపు పొందారు. 'నమో ఆంధ్ర మాతా' పేరుతో గేయాలు రాశారు. మహాత్మాగాంధీ మీద దండకం రచించారు. 1921లో విజయవాడలో గాంధీని కలిసిన వరలక్ష్మమ్మ జాతీయోద్యమంలో పాల్గొన్నారు. బాలికల అభ్యున్నతి కోసం బాపట్లలో 'స్త్రీ హితైషిణి మండలి'ని స్థాపించి స్త్రీల కొరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఇలా సమాజానికి అనేక సేవలందించిన ఆమె 1978 ఆగష్టు 13న మరణించారు.


● మన పుస్తకాలు

సంయుక్త అక్షరాలు లేకుండా
రాసిన వంద కథలు



సంయుక్త అక్షరాలు (హల్లుతో వేరొక హల్లు చేరినప్పుడు ఏర్పడే అక్షరాలు) లేకుండా వంద కథలు రాసి పిల్లల కోసం పుస్తకంగా మలిచారు ప్రముఖ రచయిత హరికిషన్‌. ఇందులో కథలన్నీ చాలా సరళంగా, చిన్నారులు సొంతంగా చదువుకునేలా ఉంటాయి. పిల్లలకు తెలుగు భాష నేర్పే క్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

సరికొత్త రాజ్యాన్ని సృష్టించుకునే
చిన్నారుల కథ



అమెరికన్‌ రచయిత్రి కేథరీన్‌ పాటర్సన్‌ రాసిన పిల్లల నవల 'బ్రిడ్జ్‌ టు టెరాబిథియా'. ఈ పుస్తకం 1977లో మొదటిసారి ప్రచురితమైంది. ఐదో తరగతి విద్యార్థి జెస్సీ ఆరోన్స్‌ ఒక పేద కుటుంబానికి చెందిన బాలుడు. లెస్లీ బర్క్‌ అనే బాలికతో అతని స్నేహం, ఆపై అతనిలోని భయాలు దూరం కావడం, వారిద్దరూ కలిసి ఓ సరికొత్త రాజ్యాన్ని సృష్టించుకోవడం ఇందులోని కథ. పిల్లలతోపాటు పెద్దల్నీ ఆద్యంతం అలరించే శైలి ఈ నవల సొంతం.

● వండర్‌ గర్ల్‌

తను బొమ్మలు గీస్తే డబ్బే డబ్బు







ఖాళీ కాగితాలు కనిపిస్తే చిన్నపిల్లల వాటిపై బొమ్మలు గీస్తూ ఉంటారు. పెద్దలు వాటిని చూసి మురిసిపోతూ ఉంటారు. ఇదంతా చిన్నారులకు ఆనందం, పెద్దలకు మురిపెం. అయితే చిన్నారి గీసిన చిత్రాలకు రూ.కోట్లలో ధర పలికితే? అది సాధ్యమేనా? సాధ్యమే అని నిరూపించింది ఆస్ట్రేలియాకు చెందిన ?ఎలిటా ఆండ్రీ. రెండేళ్లకే చిత్రలేఖనం మొదలుపెట్టిన ఈ అమ్మాయి గీసిన చిత్రాలు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అమ్ముడుపోతున్నాయి.

ఎలిటా ఆండ్రీ 2007లో జన్మించింది. ఆమెది ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌. రెండేళ్ల వయస్సులోనే బొమ్మలు గీయడం మొదలుపెట్టింది. అందరు చిన్నారులు వేసే లాంటి చిత్రాలు కాకుండా కొత్త రకమైన చిత్రకళను సాధన చేసింది. అబ్స్ట్రాక్ట్‌ ఆర్ట్‌ (నైరూప్య కళ) ద్వారా తాను అనుకున్న భావాలను చిత్రాలుగా గీసేది. అందు కోసం తను ఎంచుకునే థీమ్స్, తీసుకునే రంగులు విభిన్నంగా ఉండేవి. దీంతో అతి చిన్నవయసులో అబ్స్ట్రాక్ట్‌ ఆర్ట్‌లో కృషి చేస్తున్న కళాకారిణిగా తన గురించి అందరికీ తెలిసింది. మెల్లగా తన చిత్రాలు అందరికీ పరిచయమయ్యాయి. ఎలిటా గీసే ఒక్కో చిత్రం సుమారు 50,000 యూఎస్‌ డాలర్ల(దాదాపు రూ.43 లక్షల) వరకు అమ్ముడవుతాయి. సెయింట్‌ పీటర్స్‌బర్గ్‌లోని రష్యన్‌ అకాడమీ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ మ్యూజియం, మయామిలోని ఆర్ట్‌ బాసెల్‌తో సహా అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన అనేక మ్యూజియంలలో ఎలిటా తన చిత్రాలను ప్రదర్శించింది. ప్రస్తుతం ఎలిటాకు 18 ఏళ్లు. చిత్రకళను మరింత సాధన చేస్తూ, తన సొంత వెబ్‌సైట్‌ ద్వారా చిత్రాలను అమ్ముతోంది. చిత్రకారిణిగా మరింత పేరు తెచ్చుకోవడమే తన ధ్యేయం అని వివరిస్తోంది.

● మన హస్తకళ


రాజా రాణి బొమ్మలు



బొమ్మలంటే మనకు చాలా ఇష్టం. ఇప్పుడంటే ప్లాస్టిక్, రబ్బర్‌ బొమ్మలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఒకప్పుడు పిల్లలు ఆడుకోవాలంటే చెక్కబొమ్మలే దొరికేవి. అలాంటి బొమ్మలతో పిల్లలు ఆడుకోవడంతోపాటు, వాటిని ఇంట్లో పలు కార్యక్రమాలకు, అలంకరణలకూ వాడేవారు. అలాంటివే అన్నమయ్య జిల్లాలో తయారయ్యే రాజారాణి బొమ్మలు. అన్నమయ్య జిల్లాలోని లక్ష్మీగారిపల్లి, సెట్టిగుంట గ్రామాల్లో తయారు చేసే రాజారాణి బొమ్మలు చాలా ప్రసిద్ధి పొందాయి. ఈ బొమ్మల తయారీకి వాడే చెక్క, వాటికి వేసే సహజ రంగుల కారణంగా ఇవి పర్యావరణానికి మేలు చేయడంతోపాటు పిల్లలకూ ఎటువంటి హాని కలిగించవు. ఈ బొమ్మల తయారీకి కుదుమట్టి కలప, సర్కార్‌ కలప, టేకు కలపను ఉపయోగిస్తాయి. రాజారాణి బొమ్మలు ఆటలకే కాకుండా ఇంటి అలంకరణకూ వినియోగిస్తారు. స్థానికంగానే కాకుండా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ బొమ్మలు ప్రఖ్యాతి పొందాయి. నవరాత్రి పండగ సమయంలో బొమ్మల కొలువులో తప్పకుండా వీటిని ఉంచుతారు. విదేశాల్లో సైతం ఈ బొమ్మలు కొంటూ ఉంటారు. కొన్నిచోట్ల ఈ బొమ్మలను పెళ్లికూతురికి వివాహ బహుమతిగా కూడా ఇస్తారు. భలే బాగున్నాయిగా రాజారాణి బొమ్మల సంగతులు.

● కథ

అపాయంలో ఉపాయం



అనగనగా ఓ ఊరిలో రాము, రంగా అనే ఇద్దరు స్నేహితులు ఉండేవాడు. రాముకు కళ్లు కనిపించవు. రంగాకు కాళ్లు పనిచేయవు. రాము బలిష్టమైనవాడు కావడంతో రంగాను ఎత్తుకొని, అతను చెప్పిన దారిలో నడిచేవాడు. అలా ఇద్దరూ కాలం గడుపుతూ ఉండేవారు. ఒకసారి పక్కూరిలో జరుగుతున్న తిరునాళ్లు చూడాలని రంగాకు ఆశ కలిగింది. ఆ విషయం రాముతో చెప్పగా సరేనని రంగాను ఎత్తుకొని పక్కూరికి బయలుదేరాడు.

మధ్యలో ఆయాసం వచ్చినప్పుడల్లా కాసేపు ఆగి సేదతీరారు. ఆ సమయంలో రంగాకు ఓ చోట తాడు కనిపించింది. దాన్ని తన వద్ద దాచుకున్నాడు. మరోచోట నీళ్ల కోసం బావి దగ్గర ఆగినప్పుడు ఓ తాబేలు కనిపించింది. దాన్ని తన సంచీలో వేసుకున్నాడు. మరోచోట ఓ పాలరాయి కనిపించింది. దాన్నీ తన వద్ద పెట్టుకున్నాడు. దారితో పోతూ ఉండగా ఓ దీపం కనిపించింది. దాన్నీ తన వద్ద జాగ్రత్త చేశాడు. అలా ఆగి ఆగి వెళ్తుండటంతో వారు అడవికి చేరుకునేసరికి చీకటి పడింది. రాత్రిపూట ప్రయాణం సరికాదని, వారు అక్కడే ఉండేందుకు చోటును అన్వేషించారు. వెతకగా వెతకగా రంగాకు ఓ గుహ కనిపించింది. అందులో ఏ జంతువూ లేకపోవడంతో ఆ రాత్రికి అందులోనే ఉందామని రాముతో చెప్పాడు. సరేనని ఇద్దరూ అక్కడే ఉన్నారు.

వాళ్లు నిద్రలో ఉండగా అర్ధరాత్రి ధన్..ధన్‌మని చప్పుడయ్యింది. రంగా కళ్లు తెరిచి చూడగా దూరంగా ఓ రాక్షసుడు వస్తూ కనిపించాడు. ఆ గుహ రాక్షసుడి నివాసం అని, అందుకే ఇందులో ఏ జంతువూ ఉండటం లేదని అర్థమైంది. రాక్షసుడిని తప్పించుకునేందుకు గుహలో మరో మార్గం లేదు. రాక్షసుడికి ఎదురువెళితే చావు తప్పదు. విషయం రాముతో చెప్పి ఇద్దరూ ఓ పెద్ద బండరాయి వెనక దాక్కున్నారు.

లోపలికి వచ్చిన రాక్షసుడికి గుహలో ఎవరో కొత్త వారు ఉన్నారన్న విషయం అర్థమైంది. వెంటనే గట్టిగా 'ఎవర్రా అదీ? నా గుహలోకి వచ్చి నన్నే మోసం చేయాలని చూస్తారా? మర్యాదగా బయటకు రండి' అని అరిచాడు. రాము, రంగాలకు ఏం చేయాలో అర్థం కాలేదు. తమకిక చావు తప్పదని భావించారు. అయితే మొండిధైర్యం తెచ్చుకొని బండ వెనుకనుంచి, 'ఎవర్రా నువ్వు? నా గుహలోకి వచ్చి నన్నే బెదిరిస్తున్నావ్‌?' అన్నాడు రంగా.

రాక్షసుడు ఆశ్చర్యపోయి 'ఇది నీ గుహ ఎలా అవుతుంది? ఇది నా గుహ' అన్నాడు. దానికి రంగా 'ఓరీ..కొంతకాలం నేను దేశాటనం చేయడానికి వెళ్లగానే నా గుహ నువ్వు ఆక్రమించుకుంటావా? నేనెవరో తెలుసా? రాక్షసుల వర్గానికి అధినేతను' అని గట్టిగా నవ్వాడు. ఆ మాటతో రాక్షసుడికి భయం పుట్టింది. కానీ బింకంగా 'నువ్వంత మొనగాడివే అయితే ఏదీ నాతో పోరాటానికిరా' అని సవాల్‌ చేశాడు.

'ఛీ..నీలాంటి కుర్రకుంకతో నాకు పోరాటం ఏమిటి? కావాలంటే నా వెంట్రుక బలం చూడు' అంటూ తన దగ్గరున్న తాడును విసిరేశాడు. అది దబ్‌మంటూ రాక్షసుడి కాళ్ల ముందు పడింది. వెంట్రుకే ఇంత పెద్దగా ఉంటే ఆ ఆకారం ఇంకెంత పెద్దగా ఉంటుందో అనిపించింది రాక్షసుడికి. అయినా ధైర్యం తెచ్చుకొని, 'నాకూ ఉన్నాయి వెంట్రుకలు. దీంతో నన్ను బెదరగొట్టలేవు' అన్నాడు. 'అయితే నా వెంట్రుకలో పేను ఎంత పెద్దదో చూడు' అంటూ తాబేలును విసిరాడు రంగా. దాన్ని చూసిన రాక్షసుడికి దడ పుట్టింది.

అయినా మొండిధైర్యం తెచ్చుకొని, 'ఇవన్నీ వద్దు. నువ్వే బయటకు రా' అని పిలిచాడు. 'నేనెందుకు? నా గోటిదెబ్బ చాలు నీకు' అంటూ పాలరాయిని రాక్షసుడి పైకి వేశాడు. అది తగిలి రాక్షసుడి తలలోంచి రక్తం కారింది. గోరే ఇంత బలంగా ఉంటే ఆ రాక్షసుడు ఇంకెంత బలంగా ఉంటాడో అని రాక్షసుడు భయపడ్డాడు. ఇంతలో దీపం వెలిగించిన రంగా దాని ముందు నిలబడ్డాడు. దీపం వెలుగు అతని మీద పడి, ఎదురుగా ఉన్న గుహ గోడలపై పెద్దగా కనిపించింది. అంత పెద్ద ఆకారం చూసేసరికి రాక్షసుడు గజగజ వణికి పోతూ గుహ బయటకు పారిపోయాడు. దీంతో రాము, రంగా హాయిగా అక్కడ పడుకొని, తెల్లవారి లేచి తిరునాళ్లకు చేరుకున్నారు.



బిజినెస్ రీల్

భారత్‌లో ఓపెన్ ఏఐ కార్యాలయం



న్యూఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఓపెన్‌ఏఐ ఈ ఏడాది భారత్‌లో తొలి కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. న్యూఢిల్లీలో దీన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. ఇందుకోసం ఇప్పటికే స్థానికంగా నియామకాలు కూడా ప్రారంభించినట్లు వివరించింది. చాట్‌జీపీటీకి అమెరికా తర్వాత భారత్ రెండో అతి పెద్ద మార్కెట్‌గా ఉన్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్‌లో కార్యాలయం తెరవడం వల్ల ఇక్కడి యూజర్లకు మరింత మెరుగైన సర్వీసులు అందించేందుకు వీలవుతుందని ఓపెన్ ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మన్ తెలిపారు. స్థానిక భాగస్వాములు, ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు, డెవలపర్లు, విద్యా సంస్థలతో కలిసి పని చేయడంపై స్థానిక సిబ్బంది దృష్టి పెడతారని వివరించారు.

మోసపూరిత పథకాల పట్ల జాగ్రత్త: సెబీ హెచ్చరిక



న్యూఢిల్లీ: మోసపూరిత ట్రేడింగ్ పథకాల విషయంలో అప్రమత్తంగా ఉండాలంటూ ఇన్వెస్టర్లను సెబీ హెచ్చరించింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల ద్వారా (ఎఫ్‌పీఐలు) స్టాక్ మార్కెట్లో పెట్టుబడులకు అవకాశం కల్పిస్తామంటూ సోషల్ మీడియా సందేశాలు, మొబైల్ అప్లికేషన్లపై చేసే ప్రచారం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఆ తరహా పథకాలు చట్టవిరుద్ధమైనవంటూ.. వీటికి సెబీ ఆమోదం లేనట్టు స్పష్టం చేసింది. వాట్సప్, టెలిగ్రామ్ లేదా ఇతర యాప్‌లపై ఎఫ్‌పీఐల రూపంలో పెట్టుబడుల అవకాశాలు కల్పిస్తామన్న మోసపూరిత పథకాలకు దూరంగా ఉండాలని కోరింది. ఇనిస్టిట్యూషనల్ ట్రేడింగ్ ఖాతాలు, తక్కువ ధరలకే ఐపీవోలు, ఐపీవోల్లో కచ్చితమైన కేటాయింపులు అంటూ తప్పుదోవ పట్టించే క్లెయిమ్‌లను నమ్మొద్దని సూచించింది. భారత్‌లో నివసించే పౌరులకు ఎఫ్‌పీఐ పెట్టుబడుల మార్గం అందుబాటులో ఉండదని గుర్తు చేసింది. ఆయా సంస్థలకు రిజిస్ట్రేషన్ ఉందా? లేదా అన్నది సెబీ వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చని తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-8-2025

విశాఖ	525-00
చిత్తూరు	558-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	495-00
వరంగల్	497-00
రిటైల్ ధర	5.55

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	3,400.10	0.74
MARUTI	14,370.00	0.63
BEL	375.15	0.25
BHARTIARTL	1,933.00	0.16
TITAN	3,618.90	0.07

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
GRASIM	2,807.80	-2.55
ASIANPAINT	2,505.00	-2.4
ADANIENT	2,323.00	-2.28
ULTRACEMCO	12,605.00	-2.06
HEROMOTOCO	4,992.30	-2.06

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,724
ఎన్ఎస్ఈ	82,242
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,25,387
ఎఫ్ఐఐ	- 1,623
డీఐఐ	- 329

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.77 (రాత్రి 11.30కు)	$ 63.52 (క్రితం ముగింపు)
బ్రెంట్	67.83 (రాత్రి 11.30కు)	$ 67.67 (క్రితం ముగింపు)

భారత్ - బ్రిటన్ మధ్య స్నేహ వారధి .. పాల్



- ఇండో-బ్రిటిష్ అసోసియేషన్‌కి శ్రీకారం
- బహుళజాతి దిగ్గజం కపారో గ్రూప్ ఏర్పాటు
- సంక్షేమ కార్యక్రమాలకు భారీగా విరాళాలు



న్యూఢిల్లీ: పారిశ్రామిక దిగ్గజం స్వరాజ్ పాల్ పంజాబ్‌లోని జలంధర్‌లో 1931 ఫిబ్రవరి 18న జన్మించారు. ఆయన తండ్రి ప్యారేలాల్ స్థానికంగా చిన్నపాటి ఉక్కు ఫౌండ్రీని నడిపేవారు. స్వరాజ్ పాల్ 1949లో పంజాబ్ యూనివర్సిటీలో బీఎస్సీ పూర్తి చేశాక అమెరికాలోని ప్రతిష్టాత్మక మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో (ఎంఐటీ) మెకానికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్స్, మాస్టర్స్ చేశారు. స్వదేశానికి తిరిగొచ్చాక కుటుంబ వ్యాపారమైన ఏపీజే సురేంద్ర గ్రూప్‌లో చేరారు. అయితే, ల్యూకేమియాతో బాధపడుతున్న కుమార్తె అంబికాకు మెరుగైన వైద్యచికిత్స కోసం 1966లో ఆయన బ్రిటన్‌కి వెళ్లారు. కానీ, దురదృష్టవశాత్తూ నాలుగేళ్లకే కుమార్తె కన్ను మూయడంతో విషాదంలో మునిగిపోయిన పాల్.. ఆ తర్వాత ఆమె పేరిట అంబికా పాల్ ఫౌండేషన్ అనే చారిటబుల్ ట్రస్టును ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా బాలల విద్య, ఆరోగ్యానికి సంబంధించిన సంక్షేమ కార్యక్రమాల కోసం మిలియన్ల కొద్దీ పౌండ్లను విరాళంగా ఇచ్చారు. 1968లో లండన్ ప్రధాన కేంద్రంగా కపారో గ్రూప్‌నకు స్వరాజ్ పాల్ శ్రీకారం చుట్టారు. తర్వాత రోజుల్లో అది బ్రిటన్‌లోనే అతి పెద్ద స్టీల్ కన్వర్షన్, డిస్ట్రిబ్యూషన్ వ్యాపార దిగ్గజాల్లో ఒకటిగా ఎదిగింది. ప్రస్తుతం బ్రిటన్, భారత్, అమెరికా, కెనడా తదితర దేశాల్లో ఏటా 1 బిలియన్ డాలర్ల ఆదాయంతో కార్యకలాపాలు సాగిస్తోంది.

లెజెండ్..

లార్డ్ స్వరాజ్ పాల్ మృతిపై ఇరు దేశాలకు చెందిన పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. బ్రిటన్-భారత్ మధ్య వారధిగా వ్యవహరించిన పాల్ తనకు స్ఫూర్తిప్రదాత అని కోబ్రా బీర్ వ్యవస్థాపకుడు లార్డ్ కరణ్ బిలిమోరియా తెలిపారు. విద్య, వ్యాపారం, రాజకీయాలు ఇలా అన్ని రంగాల్లోనూ ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. వోల్వర్‌హ్యాంప్టన్ యూనివర్సిటీ చాన్సలర్‌గా వర్సిటీ అభివృద్ధిలో ఆయన ఎంతో కీలక పాత్ర పోషించారని విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చెయిర్ ఏంజెలా స్పెన్స్ పేర్కొన్నారు. బ్రిటన్‌లోని అనేక మంది భారతీయులకు మార్గదర్శిగా నిల్చిన 'లెజెండ్' అని పాల్‌ను సస్ మార్క్ వ్యవస్థాపకుడు లార్డ్ రామీ రేంజర్ అభివర్ణించారు. భారత్-బ్రిటన్‌ను మరింత చేరువ చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను పటిష్టం చేయడంలో ఆయన చెరగని ముద్ర వేశారని లండన్‌లోని భారత హైకమిషన్ ప్రధాని మోదీ సోషల్ మీడియా వ్యాఖ్యలను రీపోస్ట్ చేసింది. ఆయన విదేశాల్లో భారత్‌కి గొంతుకగా నిల్చారని హై కమిషనర్ విక్రమ్ దొరైస్వామి పేర్కొన్నారు.

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కృషి..

భారత్-బ్రిటన్ మధ్య సంబంధాలను పటిష్టం చేసే దిశగా 1975లో ఇండో-బ్రిటిష్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన లార్డ్ పాల్ దానికి సుదీర్ఘకాలం చైర్మన్‌గా వ్యవహరించారు. పాల్ సేవలకు గుర్తింపుగా 1978లో బ్రిటన్ రాణి ఆయనకు నైట్‌హుడ్ ప్రదానం చేశారు. 1983లో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక పద్మ భూషణ్ పురస్కారంతో ఆయన్ను సత్కరించింది. పలు సంవత్సరాలుగా బ్రిటన్‌లో అత్యంత సంపన్నుల జాబితాలో ఆయన పేరు క్రమం తప్పకుండా ఉంటోంది. 2 బిలియన్ పౌండ్ల సంపదతో ఈ ఏడాది సండే టైమ్స్ రిచ్ లిస్ట్‌లో ఆయన 81వ స్థానంలో నిల్చారు. ఆరోగ్యం అంతగా సహకరించకపోతున్నప్పటికీ ఇటీవలి వరకు ఆయన హౌస్ ఆఫ్ లార్డ్స్‌కి తప్పకుండా హాజరయ్యారు. 2008లో హౌస్ ఆఫ్ లార్డ్స్ డిప్యూటీ స్పీకర్‌గా పాల్ వ్యవహరించారు. తద్వారా భారత నేపథ్యంతో, ఆ బాధ్యత చేపట్టిన తొలి వ్యక్తిగా ఘనత సాధించారు. 2000 నుంచి 2005 వరకు ఇండియా-యూకే రౌండ్ టేబుల్‌కి కో-చెయిర్‌గా వ్యవహరించారు. 2009లో బ్రిటన్ మోనార్క్‌కి సలహా మండలి అయిన ప్రీవీ కౌన్సిల్ సభ్యుడిగా కూడా ఆయన నియమితులయ్యారు. మరోవైపు, వ్యక్తిగత జీవితంలో ఆయన్ను విషాదాలు వెన్నాడాయి. 2015లో కపారో గ్రూప్ సీఈవోగా వ్యవహరిస్తున్న కుమారుడు అంగద్ పాల్, 2022లో ఆయన భార్య అరుణ మరణించారు. దీనితో వారి స్మారకార్థం తలపెట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలకు ఆయన మరింత సంపద, సమయం వెచ్చించారు. భార్య మరణానంతరం అంబికా పాల్ ఫౌండేషన్ పేరును అరుణ అండ్ అంబికా పాల్ ఫౌండేషన్‌గా మార్చారు. 2023 ఫిబ్రవరిలో లండన్‌లోని చారిత్రక ఇండియన్ జింఖానా క్లబ్‌లో లేడీ అరుణ స్వరాజ్ పాల్ హాల్‌ని ప్రారంభించారు.

అంతర్జాతీయ స్థాయికి భారత ఆతిథ్యం

- జీఎస్‌టీ హేతుబద్ధీకరణపై పరిశ్రమ స్పందన
- 5 శాతం రేటుతో ఐటీసీ కల్పించాలని వినతి



న్యూఢిల్లీ: ప్రతిపాదిత జీఎస్‌టీ శ్లాబుల హేతుబద్ధీకరణతో భారత ఆతిథ్య రంగం అంతర్జాతీయంగా పోటీపడే సామర్థ్యాలను సంతరించుకుంటుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. 5 శాతం పన్ను రేటును ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) సదుపాయంతో హోటళ్లు, రెస్టారెంట్లు, టూరిజం సేవలకు ప్రభుత్వం కల్పిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశాయి. పన్నుల భారాన్ని తగ్గించేందుకు తదుపరి తరం జీఎస్‌టీ సంస్కరణలను తీసుకురానున్నట్టు స్వాతంత్రదినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ చేసిన ప్రకటనను హోటల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (హెచ్ఏఐ) స్వాగతించింది. అంతర్జాతీయంగా పర్యాటకులకు చిరునామాగా భారత్ మారేందుకు జీఎస్‌టీలో సంస్కరణలు అవసరమని పేర్కొంది. ఇతర దేశాలతో పోల్చితే భారత ఆతిథ్య పరిశ్రమ ఆకర్షణీయంగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. అంతేకాదు, 2047 నాటికి ఏటా 10 కోట్ల మంది విదేశీ పర్యాటకులను ఆకర్షించాలన్న లక్ష్య సాధనకు ఉపకరిస్తుందని పేర్కొంది. భారత్‌లో టారిఫ్‌లు (పన్ను రేట్లు) అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలన్న అభిప్రాయాన్ని హెచ్ఏఐ ప్రెసిడెంట్ కేబీ కచ్రు వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా టాప్-5 పర్యాటక గమ్యస్థానాల్లో భారత్‌ను కూడా చేర్చాలంటే దేశ పోటీతత్వాన్ని పెంచాల్సి ఉందన్నారు. హోటళ్లపై 18 శాతం కారణంగా జీఎస్‌టీతో గదుల రేట్లు అధికంగా ఉంటున్నాయని.. దీంతో అంతర్జాతీయంగా పోటీపడలేని పరిస్థితి ఉన్నట్లు వివరించారు.

ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకోవాలి..

''ప్రస్తుతం హోటళ్లలో రూ.7,500 వరకు గదుల అద్దెపై 12 శాతం జీఎస్‌టీ రేటు అమల్లో ఉంది. ఇది 6-7 ఏళ్ల క్రితం నిర్ణయించిన రేటు. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ పరిమితిని రూ.15,000కు పెంచాలి. ఇలా చేయడం వల్ల పర్యాటకులకు గదుల ధరలు అందుబాటులోకి వస్తాయి. మొత్తం మీద పరిశ్రమ పోటీతత్వం పెరుగుతుంది''అని హెచ్ఏఐ సూచించింది. హోటళ్లు, రెస్టారెంట్లు, పర్యాటక సేవలపై ఏక రూప 5 శాతం పన్ను రేటును, ఐటీసీ సదుపాయంతో అమలు చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కోరినట్టు పేర్కొంది. ఇలా చేస్తే నిబంధనల అమలు భారం తగ్గుతుందని, వ్యాపార నిర్వహణ మరింత సులభతరం అవుతుందని, మరిన్ని పెట్టుబడులు వచ్చి ఉద్యోగాల కల్పన జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

ద్రవ్యోల్బణాన్నే టార్గెట్ చేయాలా ?

మానిటరీ పాలసీపై ప్రజాభిప్రాయం కోరుతూ ఆర్‌బీఐ చర్చాపత్రం



ముంబై: ద్రవ్య పరపతి విధానానికి సంబంధించి రిటైల్ ద్రవ్యోల్బణాన్నే పరిగణనలోకి తీసుకోవాలా లేక వృద్ధికి ఊతమిచ్చేలా ఏవైనా కొత్త ప్రమాణాలను పరిశీలించాలా అనే అంశంపై ప్రజాభిప్రాయాన్ని కోరుతూ రిజర్వ్ బ్యాంక్ ఒక చర్చాపత్రాన్ని రూపొందించింది. ఇందులో నాలుగు ప్రశ్నలు పొందుపర్చింది. ఆహార, రిటైల్ ధరలు ఎప్పటికప్పుడు మారిపోతున్న పరిస్థితుల్లో మానిటరీ పాలసీకి రిటైల్ ద్రవ్యోల్బణాన్నే పరిగణనలోకి తీసుకోవాలా? 4 శాతం ద్రవ్యోల్బణం టార్గెట్ వేగంగా ఎదుగుతున్న భారత్‌లాంటి భారీ దేశంలో స్థిరత్వం, వృద్ధికి మధ్య సమతౌల్యత సాధించేందుకు 4 శాతం ద్రవ్యోల్బణం టార్గెట్ సరైనదేనా? ద్రవ్యోల్బణ శ్రేణిని సవరించాలా? ద్రవ్యోల్బణ లక్ష్య స్థాయిని తొలగించి, కేవలం శ్రేణిని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలా? అనే ప్రశ్నలు వీటిలో ఉన్నాయి. వీటిపై సెప్టెంబర్ 18లోగా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉంటుంది.

హైదరాబాద్‌లో తొలిసారి ఐఎంఈసీఈ సదస్సు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈ ఏడాది సెప్టెంబర్ 10 నుంచి 13 వరకు ఇంటర్నేషనల్ మెకానికల్ ఇంజినీరింగ్ కాంగ్రెస్ అండ్ ఎక్స్‌పోజిషన్ (ఐఎంఈసీఈ)ని హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్ (ఏఎస్ఎంఈ) వెల్లడించింది. 1996లో ప్రారంభించాక భారత్‌లో నిర్వహించడం ఇదే తొలిసారని పేర్కొంది. ఇందులో 1,500 మంది పైగా ప్రతినిధులు, 100 మంది ఎగ్జిబిటర్లు పాల్గొనున్నట్లు వివరించింది. 650 రీసెర్చ్ పేపర్లు, సాంకేతికాంశాలపై సెమినార్లు, ఏఐఎంఎల్, రోబోటిక్స్, అధునాతన తయారీ టెక్నాలజీలు మొదలైన వాటిపై చర్చా కార్యక్రమాలు ఉంటాయని ఏఎస్ఎంఈ ఇండియా డైరెక్టర్ మధుకర్ శర్మ తెలిపారు. భారత్ ఫోర్జ్ గ్రూప్ సీఎండీ బాబా కల్యాణి, స్కైరూట్స్ ఫౌండర్ పవన్ కె. చందన, ఆర్‌ఐఎల్ సీఈవో రవీంద్ర సింగ్ తదితరులు ఇందులో పాల్గొనున్నారు.

డిఫెన్స్ రంగంలోకి బొండాడ ఇంజినీరింగ్ ఎంట్రీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బొండాడ ఇంజినీరింగ్ సంస్థ ఇతర రంగాల్లోకి విస్తరిస్తోంది. ఇందులో భాగంగా రక్షణ రంగానికి సంబంధించి బొండాడ డైనమిక్స్ పేరిట అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. డిఫెన్స్ సెక్టార్ కోసం స్వదేశీ పరిజ్ఞానంతో ఇంజినీరింగ్ ఉత్పత్తుల తయారీ, అధునాతన టెక్నాలజీని అభివృద్ధి చేయడం వంటి అంశాల్లో పాలుపంచుకునేందుకు ఇది తోడ్పడుతుందని సంస్థ సీఎండీ బి రాఘవేంద్ర రావు తెలిపారు.

కొత్త ఆదాయపన్ను చట్టానికి రాష్ట్రపతి ఆమోదం

2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: ఆదాయపన్ను చట్టం, 2025కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఆదాయపన్ను చట్టం, 1961 స్థానంలో కొత్త చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. పాత చట్టంతో పోల్చితే కొత్త చట్టం సరళతరంగా, పారదర్శకంగా ఉంటుందని ఆదాయపన్ను శాఖ 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌పై ప్రకటించింది. ఈ నెల 12న ఈ కొత్త చట్టానికి పార్లమెంట్ ఆమోదం తెలపడం గమనార్హం. ఇందులో ఎలాంటి కొత్త పన్నులు ప్రతిపాదించలేదు. భాషను సరళంగా మార్చారు. గతంలో 819 సెక్షన్లు ఉండగా, కొత్త చట్టంలో 536కు తగ్గించారు. 5.12 లక్షల పదాలను 2.6 లక్షలకు కుదించారు.



వృద్ధి 6.3 శాతానికి తగ్గొచ్చు

- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక అంచనా
- వేగం తగ్గిన ప్రైవేటు మూలధన వ్యయాలు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6.3 శాతానికి తగ్గొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ విభాగం అంచనా వేసింది. 6.5 శాతం వృద్ధి నమోదు కావొచ్చన్నది ఆర్‌బీఐ అంచనాగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో (2024-25) జీడీపీ వృద్ధి రేటు 6.5 శాతంగా ఉంటే, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో 9.2 శాతంగా ఉండడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో (క్యూ1) వృద్ధి 6.8-7 శాతం మధ్య ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది. సెప్టెంబర్ త్రైమాసికంలో (క్యూ2) 6.5 శాతం, డిసెంబర్ త్రైమాసికంలో (క్యూ3)లో 6.3 శాతానికి, మార్చి త్రైమాసికంలో (క్యూ4)లో 6.1 శాతానికి తగ్గొచ్చని అంచనా వేసింది. ప్రైవేటు రంగం నుంచి మూలధన పెట్టుబడులు స్తబ్దుగా ఉండడాన్ని ఈ నివేదిక ప్రస్తావించింది. ''వ్యవసాయం, తయారీ, ఐటీ తదితర రంగాలకు చెందిన 2,170 వ్యాపారవేత్తలను సర్వే చేయగా 2024-25 కంటే 2025-26లో మూలధన వ్యయాలు తక్కువగా ఉంటాయని చెప్పారు. యూఎస్ టారిఫ్‌లు కూడా ప్రభావం చూపిస్తే మూలధన వ్యయాలు మరింత తగ్గొచ్చు''అని వివరించింది. బ్యాంకుల రుణ వృద్ధి జూలై 25 నాటికి 10 శాతానికి తగ్గినట్టు ఈ నివేదిక తెలిపింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి ఈ వృద్ధి 13.7 శాతంగా ఉన్నట్టు గుర్తు చేసింది. డిపాజిట్లలో వృద్ధి సైతం 10.65 శాతం నుంచి 10.2 శాతానికి తగ్గినట్టు పేర్కొంది. ఎస్ఎంఈ మినహా దాదాపు అన్ని రంగాలకు రుణ వితరణ వృద్ధి నిదానించినట్టు వెల్లడించింది. ఎస్ఎంఈకి మాత్రం రుణ వితరణ 21.8 శాతం పెరిగినట్టు, క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 14.2 శాతంగా ఉన్నట్టు వివరించింది.

ఎగుమతులపై ప్రభావం


అమెరికా టారిఫ్‌ల విధింపు ఎగుమతి ఆధారిత రంగాల ఆదాయం, మార్జిన్లపై ఒత్తిళ్లకు దారితీయొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక తెలిపింది. టెక్స్‌టైల్స్, రత్నాభరణాలు, లెదర్, కెమికల్స్, వ్యవసాయం, ఆటో విడిభాగాలపై ప్రభావం ఉండొచ్చని పేర్కొంది.

బీఎఫ్ఎస్ఐలో 2.5 లక్షల కొత్త ఉద్యోగాలు

- 2030 నాటికి అందుబాటులోకి
- టైర్ 2, 3 పట్టణాల్లో పెరుగుతున్న డిమాండ్
- 2025-26లో 8.7 శాతం వృద్ధి
- అడెకో ఇండియా నివేదిక వెల్లడి

ముంబై: బ్యాంకింగ్, ఫైనాన్షియల్, బీమా (బీఎఫ్ఎస్ఐ) సేవలకు డిమాండ్ బలంగా పెరుగుతోంది. దీంతో ఈ రంగంలోని కంపెనీలు మెట్రోలకే పరిమితం కాకుండా టైర్ 2, 3 పట్టణాల్లోనూ (ద్వితీయ, తృతీయ శ్రేణి) తమ సేవలను విస్తరిస్తున్నట్టు మానవ వనరుల సేవలు అందించే అడెకో ఇండియా తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8.7% మేర ఈ రంగం వృద్ధిని నమోదు చేస్తుందని అంచనా వేసింది. 2030 నాటికి ఈ రంగంలో 2.5 లక్షల కొత్త ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపింది. ఈ రంగంలో కొత్త ఉద్యోగాల్లో 48% టైర్ 2, 3 పట్టణాల్లోనే ఉంటున్నట్టు వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో నియామకాలు 27 శాతం పెరిగినట్టు తెలిపింది. స్థానిక భాషపై పట్టు, అమ్మకాల్లో అనుభవం కలిగిన వారు ఇతరులతో పోల్చితే 2.5 రెట్లు అధికంగా ఎంపికయ్యే అవకాశాలు కలిగి ఉన్నట్టు.. 10-15% అధిక వేతనం వీరికి లభిస్తున్నట్టు వెల్లడించింది. గృహ పొదుపులు సంప్రదాయ సాధనాల నుంచి మార్కెట్ ఆధారిత సాధనాలైన మ్యూచువల్ ఫండ్స్, యులిప్‌లు, పెన్షన్ ఉత్పత్తుల వైపు మళ్లుతుండడం బీఎఫ్ఎస్ఐ సేవలకు డిమాండ్‌ను పెంచుతున్నట్టు తెలిపింది.

ఈ రంగాల వారికి డిమాండ్..



బ్యాంక్‌లు సేల్స్, రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్‌లు, డిజిటల్ ప్రొడక్ట్ మేనేజర్లు, క్రెడిట్ రిస్క్ అనలిస్టుల నియామకాలను పెంచినట్టు అడెకో ఇండియా నివేదిక వెల్లడించింది. బీమా సంస్థలు, సంపద నిర్వహణ సంస్థలు ఫైనాన్షియల్ అడ్వైజర్లు, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు, డిజిటల్ అండర్‌రైటర్లు, క్లెయిమ్స్ ఆటోమేషన్ స్పెషలిస్టుల నియామకాలకు ప్రాధాన్యం పెంచినట్టు తెలిపింది. ఇండోర్, కోయింబత్తూర్, నాగర్‌పూర్, గువహటిలో 15-18 శాతం, సూరత్, జైపూర్, లక్నో, భువనేశ్వర్ పట్టణాల్లో నియామకాలు 11-13 శాతం పెరిగినట్టు పేర్కొంది. సేవలకు డిమాండ్ పెరుగుతుండడంతో 78 శాతం బీమా కంపెనీలు అదనపు నైపుణ్యాల కల్పనపై దృష్టి సారించినట్టు తెలిపింది. ఆర్థిక అక్షరాస్యత, పెట్టుబడులపై అవగాహన అన్నది మెట్రోలకు వెలుపల కూడా విస్తరిస్తోందని.. దీంతో స్థానిక నిపుణులకు డిమాండ్ పెరుగుతున్నట్టు తెలిపింది. 100కు పైగా క్లయింట్ల నుంచి సేకరించిన డేటా ఆధారంగా అడెకో ఇండియా ఈ వివరాలను విడుదల చేసింది.



బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో నిపుణుల కొరత

క్వెస్ కార్ప్ నివేదిక

బీఎఫ్ఎస్ఐ రంగంలో గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీ) వేగంగా విస్తరిస్తుండడంతో నిపుణులకు తీవ్ర కొరత నెలకొన్నట్టు క్వెస్‌కార్ప్ తెలిపింది. అంతేకాదు, నైపుణ్యాల్లో అంతరంతోపాటు మానవ వనరులపై అధిక వ్యయాలు చేయాల్సి వస్తున్నట్టు తెలిపింది. భారత్‌లో బీఎఫ్ఎస్ఐ జీసీసీల విలువ 2023లో 40-41 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2032 నాటికి 125-135 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని అంచనా వేసింది. ఈ రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) డేటా నిపుణులకు కొరత ఉందని.. నైపుణ్యాల్లోనూ 42 శాతం మేర అంతరం ఉన్నట్టు పేర్కొంది. దీంతో కంపెనీలు మానవ వనరుల పరంగా తమ వ్యూహాలను సమీక్షించుకోవాల్సి ఉందని అభిప్రాయపడింది. ప్రస్తుతం దేశీయంగా బీఎఫ్ఎస్ఐ రంగానికి సంబంధించి 190 జీసీసీలు ఉండగా, ఇవి 5,40,000 మందికి ఉపాధి కల్పిస్తున్నట్టు వెల్లడించింది. కేవలం బ్యాంక్ ఆఫీస్‌లుగా కాకుండా, ఆవిష్కరణలకు కేంద్రాలుగా జీసీసీలు మారినట్టు తెలిపింది. టైర్-1 పట్టణాలు అధిక విలువ కలిగిన ఆవిష్కరణలకు కేంద్రాలుగా ఉన్నప్పటికీ.. టైర్-2 పట్టణాలు మెరుగైన వసతులు, తక్కువ వ్యయాలతో జీసీసీలకు ఆకర్షణీయంగా మారినట్టు పేర్కొంది. బీఎఫ్ఎస్ఐ జీసీసీ రంగం భవిష్యత్తు అన్నది.. అవి ఎంత వేగంగా ఆవిష్కరణలను అందించగలవన్న దానిపై ఆధారపడి ఉంటుందని వివరించింది.

‘కూత’ మారుతోంది

కొత్తగా టైబ్రేకర్ షూటౌట్ • 29 నుంచి ప్రొ కబడ్డీ లీగ్



ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఫార్మాట్ మారినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 29 నుంచి జరిగే 12వ సీజన్ పీకేఎల్‌ను మారిన ఫార్మాట్ ప్రకారం నిర్వహిస్తారు. మ్యాచ్‌ల్లో రసవత్తర పోటీ పెరిగేందుకు అభిమానులకు ఉత్కంఠభరితమైన అనుభూతిని పంచేందుకు ఈ మార్పులు దోహదం చేస్తాయని నిర్వాహకులు చెబుతున్నారు. కొత్తగా టైబ్రేకర్, గోల్డెన్ రెయిడ్ నిబంధనలను తీసుకొచ్చారు. గతంలో గోల్డెన్ రెయిడ్ కేవలం ప్లేఆఫ్స్‌లోనే ఉండేది. ఇప్పుడు లీగ్ ఆసాంతం కొనసాగిస్తారు. మ్యాచ్ ‘టై’ అయితే కొత్త టైబ్రేకర్‌తో ఫలితం కచ్చితంగా ఫలితం రానుంది. స్కోరు సమమైన పక్షంలో ఒక్కో జట్టుకు ఫుట్‌బాల్ తరహాలో 5 రెయిడ్ షూటౌట్ అవకాశాలిస్తారు. ఇరు జట్లు ఏడుగురు చొప్పున ఆటగాళ్లను నామినేట్ చేస్తాయి. ఇందులో ఐదుగురు రెయిడ్ చేస్తారు. ‘షూటౌట్’ స్కోరు సమమైతే అప్పుడు గోల్డెన్ రెయిడ్ తెరపైకి వస్తుంది. ఇలాంటి మార్పులతో మ్యాచ్‌లో మరింత నాటకీయత పెరుగుతుందని, ఆటలోనూ పోటీ కూడా అభిమానుల్ని ఆకర్షిస్తుందని పీకేఎల్ నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ సీజన్‌లో లీగ్ దశలో 108 మ్యాచ్‌లుంటాయి. ఒక్కో ఫ్రాంచైజీ జట్టు 18 మ్యాచ్‌లు ఆడుతుంది. పాత పద్ధతిలో ప్లే ఆఫ్స్ ఉంటాయి... కానీ ఇకపై పాయింట్ల పట్టికలో మొదటి 8 స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్ చేరతాయి. తద్వారా టైటిల్ రేసులో 8 జట్లు పోటీలోనే ఉంటాయి. 5 నుంచి 8వ స్థానంలో నిలిచిన ఫ్రాంచైజీలు ‘ప్లే–ఇన్’ మ్యాచ్‌లు ఆడతాయి. గెలిచిన జట్లు ముందంజ వేస్తాయి. అలాగే 3, 4 స్థానాల జట్లు ‘మినీ క్వాలిఫయర్’ ఆడతాయి. ఇక్కడ గెలిచిన జట్టు ముందుకెళుతుంది. కానీ ఓడిన జట్టు నిష్క్రమించదు. ఓడిన జట్టుకు ప్లే ఆఫ్స్ చేరేందుకు మరో అవకాశముంటుంది. ఈ ప్రక్రియలో మొత్తం మూడు ఎలిమినేటర్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇక మొదటి రెండు స్థానాల్లో ఉన్న జట్లు క్వాలిఫయర్–1 ఆడతాయి. విజేత జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుతుంది. ఓడిన జట్టు క్వాలిఫయర్–2 ఆడుతుంది. ఎలిమినేటర్ ఫలితాల విజేత క్వాలిఫయర్–2కు అర్హత సాధిస్తుంది. అంటే 3 నుంచి 8వ స్థానం వరకు నిలిచే ఏ జట్టయిన ఇకపై ఫైనల్‌కు చేరే అవకాశంఉందన్న మాట!



సొహైల్ అబ్బాస్... భారత్‌కు రావడం లేదు

మలేసియా జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా ఉన్న పాకిస్తాన్ హాకీ దిగ్గజం

న్యూఢిల్లీ: భారత్ ఆతిథ్యమిచ్చే ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌కు ఇదివరకే పాకిస్తాన్ జట్టు దూరంగా ఉంది. ఇప్పుడు ఆ దేశ దిగ్గజం సొహైల్ అబ్బాస్ కూడా మలేసియా జట్టు అసిస్టెంట్ కోచ్ హోదాలో భారత్‌కు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ మేరకు ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 7 వరకు జరిగే టోర్నీకి అందుబాటులో ఉండటం లేదని ప్రకటించాడు. పాక్ దిగ్గజ డ్రాగ్‌ఫ్లికర్‌గా ఖ్యాతి గడించిన అతను ప్రస్తుతం మలేసియా హాకీ జట్టుకు సేవలందిస్తున్నారు. ఈ జట్టు ఆసియా కప్ కోసం భారత్‌కు రానుంది. ఈ టోర్నీ విజేత నేరుగా ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఆసియా ఈవెంట్‌కు మలేసియా జట్టు తరఫున వచ్చేందుకు అనాసక్తి చూపడం విడ్డూరంగా ఉంది. అయితే తన నిర్ణయానికి స్వదేశం (పాక్) తీసుకున్న గైర్హాజరుకు
సంబంధం లేదని అబ్బాస్ చెప్పుకొచ్చాడు. ‘నేను ఆసియా కప్ కోసం భారత్‌కు వెళ్లడం లేదు. వ్యక్తిగత కారణాల వల్లే ఆ ఈవెంట్‌కు అందుబాటులో ఉండటం లేదు. ఇది నా సొంత నిర్ణయం. దీనిపై ఎవరి ప్రభావం లేదు’ అని అన్నాడు. అబ్బాస్ 2012లో అంతర్జాతీయ హాకీకి గుడ్‌బై చెప్పారు. ఆ తర్వాత 2024 వరకు లోప్రొఫైల్ జీవితాన్నే గడిపారు. గతేడాది మలేసియా కోచింగ్ బృందంలో చేరారు. 48 ఏళ్ల సొహైల్ అబ్బాస్ ఏకంగా నాలుగు ప్రపంచకప్‌లు (1998, 2002, 2006, 2010), మూడు ఒలింపిక్స్ (2000, 2004, 2012)లలో పాల్గొన్నారు. 1998, ఫిబ్రవరిలో భారత్‌తో పెషావర్‌లో జరిగిన మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన అబ్బాస్ 311 మ్యాచ్‌లు ఆడి 21 సార్లు హ్యాట్రిక్ గోల్స్ నమోదు చేశాడు. భారత్‌లో 20 ఏళ్ల క్రితం జరిగిన ఇండియన్ ప్రీమియర్ హాకీ లీగ్‌లో విజేత హైదరాబాద్ సుల్తాన్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు.



సెమీస్‌లో యూకీ జోడీ

న్యూఢిల్లీ: విన్‌స్టన్–సాలెమ్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)–మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. అమెరికాలోని నార్త్ కరోలినాలో ఈ టోర్నీ జరుగుతోంది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో యూకీ–వీనస్ ద్వయం 7–6 (7/2), 6–3తో రోహన్ బోపన్న (భారత్)–రొమైన్ అర్నియోడో (మొనాకో) జంటపై విజయం సాధించింది. 81 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో యూకీ–వీనస్ మూడు ఏస్‌లు సంధించి, తొమ్మిది డబుల్ ఫాల్ట్‌లు చేశారు. క్వార్టర్ ఫైనల్లో ఓడిన బోపన్న–అర్నియోడోలకు 7,360 డాలర్ల (రూ. 6 లక్షల 42 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 పాయింట్లు లభించాయి.

బంగ్లాదేశ్ కెప్టెన్‌గా లిటన్ దాస్

ఢాకా: వచ్చే నెలలో జరగనున్న ఆసియా కప్ టి20 టోర్నమెంట్ కోసం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు శుక్రవారం 16 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు లిటన్ దాస్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా... 2022 తర్వాత తొలిసారి నూరుల్ హసన్‌కు జట్టులో చోటు దక్కింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు జరగనున్న ఆసియా కప్‌లో బంగ్లాదేశ్ జట్టు అఫ్గానిస్తాన్, హాంకాంగ్, శ్రీలంకతో కలిసి గ్రూప్ ‘బి’ నుంచి పోటీ పడనుంది. టోర్నీలో భాగంగా సెప్టెంబర్ 11న తమ తొలి మ్యాచ్‌లో హాంకాంగ్‌తో బంగ్లాదేశ్ తలపడుతుంది.

బంగ్లాదేశ్ జట్టు: లిటన్ దాస్ (కెప్టెన్), తన్జిద్ హసన్, పర్వేజ్, సైఫ్ హసన్, తౌహిద్ హృదయ్, జాకీర్, షమీమ్ హుసేన్, నూరుల్ హసన్, మెహిది హసన్, రిషాద్ హుసేన్, నసుమ్ అహ్మద్, ముస్తఫిజుర్, తన్జీమ్ హసన్, తస్కిన్ అహ్మద్, షరీఫుల్ ఇస్లామ్, సైఫ్ ఉద్దీన్.

విజేత ఎవరో?

నేడు డ్యురాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్

నార్త్‌ఈస్ట్ ఎఫ్‌సీతో డైమండ్ హార్బర్ ‘ఢీ’

సాయంత్రం గం. 5:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



కోల్‌కతా: ఆసియా ఖండంలో అత్యంత పురాతనమైన ఫుట్‌బాల్ టోర్నమెంట్‌గా గుర్తింపు సాధించిన... దేశవాళీ వార్షిక ఫుట్‌బాల్ టోర్నీ డ్యురాండ్ కప్ ఫైనల్‌కు సర్వం సిద్ధమైంది. సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ టోర్నీ 134వ ఎడిషన్ ఫైనల్లో శనివారం డైమండ్ హార్బర్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ)తో నార్త్ ఈస్ట్ ఫుట్‌బాల్ క్లబ్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ సీజన్‌తోనే అరంగేట్రం చేసిన డైమండ్ హార్బర్ జట్టు... తొలిసారే టైటిల్ హస్తగతం చేసుకోవాలని తహతహలాడుతుండగా... డిఫెండింగ్ చాంపియన్ నార్త్‌ఈస్ట్ ఫుట్‌బాల్ క్లబ్ టైటిల్ నిలబెట్టుకోవాలని కృతనిశ్చయంతో ఉంది. తద్వారా 34 ఏళ్లలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి టైటిల్ నిలబెట్టుకున్న తొలి జట్టుగా నిలవాలని చూస్తోంది. ఈ టోర్నీలో చివరగా 1989, 90, 91లో ఈస్ట్ బెంగాల్ జట్టు హ్యాట్రిక్ విజయాలు సాధించింది. ఆ తర్వాత మరే జట్టు వరుసగా రెండుసార్లు చాంపియన్‌గా నిలవలేకపోయింది. నార్త్ ఈస్ట్ హెడ్ కోచ్ జువాన్ పెడ్రో బెనాలీ మాట్లాడుతూ... ‘తుదిపోరులో ఫేవరెట్స్ ఉండరు. మెరుగైన ప్రదర్శన చేసిన జట్టే ఫైనల్‌కు చేరుతాయి. మానసికంగా పైచేయి సాధించగల జట్టే ట్రోఫీ చేజిక్కించుకుంటుంది’ అని అన్నాడు. మరోవైపు కిబు వికునా శిక్షణలో రాటుదేలిన డైమండ్ హార్బర్ జట్టు... ఈ టోర్నీలో బరిలోకి దిగిన తొలిసారే సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంది. శనివారం పోరులో డైమండ్ హార్బర్ జట్టు విజయం సాధిస్తే... ఓపెన్ ఎరాలో అరంగేట్రంలోనే టైటిల్ గెలిచిన తొలి జట్టుగా నిలవనుంది. తొలి సెమీఫైనల్లో నార్త్ ఈస్ట్ 1–0 గోల్స్ తేడాతో షిల్లాంగ్ లాజాంగ్ జట్టుపై విజయం సాధించగా... రెండో సెమీస్‌లో డైమండ్ హార్బర్ 2–1తో ఈస్ట్ బెంగాల్‌పై గెలిచి ఫైనల్లో అడుగు పెట్టింది.

విజేతకు రూ. 1.21 కోట్లు

డ్యురాండ్ కప్ 134వ ఎడిషన్ విజేతకు భారీ ప్రైజ్‌మనీ దక్కనుంది. గతేడాదితో పోల్చుకుంటే ఈసారి ప్రైజ్‌మనీని 250 శాతం పెంచినట్లు డ్యురాండ్ కప్ ఆర్గనైజింగ్ కమిటీ (డీసీఓసీ) వెల్లడించింది. ఫైనల్లో నెగ్గిన జట్టుకు రూ. 1.21 కోట్లు లభిస్తుందని డీసీఓసీ శుక్రవారం పేర్కొంది. రన్నరప్ జట్టుకు రూ. 60 లక్షలు దక్కనున్నాయి. సెమీఫైనల్స్‌లో ఓడిన జట్లకు రూ. 25 లక్షల చొప్పున... క్వార్టర్ ఫైనల్లో ఓడిన జట్లకు రూ. 15 లక్షల చొప్పున ఇస్తారు. ‘గోల్డెన్ బాల్’, ‘గోల్డెన్ బూట్’, ‘గోల్డెన్ గ్లవ్’ అవార్డులు గెలుచుకున్న ఆటగాళ్లకు రూ. 3 లక్షల నగదు బహుమతితో పాటు ఒక మహీంద్ర ఎక్స్‌యూవీ కారు లభించనుంది.



హడలెత్తించిన ఇన్‌గిడి

- ఐదు వికెట్లతో మెరిసిన సఫారీ పేసర్
- రెండో వన్డేలోనూ ఆస్ట్రేలియా ఓటమి
- 2-0తో సిరీస్ నెగ్గిన దక్షిణాఫ్రికా



మెకాయ్ (ఆస్ట్రేలియా): ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన దక్షిణాఫ్రికా జట్టు... ఆస్ట్రేలియాపై వన్డే సిరీస్ కైవసం చేసుకుంది. ఆసీస్ పర్యటనలో భాగంగా టి20 సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికా జట్టు... మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2–0తో చేజిక్కించుకుంది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ లుంగి ఇన్‌గిడి (5/42) విజృంభించడంతో శుక్రవారం జరిగిన రెండో వన్డేలో దక్షిణాఫ్రికా జట్టు 84 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 49.1 ఓవర్లలో 277 పరుగులకు ఆలౌటైంది. మాథ్యూ బ్రీజ్కె (78 బంతుల్లో 88;8 ఫోర్లు, 2 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (87 బంతుల్లో 74; 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. టోనీ డి జోర్జి (39 బంతుల్లో 38; 5 ఫోర్లు), ముల్డర్ (21 బంతుల్లో 26; 4 ఫోర్లు), కేశవ్ మహరాజ్ (24 బంతుల్లో 22 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) తలా కొన్ని పరుగులు చేశారు. కెప్టెన్ మార్క్‌రమ్ (0), రికెల్టన్ (8), బ్రెవిస్ (1) విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆడమ్ జంపా 3 వికెట్లు పడగొట్టగా... ఎలీస్, లబుషేన్, జేవియర్ తలా రెండు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 37.4 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. సొంతగడ్డపై ఆస్ట్రేలియా జట్టు వరుసగా నాలుగో వన్డేలో 200లోపు ఆలౌటైంది. ఇన్‌గ్లిస్ (74 బంతుల్లో 87; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) చక్కటి ఇన్నింగ్స్ ఆడగా... కామెరూన్ గ్రీన్ (54 బంతుల్లో 35; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. ట్రావిస్ హెడ్ (6), లబుషేన్ (1), అలెక్స్ కేరీ (13) ఆరోన్ హార్డీ (10) విఫలమయ్యారు. సఫారీ బౌలర్లలో ఇన్‌గిడి 5 వికెట్లతో అదరగొట్టగా... బర్గర్, ముత్తుస్వామి చెరో రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన ఆఖరి వన్డే ఆదివారం ఇక్కడే జరగనుంది.



ప్రొ పంజా లీగ్ చాంపియన్ కిరాక్ హైదరాబాద్

గ్వాలియర్: ప్రొ పంజా లీగ్ (ఆర్మ్ రెజ్లింగ్)లో హైదరాబాద్ జట్టు సత్తా చాటుకుంది. రెండో సీజన్‌లో విజేతగా నిలిచింది. ఫైనల్లో కిరాక్ హైదరాబాద్ 30–18తో రోహ్‌తక్ రౌడీస్‌పై విజయం సాధించింది. హైదరాబాద్ ఆటగాడు స్టీవ్ థామస్ కేవలం 0.09 సెకన్‌లోనే ప్రత్యర్థి ఆర్మ్ రెజ్లర్ దీపాంకర్‌ను ఓడించి రికార్డు సృష్టించాడు. మహిళలు, పురుషులు కలిసి ఆడే ఈ టోర్నీలో కిరాక్ హైదరాబాద్ బృందం ఆద్యంతం అదరగొట్టింది. సత్నామ్ సింగ్ (హైదరాబాద్) ‘ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ’గా నిలువగా, నిర్మల్ దేవి (రోహ్‌తక్) ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు అందుకుంది. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ. 20 లక్షల ప్రైజ్‌మనీ కూడా దక్కింది. ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ సభ్యుడు నరీందర్ బత్రా, ఒలింపిక్ పతక విజేత, ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్, రెజ్లర్ సారవ్ గుర్జార్, మాజీ కబడ్డీ ప్లేయర్ రాహుల్ చౌధరీ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌కు రెండో గెలుపు



థింపూ (భూటాన్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్–17 మహిళల చాంపియన్‌షిప్‌లో భారత్ వరుసగా రెండో విజయాన్ని సాధించింది. శుక్రవారం జరిగిన పోరులో భారత జట్టు 2–0తో బంగ్లాదేశ్‌పై గెలుపొందింది. తొలి అర్ధభాగంలో పర్ల్ ఫెర్నాండెజ్ 14వ నిమిషంలో గోల్ చేయడంతో భారత్ 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తర్వాత ద్వితీయార్ధంలో బొనిఫిలియా షల్లాయి 76వ నిమిషంలో గోల్ చేయడంతో భారత్ ఆధిక్యం రెట్టింపైంది. మరోవైపు డిఫెండర్లు... బంగ్లా స్ట్రయికర్లకు ఏమాత్రం అవకాశమివ్వకుండా సమర్థంగా అడ్డుకున్నారు. పొరపాటున డిఫెండింగ్ కంచెను దాటుకొని గోల్‌పోస్ట్‌పై దాడిచేస్తే గోల్ కీపర్ మున్ని పోస్ట్‌కు ముందు అడ్డుగోడలా నిలబడింది. ఆట 37వ నిమిషంలో బంగ్లా ప్లేయర్ ఫాతిమా అక్తర్ కొట్టిన షాట్‌ను చాకచక్యంగా అడ్డుకుంది. నిజానికి ఈ మ్యాచ్‌లో మరో రెండు గోల్స్ నమోదయ్యేవి. 25వ నిమిషంలో ప్రీతిక బర్మన్, 72వ నిమిషంలో నీర చాను ప్రయత్నాలకు సరైన సమన్వయం లేక గోల్స్‌గా నమోదు కాలేదు.

తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇండిపెండెన్స్ కప్ రోలర్ హాకీ టోర్నీ జరిగింది. మైటీ లయన్స్, రోలర్ స్పార్టన్స్ జట్లు రన్నరప్‌గా నిలిచి రజత పతకాలు సొంతం చేసుకున్నాయి. మైటీ లయన్స్ జట్టుకు మనల్ సుల్తానా కెప్టెన్‌గా వ్యవహరించింది. గతంలో జాతీయ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టుకు ఆడిన మొహమ్మద్ సుమేర్ రోలర్ స్పార్టన్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.





ఈ కవల పాండా కూనల పేర్లు లెని, లొట్టి. జర్మనీ రాజధాని బెర్లిన్‌లోని పాండా గార్డెన్‌లో శుక్రవారం వీటికి మొదటి పుట్టిన రోజు వేడుక జరిగింది.



జర్మనీలోని లుడ్విగ్స్‌బర్గ్ కేజిల్‌లో జరిగిన గుమ్మడికాయల ప్రదర్శనలో గుమ్మడికాయలతో రూపొందించిన సూపర్‌మ్యాన్ ఆకారం ప్రధానాకర్షణగా నిలిచింది



భారత వ్యోమగామి, కెప్టెన్ శుభాంశు శుక్లా ఇస్రో చైర్మన్ నారాయణన్‌తోపాటు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలుసుకున్నప్పటి దృశ్యమిది

హమాస్‌కు నరక ద్వారాలు తెరుస్తాం

దిగిరాకుంటే గాజా నగరం శిథిలమయమే • ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ హెచ్చరిక

గాజా నగరం: గాజా నగరాన్ని పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకునేందుకు ఆర్మీ ప్రయత్నాలను ముమ్మరం చేసిన వేళ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. షరతులకు అంగీకరించి, లొంగిపోకుంటే హమాస్‌కు నరక ద్వారాలు తెరుచుకుంటాయని వ్యాఖ్యానించారు. గాజాస్ట్రిప్‌లో ఇప్పటికే శిథిలాల దిబ్బలుగా మారిన రఫా, బెయిట్ హనౌన్ నగరాలకు పట్టిన గతే గాజా నగరానికీ పడుతుందని శుక్రవాం 'ఎక్స్'ద్వారా అల్టిమేటమ్ జారీ చేశారు. మిగతా బందీలందరినీ వెంటనే విడుదల చేయాలని, హమాస్ ఆయుధాలను వదిలివేయాలని ఆయన మరో మారు డిమాండ్ చేశారు. అయితే, బందీల విడుదలకు సిద్ధమని ప్రకటించిన హమాస్..పాలస్తీనాను ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయకుండా ఆయుధాలను త్యజించడం మాత్రం అసాధ్యమని స్పష్టం చేసింది. ఇలా ఉండగా, వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాల్లో ఇప్పటికే ఇజ్రాయెల్ ఆర్మీ పూర్తి స్థాయి ఆక్రమణ కోసం సన్నద్ధతా చర్యలను మొదలుపెట్టింది. రానున్న రోజుల్లో పూర్తి స్థాయి సైనిక చర్య మొదలవుతుందని భావిస్తున్నారు. ఇలా ఉండగా, శుక్రవారం గాజా నగరంపై జరిగిన దాడుల్లో కనీసం 17 మంది చనిపోయారని స్థానిక షిఫా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

గాజా స్ట్రిప్ ప్రాంతంలో గట్టిపట్టున్న హమాస్ మిలటరీకి, పాలనకు గాజా నగరమే ఆయువు పట్టు. ఇజ్రాయెల్ ఆర్మీ దాడుల నుంచి హమాస్ శ్రేణులను గాజాలోని భూగర్భ సొరంగాలు పెట్టని కోటలుగా ఉన్నాయని ఇజ్రాయెల్ భావిస్తోంది. బంకర్లలో ఉన్న ఈ షెల్టర్లలోనే వేలాదిగా పౌరులు, కీలక మౌలిక, ఆరోగ్య సదుపాయాలు చెక్కుచెదరకుండా ఉన్నట్లు అనుమానిస్తోంది. హమాస్‌ను ఓడించడం, బందీలను సురక్షితంగా బయటకు తీసుకురావడం నగరాన్ని పూర్తి స్థాయిలో ఆక్రమించుకోవడం ద్వారానే సాధ్యమని నెతన్యాహూ ప్రభుత్వం గట్టి నమ్మకంతో ఉంది. 22 నెలల క్రితం ఇజ్రాయెల్‌పై మెరుపుదాడి చేసి 251 మందిని హమాస్ శ్రేణులు బందీలుగా పట్టుకెళ్లింది. ఇప్పటికీ ఇంకా సజీవులైన 20 మంది సహా మొత్తం 50 మందిని విడుదల చేయాల్సి ఉంది.

వైఫల్యాన్ని మునీర్ ఒప్పుకున్నట్టే

పాక్ ఆర్మీ చీఫ్ 'భారత్ ఫెరారీ కారు, పాక్ చెత్త ట్రక్కు' వ్యాఖ్యలపై రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థను విలాసవంతమైన ఫెరారీ కారుతో, తమ దేశాన్ని చెత్త ట్రక్కుతో పోలుస్తూ పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ వ్యాఖ్యలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ దీటుగా బదులిచ్చారు. ఈ వ్యాఖ్యలతో పాకిస్తాన్ తన వైఫల్యాన్ని ఒప్పుకున్నట్లేనని పేర్కొన్నారు. 'రెండు దేశాలూ ఒకే సమయంలో స్వాతంత్ర్యం పొందాయి. ఒక దేశం మంచి విధానాలు, ముందుచూపు, కష్టించేతత్వంతో ఫెరారీ కారు వంటి మంచి ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి పర్చుకోగా, మరో దేశం అప్పటి నుంచి ఇప్పటి దాకా చెత్తగానే మిగిలిపోయింది. అది వాళ్ల సొంత వైఫల్యం. ఇదే విషయాన్ని ఆసిమ్ మునీర్ స్వయంగా అంగీకరించారని నాకనిపిస్తోంది'అని రాజ్‌నాథ్ ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. మునీర్ పోలిక పాకిస్తాన్ సమస్యాత్మక మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తోందని రాజ్‌నాథ్ అన్నారు. 'పాకిస్తాన్ ఆర్మీ చీఫ్, తెలిసో తెలియకో దోపిడీదారు మనస్తత్వాన్ని బయటపెట్టుకున్నారు. అవతరించినప్పటి నుంచీ ఆ దేశానిది ఇదే తీరు. పాక్ సైన్యం భ్రమలను మనం తొలగించాలి'అని మంత్రి పేర్కొన్నారు. ఇటీవల అమెరికా పర్యటనలో మునీర్ మాట్లాడుతూ..'హైవేపై ఫెరారీ కారు మాదిరిగా మెరుస్తూ వస్తున్న భారత్‌ను, గులకరాళ్ల ట్రక్కు వెళ్లి ఢీకొట్టిందనుకోండి, నష్టం జరిగేది ఎవరికి?'అంటూ చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో దుమారం చెలరేగింది. భారత్ అభివృద్ధి దిశగా సాగుతుండగా, పాకిస్తాన్ వెనుకబడి ఉందని, సెల్ఫ్ గోల్ చేసుకున్నారంటూ మునీర్‌పై విమర్శలు వచ్చాయి.

ఆర్మీలో మహిళలకు అనుకూల విధానాలు

సాయుధ బలగాలతోపాటు ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేలా తమ ప్రభుత్వం అనే విధానాలను అమలు చేస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. సేవలందించడమే కాదు, నాయకత్వం వహించేందుకు అవకాశమిస్తున్నామన్నారు. శుక్రవారం ఢిల్లీలో మొదలైన 15 దేశాల మహిళా అధికారుల ఐరాస ఉమెన్ మిలటరీ ఆఫీసర్స్ కోర్స్‌లో ఆయన మాట్లాడారు. ఐరాస మిషన్లలో వృత్తిపరమైన సామర్థ్యాలను పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమం రెండు వారాలపాటు కొనసాగనుంది.

హరివిల్లు ఇక కథల్లోనే!

భవిష్యత్తులో భారత్‌లో కనిపించకపోవచ్చంటున్న శాస్త్రవేత్తలు

అత్యంత అరుదుగా కనిపించే అవకాశం ఉందన్న అధ్యయనం

ఇంద్రధనస్సు. కొత్త ఆనందాలకు ఉషస్సు. ఆకాశంలో హరివిల్లు కనిపించిందంటే చాలు చిన్నారులు మొదలు పెద్దల దాకా అందరూ ఆసక్తిగా చూస్తారు. రంగురంగుల ఇంద్రధనస్సు ఎంతో మందికి ప్రేమానురాగాల విరిజల్లును కురిపిస్తుంది. వర్షం ఆగిపోగానే, కొన్ని సార్లు చిరుజల్లులు పడుతున్నప్పుడే వినీలాకాశంలో అర్ధచంద్రాకృతి ఆవిష్కృతమై కనువిందు చేస్తుంది. హరివిల్లులోని రంగులను లెక్కబెట్టేవాళ్లు కొందరైతే ఆ మొత్తం హరివిల్లు తమకు పూర్తిగా కనిపించట్లేదే అని బాధపడేవాళ్లు ఇంకొందరు. భారతీయులు మెచ్చే అందాల ఇంద్రధనస్సు ఇకపై కనిపించకపోచ్చన్న చేదు నిజాన్ని అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందమొకటి నిర్ధారించింది. కాలుష్యం, భూతాపోన్నతి, వాతావరణ మార్పులు కారణంగా మళ్లీ మార్చలేనంతగా మారిపోతున్న వాతావరణ పరిస్థితుల కారణంగానే హరివిల్లు అంతర్ధానమయ్యే అవకాశాలు బాగా పెరిగిపోయాయని అధ్యయన బృందం వెల్లడించింది. ఈ పరిశోధనా తాలూకు వివరాలు తాజాగా 'గ్లోబల్ ఎన్విరోన్మెంటల్ ఛేంజ్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

కొందరికి మోదం.. మరికొందరికి ఖేదం

ఆనందానికి, ఆశకు ప్రతిరూపంగా కనిపించే ఇంద్రధనస్సు భారతదేశంతోపాటు మరికొన్ని దేశాల్లో ఏర్పడే అవకాశాలు బాగా సన్నగిల్లుతున్నాయని అధ్యయనం పేర్కొంది. వర్షపాతం నమోదయ్యే రేటు, మేఘావృతమయ్యే పరిస్థితులు ఇటీవలికాలంలో వాతావరణ మార్పుల కారణంగా మారిపోయాయి. వర్షం పడినప్పుడు తప్పితే మిగతా సందర్భాల్లో హరివిల్లు కనిపించదు. ఈ దృగ్విషయం ప్రకారమే వర్షాలకు, ఇంద్రధనస్సు ఆవిర్భావ సందర్భాలకు అవినాభావ సంబంధం ఉంది. ఎక్కడైతే వర్షాలు తగ్గిపోతాయో అక్కడ హరివిల్లు అంతర్ధానమవుతుంది. మేఘాల్లోని నీటి ఆవిరి వర్షపు చినుకులుగా మారే సందర్భాల్లో వాటి మీదుగా సూర్యకాంతి ప్రసరించి పరావర్తనం చెందినప్పుడు దూరంగా ఉన్న వ్యక్తులకు ఇంద్రధనస్సు కనిపిస్తుంది. ఇలా ఏర్పడిన హరివిల్లులను తమ కెమెరాల్లో బంధించి ప్రపంచవ్యాప్తంగా ప్రజలు శాస్త్రవేత్తలకు పంపించారు. అలా వేర్వేరు ఖండాల్లో భిన్న ప్రాంతాల్లో ఏర్పడిన హరివిల్లు ఛాయాచిత్రాలతో ఒక పెద్ద డేటాబేస్‌ను అధ్యయనకారులు సిద్ధంచేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుత వాతావరణ మార్పులు, వాతావరణ పరిస్థితులను క్రోడీకరించి భవిష్యత్తు వాతావరణ అంచనాలను రాబట్టారు. దీంతో ప్రస్తుతం ప్రపంచంలో ఏడాదికి 117 రోజులపాటు ఇంద్రధనస్సులు ఏర్పడుతుండగా భవిష్యత్తులో మరింతగా ఏర్పడే అవకాశాలు ఉండటం విశేషం. 2100 ఏడాదికల్లా మరో 4 నుంచి 4.9 శాతం అధికంగా ఇంద్రధనస్సులు ఏర్పడొచ్చని శాస్త్రవేత్తలు అంచానావేశారు. అయితే అన్ని దేశాల్లో సమసంఖ్య ఏర్పడకుండా కొన్ని చోట్ల అత్యధికంగా, కొన్ని దేశాల్లో అత్యల్పంగా ఏర్పడతాయిన తేలింది. అత్యల్పంగా ఏర్పడే దేశాల్లో భారత్ కూడా ఉంది.



భారత్‌లోనే ఎందుకు తక్కువ?

మంచుమయ ప్రదేశాలతో పోలిస్తే మైదానాల వంటి నేలమయ ప్రాంతాల్లో హరివిల్లు ఏర్పడే అవకాశాలు 21 శాతం నుంచి 34 శాతం తగ్గిపోతున్నాయని అధ్యయనం తెలిపింది. మిగతా ప్రాంతాల్లో ఇంద్రధనస్సు ఏర్పడే అవకాశాలు 66 నుంచి 79 శాతం మెరుగుపడ్డాయి. చల్లటి, పర్వతమయ ప్రాంతాల్లోనే హరివిల్లులు అధికంగా ఏర్పడే ఛాన్సుంది. అధిక జనాభా దేశాల్లో ఇంద్రధనస్సు కనివిందు చేయడం తగ్గిపోనుంది. ఆర్కిటిక్, హిమాలయాల్లో రెయిన్‌బో ఏర్పడే సంభావ్యత అధికంగా ఉందని గణాంకాల్లో తేలింది. సముద్రమట్టానికి అత్యంత ఎత్తులో ఉండే ప్రదేశాల్లో హరివిల్లు సాక్షాత్కార ఘటనలు అధికంకానున్నాయి. భూమధ్యరేఖ నుంచి దూరంగా వెళ్లేకొద్దీ ఇంద్రధనస్సు ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పరిశోధనలో తేలింది. ఆ లెక్కన భారతదేశం భూమధ్యరేఖకు సమీపంలో ఉంది. భూమధ్యరేఖకు దూరంగా ఉండే అంటార్కిటి ఖండం వంటి ప్రదేశాల్లో అత్యధికంగా హరివిల్లులు ఎక్కువగా కనిపిస్తాయని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. ఇప్పటికైనా కట్టుతప్పిన శిలాజ ఇంధన అతి వినియోగం, అడవుల నరికివేత, దారుణంగా పెరిగిపోయిన కాలుష్యం వంటివి తగ్గిపోతే భారత్‌ను హరివిల్లులు వదిలిపోవని భావించవచ్చు. ఆ మేరకు ప్రజల జీవనశైలిలో మార్పులొస్తాయని, ఆ మేరకు మళ్లీ హరివిల్లులు సందడి చేస్తాయని ఆశిద్దాం.

\- సాక్షి, నేషనల్ డెస్క్



శుక్రవారం కోల్‌కతాలో బిమన్‌బందార్-నవోపారా కొత్త మెట్రో మార్గాన్ని ప్రారంభించిన అనంతరం మెట్రో రైలులో వెళ్తూ స్కూలు విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

క్యాంటిన్ నుంచి తెచ్చిన టీ తాగి..

ప్రాణాపాయ స్థితిలోకి పీజీ వైద్య విద్యార్థిని

రాంచీ: జార్ఖండ్ రాజధాని రాంచీలోని రిమ్స్ గైనకాలజీ విభాగం పీజీ విద్యార్థిని ఒకరు అనుమానాస్పద స్థితిలో తీవ్ర అనారోగ్యానికి గురై వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి క్యాంటిన్ నుంచి తెచ్చిన టీ తాగుతూనే ఆమె అపస్మారక స్థితిలోకి జారుకున్నారని అధికారులు తెలిపారు. విష ప్రయోగంగా అనుమానిస్తున్నట్లు ఎయిమ్స్ ప్రతినిధి శనివారం తెలిపారు. గురువారం రాత్రి రిమ్స్ గైనకాలజీ విభాగం ఆర్థోపెడిక్ వార్డులో 25 ఏళ్ల బాధిత విద్యార్థిని ఉన్నారు. క్యాంటిన్ నుంచి ఫ్లాస్క్‌లో తెచ్చిన టీని గ్లాసులోకి వంపుకుని పక్కన పెట్టుకున్నారు. ఖాళీ దొరికిన వెంటనే రెండు సార్లు చప్పరించారు. టీ బాగోలేదని, దుర్వాసన వస్తోందని ఆమె తెలపడంతో తోటి వారు ఆ టీ జోలి పోలేదు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఆమె సొమ్మసిల్లి పడిపోయారు. అక్కడి వారు వెంటనే ఆమెను ఎమర్జెన్సీకి తీసుకెళ్లారు. 'బాధిత విద్యార్థిని ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. వచ్చే 48 గంటలు చాలా కీలకం. ఫ్లాస్క్‌తోపాటు అక్కడున్న ఇతర వస్తువులన్నిటినీ సీజ్ చేసి, టాక్సికాలజీ పరీక్షలకు పంపించాం. ఇది విష ప్రయోగంగా కనిపిస్తోంది'అని ఓ అధికారి తెలిపారు. పరీక్షల ఫలితాలు అందాకే వాస్తవం వెల్లడవుతుందని రిమ్స్ ప్రతినిధి డాక్టర్ రాజీవ్ రంజన్ చెప్పారు. క్యాంటిన్ సీల్ చేసి, టీ ఫ్లాస్క్ తీసుకువచ్చిన క్యాంటిన్ ఉద్యోగిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

5.5 కోట్ల మంది వీసాల పరిశీలన

ట్రంప్ సర్కార్ నిర్ణయం

- పెద్ద సంఖ్యలో ఉన్న భారతీయ వీసాదారులపైనా ప్రభావం

వాషింగ్టన్: అమెరికాలో ఉంటున్న ఐదున్నర కోట్ల మంది విదేశీయుల వీసా పత్రాలను పూర్తి స్థాయిలో పరిశీలించే ప్రక్రియ మొదలైందని ట్రంప్ యంత్రాంగం గురువారం వెల్లడించింది. వీసాదారుల్లో ఎవరైనా వీసా నిబంధనలను ఉల్లంఘించారా అన్నది నిర్ధారించడమే దీని ఉద్దేశమని తెలిపింది. నేరాలు, ఉగ్రవాద చర్యలకు పాల్పడినా, ఉగ్ర సంస్థలకు మద్దతు పలికినా వీసా కాలపరిమితికి మించి దేశంలో నివసిస్తున్నా, యూదు వ్యతిరేక చర్యలు సహా ప్రజా భద్రతకు భంగం కలిగించినట్లు భావించిన వారిపై సైతం తగు చర్యలు తీసుకుంటామని పేర్కొంది. వారి వీసాలను రద్దు చేస్తామని, స్వదేశాలకు తిప్పిపంపించివేస్తామని స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లోనూ వీసాదారులపై ఓ కన్నేసి ఉంచుతామని తెలిపింది. అమెరికా పౌరులకు, సంస్కృతి, ప్రభుత్వం, సూత్రాలు, నిబంధనలకు భంగం వాటిల్లేలా వ్యవహరించినట్లు గుర్తించినా



చర్యలు తప్పవని పేర్కొంది. అమెరికా వ్యతిరేక భావజాలం కలిగిన వారికి ప్రయోజనాలను అందివ్వబోమని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ ప్రతినిధి మాథ్యూ ట్రగెస్సర్ తెలిపారు. కాగా, అమెరికాలో సుమారు 50 లక్షల మంది భారతీయ వీసాదారులున్నట్లు అంచనా. ట్రంప్ ప్రభుత్వ తాజా ప్రకటనతో వీరందరిలోనూ ఆందోళన మొదలై ంది. ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే 6 వేల మంది విద్యార్థుల వీసాలను రద్దు చేయడం తెల్సిందే. అదేవిధంగా, 12 దేశాల ప్రయాణికులపై పూర్తిస్థాయి నిషేధంతోపాటు మరో ఏడు దేశాలపై పాక్షిక నిషేధం విధించింది.

విదేశీ ట్రక్కు డ్రైవర్లకు నో వీసా

వాణిజ్య ట్రక్కు డ్రైవర్లుగా పనిచేసే విదేశీయులకు వీసాల మంజూరు నిలిపివేసినట్లు అమెరికా ప్రభుత్వం తెలిపింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రుబియో గురువారం ఎక్స్ వేదికగా ఈ విషయం ప్రకటించారు. తక్షణమే ఇది అమల్లోకి వచ్చిందన్నారు. 'పెద్ద ట్రాక్టర్-ట్రెలర్ ట్రక్కులపై డ్రైవర్లుగా పెద్ద సంఖ్యలో పనిచేస్తున్న విదేశీయుల కారణంగా దేశంలో రహదారులపై ప్రయాణించే పౌరుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. అమెరికన్ ట్రక్కు డ్రైవర్లకు జీవనోపాధి సైతం దెబ్బతింటోంది'అని ఆయన వివరించారు. ప్రస్తుతం అమెరికాలో ఎంత మంది విదేశీ ట్రక్కు డ్రైవర్లు పనిచేస్తున్నదీ విదేశాంగ శాఖ వెల్లడించలేదు. ట్రక్కు డ్రైవర్లుగా పనిచేయాలనుకునే విదేశీయులు ఇంగ్లిష్‌ను చక్కగా మాట్లాడటం, రాయడం తెలిసుండాలంటూ ఇటీవల ట్రంప్ ప్రభుత్వం ఉత్తర్వులు చేయడం తెల్సిందే. రహదారి హెచ్చరికలను, సూచనలను చదివి సరిగ్గా అర్థం చేసుకోలేని డ్రైవర్ల కారణంగా రహదారి ప్రమాదాలు పెరుగుతున్నాయని రవాణా శాఖ ఆరోపిస్తోంది. రహదారి భద్రతను పెంచడమే తమ లక్ష్యమని చెబుతోంది.

చిన్నారిని గదిలో ఉంచి తాళం!

ఓ హెడ్‌మాస్టర్ నిర్వాకం!

- తప్పించుకునే ప్రయత్నంలో కిటికీ గ్రిల్‌లో ఇరుక్కున్న చిన్నారి తల
- కాపాడిన గ్రామస్థులు

భువనేశ్వర్: ఒడిశాలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి నిర్వాకమిది. బెంచీపై నిద్రిస్తున్న రెండో తరగతి చదివే ఎనిమిదేళ్ల చిన్నారిని అలాగే క్లాస్ రూంలో వదిలి, తాళమేసి ఇంటికి వెళ్లిపోయాడు. మెలకువ వచ్చాక ఆ చిన్నారి కేకలు వేసినా ఎవరికీ వినిపించలేదు. రాత్రంతా చీకట్లో, ఒంటరిగా అలాగే భయంభయంగా ఉండిపోయింది. చివరికి కిటికీలోంచి దూరి బయటకు వచ్చేందుకు శతథా ప్రయత్నించింది. వీలుకాక కిటికీ గ్రిల్‌లో తల ఇరుక్కుపోయింది. ఉదయం గ్రామస్తులు వచ్చి చూసే వరకు కొన్ని గంటలపాటు అలాగే వేదన అనుభవించింది. కియోంఝర్ జిల్లాలో అన్జార్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఘటన చోటుచేసుకుంది. రెండో తరగతి చదువుతున్న జోత్స్న దెహూరి(8) అనే చిన్నారి తరగతి గదిలో ఓ బెంచీపై పడుకుని అలాగే నిద్రపోయింది. ఆమెను పట్టించుకోకుండా ఉపాధ్యాయుడు తరగతి గదికి తాళం వేసి వెళ్లిపోయాడు. చిన్నారి చీకటిపడిన రాకపోయేసరికి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఊరంతా వెదికారు. శుక్రవారం ఉదయం ఆ స్కూలు వైపుగా వెళ్లిన గ్రామస్తులకు కిటికీ గ్రిల్‌లో తల ఇరుక్కుపోయిన స్థితిలో జోత్స్న రోదిస్తూ కనిపించింది. వెంటనే గ్రిల్స్‌ను తొలగించి, చిన్నారిని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన చిన్నారి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ఘటన నేపథ్యంలో స్కూలు ఇన్‌ఛార్జి హెడ్మాస్టర్ గొరహరి మహంతాను అధికారులు సస్పెండ్ చేశారు. తరగతి గది కిటికీ గ్రిల్‌లో చిన్నారి తల ఇరుక్కున్నట్లుగా ఉన్న వీడియో ఒకటి ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. ఉపాధ్యాయుల వైఖరిపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, సాయంత్రం 4 గంటల తర్వాత తరగతి గదికి తాళాలు వేయాలంటూ 8వ తరగతి విద్యార్థులకు హెడ్మాస్టర్ చెప్పినట్లు విచారణలో తేలిందని డీఈవో వెల్లడించారు.

సీఈసీకి బెదిరింపులు ఆందోళనకరం

ఖండించిన ఐఏఎస్ అధికారుల సంఘం

న్యూఢిల్లీ: ప్రతిపక్షాలు చేస్తున్న ఓట్ చోరీ ఆరోపణల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఆయన కుటుంబసభ్యులపై కొనసాగుతున్న వ్యక్తిగత దూషణలను ఐఏఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. అధికారిక విధి నిర్వహణకు, వ్యక్తిగత దాడులకు ఎటువంటి సంబంధం లేదని సంఘం 'ఎక్స్'లో తెలిపింది. ప్రజా సేవలో గౌరవ మర్యాదలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేసింది. 'సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఆయన కుటుంబ సభ్యులపై వస్తున్న అనవసర విమర్శలు ఆందోళనకరం. ఆయన కుటుంబ సభ్యులు కూడా మంచి పేరున్న అధికారులే. అధికారిక విధుల నిర్వహణకు సంబంధం లేని ఇటువంటి వ్యక్తిగత దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం'అని పేర్కొంది. తాము అధికారంలోకి వస్తే సీఈసీతోపాటు, ఇద్దరు ఎన్నికల కమిషనర్ల పనిపడతామంటూ ఇటీవల ఇండియా కూటమి నేత తేజస్వీ యాదవ్ బిహార్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బెదిరింపు వ్యాఖ్యలు చేశారు. ఓటు చోరీ ఆరోపణలపై వారం రోజుల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలంటూ రాహుల్ గాంధీకి సీఈసీ కుమార్ అల్టిమేటం ఇవ్వడం తెల్సిందే. సీఈసీ కుమార్ కేరళ కేడరకు చెందిన అధికారి. ఒక సోదరుడు ఐఆర్ఎస్ సీనియర్ అధికారి కాగా, ఆయన ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు కూడా ఉన్నతాధికారులుగా పనిచేస్తున్నారు.

ఆ జర్నలిస్టులను అరెస్ట్ చేయొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: 'ది వైర్'వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధార్థ వరదరాజన్, కన్సల్టింగ్ ఎడిటర్ కరణ్ థాపర్‌లకు సుప్రీంకోర్టు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించింది. వరదరాజన్‌కు చెందిన 'ఫౌండేషన్ ఫర్ ఇండిపెండెంట్ జర్నలిజం'వేసిన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున నిత్యా రామకృష్ణన్ వాదనలు వినిపించారు. అసోంలోని మోరిగావ్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి అరెస్ట్ నుంచి సుప్రీంకోర్టు రక్షణ కల్పించిన తర్వాత పోలీసులు గువాహటి క్రైం బ్రాంచి పోలీసులు మేలో నమోదు చేసిన కేసులో అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం విచారణకు రావాలంటూ సమన్లు జారీ చేశారని, వెళితే అరెస్ట్ చేసే ప్రమాదముందన్నారు. అయితే, తామంతా గమనిస్తున్నామని వ్యాఖ్యానించిన ధర్మాసనం...కేసు దర్యాప్తునకు సహకరించాలని జర్నలిస్టులను కోరింది. వారిని అరెస్ట్ చేయవద్దంటూ పోలీసులను ఆదేశించింది. ఆపరేషన్ సిందూర్‌పై రాసిన ఒక వార్తా కథనంపై అసోం పోలీసులు వీరిద్దరిపై కేసు నమోదు చేశారు. అయితే, వీరిని అరెస్ట్ చేయరాదంటూ ఆగస్ట్ 12వ తేదీన సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

మిజోరంలో రూ.75 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

ఐజ్వాల్: ఈశాన్య రాష్ట్రం మిజోరంలో బీఎస్ఎఫ్, ఎక్సైజ్ నార్కోటిక్ విభాగం సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో రూ.75 కోట్ల విలువైన మెథాంఫెటమైన్, హెరాయిన్ పట్టుబడింది. బీఎస్ఎఫ్‌కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఐజ్వాల్-చంపయ్ హైవేపై అనుమానాస్పదంగా ఉన్న రెండు వాహనాలను అధికారులు అడ్డగించారు. వాహనాల్లోని ప్లాస్టిక్ బ్యాగుల్లో 50 ప్యాకెట్లలో ఉంచిన 50 కిలోల మెథాంఫెటమైన్ బయటపడింది. మూడు సబ్బుల పెట్టెల్లో మరో 36 గ్రాముల హెరాయిన్ లభించింది. వీటి మొత్తం విలువ రూ.75 కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకుని, వాటిలోని 8 మందిని అరెస్ట్ చేశారు.

ఓటర్ల జాబితా సవరణతో పేదలకు నష్టమే

- ఒక తప్పును సరి చేయడానికి మరిన్ని తప్పులు చేయొద్దు
- నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్ సూచన

కోల్‌కతా: ఎన్నికల సంఘం ప్రారంభించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై ప్రఖ్యాత ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టకపోతే పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. అర్హులైన ఓటర్ల నిర్ధారణ కోసం రకరకాల ధ్రువపత్రాలు సమర్పించాలని నిబంధన విధించడం సరైంది కాదన్నారు. ప్రజల వద్ద అలాంటి పత్రాలు అందుబాటులో ఉండవని అన్నారు. ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేయడం, మార్పులు చేర్పులు చేపట్టడం వాంఛనీయమే అయినప్పటికీ అది పౌరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా ఉండకూడదని తేల్చిచెప్పారు. అమర్త్య సేన్ శుక్రవారం కోల్‌కతాలో ఓ కార్యక్రమంలో మాట్లాడారు. పేదలకు వారి హక్కులను దూరం చేయకూడదని చెప్పారు. ఒక తప్పును సరి చేయడానికి మరిన్ని తప్పులు చేయడం తెలివైన పని కాబోదని వ్యాఖ్యానించారు. వ్యవస్థ ఏదైనా సరే దుర్బల వర్గాన్ని రక్షించేలా, వారి ప్రయోజనాలు కాపాడేలా ఉండాలని స్పష్టంచేశారు. ఒక ఉత్తమ వ్యవస్థను తీసుకొచ్చే తొందరలో పేదలకు నష్టం చేయొద్దని అమర్త్య సేన్ విజ్ఞప్తి చేశారు. దేశంలో హిందువులు, ముస్లింల మధ్య సంబంధం కేవలం సహనానికి సంబంధించింది కాదని అన్నారు. సంగీతం, సాహిత్యం, నిర్మాణం తదితర రంగాల్లో ఇరువర్గాల మధ్య చరిత్రాత్మక సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు.

ఢిల్లీలో ఆగిన కరెంటు సరఫరా

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఉత్తర ప్రాంతంలో శుక్రవారం రాత్రి 6.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా చీకట్లు కమ్ముకున్నాయి. రోహిణి, షాలిమార్ బాగ్, సివిల్ లైన్స్, అశోక్ విహార్ తదితర ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీని ప్రభావం కనీసం 8 లక్షల మంది వినియోగదారులపై పడిందని టాటా పవర్ ఢిల్లీ డిస్ట్రిబూషన్ లిమిటెడ్(టీపీడీడీఎల్) ప్రతినిధి ఒకరు తెలిపారు. 220 కేవీ గ్రిడ్ల ద్వారా సరఫరా అయ్యే విద్యుత్తులో 550 మెగావాట్ల మేర హఠాత్తుగా తగ్గిపోవడమే సమస్యకు కారణమన్నారు. దశల వారీగా సరఫరాను పునరుద్ధరించేందుకు యుద్ధ ప్రాతిపదికన ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. డిస్కంల బృందాలను వెంటనే రంగంలోకి దిగాయని, ప్రత్యామ్నాయ మార్గాల్లో సరఫరాను సాధారణ స్థాయికి తీసుకువస్తామని వివరించారు.

ఆధునికత దిశగా అడుగులేసిన హైదరాబాద్!

మీర్ ఉస్మాన్ అలీఖాన్ (1911-48)

మీర్ మహబూబ్ అలీఖాన్, అమత్ - ఉజ్ -జహ రున్నిసా బేగం దంపతులకు 1886లో మీర్ ఉస్మాన్ అలీఖాన్ జన్మించాడు. ఇతడు ఏడో అసఫ్ జా బిరుదుతో హైదరాబాద్ సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఏడో నిజాం పరిపాలనా కాలాన్ని హైదరాబాద్ రాజ్య చరిత్రలో నూతన శకంగా పేర్కొనవచ్చు. రాజ్యాన్ని ఆధునికత వైపు అడుగులు వేయించిన గొప్ప దార్శనికుడు ఉస్మాన్ అలీఖాన్. ఇతడిని హైదరాబాద్ చరిత్రలో గొప్ప హీరో, విలన్‌గా పేర్కొంటారు. రాజ్యంలో వ్యవసాయాభివృద్ధి, తాగునీటి అవసరాలను తీర్చడానికి 1920లో ఉస్మాన్‌సాగర్ (గండిపేట చెరువు), 1927లో హిమాయత్ సాగర్; అలీసాగర్(బోధన్), రాయపల్లి చెరువు(మెదక్), పాలేరు చెరువు(ఖమ్మం)లను తవ్వించాడు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సహకారంతో నిజాంసాగర్‌ను నిర్మించి నీటిపారుదల సౌకర్యాలను కల్పించాడు. 1914లో పురావస్తు శాఖను ఏర్పాటు చేసి వెయ్యి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం, ఎల్లోరా, అజంతా లాంటి చారిత్రక ప్రదేశాలను సంరక్షించాడు. హైదరాబాద్ అభివృద్ధి కోసం 1912లో హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశాడు. 1919లో హైకోర్టు భవనాన్ని, జూబ్లీహాల్, అసెంబ్లీ, మొజంజాహి మార్కెట్ భవనాలను నిర్మించాడు. 1922లో హైదరాబాద్ రాజ్యంలో మరణశిక్షను రద్దు చేశాడు. సాంఘిక దురాచారాలైన దేవదాసి, వెట్టి చాకిరి విధానాలను అదే ఏడాది రద్దు చేశాడు. 1927లో ఉచిత ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాడు. 1936లో మాధ్యమిక విద్యా మండలిని స్థాపించాడు. 1918లో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని స్థాపించి ఉన్నత విద్యను ప్రోత్సహించాడు. (1919 ఆగస్టు 28 నుంచి ఓయూలో విద్యాబోధన ప్రారంభమైంది.) నిజాం స్టేట్ రైల్వేలో భాగంగా దేశంలో తొలి రోడ్డు రవాణా సంస్థను 1932లో ఏర్పాటైంది. రాజ్యాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు దక్కన్ బటన్ ఫ్యాక్టరీ(1916), వజీర్ సుల్తాన్ టొబాకో(వీఎస్‌టీ) ఫ్యాక్టరీ, దక్కన్ గ్లాస్ ఫ్యాక్టరీ(1927), నిజాం షుగర్ ఫ్యాక్టరీ (1937), సిర్పూర్ పేపర్ మిల్లు(1939), గోల్కొండ సిగరెట్ ఫ్యాక్టరీ(1941), హైదరాబాద్ ఆల్విన్ మెటల్స్(1942) తదితర పరిశ్రమలను నెలకొల్పాడు.

హైదరాబాద్ స్టేట్ బ్యాంక్ చట్టం-1941 ప్రకారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ ప్రారంభమైంది. ఈ బ్యాంక్ మొదటి శాఖను 1942 ఏప్రిల్ 5న గన్‌ఫౌండ్రి వద్ద మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రారంభించాడు. ఉస్మాన్ అలీఖాన్ తన పేరు మీద 'ఉస్మానియా సిక్కా'ను ప్రవేశపెట్టాడు. ప్రముఖ చరిత్రకారుడు రాజేంద్రప్రసాద్ అభిప్రాయం ప్రకారం 'పాలనా పగ్గాలు చేపట్టిన తొలి సంవత్సరాల్లో ఉస్మాన్ అలీఖాన్ మంచి సంస్కర్త'. రెండో ప్రపంచ యుద్ధ కాలం నుంచి బ్రిటిష్ ప్రభుత్వం దేశంలో, ముఖ్యంగా స్వదేశీ సంస్థానాల విషయాల్లో జోక్యం చేసుకోవడం తగ్గించింది. ఇదే అదనుగా ఉస్మాన్ అలీఖాన్ ఆంగ్లేయ అధికారులను తొలగించి ముస్లింలతో ఉద్యోగాలను భర్తీ చేశాడు.

జిల్లాల పేర్ల మార్పు

మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాలంలో హైదరాబాద్‌ను ముస్లిం రాజ్యంగా మార్చే ప్రయత్నం జరిగింది. 1905లో వివిధ జిల్లాల పేర్లను మార్చారు. ఎలగండలను కరీంనగర్‌గా, పాలమూరును మహబూబ్‌నగర్‌గా, ఇందూరును నిజామాబాద్‌గా, మెతుకును మెదక్‌గా మార్చారు. మానుకోటను మహబూబాబాద్‌గా, భువనగిరిని భోన్‌గిర్‌గా మార్చారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో 1927లో మజ్లిస్-ఇ-ఇత్తేహాదుల్-ముస్లిమీన్ అనే సంస్థను స్థాపించారు. ఈ సంస్థ అంజుమన్ తబ్లి గులిస్తాన్ అనే మరో సంస్థతో కలిసి హిందువుల్ని ముస్లిం మతంలోకి మార్చే తబ్లిక్ ఉద్యమాన్ని ప్రారంభించింది. హైదరాబాద్ నగరంలో ఆర్య సమాజం శాఖను 1892లో ఏర్పాటు చేశారు. కేశవరావ్ కొరాట్కర్, దామోదర్ సత్యాలేకర్, డాక్టర్ అఘోరనాథ్ ఛటోపాధ్యాయ లాంటి ప్రముఖులు నగరంలో ఆర్య సమాజ కార్యకలాపాలకు మద్దతునిచ్చారు. ఆర్య సమాజం తబ్లిక్ ఉద్యమానికి వ్యతిరేకంగా 'శుద్ధి' కార్యక్రమాన్ని చేపట్టి ఇస్లాం మతంలో చేరిన వారిని తిరిగి హిందువులుగా మార్చింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉర్దూ మాధ్యమంలోనే బోధించేవారు. మెజార్టీ ప్రజల మాతృభాషలైన తెలుగు, కన్నడ, మరాఠీల్లో విద్యాబోధనపై నిషేధం ఉండేది. తెలుగు మాధ్యమంలో విద్యాబోధన చేయడం వల్ల నారాయణగూడలోని ఆంధ్ర బాలికోన్నత పాఠశాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం గుర్తింపు ఇచ్చేందుకు నిరాకరించింది. హైదరాబాద్ రాజ్యంలో ఖిలాఫత్ ఉద్యమాన్ని ప్రజలు ప్రారంభించారు. ఈ ఉద్యమాన్ని ఉస్మాన్ అలీఖాన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నాడు. 1920లో హైదరాబాద్, కరీంనగర్, మెదక్ లాంటి పట్టణాల్లో ఖిలాఫత్ దినాన్ని పాటించారు. ఈ ఉద్యమ కాలంలో ముస్లింలు ఉస్మాన్ అలీఖాన్‌కు 'మెహిపుల్ మిల్లత్-ఇ-ఉద్దీన్' అనే బిరుదునిచ్చి, ఖిలాఫత్ ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. జమీందార్, సియాసత్, జమానా లాంటి ఉర్దూ పత్రికలు ఖిలాఫత్ భావాలను ప్రచారం చేశాయి.

చందా రైల్వే ఆందోళన

భారత ప్రభుత్వం, హైదరాబాద్ ప్రభుత్వం మధ్య 1870లో ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం మద్రాస్-బొంబాయి మార్గంలో వాడి-హైదరాబాద్ మధ్య రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలి. రైల్వేల విస్తరణతో బొగ్గుకు గిరాకీ పెరగడం వల్ల ఈ రైల్వే లైన్‌ను బొగ్గు గనులున్న ప్రాంతాలైన డోర్నకల్, సింగరేణి మీదుగా విజయవాడ వరకు పొడిగించాలని నిర్ణయించారు. కొద్దికాలం తర్వాత చందాలో బొగ్గు నిక్షేపాలు కనుగొన్నారు. దీంతో రైల్వే లైన్‌ను చందా వరకు పొడిగించాలని నిర్ణయించారు. ఈ ప్రతిపాదనలు మొదటి సాలార్‌జంగ్ కాలంలోనే ఆమోదం పొందాయి. ఈ రైల్వే లైన్ల నిర్మాణానికి బ్రిటిష్ రైల్వే కంపెనీ మూడు లక్షల పౌండ్ల ధనాన్ని సమకూర్చింది. రైల్వే నిర్మాణ వివరాలు ప్రజలకు పూర్తిగా తెలియవు. ఈ ప్రతిపాదన వల్ల సంస్థానానికి ఆర్థికంగా చాలా నష్టం వాటిల్లుతుందని అప్పుడే ఉనికిలోకి వస్తోన్న విద్యావంతులు భావించారు. అందువల్ల చందా రైల్వే ప్రణాళికను పరిశీలించేందుకు సంస్థానంలోని విద్యావంతులు అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, ముల్లా అబ్దుల్ ఖయ్యూం నాయకత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. చందా రైల్వే పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను తమకు అందజేయాలని ఈ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ప్రజలు ఈ విధంగా కోరడం హైదరాబాద్ సంస్థాన చరిత్రలో ఇదే తొలిసారి. ఈ విషయమై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. పర్యవసానంగా అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, ముల్లా అబ్దుల్ ఖయ్యూం తదితరులను సంస్థానం నుంచి బహిష్కరించింది. 1883 నాటి చందా రైల్వే ఆందోళన హైదరాబాద్ సంస్థానంలో ప్రజా చైతన్యానికి నాంది అనడంలో సందేహం లేదు.



తెలంగాణలో రాజకీయ చైతన్యం

ఆంధ్ర ప్రాంతంతో పోలిస్తే తెలంగాణలో రాజకీయ చైతన్యం ఆలస్యంగా మొదలైంది. మిగతా సంస్థానాల తరహాలోనే హైదరాబాద్ సంస్థానంలోనూ నిరంకుశత్వం అమల్లో ఉండేది. రాజ్యంలో ప్రాథమిక హక్కులు కరవయ్యాయి. వ్యవసాయ కౌలుదార్ల పరిస్థితి దుర్భరంగా తయారైంది. ముక్తేదార్లు, ఫత్తేదార్లు అనే పెద్ద భూస్వాములు కౌలుదారీ రైతులను బాగేలా అనే దాస్యానికి, బానిసత్వానికి గురిచేశారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడానికి కొమర్రాజు లక్ష్మణరావు 1901లో హైదరాబాద్ నగరంలో 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం'ను స్థాపించారు. ఇదే తెలంగాణలో ఏర్పాటైన తొలి గ్రంథాలయం. మునగాల రాజా ఎస్.వెంకటరావు, హైదరాబాద్ మునసబ్‌దార్ రావిచెట్టు రంగారావు ఆర్థిక ప్రోత్సాహంతో లక్ష్మణరావు ఈ గ్రంథాలయాన్ని స్థాపించారు. 1904లో హన్మకొండలో 'శ్రీ రాజరాజ ఆంధ్ర భాషా నిలయం, 1905లో సికింద్రాబాద్‌లో 'ఆంధ్ర సంవర్ధిని' లాంటి తెలుగు గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. 1906లో లక్ష్మణరావు 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి' అనే సాహితీ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ప్రభుత్వ వ్యతిరేక చర్యలు చేపడుతోందని ప్రభుత్వానికి సందేహం వచ్చింది. దీంతో 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి' ప్రధాన కేంద్రాన్ని మద్రాసుకు తరలించారు. ఈ విధంగా తెలంగాణలో సాంస్కృతిక పునర్జీవనానికి పునాదులు వేయడంలో కొమర్రాజు లక్ష్మణరావు సఫలీకృతుడయ్యాడు .

ఆంధ్ర జనసంఘం ఏర్పాటు

1921 నవంబర్ 11, 12 తేదీల్లో హైదరాబాద్ సంస్థాన సాంఘిక సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశానికి సంఘ సంస్కర్త, ఎస్.ఎన్.డి.టి. మహిళా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడైన మహర్షి కార్వే అధ్యక్షత వహించారు. ఈ సమావేశ కార్యక్రమాలను ఆంగ్ల, ఉర్దూ భాషల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలంపల్లి వెంకట రామారావు ఒక తీర్మానంపై తెలుగులో మాట్లాడేందుకు ప్రయత్నించారు. దీంతో సమావేశంలో పాల్గొన్న ఒక వర్గం ఆయన ప్రసంగాన్ని అడ్డుకొంది. ఈ సమావేశంలో తెలుగు భాషకు అవమానం జరిగిందని భావించి, తెలుగు వారి కోసం ఓ సంస్థను ప్రారంభించాలని తీర్మానించారు. మాడపాటి హనుమంతరావు, బి.రామకృష్ణారావు, ఎం.నరసింగరావు, ఆదిరాజు వీరభద్రరావు సహా 11 మంది సభ్యులతో 'ఆంధ్ర జనసంఘం' పేరుతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్ర జనసంఘం మొదటి సమావేశం 1922 ఫిబ్రవరి 14న కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలోనే ఆంధ్ర జనసంఘం పేరును 'నైజాం ఆంధ్ర రాష్ట్ర జనసంఘం'గా మార్చారు. తెలంగాణ ప్రజల్ని సాంఘిక, ఆర్థిక, సాంస్కృతికాభివృద్ధి దిశగా నడపడమే ఈ సంఘం ముఖ్యోద్దేశం. తెలంగాణలోని వివిధ ఆంధ్ర సంఘాల కార్యకలాపాలను సమన్వయపరిచేందుకు 'ఆంధ్ర జన కేంద్ర సంఘం' అనే కేంద్ర సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు మాడపాటి హనుమంతరావు కార్యదర్శిగా పనిచేశారు. వెట్టిచాకిరి, వర్తక సంఘం అనే కరపత్రాలను ఈ సంస్థ విడుదల చేసింది. ఆంధ్ర జన సంఘం నిర్వహించిన తొలి నాలుగు సమావేశాలు హైదరాబాద్(1923), నల్గొండ(1924), మధిర(1925), సూర్యాపేట(1928)లో జరిగాయి. 'నిజాం ఆంధ్ర రాష్ట్ర ప్రశంస', 'నిజాం ఆంధ్ర రాష్ట్ర ఆంధ్రులు' అనే పుస్తకాలను ప్రచురించారు. కొమర్రాజు లక్ష్మణరావు జ్ఞాపకార్థం 'లక్ష్మణరాయ పరిశోధక మండలి' పేరుతో ఒక చారిత్రక పరిశోధన సంఘాన్ని జన సంఘం ఏర్పాటు చేసింది. 1930లో ఈ సంస్థ 'కాకతీయ సంచిక' అనే పేరుతో ఒక సంపుటిని విడుదల చేసింది.

ఉదరంలో ఉత్పత్తయ్యే ఆమ్లం ఏది?

జనరల్‌సైన్స్ విభాగం నుంచి గతంలో వచ్చిన ప్రశ్నలు

1. మానవ శరీరంలో ఎన్ని ఎముకలుంటాయి? (ఏఈఈ-2007)
   1) 330 2) 280 3) 206 4) 220
2. మానవ శరీరంలో అతి కఠిన భాగం? (ఏఎస్‌ఓ-2008)
   1) గోర్లు 2) ఎముకలు 3) కొమ్ములు 4) ఎనామిల్
3. చెవుల్లోని మొత్తం ఎముకల సంఖ్య? (ఏఎస్‌ఓ-2008)
   1) రెండు 2) నాలుగు 3) ఆరు 4) ఎనిమిది
4. దంతక్షయాన్ని అరికట్టడానికి నీటి సరఫరాలో కలిపే రసాయన పదార్థం? (గ్రూప్-2, 2000)
   1) క్లోరైడ్ 2) ఫ్లోరైడ్ 3) బ్రోమైడ్ 4) సల్ఫైడ్
5. పాలలోని చక్కెర? (జె.ఎల్.-2007)
   1) ఫ్రక్టోజ్ 2) గ్లూకోజ్ 3) సుక్రోజ్ 4) లాక్టోజ్
6. పాలు అంటే ఏమిటి? (గ్రూప్-1, 2002)
   1) కొవ్వు విస్తరించి ఉన్న రక్తం
   2) కొవ్వు విస్తరించి ఉన్న నీరు
   3) నీరు విస్తరించి ఉన్న కొవ్వు
   4) నీరు విస్తరించి ఉన్న చమురు
7. పాలలో కొవ్వు శాతం ఏ సమయంలో తగ్గుతుంది? (ఏఈఈ-2009)
   1) చలికాలం 2) వేసవికాలం 3) వర్షాకాలం 4) ఏదీకాదు
8. ఆవు పాలు పసుపు రంగులో ఉండటానికి కారణం? (గ్రూప్-2, 2012)
   1) జాంతోఫిల్ 2) మాల్టోజ్ 3) రైబోఫ్లావిన్ 4) కెరాటిన్
9. కండరాలకు వచ్చే కేన్సర్ ఏది? (గ్రూప్-1, 2003)
   1) లింఫోమా 2) ల్యూకేమియా 3) సార్కోమా 4) అనీమియా
10. నేత్రదానంలో దాత తన కంటిలోని ఏ భాగాన్ని దానం చేస్తాడు? (గ్రూప్-1, 2003)
    1) కార్నియా 2) లెన్స్ 3) రెటీనా 4) పూర్తి కన్ను
11. పాలిష్ చేసిన బియ్యాన్ని ఎక్కువగా తీసుకుంటే ఏ విటమిన్ లోపిస్తుంది? (డిప్యూటీ ఈఓ-2008)
    1) A 2) B_2 3) D 4) B_1
12. ఏ విటమిన్ లోపం వల్ల చిగుళ్ల నుంచి రక్తస్రావమవుతుంది?
    1) A 2) D 3) K 4) C
13. తాడు రక్తం (Cord Blood) అంటే ఏమిటి? (గ్రూప్-2, 2005)
    1) కూతుళ్లకు తండ్రి దానం చేసే రక్తం
    2) కృత్రిమ రక్తం
    3) గుండె కాండ కణాల నుంచి వృద్ధి చేసిన రక్తం
    4) మాయ కాండ కణాల నుంచి వృద్ధి చేసిన రక్తం
14. హిమోగ్లోబిన్‌లో ఉండే లోహం? (గ్రూప్-1, 1987-88)
    1) మెగ్నీషియం 2) ఇనుము 3) కోబాల్ట్ 4) మాంగనీస్
15. పేస్‌మేకర్ దేనికి సంబంధించింది? (గ్రూప్-1, 2010)
    1) గుండె 2) ఊపిరితిత్తులు 3) కాలేయం 4) కిడ్నీ
16. రక్తం ఒక..? (గ్రూప్-1, 2010)
    1) ద్రావణం 2) కొల్లాయిడ్ 3) తరల పదార్థం 4) జెల్
17. శిశువు పితృత్వాన్ని నిర్ధారించేందుకు ఏ పరీక్ష నిర్వహిస్తారు? (సివిల్స్-2010)
    1) ఆమ్నియో సెంటాసిస్
    2) డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్
    3) జన్యు సైక్లింగ్ 4) ఏదీకాదు
18. AB రక్త గ్రూపునకు చెందిన ఒక వ్యక్తిని విశ్వగ్రహీత అని ఎందుకంటారు? (గ్రూప్-1, 2007)
    1) ప్రతిరక్షక జనకాలు లేనందువల్ల
    2) ప్రతిరక్షకాలు ఉన్నందువల్ల
    3) ప్రతిరక్షకాలు లేనందువల్ల
    4) ప్రతిరక్షకాలు - ప్రతి రక్షక జనకాలు లేనందువల్ల
19. సిరా రక్తాన్ని ఆక్సిజన్ కోసం ఊపిరితిత్తులకు చేరవేసేది? (గ్రూప్-2, 2008)
    1) పుపుస సిరలు 2) పుపుస ధమనులు 3) కుడి జఠరిక 4) మహాధమని
20. చాలా కీటకాలు గాలిని సంగ్రహించే పద్ధతి?
    1) చర్మం ద్వారా 2) మొప్పల ద్వారా
    3) ట్రాకియల్ వ్యవస్థ ద్వారా
    4) లంగ్స్ ద్వారా
21. బయోగ్యాస్‌లోని ప్రధానాంశం? (గ్రూప్-1, 1987)
    1) ఈథేన్ 2) మీథేన్ 3) బ్యూటేన్ 4) ఎసిటలిన్
22. ఆక్సిజన్ లేకుండా ఒక జైవిక పదార్థాన్ని విచ్ఛిన్నం చేయడం ద్వారా ఏ వాయువును ఉత్పత్తి చేయొచ్చు? (గ్రూప్-2, 2001)
    1) బొగ్గుపులుసు వాయువు
    2) నత్రజని
    3) SO_2 4) మీథేన్
23. ఆల్కహాల్‌ను తయారు చేయడానికి ఏది అవసరం? (గ్రూప్-2, 2001)
    1) ప్రోటోజోవా
    2) శిలీంద్రాలు - ఈస్ట్
    3) బ్యాక్టీరియా 4) వైరస్
24. పురుషుడి గొంతు కంటే స్త్రీ గొంతు కీచుగా ఉంటుంది. ఎందుకంటే? (గ్రూప్-2, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్- 2009)



    1) అధిక పీడన వ్యాప్తి
    2) అల్ప పీడన వ్యాప్తి
    3) అధిక కంపన పరిమితి
    4) అల్ప కంపన పరిమితి
25. సిలికోసిస్ వ్యాధి ఏ అవయవానికి సంక్రమిస్తుంది?
    1) మూత్రపిండాలు 2) కాలేయం 3) నరాలు 4) ఊపిరితిత్తులు
26. మొదటిసారిగా కృత్రిమంగా తయారు చేసిన జీవ సమ్మేళనం? (గ్రూప్-2, 2008)
    1) మీథేన్ 2) బెంజీన్ 3) గ్లూకోజ్ 4) యూరియా
27. సాధారణంగా మూత్రం ద్వారా విసర్జితమయ్యే పదార్థం? (గ్రూప్-2, 2003)
    1) పంచదార 2) గ్లూకోజ్ 3) క్రియాటిన్ 4) ప్రొటీన్
28. మానవ కిడ్నీలో ఏర్పడే రాళ్లలో అధికంగా ఉండేది?
    1) కాల్షియం ఆక్జలేట్
    2) సోడియం ఎసిటేట్
    3) మెగ్నీషియం సల్ఫేట్
    4) సోడియం సిట్రేట్
29. మూత్రపిండాల్లోని ఏ భాగంలో మూత్రం వడపోత అవుతుంది? (డీఎల్-2012)
    1) వృక్కం 2) మూత్ర కోశం 3) ప్రసేకం 4) వృక్క సిర
30. మానవ మూత్రంలోని యూరియా తయారయ్యే భాగం? (గ్రూప్-2, 2000)
    1) మూత్రపిండాలు 2) పెద్దపేగు 3) కాలేయం 4) మూత్రాశయం
31. కృత్రిమంగా మూత్రపిండాలు వ్యర్థ పదార్థాలను శుద్ధి చేయడాన్ని ఏమంటారు? (గ్రూప్-2బి,1984)
    1) పనోరిసిస్ 2) మానోమీటర్ 3) డయాలసిస్ 4) డయామెంటేషన్
32. చక్కెర వ్యాధిగ్రస్థుని మూత్ర నమూనాలో ఉండేది? (ఏఈఈ-2009)
    1) లాక్టోజ్ 2) మాల్టోజ్ 3) గ్లూకోజ్ 4) సుక్రోజ్
33. క్లోమం ఒక ..? (గ్రూప్-1, 1999)
    1) అంతస్స్రావ గ్రంథి
    2) బహిస్స్రావ గ్రంథి
    3) అంతస్స్రావ - బహిస్స్రావ గ్రంథి
    4) ఏదీకాదు
34. శరీరంలో తాప నియంత్రణను కలిగి ఉన్న గ్రంథి? (గ్రూప్-1, 2007)
    1) పీనియల్ గ్రంథి
    2) పిట్యూటరీ గ్రంథి/ హైపోథలమస్
    3) థైరాయిడ్ 4) అడ్రినలిన్
35. మానవ శరీరంలో 'ఆడమ్స్ ఆపిల్' అని పిలిచే గ్రంథి? (గ్రూప్-1, 2007)
    1) అడ్రినల్ గ్రంథి 2) లివర్/కాలేయం
    3) థైరాయిడ్-బాలగ్రంథి
    4) థైమస్-బాలగ్రంథి
36. తన జాతి జీవులపై ప్రభావం చూపే, జీవి శరీరం నుంచి బాహ్యంగా స్రవించే సమ్మేళనాన్ని ఏమంటారు? (గ్రూప్-1, 1995)
    1) సబ్ హార్మోన్ 2) న్యూరో హార్మోన్
    3) ఫిరమోన్స్
    4) న్యూరో ట్రాన్స్‌మీటర్
37. పాల పొదుగు నుంచి - చూషణ ద్వారా పాలను స్రవించేందుకు తోడ్పడే హార్మోన్? (సివిల్స్-1989)
    1) ప్రోలాక్టిన్ 2) ఆక్సిటోసిన్ 3) అడ్రినలిన్ 4) థైమోసిన్
38. రక్తపోటు (బ్లడ్ ప్రెషర్)కు కారణమైన హార్మోన్? (అసిస్టెంట్ తెలుగు ట్రాన్స్‌లేటర్-2010)
    1) కాలేయం 2) థైమోసిన్ 3) అడ్రినలిన్ 4) సెక్రిటిన్
39. కణం శక్తి గృహం (కణ శక్తి భాండాగారం) అని పిలిచే కణాంగం? (గ్రూప్-1, 1994, ఎ.ఎం.వి. ఇన్‌స్పెక్టర్- 2009)
    1) క్లోరోప్లాస్ట్ 2) మైటోకాండ్రియా 3) గ్రానా 4) ప్రోటోప్లాజమ్
40. తుమ్ములు, మింగడం, వాంతులు, వెక్కిళ్లు దేని నియంత్రణలో ఉంటాయి? (గ్రూప్-1, 1990)
    1) మజ్జాముఖం 2) మస్తిష్కం 3) అనుమస్తిష్కం 4) హైపోథాలమస్
41. అనుమస్తిష్కం (సెరిబెల్లమ్) దేనికి సంబంధించింది? (టౌన్ ప్లానింగ్ - 2010)
    1) కండరాల కదలిక సమన్వయం
    2) గ్రాహకాంగం
    3) జ్ఞాపక శక్తి 4) దృష్టి
42. జంతు రాజ్యంలో అతిపొడవైన కణం? (గ్రూప్-1, 2010)
    1) ఆస్ట్రిచ్ అండం 2) శుక్రకణం 3) నాడీకణం 4) మైకోప్లాస్మా
43. మెదడును కప్పి ఉంచే లోపలి పొర? (డీఎల్-2012)
    1) ప్లూరా 2) డ్యూరామ్యాటర్
    3) పియామ్యాటర్
    4) అరాకినాయిడ్ మెంబ్రేన్
44. పార్కిన్‌సన్ వ్యాధి ఏ అవయవానికి వస్తుంది? (ఏఈఈ-2006)
    1) గుండె 2) కాలేయం 3) మెదడు 4) చర్మం
45. శరీరంలో వార్తలను గ్రహించి సమన్వయ పరిచే కేంద్రం? (జె.ఎల్.-2007)
    1) గుండె 2) మెదడు 3) మూత్రపిండాలు 4) పీయూష గ్రంథి
46. మెదడులో ఏ భాగం జ్ఞాపకశక్తికి మూలం? (జె.ఎల్.-2004)
    1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం 3) దవ్వ 4) అధోపర్యంకం
47. కిందివాటిలో జీర్ణక్రియా ఎంజైమ్ కానిది? (సివిల్స్-2007)
    1) ట్రిప్సిన్ 2) పెప్సిన్ 3) టయలిన్ 4) గ్యాస్ట్రిన్
48. హెపటైటిస్ వ్యాధి దేనికి సంబంధించింది? (గ్రూప్-2, 2000)
    1) కాలేయంలో మంట
    2) గుండెలో మంట
    3) మూత్రపిండాల్లో మంట
    4) పేగులో మంట
49. బేరియాట్రిక్ శస్త్ర చికిత్స అంటే ఏమిటి? (గ్రూప్-1, 2004)
    1) గుండె బైపాస్ శస్త్ర చికిత్స
    2) పొట్ట బైపాస్ శస్త్ర చికిత్స
    3) మెదడు సర్జరీ
    4) సియామీ కవలలను విడదీసే సర్జరీ
50. కోసిన తర్వాత 2-3 వారాల్లోనే తన పూర్వ స్థితిని తిరిగి దాదాపు 85 శాతం వరకు పెంచుకునే సామర్థ్యం ఉన్న మానవ శరీర అవయం ఏది? (గ్రూప్-1, 2004, ఏఈఈ-2008)
    1) మెదడు 2) మూత్రపిండాలు 3) కాలేయం 4) ఊపిరితిత్తులు
51. మానవుని సొల్లు (సెలైవా)లో ఉండే ఎంజైమ్? (గ్రూప్-2, 2003)
    1) రెనిన్ 2) అమైలేజ్ 3) లైపేజ్ 4) టయలిన్
52. 'రూట్ కెనాల్ థెరపీ' వేటికి సంబంధించిన చికిత్స? (గ్రూప్-2, 2000)
    1) దెబ్బతిన్న పళ్లు
    2) దెబ్బతిన్న మూత్రనాళం
    3) రక్తనాళాలు 4) గోర్లు
53. మానవుడిలో అతిపెద్ద గ్రంథి? (ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్-2012)
    1) కాలేయం 2) ఊపిరితిత్తులు 3) ప్లీహం 4) క్లోమం
54. మానవ ఉదరంలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం? (గ్రూప్-1, 2012)
    1) ఎసిటికామ్లం 2) హైడ్రోక్లోరికామ్లం 3) ఫార్మికామ్లం 4) నైట్రికామ్లం
55. కిందివాటిలో సరైన వరస క్రమం ఏది?
    1) గడ్డి-తోడేలు-జింక-గేదె
    2) గడ్డి-కీటకం-పక్షి-పాము
    3) బ్యాక్టీరియా-కీటకం-పాము-జింక
    4) బ్యాక్టీరియా-గడ్డి-కుందేలు-తోడేలు
56. అండోత్పత్తి స్థానం నుంచి అండాలు గర్భాశయంలోకి ప్రవేశించడానికి ఏ భాగం సహాయపడుతుంది? (గ్రూప్-1, 2004)
    1) సెర్విక్స్ 2) యోని 3) జరాయువు 4) ఫెల్లోపియన్ నాళాలు

సమాధానాలు

1) 3;	2) 4;	3) 3;	4) 2;
5) 4;	6) 2;	7) 2;	8) 3;
9) 3;	10) 1;	11) 4;	12) 4;
13) 4;	14) 2;	15) 1;	16) 2;
17) 2;	18) 3;	19) 2;	20) 3;
21) 2;	22) 1;	23) 2;	24) 4;
25) 4;	26) 4;	27) 3;	28) 1;
29) 1;	30) 3;	31) 3;	32) 3;
33) 3;	34) 2;	35) 3;	36) 3;
37) 2;	38) 3;	39) 2;	40) 1;
41) 1;	42) 3;	43) 3;	44) 3;
45) 2;	46) 1;	47) 4;	48) 1;
49) 2;	50) 3;	51) 4;	52) 1;
53) 1;	54) 2;	55) 2;	56) 4.

'ఎవరెస్ట్' ఏ హిమాలయ పర్వత పంక్తుల్లో ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

హిమాలయ పర్వత వ్యవస్థ- ప్రాధాన్యం

ఉత్తరాన కోటగోడలా విస్తరించి ఉన్న హిమాలయ పర్వత వ్యవస్థ భారత్‌కు పాకిస్తాన్, చైనా, నేపాల్, భూటాన్ దేశాలతో సరిహద్దుగా ఉంది. వ్యూహాత్మకంగానే కాకుండా ఆర్థిక, సామాజిక అంశాల పరంగా కూడా హిమాలయ పర్వతాలు భారతదేశానికి కీలకం. దేశానికి ఉత్తర ప్రాంతం నుంచి సైనిక దాడులను నిరోధించి రక్షణ కల్పించడంలో హిమాలయాలు ప్రధానపాత్రను పోషిస్తున్నాయి. తూర్పు హిమాలయ ప్రాంతంలో భారత్-చైనాలను విడదీసే 'మెక్‌మోహన్ రేఖ'ను శాస్త్రీయ సరిహద్దుగా అభివర్ణిస్తారు. ఈ ప్రాంతంలో హిమాలయ పర్వతాలు, వాటి కనుమలను పూర్తిగా భారతదేశం కిందకు తేవడంతో చైనా ఈ ప్రాంతంలో భారత్‌లోకి చొచ్చుకు రావడం చాలా కష్టం. కాబట్టి చైనా మెక్‌మోహన్ రేఖను అంగీకరించడం లేదు. చైనా వాదన ప్రకారం ఈ ప్రాంతంలో అంతర్జాతీయ సరిహద్దు హిమాలయ పర్వత పాదాల వద్ద ఉండాలి. అంటే మొత్తం హిమాలయ పర్వతాలను (అరుణాచల్ ప్రదేశ్‌ను) చైనా కోరుతుందన్న మాట. ఇది భారత్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ సమ్మతం కాదు. సైనిక వ్యూహాల పరంగా హిమాలయ పర్వతాల్లోని కనుమలు చాలా ప్రాధాన్యాన్ని కలిగి ఉంటాయి. 1962 యుద్ధంలో అరుణాచల్ హిమాలయాల్లోని తవాంగ్, బొమిడిల్లా కనుమ లను రక్షించుకోలేకపోవడంతోనే చైనా సైన్యాలు సులువుగా అరుణాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించగలిగాయి. జమ్ముకశ్మీర్ హిమాలయాల్లోని కారకోరం కనుమ నుంచి భారత్, చైనా, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) భూభాగాల్లోకి సులువుగా ప్రవేశించవచ్చు. 1980లలో (పీఓకే)మీదుగా చైనా, పాకిస్తాన్‌లను కలుపుతూ కారకోరం కనుమ ద్వారా రహదారి నిర్మించడంతో భారత్ భద్రతకు ముప్పు ఏర్పడింది. కాబట్టి కారంకోరం కనుమకు సమీపంలోని సియాచిన్ హిమానీ నద ప్రాంతంలో సైనిక బలగాలను మోహరించాల్సి వచ్చింది. కార్గిల్ యుద్ధంలో కూడా జొజిల్లా కనుమకు ముప్పు ఏర్పడింది. శ్రీనగర్-లే జాతీయ రహదారికి సమీపంలో ఈ కనుమ ఉంది. జొజిల్లా కనుమ శత్రువుల ఆధీనంలోకి వెళితే భారతదేశం నుంచి లడఖ్‌ను సులువుగా వేరు చేయొచ్చు. ఈ ప్రమాదాన్ని గమనించే కార్గిల్ యుద్ధంలో జొజిల్లా కనుమ సమీపంలోని టైగర్‌కొండ, ముష్కోష్ లోయల్లో తిష్ఠ వేసిన ముష్కరులను హతమార్చడానికి భారత సైన్యం పెద్ద మూల్యాన్నే చెల్లించాల్సి వచ్చింది. 'బనిహాల్ కనుమ' గుండా



జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారి వెళ్తుంది. అందుకే ఈ కనుమను 'కశ్మీర్ లోయ ముఖద్వారం'గా పరిగణిస్తారు.

వాణిజ్య-సాంస్కృతిక సంబంధాలు

హిమాలయ పర్వతాల కనుమలు అనాదిగా వాణిజ్య, సాంస్కృతిక సంబంధాల్లోనూకీలక పాత్ర పోషించాయి. భారతదేశం నుంచి చైనాలోకి బౌద్ధమత వ్యాప్తి హిమాలయ పర్వత కనుమల ద్వారా జరిగింది. సిక్కిం-టిబెట్ సరిహద్దులోని నాథూలా, జెలెప్ కనుమల ద్వారా టిబెట్ రాజధాని లాసా, కోల్‌కతా రేవు పట్టణాలను కలిపే రహదారి వెళ్తుంది. 1962 యుద్ధం తర్వాత ఈ రెండు కనుమల ద్వారా జరిపే వాణిజ్యాన్ని నిలిపివేశారు. ఇటీవల నాథూలా కనుమను తిరిగి వాణిజ్యానికి తెరిచారు. టిబెట్-నేపాల్-ఉత్తరాఖండ్ సరిహద్దు ప్రాంతంలోని 'లిపులేక్' కనుమ మార్గం అనాదిగా వాణిజ్యానికి ప్రసిద్ధి. 1962 యుద్ధం తర్వాత ఈ కనుమను కూడా మూసివేశారు.

శీతోష్ణస్థితి నియంత్రణ

భారతదేశపు శీతోష్ణస్థితిని నియంత్రించడంలో కూడా హిమాలయాలు కీలక పాత్రపోషిస్తాయి. శీతాకాలంలో సైబీరియా (రష్యా) నుంచి దక్షిణాసియా వైపు వీచే అతి శీతల పవనాలను హిమాలయాలు అడ్డుకొని గంగా-సింధు-బ్రహ్మపుత్ర మైదానాన్ని హిమపాతం నుంచి కాపాడతాయి. హిమాలయాలు లేకపోతే సైబీరియా శీతల పవనాల వల్ల గంగా-సింధు-బ్రహ్మపుత్ర మైదానంలో శీతకాలంలో రబీ వ్యవసాయం సాధ్యపడేది కాదు. గంగా, యమున, సట్లెజ్, బ్రహ్మపుత్ర నదులు శీతాకాలంలో గడ్డ కట్టుకుపోయేవి. కాబట్టి ఉత్తర మహా మైదాన ప్రాంతం ఉప ఆయనరేఖా అక్షాంశ ప్రాంతంలో ఉన్నప్పటికీ ఆయనరేఖా శీతోష్ణస్థితిని కలిగి ఉంది. భారతదేశంలో నైరుతి రుతుపవనాల చురుకుదనం శీతాకాలంలో హిమాలయాల్లో కురిసిన మంచు పరిమాణంపై ఆధారపడి ఉంటుంది.

జీవ నదులకు ఆలవాలం

హిమాలయాల్లోని హిమానీనద సరస్సులు, హిమానీ నదాలు, మంచుతో కప్పుకుపోయిన పర్వత శిఖరాలు అనేక జీవ నదులకు మాతృకలు. ఉదాహరణకు గంగోత్రి హిమానీనదం నుంచి గంగా, యమునోత్రి వద్ద యమున, రాకాస్‌తాల్ సరస్సు నుంచి సట్లెజ్, చాంమ్యుయాంగ్ హిమానీనదం నుంచి సింధు, వెరినాగ్ కొండల నుంచి జీలం, కైలాస మానస సరోవరం వద్ద బ్రహ్మపుత్ర, కులూ కొండల్లో రావి నదులు ఆవిర్భవిస్తున్నాయి. హిమాలయాల్లో ఆవిర్భవించడం వల్ల ఈ నదులన్నీ 'జీవనదులు'గా అవతరించాయి. అయితే ఇటీవల గ్లోబల్ వార్మింగ్ వల్ల హిమాలయ హిమానీ నదులు క్రమంగా కుంచించుకుపోవడం ఆందోళనను కల్గిస్తోంది. హిమాలయాల్లో రెండో అతిపెద్దదైన గంగోత్రి హిమానీనదం వేగంగా కుంచించుకు పోతుందని శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. దీనివల్ల గంగానదిలో సమీప భవిష్యత్తులో వరద తీవ్రత పెరిగి దీర్ఘ కాలంలో క్రమంగా ఎండిపోయే ప్రమాదం ఉందని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు.

అటవీ, వన్యమృగ సంపద

హిమాలయ పర్వత సానువులు దట్టమైన అరణ్యాలతో కూడి విశిష్టమైన అటవీ, వన్యమృగ సంపదను కలిగి ఉన్నాయి. హిమాలయ పర్వత సానువుల్లో వివిధ ఎత్తుల్లో వివిధ రకాల అరణ్యాలు ఉన్నాయి. శివాలిక్ కొండల్లో ఆయనరేఖా ఆకురాల్చు అరణ్యాలు, సమశీతోష్ణ అరణ్యాలు పెరుగుతున్నాయి. హిమాచల్ పర్వతాల్లో విశిష్టమైన కోనిఫెరస్ (శృంగాకార) అరణ్యాలు ఉన్నాయి. నాణ్యమైన మెత్తని కలప నిచ్చే పైన్, ఫర్, స్ప్రూస్, దేవదారు మొదలైన వృక్ష జాతులు ఇక్కడ పెరుగుతున్నాయి. హిమాద్రి పర్వతాల (గ్రేటర్ హిమాలయాల) నిమ్న సానువులు విశాలమైన పచ్చిక బయళ్లకు ప్రసిద్ధి. ఈ ప్రాంతాల్లో రోడో డెండ్రాన్ వంటి ఆకర్షణీయమైన పుష్ప జాతులతో పాటు విలువైన ఔషధ మొక్కలు కూడా లభిస్తాయి.

అరుదైన హిమాలయ ఎలుగుబంటి, కస్తూరి మృగం వంటి వన్య ప్రాణులు కూడా ఈ అరణ్యాల్లో సంచరిస్తున్నాయి. శివాలిక్ కొండలు-లెస్సర్ హిమాలయాల మధ్యలో విస్తరించి ఉన్న 'డూన్' ప్రాంతాలు, కశ్మీర్ లోయ ప్రాంతాల్లో సాంద్ర వ్యవసాయం కేంద్రీకృతమై ఉంది. నిమ్న హిమాలయాల్లో పర్వత సానువుల వెంట ఆపిల్ వంటి పండ్ల తోటలను పెంచుతున్నారు. హిమాలయ పర్వతాల్లో వివిధ రకాల ఖనిజ నిల్వలున్నప్పటికీ, వాటి వెలికితీత ఆర్థికంగా లాభదాయకం కాదు. నదులు హిమాలయ పర్వతాలను దాటేటప్పుడు విశిష్టమైన జల పాతాలను సృష్టిస్తాయి. ఇవి విస్తృతంగా జల విద్యుచ్ఛక్తి వనరులను కలిగి ఉన్నాయి. దూల్‌హస్తి, సలాల్, చమేలి, కర్ణప్రయాగ్ ముఖ్యమైన జల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కేంద్రాలు.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో ఏ పర్వత శ్రేణులను 'ఉప హిమాలయాలు'గా పిలుస్తారు?
ఎ) హిమాచల్ శ్రేణులు
బి) హిమాద్రి పర్వతాలు
సి) కారకోరం పర్వతాలు
డి) శివాలిక్ పర్వతాలు
2. హిమాలయాలకు చెందిన కింది పర్వతాలను 'ఆసియా ఖండ వెన్నెముక'గా వ్యవహరిస్తారు?
ఎ) కారకోరం పర్వతాలు
బి) జాగ్రోస్ పర్వతాలు
సి) లడఖ్ పర్వతాలు
డి) పిర్‌పంజాల్ పర్వతాలు
3. కశ్మీర్ లోయ ఏ పర్వత శ్రేణుల మధ్య ఉంది?
ఎ) జాస్కర్-హిమాద్రి పర్వతాలు
బి) హిమాద్రి పర్వతాలు-పిర్‌పంజాల్
సి) పిర్‌పంజాల్ శ్రేణులు-జమ్ము కొండలు
డి) కారకోరం పర్వతాలు-లడఖ్ పర్వతాలు
4. కుమావున్ పర్వత శ్రేణులు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
ఎ) జమ్ముకశ్మీర్
బి) హిమాచల్ ప్రదేశ్
సి) అరుణాచల్ ప్రదేశ్
డి) ఉత్తరాఖండ్
5. హిమాలయ పర్వత పంక్తులు ఏ కోవకు చెందుతాయి?
ఎ) నవీన ముడుత పర్వతాలు
బి) ప్రాచీన ముడుత పర్వతాలు
సి) అవశిష్ట పర్వతాలు
డి) భ్రంశ పర్వతాలు
6. వాణిజ్యానికి తిరిగి తెరిచిన 'నాథూలా' కనుమ ఏ రాష్ట్రంలో ఉంది?
ఎ) అరుణాచల్ ప్రదేశ్
బి) ఉత్తరాఖండ్
సి) సిక్కిం
డి) జమ్ముకశ్మీర్
7. 'కశ్మీర్ లోయ ముఖద్వారం'గా దేనిని పిలుస్తారు?
ఎ) కారకోరం బి) మానా
సి) బనిహాల్ డి) పిర్‌పంజాల్
8. భారత్‌లో లేని హిమాలయ పర్వత శ్రేణులు?
ఎ) మహాభారత్ శ్రేణులు
బి) కారకోరం శ్రేణులు
సి) ధవులాదార్ కొండలు
డి) జాస్కర్ శ్రేణులు
9. ప్రపంచంలోకెల్లా ఎత్తయిన ఎవరెస్ట్ (సాగరమాత) శిఖరం ఏ హిమాలయ పర్వత పంక్తుల్లో ఉంది?
ఎ) టిబెటన్ హిమాలయాలు
బి) హిమాద్రి పర్వతాలు
సి) హిమాచల్ పర్వతాలు
డి) శివాలిక్ పర్వతాలు
10. వేసవి విడిది కేంద్రమయిన డార్జిలింగ్ ఏ రాష్ట్రంలో ఉంది?
ఎ) సిక్కిం బి) అసోం
సి) అరుణాచల్ ప్రదేశ్
డి) పశ్చిమ బెంగాల్
11. లడఖ్‌లోని 'పూగా లోయ' వేటికి ప్రసిద్ధి?
ఎ) వేడినీటి బుగ్గలు
బి) హిమానీ నదాలు
సి) దట్టమైన అరణ్యాలు
డి) పైవన్నీ
12. హిమాలయాల్లోకెల్లా అతిపెద్ద హిమానీనదం ఏది?
ఎ) గంగోత్రి బి) యమునోత్రి
సి) బయిఫూ డి) సియాచిన్
13. టిబెటన్ హిమాలయాల్లోని మానస సరోవరం ఏ పర్వత శ్రేణుల్లో ఉంది?
ఎ) నాగటిబ్బ
బి) కైలాస పర్వతాలు
సి) సయాడియా పర్వతాలు
డి) పైవేవీ కావు
14. కశ్మీర్ హిమాలయాల్లోని సోనామెర్గ్, గుల్‌మెర్గ్ వేటికి ప్రసిద్ధి?
ఎ) కోనిఫెరస్ అరణ్యాలు
బి) వన్యమృగాలు
సి) పచ్చిక బయళ్లు
డి) హిమానీ నదాలు
15. హిమాలయాలు ఉద్భవించిన భౌమ్య యుగం?
ఎ) ప్రీకాంబ్రియన్
బి) మీసోజాయిక్
సి) కెయినో జాయిక్
డి) టెరిషరీ

సమాధానాలు

1) డి	2) ఎ	3) బి	4) డి
5) ఎ	6) సి	7) సి	8) ఎ
9) బి	10) డి	11) ఎ	12) డి
13) బి	14) సి	15) డి	

Education is a strong instrument..

BANK EXAMS

GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q. 1- 5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

A flash of lightning and deafening crash of thunder are enough to make a child scream and a dog **scoot** under the bed, his tail between his legs. Some adults are also frightened, particularly those who have had a close call with nature's fireworks. The child who is frightened by thunder and lightning needs comfort rather than ridicule. The majority of them are calmed by a story or song. Older tots are helped by watching and discussing the flashes and roars provided the parents show no evidence of alarm. The experiments of Benjamin Franklin 200 years ago helped dispel superstitions and primitive ideas about this natural phenomenon. If a church instead of a nearby gambling joint is struck by lightning, the people no longer are amazed that a good rather than a bad place should bear the brunt. They realize the church was struck because its steeple is the highest point in the vicinity. Lightning represents a discharge of atmospheric electricity from one cloud to another or from a cloud to the earth. The best targets here below are projections of some height. This makes the church spire more **vulnerable** than a low building protected by a grove of trees. On the other hand a single tree, shack, fence pole or human being becomes the best target on a prairie, more so when representing the only inlet for a bolt of lightning with in the radius of miles. Stay indoors during a thunderstorm but if caught outside, choose a safe shelter, preferably a large metal building or a dwelling protected against lightning.

1. What should you do during a lightning storm?
1) play golf and other outdoor games
2) watch television and engage yourself
3) if outside choose a safe shelter
4) stay in water
5) stay on a hilltop



2. How should you react to a child's fright over lightning?
1) give strict warning to them
2) try to shout at them and control the things
3) try to hide in a secret place
4) ridicule them
5) calm them by telling a story
3. What kind of structures does lightning generally strike?
1) projections of some height
2) nature's fireworks
3) gambling joint
4) a low building protected by a grove of trees
5) indoors
4. The meaning of **scoot** is
1) crawl 2) creep
3) poke 4) hurry 5) haze
5. The synonym of **vulnerable** is
1) Inclination 2) week
3) experience 4) susceptible
5) averse

Directions (Q. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Earlier homemade rafts dumped their waste into the water _____, but by June the _____ rafts were mostly gone, banned under a new state law.
1) untreated, unsightly
2) artfully, dismal
3) openly, few
4) flagrantly, petty
5) hazy, cloudy
7. We live in a _____ age; everyone thinks that maximizing _____ is the point of life.
1) ubiquitous, enjoyment
2) propitious, delight
3) sporadic, bliss
4) hedonistic, pleasure
5) omniscient, plain
8. The___of the Minister's statement cannot be verified by people who have no _____ to official records.
1) veracity, access
2) verbosity, entre
3) ambiguity, admission
4) validity, contact
5) opulence, grandeur
9. Catching the earlier train will give us the _____ to do some shopping.
1) chance 2) luck
3) possibility 4) occasion
5) probable
10. David finally found the photographs, after hours spent _____ through drawers.
1) cavorting 2) haggling
3) rummaging 4) divagating
5) cajoling

Directions: (Q. 11 - 15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The problems of translation <u>are still remain.</u>
1) are remain 2) will remained
3) will still remain
4) are remaining
5) No Correction required
12. It is ten years since I <u>have begun</u> living here.
1) begun 2) had begun
3) began 4) beginning
5) No Correction required
13. Education is a <u>strong</u> instrument for moldings the character of the young.
1) striking 2) powerful
3) potent 4) proven
5) No Correction required
14. He <u>gave</u> the I.A.S. examination in all seriousness.
1) appeared 2) took
3) undertook 4) prepared
5) No Correction required
15. He has cooked that meal so often he can do it with his <u>eyes closed.</u>
1) mind blank 2) eyes covered
3) hands full 4) hands tied
5) No Correction required

Directions (Q. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. His interest (1)/ in the study of human behavior (2)/ is indeed (3)/ very large. (4)/ No error (5)
17. The improvement made by changes (1)/ in the system (2)/ was marginal (3)/ and did not warrant the large expenses. (4)/ No error (5)
18. For a few seconds, (1)/ he was totality blinded (2)/ by the powerful lights (3)/ of the oncoming car. (4)/ No error (5)
19. The man who is persistently hesitating (1)/ which of the two things (2)/ he will do first, (3)/ will do either. (4)/ No error (5)
20. The Manager (1)/ gave her his assurance (2)/ that the complaint (3)/ would be discharged. (4)/ No error (5)
21. Everyone felt (1) / that the big (2)/ glittering diamond (3) / was most unique. (4) / No error (5)
22. From all accounts (1) / I learn that (2) / he is the best and honest member (3) / of the new committee. (4) / No error (5)
23. A man entered the tavern (1) / and asked for (2)/ some bread and cheese (3)/ with a decided foreign accent. (4) / No error (5)
24. A large scale exchange of nuclear weapons (1) / will produce (2)/ unprecedented amounts of radiation (3) / that can penetrate into the biological tissue. (4) / No error (5)
25. Several prominent figures (1) / involved in the scandal (2) / are required to appear (3) / to the investigation committee. (4) / No error (5)

Directions (Q. 26-30): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The meeting, the first such gathering in Iraq since the overthrow of Saddam Hussein four years ago, was intended to shore up support for the Iraq government.
B) The next one came six hours later.
C) Delegates from neighboring countries and elsewhere did not set a date for a second, higher-level gathering of foreign ministers and agreed only to establish working groups to focus on various issues.
D) When Iraq's chief delegate stood on a podium and ripped into US policy in Iraq
E) Clobbering hopes that the summit would prove an ice-breaker in the two countries chilly relations
F) On that front, it appeared to have been cordial but far from a resounding success.

26. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F
27. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E
28. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F
29. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E
30. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 31 - 40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

A piece of writing, we have decided, _____ (31) from true forms of visual art in that you cannot respond to the effect of the _____ (32) in a single glance. In reading, the "viewer" has to work at seeing and understanding, for a page of print, _____ (33) at first apprehended by the eye, is fundamentally grasped by the mind _____ (34) the powers of interpretation, reasoning and analysis. But just as your vision can be educated so that _____ (35) respond more intelligently to a work of art, so your powers of interpretation, reasoning and analysis can be _____ (36) so that you respond more efficiently and _____ (37) rapidly to what a writer offers you on a page of print. This process _____ (38) refinement started years ago - when you first learned to read at the age of six or seven. It _____ (39) through elementary and high school and into your late adolescence. And then, possibly, it stopped, though there was _____ (40) much room for improvement.

31. 1) differs 2) vary 3) fluctuate
4) change 5) altered
32. 1) entire 2) whole 3) complete
4) total 5) intact
33. 1) while 2) how ever
3) though 4) still 5) despite
34. 1) during 2) from first
3) though 4) through
5) thorough
35. 1) yours 2) your' s
3) you are 4) your 5) you
36. 1) refined 2) superior 3) design
4) culture 5) experiences
37. 1) additional 2) more
3) extra 4) further 5) other
38. 1) off 2) from 3) of
4) offer 5) with
39. 1) continue 2) continues
3) continuing 4) continued
5) is continued
40. 1) very 2) silent 3) more
4) largely 5) still

Key:

1) 3	2) 5	3) 1	4) 4	5) 4
6) 1	7) 4	8) 1	9) 1	10) 3
11) 3	12) 3	13) 2	14) 2	15) 5
16) 4	17) 5	18) 2	19) 4	20) 4
21) 4	22) 3	23) 4	24) 4	25) 4
26) 4	27) 5	28) 5	29) 1	30) 1
31) 1	32) 2	33) 3	34) 4	35) 5
36) 1	37) 2	38) 3	39) 4	40) 5